# సాధక గీత



వ్యాఖ్యాత :

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

Yallamrajusri Srinivasa Rao
www.srinivasavedanta.in

# సాధక గీత



వ్యాఖ్యాత:

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

Yallamraju Srinivasa Rao

# రంగభూమి

వేదాంత విజ్ఞాన రంగంలో భగవద్గీత కున్న ప్రచారం మరి దేనికీ లేదు. అన్నీ తెలిసిన పండితుల దగ్గరి నుంచీ ఏమీ తెలియని పామరుల దాకా దాని నభిమానించే వారే, ఆబాల గోపాల మందరికీ అది శిరోధార్యమే. మహాభార తంలో ఇది గాక ఇంకా ఎన్నో ఉన్నాయి గీతలు. హంస గీత- ఋభు గీత- బ్రాహ్మణ గీత- అనుగీత- ఒకటేమిటి- చాలా ఉన్నాయి. వాటికి తోడు సనత్సు జాతీయ మోక్ష ధర్మాల లాంటి ఘట్టాలు కూడా ఏమంత తక్కువవి కావు. అయినా దీనికి వచ్చిన ప్రఖ్యాతి వాటికి రాలేదు.

ఏమి కారణం. సకల వేదార్థ సార సంగ్రహ మది. వేదంలో చెప్పిన ప్రవృత్తి నివృత్తి ధర్మాలు రెండూ చోటు చేసుకొన్నాయందులో. ప్రవృత్తి అంటే కర్మ భక్తి సమాధులు. నివృత్తి అంటే కేవలం జ్ఞానం. భగవద్గీతలో నాలుగూ కనిపిస్తాయి మనకు. అంతవరకేగాదు నాలుగింటినీ సమన్వయించటంలో ఉంది దాని గొప్పతనం. అది ఎలా గని అడగవచ్చు. పేరుకు పద్దెనిమిది అధ్యాయాలని విభజించినా అన్ని అధ్యాయాలలో చెప్పిందీ నాలుగే యోగాలు. ఈ నాలుగూ మరలా రెండే. "లోకేస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తామయార్జున" అని స్వయంగా చెప్పుకొన్నాడు కృష్ణ భగవానుడు. ఈ లోకానికి రెండే రెండు యోగాలు బోధించాడటతాను. అవి ఒకటి జ్ఞానం. మరొకటి యోగం. యోగ మంటే కర్మ అని అర్థం. అప్పటికి జ్ఞానమూ - కర్మా - ఇవి రెండే భగవాను డుపదేశించింది. ఇవి రెండూ కూడా ఇంకా కొంత లోతుకు దిగి చూస్తే మరలా ఒక్కటే. దీనికి కూడా భగవానుడి ఆమోద ముద్ర ఉంది. ఏకమ్ సాంఖ్యంచ యోగంచ యః పశ్యతి సపశ్యతి. జ్ఞాన కర్మలూ రెండూ నిజాని కొక్కటే - అవి రెండూ ఒక్కటేనని గ్రహించిన వాడే ధన్యుడని చాటుతాడు. ఇలాంటి సమన్వయం భగవద్గీతలో తప్ప మరెక్కడా కనిపించదు మనకు.

అంతే కాదు. ఇలాంటి సమన్వయ జ్ఞానంతోపాటు విజ్ఞానాన్ని కూడా ప్రసాదించటం గీతలోని మరొక విశిష్టత. జ్ఞానం వేరు. విజ్ఞానం వేరు. విజ్ఞాన మంటే శాస్త్ర జ్ఞానాన్ని అనుభవానికి తెచ్చుకోటం. "జ్ఞానం తేహమ్ సవిజ్ఞానమ్ - జ్ఞానమ్ విజ్ఞాన సహితమ్-" అని అక్కడక్కడా భగవానుడు సెలవిచ్చిన మాటలలో అంతరార్థ మిదే. ప్రస్థానత్రయంలో అసలు నిది ధ్యాసనకు ప్రాధాన్య మిచ్చేది భగవద్గీత. నిదిధ్యాసనమంటే అనుభవమే. అనుభవమనేది ఎప్పుడూ

ప్రత్యక్షమేగాని పరోక్షం గాదు. మిగతా ప్రాపంచిక పదార్థాల లాగా బ్రహ్మభావం కూడా మానవుడికి ప్రత్యక్షంగానే అనుభవానికి వస్తుందనీ - అది సాధించే మార్గం కూడా అతి సులభమనీ - చాటించే ధైర్య మొక్కగీతకే చెల్లు. ప్రత్యక్షావ గమమ్ ధర్మ్యమ్ - సుసుఖమ్ కర్తు మవ్యయమ్" అని గీత ఇచ్చిన హామీ. ఇదే తదుపదేశ లక్ష్యం కూడా.

అయితే ఇది ఇంత బహిరంగ సత్యమై - అందుకోట మింత సులభమైతే ప్రతివారి అనుభవానికీ రావాలిగదా - ఎందుకు రావటంలేదని ప్రశ్న వస్తుంది. దానికి కారణం మానవ మనోదర్పణానికి పట్టిన మాలిన్యమే. కాబట్టి దానిని శుద్ధి చేసుకోటానికి మొదట కర్మయోగమూ - శుద్ధి అయిన తరువాత ఏకాగ్రత కోసం సమాధియోగమూ- ఆ తరువాత ఒక ఆలంబన కోసంగా భక్తియోగమూ - అలవరచుకోవాలనీ - ఆ పిమ్మట వాటన్నిటి ఫలితంగా ఆత్మజ్ఞాన ముదయిస్తే - అది చివరకు విజ్ఞానరూపమైన అనుభవంగా మారుతుందనీ - ఒక చక్కని భూమికాక్రమాన్ని నిర్దేశిస్తుంది గీత. దీనితో పరస్పరం విరుద్ధంగా కనిపించే సాధన మార్గాలన్నీ ఏకరూపంగా మారి అంతా బ్రహ్మాత్మానుభవంలో పర్యవ సానం చెందుతాయి. దీనిని బట్టి లోకంలో ఎవరి అంతస్తుకు తగినట్టు వారు తమ కనువైన మార్గాన్ని అనుసరిస్తూ పోవచ్చు. ఒక్కసారిగా అందరూ జ్ఞానాన్ని అందుకోలేరు. మానవులలో ఉత్తములుంటారు, మధ్యములుంటారు. మందు లుంటారు. అతి మందు లుంటారు. అందరినీ దృష్టిలో పెట్టుకొనే గీత అందరికీ అన్ని మార్గాలు బోధించింది. అవే కర్మ భక్తి సమాధి యోగాలు. భగవానుడే అంటాడొకచోట, మమ వర్త్మాను వర్తంతే - మనుష్యాః పార్థ సర్వశః. ఎవరేది పట్టుకొని పోయినా మొత్తాని కందరూ నా మార్గంలో ఉన్నవారేనని చాటుతాడు. అయితే ఒక పెద్ద హెచ్చరిక ఏమంటే ఇవన్నీ సాధకుల సౌకర్యం కోసం చెప్పినవే గాని సాక్షాత్తుగా ప్రతి ఒక్కటి ఇందులో మోక్షపదవికి తీసుకు పోతుందని భ్రాంతి పడరాదు. సాక్షా న్మోక్ష ప్రదాయక మొక్క జ్ఞానమే. అది వెంటనే లభించక పోతే దానికివి పరంపరయా Indirect సాధనాలు. జ్ఞానముదయిస్తే ఇక వీటి కస్తిత్వం లేదు. సర్వమ్ కార్మఖిలమ్ పార్థజ్ఞానే పరిసమాప్యతే, సర్వయోగాలూ జ్ఞాన యోగంలో పరిసమాప్తం కావలసిందే నంటుంది గీత.

ఇలాంటి సకలజన హితైషిణి అయినది భగవద్గీత. ఇంత శాస్త్రార్థ సంప్ర దాయాలతో కూడింది గనుకనే దాన్ని శాస్త్రంగానే మనం భావించాలని బోధి స్తారు శంకర భగవత్పాదులు. ఆయన అలాగే దర్శించి వ్యాఖ్యానించారు దాన్ని.

అది అతి లోకమైన అత్యద్భుతమైన వ్యాఖ్య. దాని వెలుగులో తీర్చిదిద్దినదే ప్రస్తుతమీ నా తెలుగు వ్యాఖ్య. దీనికి నేను సాధక గీత అని పేరు పెట్టడం కూడా సాభిప్రాయమే. వేదాంతంలో సాధన అనే దేమిటి - అది ఎలా సాగించా లని ఎందరో అడుగుతుంటారు నన్ను. గీతలో ఉంది - చూచుకోండని సలహా ఇచ్చినా అది ఆ మహారణ్యంలో ఎక్కడ ఎలా ఉందో గుర్తించలేక తికమక పడు తుంటారు. అంచేత సాధన మార్గానికి సంబంధించిన శ్లోకాల నన్నింటినీ ఏర్చి ఒక వరుసలో చేర్చి వాటి అర్థాన్ని వివరించి చెప్పటం మంచిదని తోచింది నాకు అందుకోసమే ఈ కృషి.

ఇది ఇంతకు ముందే వ్రాసి ప్రకటించిన గ్రంథం. అప్పట్లో ఒక వంద శ్లోకాలు మాత్రమే తీసుకొని వివరణ వ్రాశాను. అది ఉండగా మరలా ఇది వ్రాయవలసిన అవసరం లేదు వాస్తవానికి. అయితే అందులో ఒక పెద్ద ఇబ్బంది ఏర్పడింది. ముద్రాపకుల అనవధానం వల్ల ఆ గ్రంథంలో ఎన్నో అచ్చు తప్పులు దొర్లాయి. ఒక్కొక్కచోట అక్షరాలూ - పదాలూ - వాక్యాలే ఎగిరి పోయాయి. అచ్చు కూడా అంత బాగాలేదు. ఒకటి రెండు చోట్ల కాగితాలే తిరగబడ్డాయి. దీనికితోడు శ్లోకాలకు క్రమ సంఖ్య ఇవ్వలేదు. మూలంలోని సంఖ్యాక్రమాన్నీ చూపలేదు. ఇన్ని అవకతవకలతో ఆ పుస్తక మొకరు చదవాలన్నా కష్ట మని పించింది. వారి కివ్వాలన్నా నాకు సిగ్గనిపించింది.

అంచేత ఇలాంటి కొరత తీర్చి మరలా దాని నున్నంతలో చక్కగా తీర్చిదిద్ది సాధక లోకాని కంద జేయాలనే సదుద్దేశంతో ప్రస్తుత మీ గ్రంథాన్ని నేను ప్రచురించ వలసి వచ్చింది. ఎలాగూ పునః ప్రయత్నం తప్పలేదు గదా అని ఆ నూటికి తోడు మరి ఒక పదహారు శ్లోకాల నేనిందులో చొప్పించి మొత్తం నూట పదహారుగా మీ కందిస్తున్నాను. నూట ఎనిమిదంటే ఒక అర్థముంది గాని - నూట పదహారేమిటని ప్రశ్న రావచ్చు. దాని కన్నా చాలా పెద్ద అర్థమే ఉంది ఇందులో. ఛాందోగ్యోపని షత్తులో ఒక మాట ఉంది, మానవుణ్ణే ఒక యజ్ఞంగా భావించి వాడి జీవితకాల మంతా మూడు సవనాలుగా విభజించా రట. మొదటిది ప్రాతస్సవనం. అది బాల్యం. రెండవది మాధ్యందిన సవనం. అది యౌవనం. మూడు సాయం సవనం. వార్ధక్యం. మూడింటికీ మామూలు యజ్ఞంలో మాదిరే మూడు ఛందోనియమాలున్నాయి. మొదటి దానికీ అను ష్టుప్పు ఛందస్సు. రెండవ దానికి త్రిష్టుప్పు. మూడవ దానికి జగతి. ఇందులో అనుష్టుప్పు కిరవయి నాలుగక్షరాలైతే - త్రిష్టుప్పుకు నలభయి నాలుగైతే -

జగతికి నలభయి ఎనిమిది. ఇవి బాల్యం ఇరవయి నాలుగు సంవత్సరాలకూ - మధ్యకాలం నలభయి నాలుగింటికి- వార్ధక్యం నలభయి ఎనిమిదింటికీ - సంకేతాలుగా భావించమన్నారు. అప్పటికి మొత్తం మన ఆయుర్దాయం నూరుగాదు, నూట పదహారవుతుంది.

ఈ నూట పదహారు వత్సరాలు మానవుడొక పవిత్రమైన యజ్ఞంగా భావించి ఉపాసిస్తే ఆయురారోగ్యాదులే గాక పరమపద ప్రాప్తికి కావలసిన ఉత్తమ జ్ఞానం కూడా లభిస్తుందట. అందుకే నేమో పెద్దలకు సమ్మానం చేసే టప్పుడు మనం నూట పదహార్లు సమర్పించటమనిపిస్తుంది. ప్రస్తుతం నూట పదహారు గీతా శ్లోకాల నెన్ను కోవటంలో నా ఉద్దేశం కూడా ఇదే. నూటపద హారు శ్లోకాలూ నూటపదహారు జీవితాబ్దాలకు సంకేతంగా భావించాను నేను. జీవేమ శరద శ్శత మన్నట్టు నూటపదహా రేండ్లు మనం బ్రతకాలని - బ్రతికిన బ్రతుకు మరలా వృథా కాకుండా ఒక్కొక్క శ్లోక మొక్కొక్క విలువైన జీవిత వర్షంగా భావించి అధ్యయనం చేయాలని - చేసి తరించాలనే నిగూఢమైన అభిసంధి Intention ఉంది నాకు. అందుకే ఈ సంఖ్యాను సరణం.

అయితే ఒక సందేహం రావచ్చు చాలా మందికి. గీతలో నుంచి మీరెన్ని శ్లోకాలైనా తీసుకోవచ్చు. ఎన్ని తీసుకొన్నా ఒక వరసలో తీసుకొనాలిగదా. వరస తప్పిస్తే మీకు ప్రతిపాద్యమైన విషయంలో క్రమమెలా సరిపోయింది - అని. వాస్తవమే. మూలంలో కచ్చితంగా అలాంటి క్రమం పాటించి ఉంటే సరిపోయేది కాదు. కాని అధ్యాయ విభాగం మినహా విషయ ప్రతిపాదనలో అంతకచ్చితమైన పరిపాటి Order లేదు మూలంలో కర్మ భక్తి యోగ జ్ఞానాదులన్నీ కలగా పులగం చేసి వ్రాసిన ఘట్టాలెన్నో ఉన్నాయి. ఒక విషయం పట్టిస్తున్నప్పుడే విషయాంత రాన్ని ప్రస్తావించటం కూడా జరిగింది. ఒక విషయమే మాటిమాటికీ చెప్పడం కూడా కద్దు. అసలు అధ్యాయ విభాగంలో కూడా అంతక్రమం కనిపించదు. సాంఖ్యం తరువాత కర్మా - కర్మ తరువాత మరలా జ్ఞానమూ - కర్మసన్న్యాసం తరువాత ఆత్మా సంయమమూ జ్ఞాన విజ్ఞానం తరువాత మరలా అక్షర పర బ్రహ్మమూ- ఇలా ఎంతో వ్యుత్క్రమం కనిపిస్తుంది. పోతే సాంఖ్యం - జ్ఞానం - విజ్ఞానం- పురుషోత్తమ- క్షేత్రజ్ఞ- ఇవన్నీ చెప్పే విషయ మొక్కటే. ఒక విధంగా పునరుక్తి ఇది.

అయితే ఎందుకింత గందరగోళ మేర్పడిందని అడుగుతారేమో. గందర గోళం కాదిది. మన వేదాంత గ్రంథాల విధానమే ఇది. ఉపనిషత్సం ప్రదా

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

యాన్నే గీత కూడా అనుసరించింది. అందులో సాధకులకు – అన్ని అంతస్తులలో ఉండే వారికీ– అన్ని మాటలూ చెప్పవలసి ఉంది. వాటికి మరలా పరస్పర సంబంధం చూపవలసి ఉంటుంది. ఏది బోధించదలిస్తే దాన్ని ప్రశస్తమని వర్ణించవలసి ఉంటుంది. అన్నింటిలోనూ పరమ ప్రధానమైనది మరలా సూచించవలసి ఉంటుంది. మొత్తానికి దేనికది తెగగొట్టినట్టుగాక అన్ని జీవిత సత్యాలను కలిపి ఒక ముద్దగా చేసి అందించటమే భారతీయ తత్త్వశాస్త్ర సంప్రదాయం.

ఈ రహస్యం తెలియకపోతే అంతా మనపాలిటికి గంగదరగోళంగానే కనిపిస్తుంది. ఇదుగో ఇది నూటికి నూరుపాళ్ళూ గ్రహించిన మహానీయుడు జగద్గురు శంకర భగవత్పాదులొక్కరే. మిగతా వారంతా గీతనొక పుక్కిటి పురాణమని భావిస్తే ఆయన దానినొక గొప్ప శాస్త్రంగా భావించారు. శాస్త్రీయమైన మార్గంలో వ్యాఖ్యానించారు. శాస్త్ర దృష్టినొక కరదీపికగా ధరించి పయనిస్తుంటే అల్లిబిల్లిగా అల్లుకొన్న ఆ లతా గుల్మ మార్గంలో ఆయనకు దారులు స్పష్టంగా అన్యోన్య విలక్షణంగా కనిపించాయి. ఏ శ్లోక మే ప్రకరణం Context లోనిదో – ఏ ప్రకరణమే అధ్యాయం లోనిదో – ఏ అధ్యాయాని కే అధ్యాయాంతరం సంబంధించిందో మొత్తం శాస్త్రాని కాద్యంతాలేవో అసలు శాస్త్ర ప్రతి పాదితార్థమేమిటో – అత్యద్భుతంగా వివరించారాయన. ఒక విధంగా చెబితే పాణినీయాష్టాధ్యాయిని భట్టోజీ దీక్షితులు సిద్ధాంత కౌముదిగా మలిచినట్టు మలచారాయన.

ఆ గురువుగారు చూపిన రహదారిలో పయనించిన వాడనే నేను. ఎక్కడ ఏ శ్లోకం తీసుకొన్నా – అటూ ఇటూ క్రమం మార్చినట్టు కనిపించినా – నేనను కొన్న విషయం క్రమం ఏ మాత్రమూ మారబోదు. ఇది సాధక గీత కాబట్టి సాధకుల మార్గానికి పనికివచ్చే శ్లోకాలనే ఏరుకొన్నాను. తదనుగుణమైన వరుసలో పేర్చుకొన్నాను. శ్లోకశ్లోకానికీ సంబంధం కలుపుతూ ఒక శృంఖలా రూపంగా వివరిస్తూ వచ్చాను. తన్మూలంగా మాతృకలోని భావక్రమం తప్పదు సరికదా – దాని కింకా ఎంతో అనుకూలంగా కలిసి వస్తున్నది. ఇలా మైనం లాగా ఎటు తీస్తే అటుసాగి వస్తున్నదంటే అది భగవద్గీత సార్వపథీనమైన రచన. భాష్యకారుల అనన్యా దృశ్యమైన వ్యాఖ్యాన కౌశలం. ఈ రెండూ నేత్రాలుగా పనిచేస్తున్నంత దాకా నాకు దారితప్పే భయమేముంది. నాకూ లేదు – నాతో పాటు మీకూ లేదు. భగవద్గీత అంతా బంగారమే కాబట్టి ఎక్కడ ఎంత చేతికి తీసుకొని మనకు కావలసిన సొమ్ము లెలాంటివి చేసినా చేసుకోవచ్చు.

పోతే చివరిమాట నేను చెప్పేదేమంటే అది మీరు శ్లోకాలతో చదివినా సరే. శ్లోకాలు చూడకుండా చదువుతూ పోయినాసరే. మధ్యలో తెగిపోవటమంటూ ఉండదు, శాస్త్ర విషయమంతా అనుస్యూతంగా మనసుకు వస్తుంది. అది కూడా సాధన మార్గాని కనుగుణంగా బోధపడుతూ వస్తుంది. కేవల విషయ జ్ఞానం కంటే సాధనే ముఖ్యంగా భావించాను కాబట్టి దానికనుగుణంగా పోవాలని శ్లోకాలు వ్యాఖ్యానించటంలో కూడా స్వాతంత్ర్యం చాలావరకూ అవలంబించాను. అయితే ఎంత స్వాతంత్ర్యమైనా అది మరలా మొదలు చెడ్డబేరం గాదు. అద్వైత దర్శనమనే కేంద్ర బిందువును వదలకుండా ఎక్కడికక్కడ దానిని స్పృశిస్తూనే ఉంటాను. కాబట్టి సిద్ధాంత సాధన సమన్వయ రూపమైన గ్రంథమిది. Imitation of chirst అనే ఆంగ్ల గ్రంథంలాగా ఇది ఒక క్రొత్త బాణిలో నడచిన అభినవ గీత అనుకోవచ్చు. సహృదయ జిజ్ఞాసువులు దీన్ని జాగ్రత్తగా పఠించి నేనుద్దేశించిన ప్రయోజనాన్ని అందుకోగలిగితే నా శ్రమకు కూడా ఫలాన్ని అందుకోగలను.

సాధయామ స్తావత్.

పార్థాయ ప్రతి బోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణ మునినా మధ్యే మహాభారతమ్
అద్వైతామృత వర్షిణీం భగవతీ మష్టాదశాధ్యాయినీ
మంబ! త్వా మనుసందధామి భగవద్గీతే! భవద్వేషిణీమ్.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# సాధక గీత

## 1

**అశోచ్యా నన్వశోచస్త్వమ్ - ప్రజ్ఞావాదాంశ్చ భాషసే**
**గతాసూ నగతాసూంశ్చ - నానుశోచంతి పండితాః 2-11**

ఇది మన సాధకగీతలో మొదటి శ్లోకం. విషాదంతో ప్రారంభమవుతున్నది గీత. విషాదమే జీవితానికున్న ఏకైక సమస్య. ఇది ఒక అర్జునుడికే గాదు. అర్జునుడు నరుడైతే మనమంతా కూడా నరులమే. కాబట్టి నరులందరికీ ఉన్న సమస్యే ఇది. ఏమిటా సమస్య. ఎప్పుడూ శోకిస్తూ ఉండటం. ఎవరిని గూర్చి శోకించటం. ఎవరిని గూర్చి శోకించకూడదో వారిని గూర్చి. ఎవరా శోకించ గూడని వారు. గతాసువులు. అంటే చనిపోయిన వారు. చచ్చిపోయిన పుత్ర మిత్ర కళత్రాదులను గూర్చి ఎప్పుడూ పరితపిస్తుంటాడు మానవుడు. అలాగే అగతాసువులు. బ్రతికున్న వారిని గురించి కూడా బాధపడు తుంటాడు. ఎప్పుడో ఒకప్పుడు వారిమాదిరే వీరుకూడా పోకతప్పదు గదా అని.

ఇలా వ్యథ చెందటంవరకే అయితే బాగుండును. అదేదో అజ్ఞానంవల్ల తెలియక అలా బాధ పడుతున్నారని సమాధానం చెప్పుకోవచ్చు. అలాంటిది కాదిక్కడ వ్యవహారం. అన్నీ తెలిసిన ప్రజ్ఞావంతుల లాగా మరలా అభి నయిస్తుంటారు మానవులు. అర్జునుడు ప్రదర్శిస్తున్న దిప్పు డిలాంటి ప్రజ్ఞా వాదమే. భీష్మ ద్రోణాదులను చంపితే తనకు పాపం వస్తుందనీ- దానివల్ల నరకంలో పడవలసి వస్తుందనీ- పితృపితామహాదులంతా అలాంటి కుల పాంసనుల మూలంగా ఉత్తమగతులు లేకుండా పోతారనీ- ఇలా ఏకరువు పెడుతూ పోతాడర్జునుడు. చచ్చిన తరువాత జీవుడనే వాడుంటాడనే విషయం తెలియకపోతే అతడీ పుణ్యాపాపాలూ-స్వర్గనరకాలనూ గూర్చి ఎలా చర్చించ గలడు. చర్చించాడంటే అప్పటికి శరీరం కంటే భిన్నంగా జీవుడనే వాడొక డున్నాడని గ్రహించాడనే అర్థం. గ్రహించే ప్రజ్ఞ ఉన్నప్పుడిక భీష్మాదులు మరణిస్తున్నారే అని దుఃఖపడటం దేనికి. మరణించినా అదివారి శరీరమేగాని శరీరి అయిన జీవుడు కాదు గదా.

ఇదుగో ఇలా తెలిసీ తెలియని ప్రసంగం చేయటం వల్లనే అర్జునుణ్ణి చీవాట్లు పెడుతున్నాడు భగవానుడు. నరుడికి బోధ చేయవలసింది నారాయణుడే గదా.

Yalamanchi Brahmaji Srinivasa Rao
www.advaitavedanta.in

అర్జునుణ్ణి నిమిత్తంగా చేసుకొని మనబోటి నరుల కందరికీ చేసే బోధ అది. సరిగా అర్జునుడి కున్న అవలక్షణమే మనందరికీ కూడా ఉంది. మనకు కొంత తెలుసు. కొంత తెలియదు. తెలియని దాన్ని తెలుసు కొందామనే ఓపిక లేదు మనకు. అంతా తెలిసినట్టు పండితులం కాకపోయినా లేని పాండిత్యాన్ని ఒలక బోస్తుంటాము. పాండిత్యమంటే నీవూ నేనూ అనుకొనేది గాదు పాండిత్యం. చచ్చినవారి కోసం గాని చావబోయేవారి కోసం గాని ఏమాత్రమూ పలవించ కుండా ఉండ గలగటమే అసలైన పాండిత్యం- అని చాటుతున్నాడు భగ వానుడు.

పండా ఆత్మ విషయా బుద్ధిః- సా యేషాం తే పండితాః- పండ అంటే ఆత్మ విషయమైన జ్ఞానం. అది ఎవడి కుంటే వాడు పండితుడు. ఈ కనిపించే శరీరమూ- ఇదే నేనని భ్రమించే జీవుడూ- ఇది రెండూగాక వీటి రెంటినీ గ్రహిస్తున్న శుద్ధమైన చైతన్య మేదో అదీ ఆత్మ. అది ప్రతి ఒక్క ప్రాణీ లోపలా వెలపలా కూడా వ్యాపించి ఉన్నది. దానికీ శరీరాదులన్నీ ఉపాధులే Medium. ఉపాధు లనేవి భౌతికం Physical కాబట్టి ఎప్పటి కప్పుడు మార్పు చెందు తుంటాయి. మార్పు చెందటం వల్లనే ఎప్పుడో ఒకప్పుడు పూర్తిగా మార్పుచెంది మరణిస్తాయి.

పోతే చైతన్య మనేది ఇలా మార్పు చెందేది గాదు. మార్పుల నన్నిటినీ కనిపెట్టి చూచెది కాబట్టి మార్పు చెందదు. అదీ మారితే దాని మార్పును తెలుసుకొనేది వేరొకటి కావలసి వస్తుంది. కనుక అది మారేది కాదు. మారేది కాకపోతే మరణించేది కూడా కాదు. కాబట్టి చైతన్య మనేది నిత్య సిద్ధం. దానికి గోచర మయ్యే శరీర మనః ప్రాణాధికమైన ప్రపంచమంతా ఇక అనిత్యమే. వీటికే ఆత్మానాత్మలని పేరు పెట్టారు వేదాంతులు. ఆత్మ అమృతం. అనాత్మ మృతం.

ఇందులో మృతమైన అనాత్మనే ఆత్మ అని భ్రమపడుతున్నాము మనమంతా. శరీరాది సంఘాతాన్నే గదా మనం నేను-నేను-అని అభిమానించి వ్యవహరిస్తు న్నాము. ఎప్పుడీ తాదాత్మ్య బుద్ధి Identity పెట్టుకొన్నామో అప్పుడీ శరీరం పోగానే మనమూ పోవలసి వస్తున్నది. అంటే దాని మరణాన్ని మన కారోపణ చేసుకొంటున్నాము! ఇది ఆత్మ ఏదో అనాత్మ ఏదో వివేచన చేయకపోవటం వల్ల కలుగుతూ ఉన్న అనర్థం.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఈ అనర్థం పోగొట్టుకొని పురుషార్థాన్ని చేపట్టాలంటే మరలా మన మీ అనాత్మ సంఘాతం నుంచి మన ఆత్మను వేరు చేసుకొని చూడాలి. చూస్తే అది మన స్వరూపమే కాబట్టి అదే నేననే అసలైన ఆత్మ జ్ఞానముదయిస్తుంది. ఉదయిస్తే అది అమృతమైన తత్త్వం కాబట్టి ఈ శరీరాదులు నశించినా నేను నశించకుండా చైతన్య రూపుడనై ఎప్పుడూ నిలిచి ఉంటాననే భావ మేర్పడు తుంది. అలాంటప్పుడిక భీష్ముడేమిటి -ద్రోణుడేమిటి-నీవేమిటి-నేనేమిటి. ఎవరున్నాపోయినా మనకు దిగులు లేదు. పోయేదక్కడ శరీరాదులే గాని ఆత్మ గాదు.

ఇదుగో ఇలాంటి ఆత్మా నాత్మా వివేచనకే సాంఖ్యమని పేరు. దీనివల్ల ఆత్మ జ్ఞాన మలవడితే అది పండ. పండ గలవాడే పండితుడు. పండితుడైన వాడికి వీడు బ్రతికున్నాడు-వీడు మరణిస్తున్నాడనే భేద దృష్టిలేదు. ఆత్మ దృష్టితో చూస్తే ఎవ్వడూ నిజంగా మరణించటం లేదు. అందరూ అమృతులే. ఇక విషాదం దేనికి. అలాంటి పాండిత్యం లేని వాడికే విషాద మనేది. కాబట్టి సాంఖ్య బుద్ధి నలవరుచుకొని పండితుడవై మనవాళ్ళూ మనమూ ఎప్పటికైనా మరణిస్తా మేమోననే భయాన్ని వీడి నిర్భయంగా బ్రతకమని భగవానుడి ఉపదేశం.

## 2

**నాసతో విద్యతే భావో- నాభావో విద్యతే సతః**
**ఉభయో రపి దృష్టోంత- స్త్వనయో స్తత్త్వ దర్శిభిః 2-16**

ఆత్మా నాత్మా వివేక రూపమైన సాంఖ్య దృష్టి నలవరుచుకోటమే మరణాన్ని జయించటాని కుపాయమని చెప్పాము. అయితే అది ఆత్మ చైతన్య మొక్కటే నిత్యం-మిగతా అనాత్మ జగత్తంతా అనిత్యమేననే సూత్రం మీద ఆధారపడి ఉంది. మరి ప్రపంచ మనిత్యమని చెప్పటానికి గాని చైతన్యమే శాశ్వతమని చెప్పటానికి గాని ఏమిటి ప్రమాణమని ఇప్పుడు ప్రశ్న వస్తుంది.

దీనికి సమాధానమే ఈ శ్లోకం సత్తు అసత్తు అని లోకంలో పదార్థాలన్నీ రెండు వర్గాలు. సత్తంటే ఉన్నదనీ అసత్తంటే లేనిదనీ అర్థం. అందులో ఉన్నదేదో అది ఎప్పుడూ ఉంది. లేనిదెప్పుడూ లేదు. ఉన్నది లేకపోవటం గానీ లేని పదార్థ ముండుట గాని ఎన్నటికీ సంభవం కాదు.

అయితే ఇది అందరికీ తెలిసిందే గదా-క్రొత్తగా మనకు బోధించటం దేనికని అడగవచ్చు. అక్కడే ఉన్న దంతరార్థం. అది మనకు తెలిసినట్టు కని

పించినా నిజంగా చూస్తే తెలియదు. నిజంలో మనమంతా ఉన్నదే లేదను కొంటున్నాము. లేనిదే ఉన్నదని భావిస్తున్నాము. ఆత్మ చైతన్యమనేది సర్వత్రా ఉన్నది. సర్వదా ఉన్నది. దాన్నే మనం లేదనుకొంటున్నాము. అలాగే ఉందను కొని నిత్యమూ చూచే ఈ చరాచర జగత్తెపుడూ లేదు. అయినా అనుక్షణమూ దీని నున్నట్టే చూస్తున్నాము. ఇదే మనం చేస్తున్న పొరపాటు. కనుకనే దీనిని సవరించి మనకుజ్ఞానోదయం కలిగించాలని భగవానుడి ఈ ఉపదేశం.

కావచ్చు. కానీ మనకీ ప్రపంచం నిత్యమూ అనుభవానికి వస్తూనే ఉంది గదా. ఇది అసత్తెలా అయింది. అలాగే మీరుందని చెప్పే ఆ చైతన్యమెక్కడా మనకు గోచరం కావటం లేదు గదా-అది ఒక్కటే సత్తని ఎలా చెప్పగలరు అని ఆశంక.

ఇలాంటి ఆశంక కలగటం సహజమే. వస్తు నిరూపణ చేయనంత వరకే ఆశంక. చక్కగా నిరూపించి చూచామంటే సదసద్విభాగం మనకు బాగా అర్థమవుతుంది. నామరూపాత్మకమైన ఏ పదార్థమైనా తీసుకొని చూడు. ఒక ఘటం గాని పటంగాని ఏదైనా సరే. అది దాని కారణ ద్రవ్యం కన్నా భిన్నంగా ఉండబోదు. ఇంతెందుకు. ఘటమనే పదార్థమే ఉంది. అది దాని కారణమైన మృత్తు కంటే వ్యతిరిక్తంగా ఎక్కడ ఉంది. మృత్తికే ఘటరూపంగా కనిపిస్తూ ఉంది. కాబట్టి ఘటమనేది వేరే ఎక్కడా లేదు. అది అసత్తే.

అలాగే ఆ మృత్పిండం దాని అణువుల సంయోగమే. వేరు కాదు. అవి పృథివీ పరమాణువులు. ఆ పృథివి జలవికారం. జలం తేజో వికారం. తేజస్సు వాయు కార్యం. ఆ వాయు వాకాశ జన్యం. కాబట్టి ఆకాశం కన్నా వేరుగా ఏ భౌతిక పదార్థమూ లేదు. పోతే ఈ ఆకాశం కూడా ఆచేతనమే కాబట్టి దానిపాటి కది సిద్ధించదు. సిద్ధించాలంటే దానికి విలక్షణమైనది మరేదో వుండాలి. అది మరలా పరాధీనం Dependent కాగూడదు. స్వతస్సిద్ధమైనది కావాలి ఆలాంటి దొక్క చైతన్యమే Pure Consciousness.

కాబట్టి చైతన్యమే అన్ని భావాలకూ ఆఖరి భావం. దానికిక కారణం లేదు గనుక అది దేనికీ కార్యం కాదు. కార్యం కాకపోతే మిగతా ఘటపటాది కార్యాల మాదిరి దానికి వ్యభిచారం Mutation లేదు. అవ్యభిచారి Immutable. కనుకనే అది సత్తు. పోతే మిగతా నామరూపాది ప్రపంచ మంతా ఆకాశం దాకా ఎక్కడి కక్కడే వ్యభిచరించే కార్యరూపాలే కాబట్టి మూలకారణమైన ఈ శుద్ధ చైతన్యం కన్నా భిన్నంగా లేవవి. కనుక ఈ చరాచర జగత్తంతా అసత్తేనని తీర్మానం.

అయితే అసత్తయిన ఇదే మనకు కనిపిస్తున్నది గాని సత్తని చెప్పినా అది కనిపించటం లేదే అనవచ్చు. కనిపిస్తున్నా ఈ కనిపించేది అదే గాని ఇదిగాదు. ప్రతి ఒక్క పదార్థాన్నీ పట్టి చూడు. సన్ ఘటః- సన్ పటః, ఘటమున్నది-పటమున్నది అంటూ ప్రతి ఒక్కటీ ఉన్నది ఉన్నదనే చూస్తున్నాము. ఉండటమనే భావమూ-ఘట పటాది భావాలూ-రెండు సమానాధి కరణాలుగా In equation కనిపిస్తాయి. వాటిలో ఘటపటాది భావాలు మారుతూ పోతాయి గాని ఉండటమనే భావ మెప్పటికీ మార్పు చెందదు. ఘటంలో కాకపోతే అది పటంలో కనిపిస్తుంది. పటంలో కాకపోతే అది కుడ్యంలో కనిపిస్తుంది. ఘటం మాత్ర మలాకాదు. పటం దగ్గరికి వచ్చేసరికి ఘటమనే బుద్ధి లేదక్కడ. అలాగే కుడ్యం దగ్గరికి వెళ్ళేసరికి పటమనే బుద్ధిలేదు. సద్బుద్ధి అలా కాక సర్వత్రా ఉంటుంది. నష్టమైన ఘటంలో సద్బుద్ధి కూడా లేదు గదా అని ఆక్షేపించ రాదు. ఘటమనే విశేష రూపమే నశించింది గాని అక్కడ సత్తనే సామాన్యానికి క్షతి లేదు. ఎందుకంటే ఘట ముందని ఎలా చూచావో ఘటాభావాన్ని The Absence of pot కూడా ఉందనే చూస్తున్నావు. ఉభయత్రా సద్బుద్ధి ఉండనే వుంది. ఘట బుద్ధే ఒకచోట వుంది. మరొక చోట లేదు. ఈ విధంగా లోకంలో అణువు మొదలు ఆకాశం దాకా ప్రతి ఒక్క భావమూ మార్పు చెందుతూ పోవటం వల్ల అంతా చివర కసత్తే. అంటే వాటి వాటి విశేష రూపాలలో అవి లేవు. కేవలం సద్రూపంగానే ఉన్నాయి అన్నీ.

అయినా కనిపిస్తున్నా యంటే సత్తనే భావమే ఆయా విశేష రూపాలుగా భాసిస్తున్నదని చూడాలి మనం ఎండమావులలో నీళ్ళు ప్రవహిస్తున్నట్టు కనిపించినా అవి నీళ్ళు కావు. సూర్య కిరణాలే ఆ రూపంలో భాసిస్తున్నాయని అర్థం చేసుకోటం లేదా మనం. అలాగే ఇక్కడా ఇందులో ఉన్న మర్మమేమంటే సత్తనే దానికి రూపం లేదు. కాబట్టి దాని నున్నదున్నట్టు దర్శించలేకపోతున్నాము. అసత్తయినా ఘట పటాదుల కొక రూపముంది. కాబట్టి లేకున్నా వాటి నున్నట్టు చూస్తున్నాము. మరి దీనికి పరిష్కారమేమిటని అడగవచ్చు. సత్తనే దాని వివిధ రూపాలే ఈ ఘట పటాదులన్నీ-సద్రూపం గానే ఇవి సత్యం కాని తత్త ద్రూపంగా కావని-సమన్వయించుకోటమే.

ఇదిగో ఈ సద్రూపమైన చైతన్యమే ఆత్మ. అది అన్నింటిలోనూ పరచుకొని ఉన్నదే. కాబట్టి దాని నలాగే దర్శించి పట్టుకోటమే తత్త్వ దర్శనం. అప్పుడీ

అనాత్మ ప్రపంచం కూడా ఆయా విశేష రూపాలుగా కాక ఆత్మరూపంగానే గోచరిస్తుంది కాబట్టి ఆత్మా నాత్మలు రెండింటినీ ఆత్మ రూపంగానే చూచినట్టవు తుంది. ఉభయో రపి దృష్టోంతః అంటే ఇదే అర్థం. ఆత్మా నాత్మల రెండింటి అంతమూ ఆత్మే. ఇలా రెండింటినీ కలిపి ఒకే ఒక చైతన్యంగా దర్శించటమే తత్త్వ దర్శనం. అంతే గాని కేవల మాత్మను మరచి అనాత్మనే చూడటం గాదు. అలా చూడటం వల్లనే మరణ భయం మానవులకు.

## 3

అంత వంత ఇమేదేహా-నిత్యస్యోక్తా శ్శరీరిణః
అనాశినోఽ ప్రమేయస్య-తస్మాద్యుధ్యస్వ భారత. 2-18

ఇందులో మనం గ్రహించవలసిన రహస్య మేమంటే-యద్భావస్తద్భవతి. దేనితో తాదాత్మ్యం చెందితే అదే అవుతాడు మానవుడు. అలా అయినప్పుడు దాని గుణాలే సంక్రమిస్తాయి మనకు. ప్రస్తుతం మనమంతా ఆబాల గోపా లమూ ఈ దేహంతో తాదాత్మ్యం చెంది కూచున్నాము. ఎన్నో జన్మలనుంచి పెట్టుకొన్న ఈ సంబంధంవల్ల దీని లక్షణాలే మనకు సంక్రమించాయి. దీని లక్షణాలేమిటి, ఒక్క మాటలో చెబితే ఎప్పటి కప్పుడంతమై పోవటం. శరీర మనేది నిత్యమయిన పదార్థంగాదు. నిత్యమయితే అంతరించరాదు. ఇది కొన్నా ళ్ళయితే కనపడకుండా నశించిపోతున్నది. మన వ్యష్టి శరీరమూ నశిస్తున్నది. సమష్టి రూపమైన ఈ విశ్వ శరీరమూ నశిస్తున్నది. ఎప్పుడో ఒకప్పుడనిగాదు. ఎప్పుడూ నశిస్తూనే ఉంది. మార్పు చెందటమే నశించటమంటే. మార్పంటే ఏమిటి. ముందున్న దశపోయి మరొక దశ రావటమే గదా. ఇలా ప్రతిక్షణమూ దశలు మారుతూపోతే అది వినాశమే గదా శరీరానికి.

ఇలా ప్రతిక్షణమూ వినాశం పాలవుతూ ఎప్పుడో ఒక క్షణంలో పూర్తిగా నశించిపోతున్నదీ శరీరం. ఇలాంటి పదార్థాన్ని నెత్తిన వేసుకొని అదే నేను-నేనే అది-అని తాదాత్మ్యం చెందాము మనం. దీనితో అది మారుతుంటే మనం మారుతున్నామని-అది చివరకు నశిస్తుంటే మనమే సర్వనాశనమైపోతున్నామని భావిస్తున్నాము. అలా భావిస్తే శరీర ధర్మం మన కాపాదితమై మనం నిజంగానే మరణించవలసి వస్తున్నది. ఉన్నంతకాలమూ విషాదాన్ని కూడా అనుభవించ వలసే వస్తున్నది.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఇది అసలైన అనుభవం కాదు. అనుభవా భాస శరీరంతో కాక శరీరితో తాదాత్మ్యం చెందినప్పుడే అది నిజమైన అనుభవం. అసలు శరీరే మనం. శరీరంలో ఉన్న వాడెవడో వాడు శరీరి. వాడీ శరీరం లోపలా వెలపలా కూడా వ్యాపించి ఉన్నాడు. ఎందుకంటే పిండశరీరమేకాక బ్రహ్మాండం కూడా శరీర మేనని చెప్పాము, రెండింటినీ కనిపెట్టి చూస్తున్నది ఆత్మచైతన్యం. ఈ చైతన్యమే మన స్వరూపం. నేనే అని భావించేది మనలో ఈ చైతన్యమే. నేను చూస్తున్నాను – చేస్తున్నాను అనుకొనేది చైతన్యమే గదా. ఈ శరీరాన్ని నాది అనుకొని దర్శించేదికూడా నా చైతన్యమే, కాబట్టి ఈ చైతన్యమే ఆత్మ. అదే అసలు నేను. అనవసరంగా అది చూచే ఈ శరీరాది సంఘాతాన్ని నేనని అభిమానిస్తున్నాను. ఇది నకిలీ నేను గాని అసలు నేనుగాదు. అసలు నేను ఈ శుద్ధ చైతన్యమే. ఇదే శరీరి అంటే.

ఇది మాత్రం శరీరంలాగా అనిత్యం కాదు. నిత్యం. అంటే ఎప్పటికీ మారేది గాదు. అవినాశి. అవినాశి అని ఎలా చెప్పగలవని అడగవచ్చు. దాని కొక్కటే జవాబు. అప్రమేయ మీ ఆత్మ. ప్రమేయం కాని దేదో అది అప్రమేయం. ప్రమేయ మంటే జ్ఞానానికి గోచరించేది. జ్ఞానానికి గోచరించేది కాదిది. జ్ఞానమే. చైతన్యమంటె జ్ఞానమే గదా. జ్ఞానం గోచరింప జేసుకొనేదే గాని గోచరించేది కాదు. గోచరించేవి శరీరాదులైన ఉపాధులు. ఉపాధులనేవి సముద్రంలో తరంగాలు. ఒకటిపోతే ఒకటి పొడచూపుతుంటాయి. వీటి రాకపోకలను ఎప్పుడూ కనిపెట్టి చూచే చైతన్యం వాటి మాదిరి పోవటానికి లేదు. రావటానికి లేదు. స్థాయిగా నిలిచి ఉండాలి. కనుకనే అవి అనిత్యమైతే ఇది నిత్యమయి తీరాలి. నిత్యం కాకపోవటాని కిది ప్రమేయం కాదు. నామ రూపాత్మకం కాదు. ప్రమేయ మయిం దెప్పుడూ నామరూపాత్మకం. నామరూపాత్మకమైతే మార్పు చెందటం తథ్యం. మార్పు చెందిందో నశించక తప్పదు కనుకనే శరీరాదులు నశ్వరాలైతే శరీరి అయిన చైతన్య మవినాశి.

అంతేకాదు. ఆ మాటకు వస్తే నశ్వరమైన ఈ శరీరాదులు కూడా నిజంలో అవినాశి అయిన ఆ చైతన్య రూపాలే. కాబట్టి దానికి బాహ్యంగా స్వతంత్రమైన సత్తా వీటి కెప్పుడూ లేదు. సువర్ణానికి భిన్నంగా కటకకుండల కేయూరా ద్యాభరణా లెక్కడున్నాయి. సువర్ణమే ఆభరణ రూపాలుగా భాశిస్తున్న దాయె. ఆభరణాలుగా అవి అనిత్యమయినా సువర్ణంగా మరలా సత్యమే. ఎందుకంటే ఆభరణాలు మొదట లేవు. చివర లేవు. మధ్యలో మాత్రమే కనిపిస్తున్నాయి.

కనిపించే టపుడు కూడా సువర్ణ మయమే అవి. కరిగించినా చెరిపించినా ఆభరణాలన్నీ సువర్ణాత్మకమే తదాత్మకంగా అంతా ఏకమే నిత్యమే.

అలాగే ఆత్మ చైతన్యానికి వేరని చూస్తే ఈ శరీర మనఃప్రాణాదులన్నీ అనిత్యమే సందేహం లేదు. కాని వివేచన చేసి చూస్తే ఈ ఉపాధులన్నీ చైతన్య వివర్తమే గాని వేరుగావు. ఆదిలో కావు. అంతంలో కావు. నడుమ ఈ స్థితి కాలంలో ఇవి ఇలా కనిపిస్తున్నప్పుడు కూడా శరీరాదులుగా లేవివి వాస్తవంలో. ఇవన్నీ చైతన్య మెత్తిన రూపాలే. కాబట్టి చైతన్యాత్మకంగా మాత్ర మివి సత్యమే నిత్యమే. వాటి నలా చూడగలిగితే అంతా ఒకే ఒక ఆత్మ. అది మన స్వరూపమే కాబట్టి మనికిక దేనివల్లా భయం లేదు. విషాదం లేదు. అలా చూడలేకనే ఈ ఉపాధి వర్గం మనకు వేరుగా కనిపించటం. మనమీద దాడి చేయటం. తన్మూలంగా వాటి మార్పు మనకు కలిగే మార్పుగా వాటి వినాశం మన వినాశంగా భావించి భీతి చెందుతున్నాము. ఇదంతా ఆత్మానాత్మలను వివేచన చేయలేని అజ్ఞానం. ఈ అజ్ఞానంతో సాగించాలి మనం సంగ్రామం. సాగిస్తే నరులమైనా మనం విజయులమై ప్రకాశించగలం.

## 4

నజాయతే మ్రియతేవా కదాచిత్
నాయమ్ భూత్వా భవితావా నభూయః
అజో నిత్య శ్శాశ్వతో యమ్ పురాణో
నహన్యతే హన్య మానే శరీరే - 2-20

ప్రపంచంతో పోరాడితే మనకే విజయం లభిస్తుందని ఏమిటి నమ్మకం. మన మాత్మ స్వరూపులం. పరమాత్మ వారసులమే మనం. పరమాత్మవలన సృష్టి అయిందీ ప్రపంచం. ఆయన మాయాశక్తి విలాసమే కదా ఇదంతా. ఆయన వస్తువైతే ఇది తదా భాస. అభాస గనుకనే ఇది ఆరు రకాలైన పరిణామా లకు గురి అవుతూ ఉంటుంది. పుట్టటమూ - ఉండటమూ - పెరగటమూ - మారటమూ - తరగటమూ - నశించటమూ - ఈ ఆరు భావవికారాలనూ పొందని పదార్థమే కానరాదు సృష్టిలో.

అయితే ఇవన్నీ ఈ జ్ఞేయ రూపమైన జగత్తుకే పరిమితం. దీనినంతటినీ భాసింపజేసే ఆత్మచైతన్యానికి లేవు. చైతన్య మనేది అజం. అజమంటే జన్మలేనిది. జన్మలేనిదంటే పై జెప్పిన ఆరు వికారాలలో మొదటిది లేదని అర్థం.

మొదటిదే లేకపోతే మిగతా అయిదింటికీ అసలాస్కారమే లేదుగదా. అంచేత ప్రపంచం లాగా అది అనిత్యం కాదు. నిత్యం. నిత్యాలు కూడా చాలా ఉన్నట్టు కనిపిస్తాయి మనకు. పృథి వ్యాది భూతాలు చాలాకాలమున్నట్టు తోస్తాయి. అయితే అది సాపేక్ష నిత్యత్వం, ఎప్పటికైనా లయమై పోవలసిందే. పోతే ఇది నిరపేక్షమైన నిత్యత్వం కాబట్టి అలా పోయేదికాదు. కనుకనే శాశ్వతమన్నారు దీన్ని.

అయినా చమత్కార మేమంటే శాశ్వతమూ అద్వితీయమూ అయినా ఆ చైతన్యం చైతన్య రూపంగానే నిలిచిపోవటం లేదు. అలా కదలకుండా ఏక రూపంగా నిలిస్తే అనేకాత్మకమైన ఈ ప్రపంచం మనకసలు కనిపించేది గాదు. ఇది ఇలా కనిపిస్తున్నదంటే అది ఎప్పటికప్పుడు నవనవోన్మేషంగా చిత్రవిచిత్రమైన రూపాలు తాలుస్తూ ఉందని అర్థం. అయితే ఎన్ని రూపాలు దాల్చినా చైతన్యమనే అసలు రూపాన్ని అది వదిలి పెట్టదు. పురాణః అని వర్ణించటంలో ఇమిడి ఉన్న అంతరార్థ మిదే. పురాపి నవ ఏవేతి పురాణః అన్నారు. పూర్వమున్నదే అయినా అపూర్వంలాగా కనిపించేదేదో అది పురాణం. పూర్వమున్నది చైతన్యం. అపూర్వంగా కనిపించేవి నామ రూపాలు. జ్ఞేయంగా కనిపించే ఈ నామ రూపాలు దానివే కాబట్టి ఇది ఏమిటా అని విచారణచేస్తూ పోతే వీటి కధిష్ఠానమైన ఆ శుద్ధ చైతన్యమే మనకు తారసిల్లుతుంది. అంచేత ఎన్ని రూపాలుగా భాసించినా అది వాస్తవానికి సద్వితీయం కాదు. అద్వితీయమే.

కనుకనే "నహన్యతే హన్య మానే శరీరే." పరమాత్మను వర్ణించే ఘట్టం కాబట్టి శరీర మంటే ఇక్కడ అనంతంగా వ్యాపించిన ఈ విశ్వమే శరీరం. మనది పిండ శరీరమైతే ఇది బ్రహ్మాండ శరీరం. ఈ బ్రహ్మాండమే పరమాత్మకు శరీరమయి కూచుంది. దీనిలో ప్రతి అణువూ ఆ చైతన్యంతో నిండినదే. అయితే ఎలాంటి మార్పు కలిగినా ఈ శరీర భాగాలకు కలగవలసిందే గాని దాని నావరించి ఉన్న చైతన్యాని కది ఏమాత్రమూ అంటబోదు. దేశ కాలానుగుణంగా ఈ బాహ్య ప్రకృతి ఎన్నో మార్పులకు పాల్పడుతుంటుంది. ఉన్నవి నశిస్తాయి. వాటి స్థానంలో అంతకు ముందులేనివి తల ఎత్తు తుంటాయి. అవీపోయి కొంత కాలానికి మరికొన్ని పొడచూపటం కద్దు. ప్రవాహ న్యాయంగా ఇది ఇలాగే సాగుతూ పోవటం చూస్తున్నాము. అందుకే దీని కసలు సంసారమనే పేరు సార్థకంగా ఏర్పడింది.

సంసారం కాబట్టి దీనిలో ఇలాంటి పరిణామాలు కలుగుతూ పోవటం సహజమే. కాని అవి ఈ ప్రకృతి మేరకు వచ్చి నిలచి పోవలసిందే. దాని ప్రతి అణువునూ వ్యాపించి ఉన్న ఆ చైతన్యాన్ని మాత్రమివి ఏ మాత్రమూ స్పృశించ లేవు. కారణం అది ఆకాశంలాగా నిరాకారం. నిరంజనం. ఆకాశమైనా ఇంకా జడమైన పదార్థం. పోతే ఇది జడంకాదు. శుద్ధ చైతన్యం. దాని నిక ఏగుణం గానీ అంటే దేముంది. గుణాలేవైనా దానికి విషయం కావలసిందే గదా. విషయమైతే దానికి బాహ్యంగా ఉండవలసిందే. సన్నిహితం కాదు. సన్నిహితం కాకపోతే అంటుకొనే ప్రశ్నలేదు.

## 5

**దేహీ నిత్య మవధ్యోయమ్-దేహే సర్వస్య భారత**
**తస్మా త్సర్వాణి భూతాని-నత్వం శోచితు మర్హసి- 2-30**

పరమాత్మను వర్ణించిన ఘట్టమయింది. ప్రస్తుతం జీవాత్మను వర్ణించే ఘట్టమిది. పరమాత్మ వంటిదే జీవాత్మ. ఎందుకంటే అదీ చైతన్యమే. ఇదీ చైతన్యమే. అయితే। అది విశ్వవ్యాప్తం కాబట్టి అఖండం. ఇది శరీర మాత్ర పరిచ్ఛిన్నం కాబట్టి సఖండం. అంతే తేడా.

ఒక జీవాత్మ ఏమిటి. ప్రపంచమంతా చైతన్యమయమే గదా. వాస్తవమే. కాని ఈ ప్రపంచంలో ఆ చైతన్య మెక్కడ బడితే అక్కడ ఉద్భూతం Manifest కాదు. ఒక్క జీవ చ్ఛరీరం లోనే Living organism అది చక్కగా అభివ్యక్తమయి కనిపిస్తుంది. ఇంతెందుకు మన ముఖాని కెదురుగా ఒక గోడ ఉంటుంది. తడికె ఉంటుంది. అద్దముంటుంది. అద్దంలో ప్రతి ఫలించినట్టుగా అది తడికెలో గాని కుడ్యంలోగాని ప్రతిఫలించదు గదా. అలాగే చైతన్యం కూడా. అందుకే ఈ జీవుడొక్కడే దేవుడికి వారసుడని చెప్పటం. సృష్టిలో మరి దేనికీ ఆ యోగ్యత లేదు.

జీవుడికి కూడా ఈశ్వరుడికి లాగే ఒక శరీర మున్నది. అది బ్రహ్మాండ మయితే ఇది పిండాండ మన్నారు. ఆ శరీరాన్ని అది వ్యాపించినట్టే ఈ శరీరాన్ని ఇదీ వ్యాపించి ఉంది. అది ఎలా నిత్యమో ఇది కూడా అలాగే నిత్యం. నిత్యం కానిదీ నిరంతరం మార్పు చెందేదీ అక్కడా ఇక్కడా ఈ శరీరమే. మన ఈ శరీరం పుడుతుంది. గిడుతుంది. కాని దీనిలో ఉన్న అహమనే స్ఫురణకు మాత్రం పుట్టుకా గిట్టుకా లేదు. మధ్యలో కూడా ఎలాటి వికారాలూ Changes

Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

లేవు. అంచేత ఈ దేహం రేపు నశించిపోతుంటే దానితోపాటు మన ఆత్మ కూడా నశిస్తుందే అని మనం దిగులు పడనక్కరలేదు. విశ్వతో వ్యాప్తి అయిన ఆ పరమాత్మ చైతన్య మెలాగో అలాగే ఈ జీవ చైతన్యం కూడా అహమనే స్ఫూర్తితో ఎప్పటికీ నిలిచి ఉంటుందనే ధీమాతో ఉండాలి మనం. పోతుందనే బెంగ ఏ మాత్రమూ పెట్టుకోరాదు.

కాకపోయినా అది ఎలా పోగలదు. ఒక నిర్దిష్టమైన రూపముంటే గదా పోవటానికీ రావటానికీ. చైతన్య మొక్కటే దానికున్న రూపం. అది ఒక దాన్ని కనిపెట్టవలసిందే గాని దానినేదీ కనిపెట్టేది లేదు. కనిపెట్టే దెప్పుడూ మార టానికి లేదు. మారితే ఆ మార్పును కనిపెట్టవలసిందదే గదా. కాబట్టి మారదు. మారకుంటే నశించబోదు. దాని పాటి కది నశించక పోయినా మరొక పదార్థమేదైనా నశింపజేయవచ్చు గదా అంటే అది సర్వ వ్యాపకం. సర్వమూ అదే అయి నప్పుడు దానికి విజాతీయమైన భావమేలేదు కదా. ఇక మరొక దాని చేతిలో అది ఎలా నశించటం.

పోతే ఇక పరిశేష న్యాయంగా దాని చేతిలో అదే నశిస్తుందని చెప్పవలసి వస్తుంది. అది మరీ అర్థరహితమైన ప్రసంగం. అగ్ని తన్ను తాను కల్చుకో గలదా. ఆటగాడు తన భుజాల మీదనే తానెక్కగలడా. అలాగే ఆత్మ చైతన్యం తన్ను తాను నిర్మూలించుకోట మసంభవం. నిర్మూలన క్రియకు కూడా అదే సాక్షి కావలసినప్పుడది నిర్మూలనమెలా కాగలదు. కాబట్టి ఆత్మ ఎప్పటికీ నశించేది కాదు. కాకుంటే ఇకమనకెలాటి భయాందోళనలూ చెందవని లేదు.

## 6

**వాసాంసి జీర్ణాని యథా విహాయ**
**నవాని గృహ్ణాతి నరోపరాణి**
**తద్వ చ్ఛరీ రాణి విహాయ జీర్ణా**
**న్యన్యాని సంయాతి నవాని దేహీ - 2-22**

నిజమే. చెందబనిలేదు వాస్తవానికి. అయినా మనకలాంటి ధైర్య మబ్బటం లేదు. ఏమి కారణం. దేహంతో పుట్టి దేహంతో పెరిగి దేహంతోనే నశిస్తున్నాము మనం. దేహాతి రిక్తమైన చైతన్యమే నీవని శాస్త్రమెంత ఘోషించి చెప్పినా దానితో తాదాత్మ్యం చెందలేకపోతున్నాము. మీదు మిక్కిలి ఏ శాస్త్రమూ చెప్పకపోయినా నిత్యమూ ఈ దేహమే నేనని దీనితోనే ప్రతి ఒక్కరమూ మమేకంగా బ్రతుకు

తున్నాము. అలాంటప్పుడు ధైర్యమనేది ఎలా అబ్బుతుంది. అబ్బకపోవటమే సహజం.

అయితే అలాగని ఊరక కూచోరాదు. కూచుంటే వివేచనా బుద్ధి ఉండి మనకు ప్రయోజనం లేదు. వివేక మున్నందుకు మన మీ జడమైన దేహం నుంచి శుద్ధమైన చైతన్యాన్ని వేరు చేసుకొని చూడవలసి ఉంది. దృఢమైన దీక్షతో చేయాలాపని. అలా చేయట మభ్యాసమైతే మనకవి రెండూ వేరనే భావం బాగా తార్కారణమవుతుంది. అద ఎలాగని అడగవచ్చు. ప్రతి రోజూ మనం స్నానం చేసిన తరువాత ప్రాత బట్టలు మార్చుకొని క్రొత్త బట్టలు ధరిస్తూ ఉంటాము. అలాగే రేపు అవసానంలో కూడా ఈ శరీరాన్ని ఒక పాత గుడ్డలాగే వదిలేసి మరొక క్రొత్త శరీరాన్ని ధరిస్తామనే భావం మనసు కేర్పడుతుంది.

పాత దుస్తులు వదలి కొత్తవి ధరిస్తున్నప్పుడు దుస్తులే మారుతున్నవి గాని శరీరం మారటంలేదు గదా. అది అలాగే నిలిచి ఉండటం చూస్తున్నాము. ఆలాగే మరికొంత విమర్శించి చూచామంటే ఈ శరీరాలు కూడా దుస్తుల మాదిరి మారుతూ పోతుంటే లోపల వాటిని కనిపెట్టి చూచే చైతన్య మెలాటి మార్పూ లేక యథాపూర్వంగా నిలిచి ఉంటుందనే సత్యం అనుభవానికి రాకపోదు.

అయితే ఎటు వచ్చీ గట్టి నమ్మకంతో తగినంత అభ్యాసం సాగించవలసి ఉంటుంది మనం. సాధనమున పనులు సమకూరు ధరలోన అన్నారు పెద్దలు అక్కడే ఉన్నదయినా ప్రయత్నించనంత వరకూ అది మన సొమ్ముగాదు. ప్రయత్నం చేయగా చేయగా ఎలాంటి కార్యమైన పాకానికి వస్తుంది. పైగా ఇక్కడ చైతన్యమనేది మనం క్రొత్తగా సృష్టించవలసింది గాదు. సృష్టి అయినట్టు కనిపించే ఈ శరీరాది సంఘాతం వాస్తవంలో ఉన్నదీగాదు. లేకున్నా ఇది ఇలా భావిస్తుంటే - ఉన్నా అది దీనిలో మరుగు పడిపోయింది. కనుక అదే ఉంది ఇది లేదనే విమర్శ దృష్టితో చూడాలి సాధకుడు పరిపక్వమైన దృష్టి అలవడిం దంటే తప్పకుండా ఈ శరీరమొక జీర్ణమైన వస్త్రం మాదిరే మనకు భాసిస్తుంది. దానితో రేపు అవసాన సమయంలో అది మనలను వీడిపోతుంటే ఆ వియోగాన్ని తనది కాదన్నట్టు తేలికగా చూడగలడు మానవుడు. అంత తేలికగానే తాను చైతన్య రూపుడుగా ఎక్కడికీ పోకుండా నిశ్చలంగా ఉన్నాననే యథార్థాన్నీ అనుభవానినకి తెచ్చుకోగలడు.

Vallabhaneni Srinivasa Rao Brahmasri
www.advaitavedanta.in

## 7

**దేహినోస్మిన్ యథా దేహే-కౌమారం యౌవనం జరా**
**తథా దేహాంతర ప్రాప్తి-ర్ధీర స్తత్ర నముహ్యతి- 2-13**

శరీరాన్ని వస్త్రంతో పోల్చి చెప్పారు. బాగానే వుంది. కాని ఎంత బాగున్నా ఆ భావం మనసు కంతగా పట్టకపోవచ్చు. కారణమేమంటే వస్త్ర మనేది మన శరీరం కన్నా వేరయిన పదార్థం. కాబట్టి అది తొలగినా మనకు బాధలేదు. పోతే ఈ శరీర మలాంటిది గాదు. ఇది పుట్టినప్పటి నుంచి మనల నంటిపెట్టు కొని ఉంది. మనతో అవినాభూతంగా కనిపిస్తున్నది. ఇలాంటి దాన్ని మన మొక వస్త్రం మాదిరి చూడటమెలా సాధ్యపడుతుందని ప్రశ్న.

నిజమే. నీవన్నట్టు అవినా భూతమైనదే అయితే అలా భావించట మసాధ్యమే కాని అవినా భూతం కాదిది. వినాభూతమే Separable. వివేచన చేయకనే గాని బాగా లోతుకు దిగి చూస్తే నిజంగా ఒక వస్త్రం మాదిరి ఇదీ మనకు బాహ్యమే. ఎంచేత నంటే మనం బాల్యంలో చూచిన శరీరం యౌవ నంలో లేదు. యౌవనంలో చూచింది వార్ధక్యంలో లేదు. ఎప్పటికప్పుడు మారుతూ పోతున్నదీ శరీరం. కొన్ని ఏండ్లు గడచిన తరువాత అంతకు ముందు చూచిన దానికీ దీనికీ అసలు సాజాత్యమే కానరాదు. ప్రతి ఏడు సంవత్సరాలకూ ఒకసారి మన దేహం యావత్తూ నశించి ఇంకొకటి క్రొత్తగా దాని స్థానంలో ప్రవేశిస్తుందని చెబుతారు శాస్త్రజ్ఞులు అలాంటప్పుడీ శరీరం మాత్రం మన కవినా భూతమెలా అయింది. ఎప్పటికప్పుడొక కప్పుడు బొంతలాగా తగులుతూ వదులుతూ ఉండటం దాఖలా అవుతూ ఉంది గదా.

జీవిత మంతా మనకున్న ఈ అనుభవాన్ని బట్టి రేపు అవసానంలో ఈ శరీర మంతా ఒక్కసారిగా తొలగిపోయి మరి ఒక సరిక్రొత్త శరీరం వస్తుందనే మాట మన మెందుకని నమ్మరాదు. దృష్టాన్ని బట్టే గదా అదృష్టాన్ని ఊహిస్తాడు మానవుడు. దృష్టం మనకు జీవితం. ఇందులో మన ముంటూనే మన శరీరం పోతూ వస్తున్నది. దీన్ని బట్టి మరణం కూడా ఇంతేనని గ్రహించవచ్చు. మర ణంలో కూడా భౌతికమైన శరీరానికే గాని మార్పు-అభౌతికమైన చైతన్యానికి లేదు. బాల్యంపోయి యౌవనం వచ్చినప్పుడూ యౌవనంపోయి వార్ధక్యం వచ్చినప్పుడూ మనకది అనుభవసిద్ధమే గదా. బాల్యంలో చూచిన శరీరమే మారింది గాని దానిని కనిపెట్టిన నేననే స్ఫూర్తిమారలేదు. రేపు మరణం లోనూ

అంతే గదా. అప్పుడూ శరీరమే మారుతుంది గాని లోపలి స్ఫూర్తి మారబోదు. మారకుంటే ఇక మనకు మరణమెక్కడిది.

అయితే వచ్చిన ఇబ్బంది ఏమంటే మరణంలో ఈ శరీరం కదలకుండా పడిపోతుంది. వెంటనే దాన్ని బంధువులు దహనంచేసి మరలా మనకు కనపడ కుండా చేస్తున్నారు. అందువల్ల మనకనుమానం-మరొక శరీరం ధరిస్తామా లేదా అని. ఈ అనుమానం ప్రక్కన నిలబడి చూచే వాళ్ళకే. వాడికి కాదు. వాడి అనుభవమేమిటో బ్రతికిన వాళ్ళెవరికి అంతుపట్టదు. అప్పట్లో వాడికి కలిగే అనుభవాలు రెండే. శరీరమే నేనని భ్రమపడ్డాడా దానితోపాటు తానూ పోవలసి వస్తుంది. అలాకాక వేరు చేసుకొని చూడగలిగాడా అది నశిస్తున్నా తాను నశించటం లేదనే ధైర్యంతో నిలిచి ఉంటాడు.

మరి అలా నిలవాలంటే సామాన్యమైన విషయం కాదు. ధీరుడయి వుండాలి వాడు. ధీ అంటే బుద్ధి, వివేచనా శక్తి అని అర్థం అది ఉన్నవాడే ధీరుడు. అలాంటి వాడు తప్పకుండా దేహం కంటే ఆత్మను వేరుగా చూడ గలుగుతాడు. చూడ గలిగితే ఇక మోహ వాగురలో పడే ప్రసక్తిలేదు. శరీరాదులే నేనని అభిమానించటమే Identification మోహం. ఈ మోహమే అవిద్య Ignorance of the fact. ఇదే మన మరణానికి కారణమవుతున్నది. అది లేకుంటే మరణమే లేదు మనకు. అమృత స్వరూపులమే.

## 8

**మాత్రా స్పర్శాస్తు కౌంతేయ-శీతోష్ణ సుఖ దుఃఖదాః**
**ఆగమాపాయినో నిత్యా-స్తాంస్తితి క్షస్వ భారత 2-14**

శరీరానికీ మన చైతన్యానికీ సాజాత్యమే లేదని ప్రతిపాదించాము. కాని అది వట్టి సిద్ధాంతమే నేమో. ఎందుకంటే అనుభవాన్ని బట్టిచూస్తే దానికి విరుద్ధంగా కనిపిస్తున్నది. చలీ - వేడీ - సుఖమూ - దుఃఖమూ ఇలాంటి ద్వంద్వాలకు మన శరీర మెప్పుడూ గురి అవుతూ ఉంటుంది. అలా గురి అవుతూ ఉందంటే ఆ అనుభవం మనది కాకపోదు. అసలు అనుభవ మంటేనే మనది. మనదంటే మన చైతన్యానిది. అచేతనమైన శరీరానిదెలా అవుతుంది. అనుభవం. చైతన్యంతో సంబంధం లేకుండా జడమైన దేహ మెప్పుడూ ఏది గాని అనుభవించలేదు. అలాగయితే నిప్పులో చేయి పెట్టి చేయి మాత్రమే కాలుతూంది గాని - నేను కాదని అనుకోగలగాలి. ఏదీ అలా అనుకో గలుగు

తున్నాడా ఎవడైనా. జీవితంలోనే అనుకోలేని వాళ్ళం రేపు మరణంలో మాత్రమెలా భావించగలమని ప్రశ్న వస్తుంది.

విచారణ లేనంత వరకే ఇలాంటి ప్రశ్న. మొదటనే చెప్పాము విచారణా శీలుడికి భ్రాంతి లేదని, కాని ఆ విచారణ అనేది నూటికి కోటికి ఒక్కడికి గాని ఉండదు. అందులోనూ బాగా పరిణతి చెందినవాడే ఒక్కడో గాని దొరకడు. మిగతా తొంభై తొమ్మిది మంది నిక్షేపరాయళ్ళే. అలాంటి పామర జనుల అనుభవ మేదో దాన్ని పురస్కరించుకొని మాట్లాడుతున్నావు నీవు. అది సార్వ జనీనమే అయినా యథార్థమైనది కాదా అనుభవం. ఎందుచేత. నీవు శీతోష్ణాలనీ – సుఖ దుఃఖాలనీ – ఏ ద్వంద్వాల అనుభవం చెబుతున్నావో అది ఆయా ఇంద్రియాల తాలూకు అనుభవమే కాని ఆత్మది కాదు. నిప్పులో చేయి పెడితే మన చర్మానికే సోకుతున్నదా వేడి. కాలినా – మాడినా – మసి అయినా – చర్మమే. చర్మం వరకే ఆ మార్పు. దాని ననుభవానికి తెచ్చుకొనే చైతన్యంలో లేదా మార్పు. అది అనుభవ రూపంగానే నిలిచిపోతున్నది.

అంతేకాదు. ఈ ద్వంద్వాలు కూడా నిత్యం కావు. అనిత్యాలవి. అనిత్యాలని ఎలా చెప్పగలవు. ఆగమా పాయులు కావటం వల్ల. ఆగమ మంటే రావటం. అపాయమంటే పోవటం. రాకపోకలు చేస్తుంటాయే గాని – నిలకడగా ఎప్పుడూ ఉండవని చూడండి. నీరు మరిగి పోతుంటుంది. చేయి పెట్టటానికి భయపడ తాము మనం. అయితే అది వట్టి భయమే. నీటి కది స్వభావం కాదు. స్వభావ మయితే కొంతసేపటికి మళ్ళీ అది చల్లబడదు. అందుచేత దానిలో ఉండే ఉష్ణ గుణ మనిత్యం. దాన్ని అనుభవించే మన చైతన్యమే నిత్యం. అనిత్యాన్ని చూచి నిత్యం భయపడవలసిన అగత్య మేమిటి. అదే మాయ. ఈ మాయ వల్లనే శరీరేంద్రి యాదులను నేనని భ్రమించాము. ఆ భ్రాంతితో ఇంద్రియ సంసర్గం వల్ల ఏర్పడే కష్టసుఖాలు నావే నని అనుభవిస్తున్నాము. అయితే ఎంత అనుభ వించినా భ్రాంతి మూలకమే కాబట్టి ఇది వాస్తవం కాదు.

పోతే వాస్తవికమైన అనుభవ మేమిటి. అదే విచారణా దక్షుడైన వాడి కుందని చెప్పే అనుభవం. వాడు తన స్వరూపాన్ని నిత్యమూ వేరు చేసుకొనే చూస్తుంటాడు. దాని బలంతో ఇంద్రియాలకు కలిగే స్పర్శలు తనవిగా ఎప్పుడూ అభిమానించడు. అభిమానించకపోతే ఇక వాటివల్ల మనకు బాధ లేదు. లోకంలో కూడా చూడండి. అభిమానమున్న వాడికే బాధ. లేనివాడికి లేదు.

విషయేంద్రియ సంపర్కం సాధారణమే అయినా ఒకడు మనసుకు తీసుకొన్నట్టు మరి ఒకడు తీసుకోడు. ఇంకా ఒక్కొక్కడైతే ఎంతో కష్టం కలిగించే సందర్భాలను కూడా లెక్క చేయకుండా తిరుగుతుంటాడు. అలాంటి వాళ్ళను మొద్దులనీ మొరటు వాళ్ళనీ అంటాము మనం. వచ్చీపోయి ఇలాటి మొరటు తనమే అలవరచుకోవాలి మనం అధ్యాత్మ రంగంలో కూడా.

దీనికే తితిక్ష అని పేరు. తితిక్ష అంటే సహనమని అర్థం. పిడుగు పడ్డా పర్వతం చలించదు. సహనాని కది పరాకాష్ఠ. అలాంటి సహనశక్తే అలవడితే ఈ ద్వంద్వాలనేవి ఏమీ చేయలేవు మానవుణ్ణి. అయితే అలవడటమెలాగ. అందులోనే ఉంది మర్మం. ఈ కలిగే ద్వంద్వ బాధలన్నీ నిత్యం కావు. వస్తూ పోయేవే ఇవన్నీ. నిలిచేవి కావు. నిలిచేది సద్రూపుడనైన నేనొక్కడనే. నాకు భిన్నంగా ఇది అంతా కేవల మసద్రూపమే. అంటే వట్టిదేనని గట్టి నిశ్చయంతో మండాలి.

## 9

యం హి న వ్యథయ న్త్యేతే-పురుషం పురుషర్షభ
సమ దుఃఖ సుఖం ధీరమ్-సోమృతత్వాయ కల్పతే 2-15

అలాంటి దృఢ నిశ్చయంతో ఉన్న ఎవడినైతే ఈ మాత్రా స్పర్శలు బాధిం చవో వాడికి సుఖమూ - దుఃఖమూ - అనే భావాలు రెండు సమానమే అవుతాయి. సుఖదుఃఖాలు రెండూ సమానంగా చూడగలవాడే ధీరుడు. వాడికి మరణ మనేది కూడా సంభవించదు. అమృతత్వాన్నే చూరగొంటాడు వాడు.

అయితే ఎటు వచ్చీ అంతటి మహాయోగం పట్టాలి మానవుడికి. పట్టాలంటే దాని కొక్కటే షరతు. ద్వంద్వాలన్నీ జీవితంలో ఏ మాత్రమూ తేడా లేకుండా దర్శించటమే. అందులో ఏది ఎప్పుడు సంప్రాప్తమయినా బెదరిపోకుండా స్తిమిత మయిన మనస్సుతో అనుభవించగలిగి ఉండాలి. ఎంతో సహనముంటే గాని అది అలవడదు.

ఈ సహనశక్తి ఎలా ఏర్పడుతుంది. నా చైతన్య మొక్కటే ఉంది సర్వత్రా. అదే సత్పదార్థం. అది తప్ప మరేదీ లేదు ప్రపంచంలో శరీరాదులైతేనేమి. శీతోష్ణాదులైతే నేమి - ఇవన్నీ నిజాని కసత్తులే లేనిదే మన కున్నట్లు కనిపిస్తు న్నాయి. వాటి అస్తిత్వానికి నేనే కారణం నా జ్ఞానమే లేకపోతే అవి ప్రకాశించ లేవు. అవి నా జ్ఞానానికి రూపాంతరాలే. అగ్నిలో ఉండే ఉష్ణమూ నేనే. దాని

Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

వలన కలిగే వేదనా నేనే. నా రూపంతోనే నాకు సంసర్గమేర్పడుతున్నది వాస్త వానికి. అలాంటప్పుడు నాకు బాధ దేనికి, బాధపడుతున్నానంటే నన్ను చూచి నేనే బెదరిపోతున్నానని అర్థం. తన నీడ చూచి తానే ఉలిక్కిపడినట్లున్నది. రెండూ ఒకటేననీ - అదీ నా స్వరూపమేననీ - భావిస్తే ఏ భయాలూ లేవు.

ఇలాగే శరీరం దగ్గర నుంచీ ప్రతి ఒక్కటీ లోకంలో నా చైతన్యచ్ఛాయే నానీడే గాని వేరు గాదని ఎప్పుడూ విచారణ చేస్తూ పోవాలి. ఆ విచారణ పరిపాకానికి వచ్చిందంటే తప్పకుండా ఏర్పడుతుంది సహనం. దానితో రేపు మరణానుభవం కూడా మనకు ప్రతికూలంగా తోచదు. అదీ మన స్వరూప మేననే భావనతో జీవితం లాగా మన కనుకూలమే అవుతుంది. అయితే మరణమే లేదు వాస్తవంలో.

## 10

ఇహైవ తైర్జిత స్సర్గో - యేషాం సామ్యే స్థితం మనః
నిర్దోషం హి సమం బ్రహ్మ - తస్మా ద్బ్రహ్మణి తే స్థితాః 5-19

సుఖ దుఃఖాదులైన ద్వంద్వాలు సమానంగా అనుభవానికి రావటమే సామ్యం. ఇలాంటి సామ్యావస్థలో మన మనస్సెప్పుడూ నిలవగలిగితే చాలు, మనమీ సృష్టిని జయించామన్న మాటే. సృష్టిని జయించటమంటే సృష్టి రహస్యాన్ని భేదించటమే. సృష్టి రహస్యమేమిటి, ద్వంద్వ మోహమే సృష్టిలో ఉన్న రహస్యం. సర్వభూతాని సమ్మోహం సర్గేయాంతి పరం తప" అని భగవానుడే సెలవిచ్చాడు. ఈ ద్వంద్వ సంఘాతం వల్లనే సామ్యం దెబ్బతిని - వైషమ్య మేర్పడింది. అదే సృష్టికంతా మూలం.

సామ్య వైషమ్యాలనేవి మరొక మాటలో చెబితే సామాన్య విశేషాలనవచ్చు. అందులో సామాన్యమనేది జ్ఞానం. అది పదార్థాలన్నింటినీ వ్యాపించి ఉంది. కాబట్టి అదే సామాన్యమనేమాట కర్థం. పోతే విశేషాలనేవి దానికి విలక్షణంగా కనిపించే నామరూపాలు. ఇవే అఖండంగా వ్యాపించిన జ్ఞానాన్ని జ్ఞేయ రూపంగా మనకు ప్రదర్శిస్తున్నాయి. వీటిని చూస్తున్నంత వరకూ వీటికి మూలమైన సామాన్యం మీదికి మన దృష్టి పోదు. అలా పోనంత వరకూ సృష్టికి మనం లోబడవలసిందేగాని సృష్టిని మనం లోబరచుకోలేము. విశేషాలను త్రోసి రాజని కేవలం సామాన్యాన్ని నిఘాపెట్టి చూచినప్పుడే మన దృష్టి త్రిగుణాత్మక మైన సృష్టిని దాటిపోగలదు. సామాన్యమే అసలు బ్రహ్మస్వరూపం. దానికి విశేష

మనేది ఒక దోషం. సవిశేషంగా చూస్తే బ్రహ్మమే ప్రపంచంగా భాసిస్తుంది. అప్పుడది సదోషం. నిర్వి శేషంగా చూస్తే మరలా ఈ ప్రపంచమే బ్రహ్మంగా అనుభవానికి వస్తుంది. అప్పుడది నిర్దోషం.

కాబట్టి సాధకులుగా మనం చేయవలసిన పని ఏమిటి. సవిశేష దృష్టిని వదులుకోవాలి. నిర్విశేషమైన సామాన్య దృష్టినే అంతకంతకు అభ్యసిస్తూ పోవాలి. అలా అభ్యసిస్తూ పోతే క్రమంగా ఈ సంసారానికి దూరమవుతూ ఆ బ్రహ్మ తత్త్వానికి దగ్గర పడతాము. అది సమగ్రమయ్యే నాటికి సమగ్రమైన బ్రహ్మానుభవాన్నే అందుకో గలుగుతాము. ఆ బ్రహ్మమే నేననే భావంతో ఉండి పోతాము. అలా ఉండటమే మోక్షం. అదే అమృతత్వం.

ఎటువచ్చీ ఆ సమదర్శనాన్ని సాధించటంలోనే ఉన్నది ఉన్నదంతా. అది అన్నింటికీ ఆది. అన్నిటికీ అంతం. కొంత నేర్పున్న వాడికది సాధించటం కూడా ఏమంత దుష్కరం కాదు. మామూలుగా లోకంలో మనమే వస్తువును గాని - వ్యక్తిని గాని దృష్టించి చూడము. చూచీ చూడనట్లు వెళ్ళిపోతుంటాము. అలాకాక కొంచెం సేపలాగే దృష్టి పెట్టి చూడడం నేర్చుకోవాలి. చూస్తే అందులో రూప గుణాదులేవీ మన దృష్టికి అంతగా రావు. అంతకంత కాపదార్థం అస్పష్టంగా సూక్ష్మంగా మారిపోతుంది. సూక్ష్మమయ్యేకొద్దీ ఆకాశంలాగా విశాలమై ఒక ఖాళీ మాదిరయిపోతుంది. ఎంతెంత ఖాళీ అవుతుందో - అంతంత మన చైతన్య మా ఖాళీని భర్తీ చేస్తుంది. అప్పుడంతా మన స్వరూపమేననే ప్రత్యయ Notion మొకటి తప్పకుండా ఏర్పడుతుంది.

ఈ విధమైన నిర్వికల్ప దృష్టితో చూచేవాడికి సృష్టిలో ఎన్ని వికల్పాలున్నా అడ్డురావు. చరాచర పదార్థాలేవి ఎప్పుడు తారసిల్లినా అవన్నీ సామాన్య రూప మైన Universal తన స్వరూపంగానే అనుభవానికి వస్తాయి. అప్పుడీ సృష్టిలో వైవిధ్యం గాదు - ఏకత్వమే దర్శనమిస్తుంది. ఆ ఏకత్వం కూడా నాకు భిన్నంగా కాదు. నేనుగానే నాకు సాక్షాత్కరిస్తుంది. ఇది సాధనలో కొంత ప్రవేశమున్న వాళ్ళకు గాని అవగాహనకు రాదు.

## 11

**యోగస్థః కురు కర్మాణి - సంగం త్యక్త్వా ధనంజయ**
**సిద్ధ్య సిద్ధ్యోస్సమో భూత్వా - సమత్వం యోగ ఉచ్యతే 2-48**

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

బ్రహ్మస్వరూపమైన మోక్ష సుఖాన్ని చూరగొనాలంటే నిరంతరమూ మన మనస్సు సామ్యావస్థలోనే ఉండాలని చెప్పాము. ఇదిగో ఈ సామ్యమే నిజమైన యోగం. యోగమంటే ఉపాయమని అర్థం. ఒక ఫలితాన్ని సాధించే దాని కుపాయ Means మని పేరు. ఉపేయ End మిక్కడ మోక్షం. అది సామ్య స్వరూపం. దాన్ని సాధించే ఉపాయం కూడా సామ్యమే. సమదర్శనంతోనే సమత్వం సాధించాలి. కనుకనే ఆదీ అంతమూ కూడా సమత్వమేనని చెప్పటం. ఉపాయ రూపంగా ఆది అయితే ఉపేయ రూపంగా అంతం. దీనిని బట్టి బ్రహ్మమనేది ఎప్పుడూ అద్వితీయమనే మాట తేటపడుతున్నది. సమత్వమే గదా బ్రహ్మమంటే.

సమత్వమే యోగమని కూడా చెప్పాము. అది ఒక్కటి సాధిస్తే చాలు. మిగతా యోగాలన్నీ అందులోనే కలిసివస్తాయి. అయితే దానికి సంగం మాత్రం పనికిరాదు. సంగమంటే నామరూపాది విశేష దృష్టి. ఆ దృష్టి ఉన్నంత వరకూ అది వైషమ్యానికి దారి తీస్తుంది. ఎందుకంటే వైషమ్య మనేది సామ్యానికి విరుద్ధం ఎలాగని ప్రశ్నించవచ్చు. ఒక ఇల్లు కట్టుకొని ఇది నాది అని కాంక్ష పెట్టుకొన్నాను. గ్రామంలో ఇంకా ఎన్నో ఇండ్లున్నాయి. కాని దానిని మాత్రమే నాదని అభిమానిస్తున్నాను. అంచేత అది విశేష దృష్టి అయింది. అందులో తగులుకొనే సరికి ఆ ఇంటిమీదనే లోకం నాకు. అలాంటి అభిమానం దాని ప్రక్కనే ఉన్న మరొక ఇంటిమీద ఉండబోదు. ఇక సమత్వమేముంది. అంతా వైషమ్యమే. అలాకాక అన్నీ ఇండ్లే గదా. ఇటుకా సున్నంతో కట్టినవే గదా - అని చూస్తే -- ఏదీ లేదు. వైషమ్య మెగిరిపోతుంది.

అంతేకాదు. ఇది మన దృష్టిలోనే ఉందిగాని ఆ వస్తువులో లేదని చెప్పటాని కెంతో దూరం పోనక్కరలేదు. కట్టకముందు నాది కాదది. మట్టిలో కలిసిపోతే నాది కాదు. డబ్బుకు కసాలాపడి వేరొకడికి విక్రయిస్తే నాది కాదు. అంతెందుకు ఈ క్షణంలో హఠాత్తుగా నేను కన్ను మూస్తే నాకు సంబంధం లేదు. ఇలా భావన చేస్తూ పోతే చాలు. వెంటనే వైషమ్య దృష్టిపోయి సామ్య దృష్టి మనసులో చోటు చేసుకోవటం ఖాయం. ఇదే యోగమంటే.

ఇలాంటి యోగం మానసికంగా ఎప్పుడు సాధించామో జీవితంలో కూడా అది తొంగి చూస్తుంది. జీవితమంటే ఒక మనస్సే కాదు. మనోవాక్కాయములు -- మూడూ కలిసి జీవితం. అందులో మిగతా రెండింటికీ మనసు మూలం. మనసు ఆలోచించిందే మాటలోకి వస్తుంది. కర్మ అంటే పని గదా. ప్రతి

Vallamrajusrinivasarao www.advaitavedanta.in

పనికీ వెనకాల పని చేసేది మనసే. ఒక దొంగతనం చేయాలని మనసులో అనుకుంటే దొంగతనం చేస్తాము. అలాకాక దేవతార్చన చేయాలనుకుంటే దేవతార్చనే చేస్తాము. ఏది సంకల్పిస్తే అది. సంకల్పాను గుణంగానే సకల కర్మలూ జరుగుతుంటాయి. అలాంటప్పు డాసంకల్పం సవికల్పంగా గాక ఎప్పుడూ నిర్వికల్పంగా ఉండగలిగితే జీవితంలో మనం తప్పకుండా సమత్వాన్నే చూడగలం. అంటే మనసులోనే గాక దైనందిన వ్యవహారంలో కూడా మన మా సమత్వ రూపమైన బ్రహ్మ చైతన్యాన్నే దర్శించగలమని భావం.

అయితే ప్రతి దినమూ మన మాచరించే పనులు ఎన్నో ఉంటాయి గదా. అందులో కొన్ని జరిగితే బాగుండుననీ కొన్ని జరగకుంటే బాగుండుననీ కోరుతుంటాము గదా. ఇలాంటి ఇష్టా నిష్టాలు పని చేస్తున్నప్పుడు సమత్వ దృష్టి ఎలా నిలుపుకోగలమని ప్రశ్న వస్తుంది, వాస్తవమే. సవికల్పంగా భావించినంత వరకూ నిలుపుకోవడం కష్టతరమే. కాని నిర్వికల్పమైన భావనను అలవరచు కుంటే మాత్రం నిలవకుండా పోదు. ఆ భావన అలవడాలంటే నీకొకటే మార్గం. మనం చేసే ప్రతి పనీ తప్పక ఫలించాలనే పట్టుదల మనకుండ కూడదు. ఫలించకపోయినా ఒకటేననే బరవసా మనకుండాలి.

మరి ఈ బరవసా ఎలా ఏర్పడాలని ప్రశ్న. సంగమనేది లేనప్పుడే అది ఏర్పడుతుంది. అది ఎలా లేకపోతుంది. విశేష దృష్టికి స్వస్తి చెప్పినప్పుడే. దానికెప్పుడు స్వస్తి చెప్పగలం. అంతా నా చైతన్యమే – నా స్వరూపమేననే అఖండ భావన సడలకుండా పట్టుకొన్నప్పుడు. అదే గదా యోగమని చెప్పాము. ఆ యోగంలో పాదుకొనిపోవాలి సాధకుడి మనస్సు. యోగస్థః అనే మాటకిదే అర్థం. అలా పాదుకొన్న మనస్సుకు తన స్వరూపం తప్ప మరేదీ కనిపించదు. ప్రతి ఒక్కటీ తన స్వరూపమే. అలాంటప్పుడిక ఏది ఆలోచించినా – తదను గుణంగా ఏ పని చేసినా – అందులో భేదం కానరాదు. స్వరూప భావనతోనే చూస్తాడు. కాబట్టి జయాప జయాదులైన ద్వంద్వాలు రెండూ సమానంగా స్వీకరించే ధైర్య మేర్పడుతుంది. అప్పటినుంచీ సాధకుడి జీవితమిక ఎలాంటి ఒడిదుడుకులూ ఒత్తిడులూ లేకుండా ప్రశాంతంగా నడుస్తూ పోతుంది.

## 12

సర్వ భూతస్థ మాత్మానం – సర్వ భూతాని చాత్మని
వీక్షతే యోగ యుక్తాత్మా – సర్వత్ర సమ దర్శనః **6–29**

యోగయుక్తాత్మా - యోగంతో కూడిన ఆత్మ గలవాడు. ఆత్మ అంటే ఇక్కడ మనస్సని అర్థం. అలాంటి మనస్సు గలవాడికి సర్వత్రాసమం గానే పడుతుంది దృష్టి. ఎక్కడ ఏది చూచినా ఒకటిగానే కనిపిస్తుందని భావం. ఎందుకని. సకల భూతములలోనూ తన స్వరూపమే చూడగలుగుతాడు. అంతేగాదు. తన స్వరూపంగా సకల భూతాలను కూడా చూస్తాడు. అలా చూచేవాడికి తాను తప్ప సృష్టిలో మరేదీ లేదని బోధపడుతుంది. ఎలాగ. ఆకాశ మన్నింటిలో - అన్నీ ఆకాశంలో ఉన్నాయంటే ఏమిటర్థం. ఆకాశమే ఉంది - మరేదీ లేదనే గదా. అలాగే ఆకాశంకన్నా సూక్ష్మమైన చైతన్య మన్నింటినీ వ్యాపించి అందు లోనే సర్వమూ ఇమిడి ఉందంటే సర్వమూ అనేది లేదనీ - అది ఒక్కటే ఉందనేగదా - గ్రహించవలసింది.

అలాంటప్పుడు ప్రపంచంలో ఇక ఏది చూచినా అదే. విడిగా చూచినా అదే. కలిపి చూచినా అదే. చైతన్యమే చైతన్యం. ఏక ధారగా సాధకుడి దృష్టి కది ఒక్కటే సాక్షాత్కరిస్తుంది. ప్రతి ఒక్క దానిలో పరచుకొని ఉన్నట్టు తన చైతన్యాన్నే లోపలా వెలపలా అనుసంధించుకుంటూ పోతాడు సాధకుడు పదార్థాలూ -- పరిస్థితులూ - ఎప్పటికప్పుడు మారిపోతున్నా ఆ మార్పులను కనిపెట్టే ఈ దృష్టి మాత్రం చెదరకుండా అలాగే నిలిచి ఉంటుంది.

దానితో ఇక ఏ పని చేస్తున్నా మనం భయ పడ నక్కరలేదు. ఒక పని మొదలు పెట్టినప్పుడు - అది జరుగుతూ ఉన్నప్పుడు - ఫలితానికి వచ్చినప్పుడు - ఈ మూడు దశలు కూడా సమానంగా కనిపిస్తాయి. ఏమాత్రమూ తేడా ఉండదు. తేడా ఏ మాత్రమున్నా అది వాడు జ్ఞాన దృష్టితో సమన్వయించుకో గలడు. కాబట్టి ఇది జరిగింది అది జరగలేదనే కొరతగానీ - పనులవల్ల కలిగే ఒత్తిడిగానీ - మనసు మీద బొత్తిగా పనిచేయదు. ఒక కార్యమారంభించక ముందెంత తేలికగా ఉంటుందో మనసు - ఆ తరువాత కూడా అంత తేలికగానే ఉండగలదు. అదే ముక్తి. ముక్తి అంటే విడుదల అనే గదా అర్థం. విడుదల మనకు దేని నుంచి ఒత్తిడి నుంచి. అన్ని ఒత్తిడులూ బలాదూరయినప్పుడిక అది ముక్తిగాక మరేమిటి.

## 13

సర్వ భూత స్థితం యోమాం - భజ త్యేకత్వ మాస్థితః
సర్వథా వర్త మానోపి - సయోగీ మయి వర్తతే 6-31

అసలు లోకంలో ఏ సందర్భాన్ని గానీ మనం చూచే చూపు రెండు విధాలుగా ఉంటుంది. నామ రూప క్రియల వరకూ పరిమిత మయ్యేది ఒకటి. వాటిలో దాగి ఉన్న తత్త్వాన్ని ఆకళించేది మరొకటి. నామాదుల మేరకే చూచేది ఆ మేరకే వచ్చి నిలిచిపోతుంది. అంతకన్నా దూరం పోలేదు. నామ రూపాదులు అసంఖ్యాకం కాబట్టి అవి వైషమ్యానికి దారితీస్తాయి. ఆ వైషమ్యంలో తగులు కొన్న మనస్సు రాగ ద్వేషాదులకు గురి అవుతుంది. దానితో బరువెక్కి అంత కంత కగాధమైన ఊబిలో దిగబడి పోతుంది. అదే సంసార బంధం. ఉదాహర ణకు మన ఇండ్లూ వాకిండ్లూ ఆస్తులూ పాస్తులూ – చుట్టాలూ – పక్కాలూ – వ్యాపారాలూ – వ్యవహారాలూ ఇవన్నీ మన మనస్సును సంకుచితం చేసేవే. పాతాళాని కీడ్చుకు పోయేవే.

అలాకాక ఈ నామ రూపాలనే ఆవరణాన్ని ఛేదించుకొనిపోయి చూడ గలిగితే అందులోని తత్త్వం మీద పడుతుంది మానవుని దృష్టి. తత్త్వమనేది సకల భూతాలలోనూ సమానంగా పంచి పెట్టబడి ఉంది. ఒక దానిలో హెచ్చుగా లేదు. మరొక దానిలో తక్కువగ లేదు. అణువు మొదలుకొని ఆకాశం దాకా అన్ని పదార్థాలనూ అలుముకొని ఉంది. దాని నాకళించుకోవాలంటే మన చూపు కూడ ఏకాగ్రమే కావాలి. అనేకాగ్రమైన దృష్టి కది అంతు చిక్కదు. దాని కంతు చిక్కేవి నామ రూపాదులే. అవి మానవుడి కెప్పుడూ శాంతి నీయవని గదా చెప్పాము. శాంతే కావాలంటే ఎప్పటికైనా అనేకంలో ఉన్న ఏకత్వాన్ని మనసుకు తెచ్చుకోవటమొక్కటే మార్గం.

దీనికొక చక్కని దృష్టాంతం మనవి చేస్తాను. వినండి. మనమొక జవుళి అంగడికి వెళ్తాము బట్టలు కొన్ని బేరం చేయటానికి. అంగడిలో ఎన్నో రకాల బట్టలుంటాయి. అవి నూలువే కాదు – టెర్లినే కాదు – టెరికాటనే కాదు. చూచేకొద్దీ కళ్ళు జిగేలుమనిపించే గుడ్డలెన్నెన్నో మనకళ్ళ ముందు సాక్షాత్క రిస్తాయి. అందులో ఒక దానికున్న నేతా– నయమూ– నాజూకూ–మరొక దానికుండదు. వాటి మీదనే చూపు పెట్టి చూస్తూపోతే మన మెప్పటికీ తేరుకో లేము. ఏదీ నిర్ణయించుకోలేము. మనసు పరిపరివిధాల పరుగులు పారుతుంది.

అలా కాక ఇవన్నీ బట్టలే గదా– పడుగు పేకగా నేసినవే గదా– మాన సంరక్షణమే గదా వీటి ప్రయోజనం– అని భావించగలిగితే చాలు. ఏదో ఒకటి

Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

కొంటాము. వెళ్ళిపోతాము. చూడండి. ఇక్కడ మొదట చూపులో శాంతిలేదు. రెండవ దానిలో ఉంది. ఏమి కారణం. నామరూపాలనే చూచేసరి కేబట్ట కాబట్టి విశిష్టంగానూ విలువైనది గానూ కనిపించి మనసుకు విభ్రాంతి కొలిపింది. దానికి భిన్నంగా అన్నింటిలోనూ ఒకే స్వరూపాన్ని ఒకే ప్రయోజనాన్ని ఎప్పుడు చూచామో అప్పుడన్నీ వస్త్రంగానే భాసించి ఇందులో ఏదైనా ఒకటేననే తృప్తి నిచ్చింది.

దీనిని బట్టి ఏకత్వాన్ని దర్శిస్తూ పోవట మొక్కటే శాంతి దాయకమని అర్థమయింది. అలాంటి ఏకత్వం పిపీలికాది బ్రహ్మ పర్యంతమూ ఒకే ఒక ఆత్మ చైతన్యం తప్ప మరొకటి లేదని ఇంతకు ముందే చాటించాము. ఆ చైతన్యం కూడా ఎక్కడో లేదు. అది మన స్వరూపమే. అలాంటప్పుడిక మనకు భయ మేమిటి. మన స్వరూపం మన దగ్గరే ఉంది. మనమే. మన చూపే. ఆ చూపుతో మనం నిత్యమూ చూడగలిగితే చాలు. ఏది చూచినా- ప్రమాదం లేదు. ఆ చూపే మనల నొక అంగరక్షకుడి లాగా కాపాడుతూ పోతుంది. ఆయా కార్యాలు మనం నిర్వర్తిస్తున్నా వాటన్నిటినీ మనం బ్రహ్మాకారంగా మారుస్తూ పోతే అది పరమ శాంతిని మనకు ప్రసాదిస్తుంది.

## 14

యా నిశా సర్వభూతానామ్- తస్యామ్ జాగర్తి సంయమీ
యస్యామ్ జాగ్రతి భూతాని- సానిశా పశ్యతో మునేః **2-69**

ఈ ప్రకారంగా సమస్త ప్రపంచాన్నీ తమ శరీర మన, ప్రాణాదులతో సహా బ్రహ్మాకారంగా మార్చుకొని దర్శిస్తూ పోవటమే నిజమైన యోగం. యోగమంటే కలయిక అని అక్షరార్థం. రెండు విజాతీయ భావాలున్నంతవరకూ కలయిక అనేది ఏర్పడదు, తాత్కాలికంగా కలిసినట్టు కనిపించినా ఎలా కలిశాయో అలాగే విడిపోగలవు. సంయోగ ముందంటే వియోగం కూడా ఉండి తీరుతుంది. తిల తండులాలు కలిశాయంటే వాటిని మరలా విడదీయగలం. పాలూ నీరూ కలిసినా యంత్ర సహాయంతో విడగొట్టగలం. కాబట్టి ఇలాంటి కలయిక వల్ల మనకు సుఖంలేదు. వియోగం లేని యోగం కావాలి మనకు.

ప్రస్తుతం బ్రహ్మజ్ఞానికి కలిగే యోగమిలాంటి యోగం. అంతకు ముందు ప్రపంచమనే దొకటి ఉండి దానిని క్రొత్తగా బ్రహ్మాకారంగా దర్శించటం లేదు జ్ఞాని. అంతకు ముందూ బ్రహ్మ చైతన్యమే ఇది. అయినా అనాది సిద్ధమైన

Yalamanchili Brahmaji Srinivasa Rao www.advaitavedanta.in

అజ్ఞానంవల్ల ప్రపంచాకారంగా భాసిస్తున్నదా బ్రహ్మం. మరలా జ్ఞాన దృష్టితో ఎప్పుడు దర్శించామో అప్పుడు సర్పమే రజ్జువుగా కనిపించినట్టు ప్రపంచ మంతా తన సహజమైన బ్రహ్మ స్వరూపంతోనే మనకు సాక్షాత్కరిస్తుంది. సహజంగా బ్రహ్మంతో కలిసే ఉన్నది గనుక ఇది క్రొత్తగా ఏర్పడే కలయిక కాదు. అలాగే నామరూపాలనే విశేషాలన్నీ ఒకే ఒక చిదాకారంగా అనుభవానికి వస్తాయి కాబట్టి ఇందులో వైషమ్యమనే వాసనకూడా లేదు. ఒక్క మాటలో సమత్వ రూపమైన యోగమంటే ఇదే.

ఇలాంటి యోగంతో నిరంతరమూ కాలం గడిపే బ్రహ్మవేత్త వ్యవహారమే వేరు. మామూలు లోకుల దైనందిన జీవితాలకీ అలాంటి వ్యక్తి జీవితానికీ హస్తిమశ కాంతర ముంటుంది. మామూలు వాడేది రాత్రి అనుకొని చూస్తాడో జ్ఞాని కది కేవలం పగలు. మరి వాడేది పగలుగా భావిస్తాడో ఈ జ్ఞానికది రాత్రి అట.

ఏమిటీ మాటలకర్థం. అందరూ లోకంలోనే బ్రతుకుతున్నప్పు డొకడికి రాత్రి అయి మరొకడికి పగలెలా అవుతుంది. అలాగే ఒకడికి పగలయి ఇంకొకడికి అదే రాత్రి ఎలా అవుతుంది. అనుభవానికే విరుద్ధం గదా ఇది. అయితే ఎందుకు చెప్పినట్టీమాట. పగలు - రాత్రి అనే శబ్దాల కిక్కడ అహో రాత్రాలని వాచ్యార్థం కాకుండా జ్ఞానమూ - అజ్ఞానమూనని లాక్షణీకమైన Meta phonical అర్థం చెప్పుకొంటే సరిపోతుందంటారు కొందరు. అలా చెప్పుకొన్నా చెల్లదు. ఎందు కంటే ఒకరికి పగలైనది ఒకరికి రాత్రి అన్నప్పుడు రాత్రి పగలనే రెండు భావాలూ ఇద్దరికీ చెబుతున్నాడు భగవానుడు. అప్పటికి ఇద్దరికీ జ్ఞానాజ్ఞానాలు వర్తించవలసి ఉంటుంది. ఇక లౌకికుడి కంటే జ్ఞానికి విశేషమేమి చెప్పినట్టు.

కాబట్టి అహో రాత్రాలనే మాటలకిక్కడ చెప్పవలసిన అర్థం జ్ఞానమూ - అజ్ఞానమూ -నని గాదు. రాత్రి అంటే పరమాత్మ తత్త్వమన్నారు భగవత్పాదులు. రాత్రిలాగా అంతా మన కగమ్య గోచరం కాబట్టి పరమాత్మ రాత్రి లాంటిది. ఇలా లోకులందరికీ రాత్రి మాదిరి ఏ మాత్రమూ గోచరం కాకపోయినా మహా యోగి కది పట్ట పగలు లాగా ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తుంటుంది. ఇది ఎలాంటిదంటే ఒక గ్రుడ్లగూబే ఉంది. దానికి పగటివేళ కండ్లు కనిపించవు. మనకంతా ఎంతో స్పష్టంగా ప్రతి ఒక్కటీ కనిపిస్తున్నప్పుడే అది ఏ ఒక్కటీ చూడలేని దుర్దశలో చిక్కుపడి ఉంటుంది. మనకు పగలైతే దాని కదే రాత్రి.

అలాగే యోగికి ఎంతో స్పష్టంగా సూర్యరశ్మిలో మాదిరి కనిపించే ఆ బ్రహ్మ తత్త్వం గుడ్లగూబ లాంటి దృష్టి గల లోకుల కేమాత్రమూ అంతుపట్టటం లేదు. గుడ్లగూబకు సూర్య తేజస్సే తమస్సు లాగా భాసించినట్టు మనందరికీ ఆ బ్రహ్మ చైతన్యమే అచేతనమైన జగత్తయి కూచుంది.

పోతే ఇక మన మందరమూ పగలని ఏది చూస్తామో అది బ్రహ్మవేత్తకు రాత్రి అట. ఏమిటి దీని కర్థం. పగలంటే ఇక్కడ నిజంగా పగలు గాదు. మనం పగలని భ్రమ పడుతున్నది. అది ఏదో గాదు. ఈ నామ రూపాత్మకమైన ప్రపంచమే. ఇది మన చుట్టూ పరచుకొని కనిపిస్తుంటే నిజంగానే ఉందని చూస్తున్నాము. అది కనిపిస్తూ - మనం చూస్తూ ఉన్నాము కాబట్టి పగలనే మన భావం. ఇది పగలు గాదు. నిజంలో రాత్రి. అంటే మన ముందనుకొని చూచే ఈ చరాచర దృశ్యాలు వాస్తవంలో లేవక్కడ. లేని ప్రపంచాన్నే మన అజ్ఞానం వల్ల ఉన్నట్టు దర్శిస్తున్నాము. దానితో వ్యవహరిస్తున్నాము. ఇది ఎలాంటిదంటే ఒక స్వప్న దృక్కు అనుభవం లాంటిదన్నారు భాష్యకారులు. స్వప్నంలో మనమెన్నో చిత్ర విచిత్ర దృశ్యాలు చూస్తుంటాము. ఎంత మందితోనో వ్యవహరిస్తుంటాము. అదంతా తాత్కాలికంగా పగలే మనకు. అంత మాత్రాన అది యథార్థమైన పగలు కాదు గదా. రాత్రినే పగలుగా భావించి చూస్తున్నాడు స్వప్న దృక్కు. వాడిలా చూస్తున్నా ప్రక్కనే మేలుకొని ఉన్న వేరొకడి కది రాత్రి కాలమే. పగలు గాదు. ఇక్కడ కలగనే వాడికి రాత్రే పగలైనా మేలుకొని చూచే వాడి కది ఎలా రాత్రి కాలమో - అలాగే అజ్ఞాని ప్రపంచమని చూస్తున్నది జ్ఞాని కదంతా బ్రహ్మమే.

దీనినిబట్టి తేలిందేమంటే జ్ఞానికి బ్రహ్మమూ బ్రహ్మమే. ప్రపంచమూ బ్రహ్మమే. అజ్ఞానికి బ్రహ్మమూ ప్రపంచమే. ప్రపంచమూ ప్రపంచమే. అంటే జ్ఞాని కహోరాత్రాలు బ్రహ్మే కనిపిస్తుంటే. అజ్ఞానికి ప్రపంచమే కనిపిస్తున్నదని అర్థం. ఇందులో బ్రహ్మాన్ని ప్రపంచంగా చూస్తున్న మన బోటి లోకులది వియోగమైతే - ఈ సమస్తమూ బ్రహ్మతత్త్వంగా దర్శించే జ్ఞానిది నిజమైన యోగం. అప్పుడిక నామ రూపకృతమైన వైవిధ్యమే Diversity లేదు కాబట్టి అదే సమత్వం. సామ్యం. ఈ కనిపించే చరాచర పదార్థాలలోనూ పరచుకొని ఉన్నదదే. అదే ఇవన్నీ వాస్తవానికి. అది మన స్వరూపమే. దానిని పట్టుకొని మన స్వరూపమని భావించినప్పుడే మనకు మోక్షం.

## 15

**యోయమ్ యోగ స్త్వయా ప్రోక్త స్సామ్యేన మధు సూదన!**

**ఏతస్యాహం నపశ్యామి చంచలత్వాత్ స్థితింస్థిరామ్ 6-33**

సంసార వలయంలో చిక్కిన మానవుడు మోక్షం సాధించాలంటే సత్పదార్థ మేదో దాన్ని పట్టుకోవాలనీ - అది చరాచర పదార్థాలన్నిటిలో సమానంగా పరచుకొని ఉన్న చైతన్యమేననీ - అది కూడా మన స్వరూపమేననీ - ఇంతవరకూ ప్రతిపాదించాము. దానినందుకొనే ఉపాయం కూడా బోధించాము సమత్వ రూపమైన అభ్యాస మొక్కటేనని.

అయితే ఈ సమత్వమనేది అభ్యసించగలమా అనేది మనకు పట్టుకొన్న సమస్య. ఇందులో ఉన్న ఇబ్బంది ఏమంటే మానవుడది తన మనసుతోనే సాధించవలసిన క్రియ. మరొకమార్గం లేదు. మనసుతో ముందు సాధిస్తేగాని అది తరువాత మన జీవితంలో ప్రవేశించదు. మరి ఈ మనసు చూస్తే చాలా చపలమైనది. క్షణకాలం ఎక్కడా స్థిరంగా నిలిచేది కాదు. కోతిలాగ ఎప్పుడూ మార్పునే కోరుతుంటుంది. మారకపోతే అసలది మనసే కాదు. సంకల్ప వికల్పాత్మకమని గదా దానిని వర్ణించారు. సంకల్ప వికల్పాలంటేనే మార్పు. అలాంటప్పుడింత అస్థిరమైన మనసుతో సుస్థిరమైన తత్త్వాన్ని ఎలా ఆకళించు కోవాలని ప్రశ్న.

నిజంగా ఇది చాలా గడ్డయిన సమస్యే. సందేహం లేదు. ఎందుకంటే సాధనంవల్లనే సాధ్యమనేది సిద్ధిస్తుంది. దాని పాటికది ఎప్పుడూ సంభవం కాదు. ఇది లోకంలో ఎక్కడ పట్టినా మనం చూచే వ్యవహారమే. మరి ఇక్కడి సమత్వమనేది అలాంటి సాధ్యమైన పదార్థం. దాని కేకైక సాధనం మనసని చెబుతున్నది శాస్త్రం. ఆ మనసింత అయోమయంగా ఉన్నదంటే ఏమిటి గతి. సమత్వమనేది ఎలా సిద్ధిస్తుందనే ప్రశ్న రావడం సహజమే. ఇలాటి ప్రశ్నే వేశాడు కృష్ణ పరమాత్మ నర్జునుడు.

## 16

**చంచలం హి మనః కృష్ణ - ప్రమాథి బలవ ద్దృఢం**

**తస్యాహంనిగ్రహం మన్యే - వాయోరివ సుదుష్కరమ్ 6-34**

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

అర్జునుడికినరుడని కూడ పేరుంది. నరుడంటే మానవుడే. మానవుడే అడుగుతున్నా డీప్రశ్న. ఏమని. మనసనేది బాగా చంచలమైనది. నిత్యమూ పారాడే స్వభావం దానిది. తంతునాగం లాగా చాలా బలమైనది. దృఢమైనది. అలాంటి రాకాసి మనసు నరికట్టమంటావు నీవు. అది గాలిని మూట గట్టటం లాంటిదని నాకు తోస్తుంది. ఎంతో కష్టపడి గాలిని మూట కడతావు. కాని ఏమి ప్రయోజనం. నీవు కట్టే లోపలే అది తప్పించుకొని పోతుంది. అలాంటిదే ఈ మనసు కూడా.

అంతేకాదు. మరి ఒక చిత్రం కూడా ఉంది ఇందులో. గాలిని మూట కట్టాలనుకునేది గాలి కాదు. మనం ఇక్కడ మనసును కట్టి వేయాలనుకొనేది మనసే అయి కూచుంది. అంచేత ఇది ఇంకా అసాధ్యమైన విషయం.

అయితే అసాధ్యమని ఊరక కూచుంటే సాధన చేయలేము. సాధన చేయక పోతే సంసారంలో నుంచి బయట పడలేము. ఏమిటీ విషయవలయం. ఎప్పటికి దీనికి పరిష్కారమని ప్రశ్న.

## 17

**అసంశయం మహాబాహో - మనో దుర్నిగ్రహం చలం।**
**అభ్యాసేన తు కౌంతేయ - వైరాగ్యేణ చ గృహ్యతే 6-35**

ఈ ప్రశ్నకు జవాబివ్వ వలసిన వాడెవ్వడు. నరుడు వేసే ప్రశ్నకు నారాయ ణుడే ఇవ్వాలి జవాబు. కనుకనే ఇస్తున్నాడు. ఏమని. నిజంగా విషవలయమే ఇది. మనసును నిగ్రహించ వలసింది మనసే అయికూచుంది. కాబట్టి అది చాలా అసాధ్యమనే విషయంలో సందేహం లేదు. అయినప్పటికి అసాధ్యమని ఊరక కూచుంటే లాభం లేదు. ప్రయత్నం చేయవలసిందే తప్పదు. ప్రయత్నిస్తే అరికట్టవచ్చు. ఏమిటి ప్రయత్నం. అది ఎలా చేయాలి అభ్యాసమనీ వైరాగ్యమనీ అది రెండు విధాలు. ఈ రెండు కలిపి ప్రయత్నిస్తే మంత్రముగ్ధమైన భుజంగం లాగా అది మనకు తప్పక వశమవుతుంది.

అభ్యాస మేమిటి వైరాగ్యమేమిటి. ఆత్మ స్వరూపాన్ని పట్టుకోవటం అభ్యాసం. అనాత్మ స్వరూపాలను త్రోసివేయటం వైరాగ్యం. వీటిలో ఏది ముందు - ఏది వెనక అనే ప్రశ్నలేదు. రెండూ ఏక కాలంలో అభ్యసిస్తూ పోవాలి. లోకంలో ఒక సామెత ఉంది. పెండ్లి అయితేగాని పిచ్చి కుదరదు

పిచ్చి కుదిరితేగాని పెళ్ళి కాదు అని. అది పరిష్కారం కావాలంటే ఏమిటి ఉపాయం. పిచ్చికి మందు ఇప్పిస్తూ ఉండాలి. పెండ్లికి సంబంధం చూస్తూ ఉండాలి. రెండూ కలిసి ఒక కొలికికి వస్తే పిచ్చి కుదురుతుంది. పెండ్లీ జరుగుతుంది.

అట్లాగే పిచ్చిలాంటి ఈ సంసారబంధం తొలగి పెండ్లి లాంటి జీవ బ్రహ్మైక్యం సాధించాలంటే మన మా రెండింటినీ ఒకేసారి పట్టుకోవాలి. అంటే ఏమన్నమాట. ప్రపంచానికంతా మూలభూతమైన తత్త్వాన్ని అనుసంధానం చేసుకుంటూ దానిలో ఈ నామ రూప ప్రపంచాన్ని వైరాగ్య భావంతో ప్రవి లయం చేస్తూ రావాలి. అప్పుడు అద్వితీయమూ ఆత్మ స్వరూపమూ అయిన చైతన్యమొక్కటే మన మనస్సు నావరిస్తుంది. దానితో మన మనసుకు ఉండే చాపల్యం ఎగిరిపోయి అది అమనస్కమవుతుంది.

శాస్త్రీయంగా చూచినప్పటికీ అసలు అభ్యాస వైరాగ్యాలకు విలక్షణంగా మరొక సాధనే లేదనిపిస్తుంది. ఎందు చేతనంటే ఈ సంసార మనేది మనకు అనాది సిద్ధమైన అజ్ఞానం వల్ల ఏర్పడిందే. ఇదంతా నా స్వరూపమని తెలియక పోవటమే అజ్ఞానమంటే. ఈ అజ్ఞానానికి కొండ చిలువకులాగా రెండు ముఖా లున్నాయి. ఒకటి ఆవరణం Contraction. మరొకటి విక్షేపం Distraction. ఆవరణమనే ముఖంతో అది సత్యమైన ఆత్మను కప్పి పుచ్చింది. విక్షేప ముఖంతో అసత్యమైన ప్రపంచాన్ని బయట పెట్టింది. అదీ జరిగిన పెద్ద మోసం.

ఇప్పుడీ మోసాన్ని భేదించాలంటే సాధకుడైన వాడేమి చేయాలని ప్రశ్న. ఆవరణ విక్షేపాలనే రెండింటికీ రెండా హుతులు పడవేయాలి. అందులో విక్షేపానికి పడవేసే ఆహుతే వైరాగ్యం. ఎందుకంటే నామరూపాలే విక్షేపం. అవి అభిమానాన్ని రేకెత్తించి ఆకడుతున్నాయి మానవుణ్ణి. కాబట్టి వాటిని నిత్యమూ వైరాగ్య బుద్ధితో భావన చేస్తే కరిగిపోతాయి. పోతే ఇక ఆవరణకు మనం వేయగల్గిన ఆహుతి అభ్యాసం. ఆవరణ మనేదివాసనారూపంగా ఆత్మ చైతన్యాన్ని ఆవరించి ఉన్నది. చీకటి లాంటిదది. వస్తు రూపంగా లేకపోయినా ఏదో ఉన్నట్టు కనిపిస్తుంది. అంచేత నిత్యము స్వరూపాన్నే భావన చేస్తూ పోతే చాలు అది తేజోరూపమయిన జ్ఞానం కాబట్టి ఆవరణాత్మకమైన తమస్సును పటాపంచెలు చేస్తుంది. తన్మూలంగా అద్వితీయమైన ఆత్మ చైతన్యం ఎప్పుడూ మన కనుభవానికి వస్తుంది. ఇందులో ఉన్న రహస్య మేమంటే వైరాగ్యమనేది

Vallabhaneni Srinivasa Rao
www.advaitavedanta.in

ప్రతిలోమ క్రియ. అది అనాత్మ జగత్తును లయం చేస్తుంది. పోతే అభ్యాసం అనులోమ క్రియ. అది ఆత్మమీదనే చూపునిలుపుతుంది. దానితో అంతా ఆత్మగానే అనుభవానికి వస్తుంది.

# 18

**అసంయ తాత్మనా యోగో- దుష్ప్రాప ఇతి మే మతిః**
**వశ్యాత్మనా తు యతతా-శక్యోవాప్తుముపాయతః 6-36**

అయితే ఈ అభ్యాస వైరాగ్యాలు మాత్రమను కొన్నంత సులభమా అని మరలా ప్రశ్న వస్తుంది. ఎందుకంటే బంధుమిత్రాదులూ వస్తు వాహనాదులూ - మనలను చాలా బలంగా పట్టుకొని బాధిస్తున్నాయి వీటన్నింటినీ నిరభిమానంగా చూడటమనేది అంత సులువైన వ్యవహారం కాదు. అట్లాగే వాటిని కేవలం చైతన్యమనే దృష్టితోచూడటం కూడా చెప్పినంత సులభం కాదు.

చైతన్యమంటే జ్ఞానం. ప్రాపంచికమైన పదార్థాలన్నీ మనకు జ్ఞేయంగా Known కనిపిస్తాయేగాని జ్ఞానంగా Knowledge కాదు. జ్ఞానంగానయితే అసలు కనిపించనే కనిపించవు. మరి కండ్లు తెరచినా మూసినా వందలు వేలు మన చుట్టూ కనిపిస్తూనే ఉన్నాయి పదార్థాలు. అనుక్షణమూ చూస్తూనే ఉన్నాము వాటి రూపాలు మనం. అలా చూడటానికి బాగా అలవాటు పడ్డాము కూడ. అవి లేకుంటే ఉండలేని పరిస్థితికి కూడా వచ్చింది మానవుడి మనస్సు. అలాంటప్పుడు ఎంత శాస్త్రీయంగా నిరూపణ చేసినా ఈ రూపాలనన్నింటినీ కేవలం చైతన్య రూపంగా దర్శించగలమా అని కూడా పెద్ద అనుమానం.

దీనికి సమాధానమే ఈ శ్లోకం. అసంయతాత్ముడి కైతేనే ముందు చెప్పిన క్లేశం. వశ్యాత్ముడికి కాదట, ఆత్మ అంటే ఇక్కడ మనస్సనే అర్థం. మానవుని మనస్సు కొక గొప్ప సామర్థ్యమున్నది. దానిపేరు సంయమం. సంయమమంటే ఒక పదార్థాన్ని సంశ్లేషాత్మకంగా Synthetic చూచే మనస్తత్వం. లోకంలో మనమే పదార్థాన్ని చూచినా రెండువిధాలుగా చూస్తుంటాము. సంశ్లేషంగా Synthetic నైనా చూస్తాము. విశ్లేషం Analytic నైనా చూస్తాము. మనం దారిలో నడుస్తూంటే దారి ప్రక్కన ఒక చెట్టు కనిపిస్తుంది. దాన్ని చెట్టుగానే చూచామంటే పచ్చగా ఎత్తుగా ఒక అఖండమయిన రూపాన్నే చూస్తుంది. మన కన్ను. అప్పుడది సంశ్లేష దృష్టి.

అలాకాక అదేమిటి-ఇదేమిటి-అని విశ్లేషణ చేసి చూచామంటే చాలు. అదే కొమ్మలు రెమ్మలుగా-పూవులుగా కాయలుగా-గోచరిస్తుంది. చెట్టనే దృష్టితో చూచినప్పుడీ విభాగాలన్నీ అక్కడే ఉన్నా గోచరం కావు. విభాగదృష్టితో చూచి నప్పుడు చెట్టు అనే అఖండ రూపం మనసుకు రాదు. ఒకటి మగ్నమైతే merged ఇంకొకటి ఉన్మగ్న Emerged మవుతుంది. మొత్తంమీద రెండు శక్తులూ సహజంగానే ఉన్నాయి మానవుని మనస్సుకు. ఏ సందర్భంలోనయినా సరే. రెండు శక్తులూ ఏదో ఒక మోతాదులో పనిచేస్తూనే ఉంటాయి. ఒక దానిని విడిచి మరి ఒకటి ఉండదు. అలా ఉండేట్టయితే మన మనో నేత్రాని కెప్పుడూ పరమాత్మ అయినా కనిపించాలి. లేదా ఎప్పుడూ పరమాణువులయినా కని పించాలి. ఎందుచేతనంటే ఒకటి కేవల సంశ్లేషం. వేరొకటి కేవల విశ్లేషం. అయితే మనకలా కనిపించటంలేదు. దీనినిబట్టి మన ప్రతి ఒక్క అనుభవం లోనూ రెండూ కలిసే పనిచేస్తుంటాయని తార్కాణమవుతుంది.

అలాంటప్పు డీరెండు శక్తులలో ఒకదానిని తొంబది తొమ్మిది శాతం దాకా పెంచుకుంటూ పోగలిగితే మరొకటి కేవలం ఒక్క శాతమే కాబట్టి బాగా దుర్బలమై పోతుంది. అప్పుడది ఉన్నా మనకు ప్రమాదంలేదు. అసలే లయం కావడంలేదు కాబట్టి రెండూ అవినాభావంగా ఉండాలనే సూత్రానికి అపవాదం లేదు. అలాగే ఉన్నప్పటికీ దుర్బలం కాబట్టి దాని ఉనికివల్ల మనకు భయంలేదు.

అయితే ఇందులో ఏది తగ్గించుకోవాలి. ఏది హెచ్చించుకోవాలని ప్రశ్న. తగ్గించుకోవలసింది విశ్లేష దృష్టి. ఎందుకంటే అదే వైషమ్యానికి కారణం. దానికి భిన్నంగా సామ్యానికి కారణం కాబట్టి సంశ్లేష దృష్టిని హెచ్చించుకోవలసి ఉంది. సంశ్లేష దృష్టిని పెంచుకుంటూ పోతే చివరకంతా చైతన్యమే ననే భావనకు తీసుకుపోతుంది. అప్పుడు మనసు తొంబది తొమ్మిదిపాళ్లు సంశ్లేష స్థితిలోనే ఉంటుంది. అప్పటికి ఒక్క భాగం విశ్లేష మనేది లేకుండా పోదని చెప్పాము. అయితే అది ఒక బిందు రూపంగా మారి చాలా బలహీనమవుతుంది. కాబట్టి చైతన్యాన్ని ఏమాత్రమూ బాధించలేదు. మీదు మిక్కిలి దానికే అధీనమై దాని ఇచ్ఛానుసారంగా ప్రవర్తించే శక్తిగా మారుతుంది. దీనినే అవ్యక్తమనీ - ప్రకృతి అనీ - మాయ అనీ - Cosmic power పేర్కొంటారు వేదాంతులు.

మొత్తంమీద ఇక్కడ ఉన్న పెద్ద షరతేమంటే నిరంతరమూ సంశ్లేష దృష్టినే పెంచుకుంటూ పోవటం. కొంతవరకూ ఇప్పుడే మనకున్నదది. అయితే అది

చాలదు. విస్ఫులింగ మాత్రంగా ఉన్నదీనినే జ్వాలారూపంగా ప్రజ్వలింపజేయాలి మనం. అలా పరిణతి చెందాలంటే దానికి మొదటి నుంచీ సంయయమనేది ఉండాలి. సంయమమంటే సంశ్లేషమనే గదా పేర్కొన్నాము. ఈ సంశ్లేష దృష్టి మానవులందరిలో ఉన్నా సమానంగా ఉండదు. కొందరిలో దాని మోతాదు తక్కువ. కొందరిలో ఎక్కువ. వారిలో వ్యక్తమైన concrete సంశ్లేషాలనే గమనించగలరు గాని చాలామంది అవ్యక్తమైన Abstract వాటి నవగాహన చేసుకోలేరు. ఏ ఒకరిద్దరో అలా ఆకళించుకోగలరు. వారిని వశ్యాత్ములని వర్ణించారు పెద్దలు. మనస్సును కూడగట్టుకొని ఏది చూచినా అఖండంగా చూడడానికే అలవాటుపడి ఉంటారు వారు. సహజమైన శక్తి కొంత. అలవాటు కొంత. అది శక్తిని పెంచుతూపోతుంది. దానితో యోగాన్ని సాధించవచ్చు. శక్తి ఉన్నా పెంచుకోలేకపోతే అది అసంయమం అలాంటి వాడెప్పుడూ యోగానికి నోచుకోలేడు.

## 19

తపస్విభ్యోధికో యోగీ-జ్ఞానిభ్యశ్చ మతోధికః
కర్మిభ్యశ్చాధికోయోగీ-తస్మాద్యోగీ భవార్జున 6-46

యోగమంటే సమధర్శన మని చెప్పాము. దాన్ని మన మర్థం చేసుకున్నంత మాత్రాన ఉపయోగం లేదు. ఆచరణలో పెట్టినప్పుడే దానికి విలువ. అసలాచరించిన వాడే యోగి. కనుకనే వాడందరికన్నా గొప్పవాడు. అందరికన్నా అంటేఎవరా అందరు.

ఒకరు తపస్వులు. వీరిని గొప్పగా చూస్తాము మనం. తపస్సు చేశారంటే ఎంతో గొప్ప అని మన నమ్మకం. నిజానికేమంత గొప్పకాదది. సాంప్రదాయికంగా చూస్తే తపస్సనే మాటకు తపించడం-అన్న పానాదులు మాని శరీరాన్ని శుష్కింప చేసుకోవటం - అని అర్థం. కృచ్ఛ్ర చాంద్రాయణాదులైన వ్రతాలన్నీ ఇలాంటివే. వీటివల్ల మనో మాలిన్యం పోతుందనేది వట్టిమాట ఇంకా ఎక్కువవుతుందేమో కూడ. అందుకే గదా రాక్షసులు ఎంతో ఘోరమైన తపస్సుచేసి కూడ వారికి రాగద్వేషాలు నశించనిది. మహర్షులు కూడ కొంతమంది తపస్సంపన్నులైన వారు తమదారి కడ్డు తగిలిన వారి నందరినీ శపించటం మానలేదు. దీనినిబట్టి తపస్సనేది యాంత్రికమైన ఒక పరిశ్రమలాంటిదే గాని మరేమీ కాదు.

అట్లాగే జ్ఞానం కూడ గొప్పకాదు. జ్ఞానం కాకపోవడమేమిటి - అదే గదా తత్త్వాన్ని సాధించటాని కేకైక సాధనం - అని శంకించవచ్చు. నిజమేగాని అది కేవలం పుస్తక జ్ఞానమయితే పనికిరాదు పుస్తక జన్యమైనది అనుభవానికి రావాలి అప్పుడే అది ఆత్మదర్శనానికి సాధనమవుతుంది. అనుభవమే గదా యోగమని పేర్కొన్నాము. అంచేత ఆ స్థాయికి రాని పరోక్ష జ్ఞానమూ తగ్గు జాతిదే.

పోతే ఇక కర్మ. అది ఇంకా తక్కువ స్థాయి. కేవల మీ భౌతిక ప్రపంచం తోనే ముడిపడి ఉన్నదది. ఆత్మ స్పర్శకూడా లేదు దానికి. ఫలాపేక్ష లేకుండా చేస్తేనే అద్దైనా కొంత ఫలిత మిచ్చేది. ఫలాపేక్ష లేకుంటే అది యోగానికి కొంత దోహదం చేస్తుంది.

కనుక ఇంతకూ ఫలితాంశ మేమంటే తపోజ్ఞాన కర్మలనేవి ఏవి మోక్షానికి సాక్షాత్తుగా సాధనాలు కావు. అవే సమదర్శనమనే యోగంతో చేరి పనిచేస్తే సాధనాలవుతాయి అప్పుడిన్ని నామధేయా లనవసరం దానికి. యోగమనే పేరొక్కటే చాలు. దాని నభ్యసించటమే సాధకుని కర్తవ్యం వాడే అందరికన్నా విశిష్టుడు.

## 20

యుక్తాహార విహారస్య - యుక్త చేష్టస్య కర్మసు!
యుక్త స్వప్నావ బోధస్య-యోగో భవతి దుఃఖ హా!! 6-17

ఆచరణమే యోగమని చెప్పాము. ఆచరణ అనే సరికది సాధకుడి మనో దార్ఢ్యాన్ని బట్టి ఉంటుంది. మనోదార్ఢ్యమంటే అది ఒక్కసారిగా ఊడిపడేది కాదు. ఆహారం దగ్గర నుంచీ ఉన్నాయి దానికి పునాదులు. అవి గట్టిపడితే గాని దానిపైన నిర్మించే కట్టడం నిలవదు. ఎలా గట్టిపడాలంటారది.

మనమే పని చేసినా ఒక మోతాదు దాటి చేయరాదు. మోతాదులోనే ఉంది సమత్వం. అది దాటితే దానికి దెబ్బతగులుతుంది. ఈ మోతాదుకే యుక్తమని పేరు పెట్టారు. ఆహారం తీసుకొంటే యుక్తంగా తీసుకోవాలి. విహరిస్తే యుక్తం గానే విహరించాలి. ఇవే సగం బలమిస్తాయి మానవుడి మనస్సుకు.

పోతే ఇక ఎన్నో ఉంటాయి మనం ప్రతి క్షణం సాగించే పనులు. ఒక ప్రసంగాలే కావు. ప్రయాణాలే కావు. విందులే కావు. వినోదాలే కావు. ఉద్యోగాలే కావు. వ్యాపారాలే కావు. ఇవన్నీ చేష్టల క్రిందికి వస్తాయి. ఈ చేష్టలు

కూడా తగ్గించు కోవాలి మనమదే పనిగా. అసలే వాటిని చేయకూడదని కాదు. చేస్తే అర్థం ప్రాణం ధారబోసి చేయటమూ కాదు. ఎంత వరకో అంత వరకే. ఎంత సుఖంగా ప్రవేశిస్తామో అందులో - అంత సుఖంగా బయట పడగల గాలి. లేకుంటే మనస్సు దానిలో బాగా లగ్నమై తన బలాన్ని కోల్పోతుంది. అన్నింటి కన్నా ముఖ్యం నిద్రా-మెలకువా. అతి నిద్రా పనికి రాదు. అతి జాగ్రత్త పనికిరాదు. మొదటిది అభ్యాసానికి దెబ్బయితే రెండవది వైరాగ్యానికి దెబ్బ. కాబట్టి వాటిని కూడా సాధకుడు అదుపులో పెట్టుకోవాలి.

ఇలా నిగ్రహం పాటిస్తూపోతే అది మనోదార్ఢ్యానికి క్రమంగా దారి తీస్తుంది. మనసు దృఢమైతే ఇక యోగం మనకు నిలిచిందన్న మాటే. లేకపోతే యోగమని మాటలు చెప్పడమే గాని అది మనకెప్పుడూ దక్కేదిలేదు. అనుభవానికి వచ్చేది లేదు.

## 21

అయతిః శ్రద్ధయోపేతో - యోగాచ్చలిత మానసః
అప్రాప్య యోగ సంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి 6-37

సమత్వ రూపమైన యోగాని కెప్పుడూ సాధకుడు యత్నం చెయాలని చెప్పాము. ఈ యత్నమనే మాట వినేటప్పటికి ఒక సందేహ మేర్పడుతుంది మనకు. యత్న మనేది అందరూ చేయలేరు. మానవులలో ఏ కొందరో దానికి అధికారులు. Competent. కాని అధికారం లేకున్నా శ్రద్ధాభక్తులున్న వ్యక్తు లనేకులున్నారు లోకంలో. అడపా దడపా కొంత యత్నం కూడా చేయకపోరు. అయితే అది తీవ్రమైన యత్నం కాకపోవచ్చు. అంత బలమైన యత్నం కాక పోవటం మూలాన యోగమార్గంలో వారికి మాటి మాటికీ మనసు చలించటం కూడా సహజమే. అలాగే జీవితాంతమూ చలిస్తూపోతే ఇక వాడి గతేమిటి. సిద్ధి అనేది ఎప్పుడు అని ప్రశ్న.

నిజంలో యోగం సిద్ధించని వాడి గతేమిటని అడగ నక్కరలేదు. వాడిగతి అధోగతేనని ఊరకనే చెప్పవచ్చు, కాని ఇక్కడ సూక్ష్మ మేమంటే వాడికి ప్రయత్నం లేదేగాని శ్రద్ధ ఉన్నది. శ్రద్ధ అనేది కూడా ఒక గొప్ప గుణమే. అది ఉన్నప్పుడేదో ఒక మంచిగతి రావాలే గాని అధోగతి పాలు కాగూడదు మానవుడు.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

అయితే అది ఏమిటి- ఎలా ఉంటుందనే విషయం మనంనిర్ణయించేది గాదు. మనమంతా నరులం. నరుడికి కలిగే సంశయం నారాయణుడే తీర్చ వలసి ఉంది. ఎందుకంటే వాడికి భగవంతుడని పేరు. భగమంటే షాడ్గుణాలలో "భూతానా మాగతిం గతిమ్" అని ప్రాణుల రాకపోకల రహస్యం కూడా ఇమిడి ఉంది. అలాంటి రహస్యాలన్నీ తెలిసినవాడు గనుకనే వాడు భగవంతుడు. వాడే కృష్ణ రూపంగా అవతరించాడు కనుక నరుడు వేసిన ప్రశ్నకు ఆ నారాయణుడైన కృష్ణుడే సమాధానం చెప్పాలి. మరొక్కడి కలాంటి అధికారం లేదు. అందులోనూ అతీంద్రియమైన విషయంలో.

## 22

**పార్థ నై వేహ నాముత్ర-వినాశస్తస్య విద్యతే**
**నహి కల్యాణకృత్ కశ్చిత్-దుర్గతిం తాత గచ్ఛతి 6-40**

చెబుతున్నాడు సమాధానం శ్రీకృష్ణ భగవానుడు. ఎంత అభ్యాస పాటవం లేకపోయినా శ్రద్ధా వంతుడైన వాడెప్పటికీ దెబ్బతినడు. ఇహం లోనూ పరం లోనూ ఎక్కడా వాడికి వినాశనం లేదు. కాకపోయినా పాడైపోవటానికి వాడేమి దుర్మార్గం చేశాడని. ప్రయత్న మెక్కువగా చేయలేదంత మాత్రమే. అయినా శ్రద్ధ అనేదొక్కటి ఉంది గదా. శ్రద్ధ దైవ గుణాలలో ఒకటిగా పరిగణించబడింది. అది అన్ని సిద్ధులకూ మూలం. అసలు శ్రద్ధ ఉన్నవాడు ప్రయత్నం కూడ చేయక పోడు. అయితే తగినంత బలంగా చేయకపోవచ్చు. అంత మాత్రాన మోసం లేదు చేసినంత వరకూ అది మంచిపనే. మరి మంచి చేసిన వాడెన్నటికీ వంచితుడు కాడు. అధోగతి కంత కన్నా పోడు. ఇది ముమ్మాటికీ సత్యం.

## 23

**ప్రాప్య పుణ్య కృతాం లోకా-నుషిత్వా శాశ్వతీ స్సమాః**
**శుచీనాం శ్రీ మతాం గేహే-యోగ భ్రష్టోభి జాయతే 6-41**

అంతేగాదు. ఎలాంటి గతి పొందుతాడని గదా అడిగావు వాడు చచ్చిన తరువాత పుణ్యలోకాలకు పోతాడు. అక్కడ చాలా కాలం సుఖంగా బ్రతుకు తాడు. అది సమాప్తం కాగానే మరలా ఈ లోకంలో వచ్చి జన్మిస్తాడు. అది కూడా ఎక్కడో పనికిరాని చోట గాదు. శుచీ శుభ్రతా ఉండే కుటుంబంలోనూ జన్మిస్తాడు.

శుచిత్వమూ - ఐశ్వర్యమూ ఈ రెండింటినీ పేర్కొనటంలో ఒక విశేష మున్నది. శుచిత్వ మున్న ఇంట్లో జన్మిస్తే జన్మతోనే వాడి కొక మానసిక నైర్మల్య మేర్పడుతుంది దానికి తోడు ఐశ్వర్యమూ ఉంటే అభ్యాసాని కెక్కువ ఆటంకం లేకుండా సాగిపోతుంది. దానితో ముందు జన్మలలో మందకొడిగా సాగిన ప్రయత్న మీ జన్మలో బాగా ముందుకు సాగటాని కవకాశ ముంటుంది.

## 24

**అథవా యోగినా మేవ - కులే భవతి ధీమతాం**
**ఏతద్ధి దుర్లభ తరం - లోకే జన్మయ దీదృశమ్ 6-42**

ఇంకా కొంత దూరం పోయి హామీ ఇస్తున్నాడు భగవానుడు. ఆచారమూ ఐశ్వర్యమూ ఉన్న ఇళ్ళలోనే కాదు. దేవుడు మేలు చేస్తే యోగాభ్యాస పరుల ఇంటిలోనే జన్మించినా జన్మించవచ్చు. శుకుడూ శంకరుడూ మొదలైన తత్త్వ వేత్తల జన్మ లిట్లాంటివే. అలాంటి జన్మ రావడం చాలా అపురూపం. ఎవరి కంటే వారికి లభించే సంపద గాదిది.

ఎందు కంటే ఆచార మనేది మనశ్శుద్ధి నీయవచ్చు. ఐశ్వర్యం మానవుడికి కొన్ని సౌకర్యాలు కల్పించవచ్చు. కాని అది కేవలం బాహ్యోరూపమే యోగానికి అంత మాత్రాన ప్రయోజనం లేదు. అంతర్యాన్ని మన మనుభవానికి తెచ్చుకోవాలి. అది అనుభవజ్ఞులు మాత్రమే మనకు ప్రసాదించగలరు. అట్టి వారు దేశంలో ఎక్కడ ఉన్నారో వెతుకుతూ పోవడం కష్టం. వెతికినా దోరకనూ వచ్చు. దొరకకనూ పోవచ్చు. అలాకాక వారితో మనకు రక్త సంబంధమే ఉంటే ఎంతో మేలుగదా. ఎప్పుడూ వారు మనకు కనిపిస్తూ ఉంటారు. తరచుగా వారివల్ల ఎన్నో యోగ రహస్యాలు తెలుసుకోవచ్చు సాధకుడు. ఇది దీనిలో ఉన్న విశేషం.

## 25

**తత్రతం బుద్ధిసంయోగం - లభతే పౌర్వ దైహికం**
**యతతే చ తతోభూయ - స్సంసిద్ధౌ కురునందన 6-43**

అయితే ఇక్కడ ఒక సందేహం. ఎన్ని అవకాశాలయినా ఉండవచ్చు. కాని వాటిని మానవుడుపయోగించు కొన్నప్పుడే ఫలితమిస్తాయి. లేకుంటే ఆం...

Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

అన్నీ ఉన్నాయనే సామెతే అవుతుంది. ప్రస్తుత మిలాంటి సౌకర్యాలన్నీ మన కబ్బినందుకవి మనకు ఉపయోగపడతాయా. పడతాయని. ఏమి నమ్మకం - అని మరలా ప్రశ్న.

పడతాయనే చెబుతున్నాడు పరమాత్మ. యోగభ్రష్టుడే వాతావరణంలో జన్మించినా వాడికా వాతావరణాన్ని ఉపయోగించుకునే బుద్ధిబలం కూడా జన్మ తోనే వస్తుంది. జన్మతోనే వస్తుందంటే ఎప్పటిదది. ఇంతకు ముందు జన్మల తాలూకు సంచితం. దాని సంస్కార మెక్కడికీ పోదు. ఎన్ని జన్మలు గడచినా అది వాడికి మాత్రమే హక్కుభుక్తం. తన్మూలంగా పూర్వ మెలాటి బుద్ధిబల ముందో మానవుడి కదే ఇప్పటి జన్మలోకూడా తటస్థ మవుతుంది.

అంతేగాదు. ఆ బలంతో వాడిప్పుడంతకన్నా ఎక్కువగా ప్రయత్నం సాగి స్తాడు. అలా సాగించినప్పుడే అంతకంతకు ముందుకుపోగలడు సాధకుడు. లేకపోతే పాతరలో ధాన్యం లాగా ఎంత పోగుజేస్తే అంతటితోనే నిలిచిపోయే ప్రమాద మున్నది. కాబట్టి జన్మాంతరంలో చేసుకొన్నది కొంతా-దాని ఆసరాతో మరలా మనం సాగించేది కొంతా-రెండూ కలిసి సాధన పెరుగుతూ పోతుందని భావించాలి మనం. ఒకటి అసలైతే మరి ఒకటి దానిపైన పెరిగే వడ్డీ లాంటిది.

## 26

**ప్రయత్నా ద్యత మానస్తు-యోగీ సంశుద్ధ కిల్బిషః**
**అనేక జన్మ సంసిద్ధ - స్తతో యాతి పరాం గతిమ్ 6-45**

మొత్తం మీద అదేపనిగా ప్రయత్నం చేస్తూ పోతే కొంతకాలానికి శుద్ధి అనేది ఏర్పడుతుంది. చిత్తానికి పట్టిన కల్మషం తొలగి పోవటమే శుద్ధి. కిల్బిషమంటే ఏమిటది. నిరంతర విషయ చింతన వల్ల మనసుకు కలిగే ఉపరాగం Impression దానిచే ఉపరక్తమైన మనస్సు మసి పట్టిన కాగుమాదిరి తయారవుతుంది. కాగు రాగిదు. కాని ఏమి సుఖం. ఎప్పుడూ నల్లగా కందెనలాగా కనిపిస్తుంటుంది. సహజమైన దాని ఎర్రదనం ఎప్పుడూ మనకు దృగ్గోచరం గాదు. అది ఆ నల్లని మసిపూత క్రిందబడి మటు మాయ మయింది.

అది ఇప్పుడు మరలా తన సహజమైన కాంతితో మనకు కనపడాలంటే దానికి మనం బాగా పులికాపు పెట్టాలి. రెండు చేతులతో పట్టి గట్టిగా తోమాలి. తోమే కొద్దీ నలుపు విరిగి ఎఱు పెక్కుతూ వస్తుందది. మన మనసుకు కూడా

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

వచ్చీ పోయి ఇలాంటి తోమకమే పెట్టవలసి ఉంటుంది. పెట్టే కొద్దీ మనసు కూడా వన్నె మారి తన సహజరూపంతో ప్రకాశిస్తుంది.

అంతేకాదు. ఏదైనా ఒక పాత్ర తోమేటప్పుడు చేయి రెండు వైపులా పోతుంది. ఒక వైపే అయితే అది సరిఅయిన తోమకం కాదు. అలాగే మనసును శుద్ధి చేసేటప్పుడు కూడా ఇరువైపులా చేయవలసి ఉంటుంది శుద్ధి. ఒకటి నేతి అని అనాత్మ దృష్టిని నిరాకరిస్తూ పోవడం. వేరొకటి అలా నిరాకరించినదంతా మరలా మన ఆత్మస్వరూపమేనని అనుసంధానం చేసుకుంటూ రావడం. ఒకటి ప్రసంఖ్యానమనీ – మరొకటి ప్రవిలాపనమనీ చెబుతారు శాస్త్రజ్ఞులు. మొత్తానికీ రెండూ కలిసి శోధనమనే ప్రక్రియను పూర్తిచేస్తాయి. దానితో బాగా పరిశుద్ధ మవుతుంది మానవుని మనస్సు. అప్పుడిక దానికి మనసనే పేరు లేదు. అది ఆత్మే అవుతుంది.

అయితే ఇది అంతసులభంగా జరిగే పనిగాదు. ఒక జన్మలో తెమిలే వ్యవ హారంకూడా కాదు. దానిని సాధించే లోపల మానవుడనేక జన్మ లెత్తవలసి ఉంటుంది. అలా చెప్పటంలో కూడా ఆశ్చర్యపడనక్కర లేదు. ఎంతో కర్మ మిగిలిపోయే కొంత కర్మవల్ల ప్రస్తుత మీ జన్మ ఏర్పడింది మనకు. ఇందులో మరలా చేస్తూనే ఉన్నాము కర్మ. అమిగిలి పోయిందీ ఇదీ కలిసి ఇంకా ఎన్నిజన్మ లివ్వాలో మనకు. అయితే సాధన చేసేకొద్దీ కర్మ కొంత తరిగిపోవచ్చు. సందేహంలేదు. కాని ఏమి సాధన. సముద్రం మాదిరి కర్మ ఉంటే అందులో ఒక బిందువు మాదిరైనా లేదు మనసాధన. ఇలాంటి బిందువు లెన్ని చేరితే సముద్రమయ్యేది.

కనుకనే ఎన్నో జన్మలు పడుతుందని చెప్పటం. ఒక్కొక్క జన్మలో కొంత కొంతపోగు చేస్తూపోతే ఒకానొక జన్మకది కొండలాగా పెరిగిపోతుంది. దానితో అంతవరకూ కొండలాగా పెరిగిన కర్మఅంతా కరిగిపోతుంది. కర్మ పూర్తిగా తొలిగిపోతే ఆ ఖాళీని క్రమంగా జ్ఞానమే ఆక్రమిస్తుంది. అప్పుడు ఇక జన్మలేదు. పునరావృత్తి రహితమైన పదాన్నే మన మందుకోగలం.

## 27

**మనుష్యాణాం సహస్రేషు–కశ్చి ద్యతతి సిద్ధయే**
**యతతా మపి సిద్ధానామ్–కుశ్చి న్మాం వేత్తి తత్త్వతః 7–3**

కాటుక కొండల మాదిరి ఈ కర్మపుంజ మిలా పెరిగిపోవటం మూలాన్నే ఎన్నో జన్మలకు జ్ఞానోదయం కలగటం అలా ఉంచి దానికోసం ప్రయత్నం చేయాలనే బుద్ధి కూడా అసలు ఎన్ని జన్మలకో గాని పుట్టదు. అందుకే కొన్ని వేలమంది కొకడు కనిపిస్తాడు సాధకుడని చెప్పబడేవాడు.

వాడు కూడా ఆ పరమార్థాన్ని ఉన్నదున్నట్టు పట్టుకోగలడని చెప్పలేము. వాడు తాను పట్టుకొన్నదేదో అదే సిద్ధి అని భావిస్తుంటాడు. అలాంటి సిద్ధి నార్జించిన వారిలో కూడా కొన్ని వేల మందిలో ఎవడో ఒక్క మహానుభావు డుంటాడు తత్త్వవేత్త.

అయితే ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది. సిద్ధుడంటున్నారు. తత్త్వవేత్త అంటు న్నారు. ఇద్దరూ ఒకటికాదా అని. కాదు. సిద్ధివేరు. తత్త్వజ్ఞానం వేరు, రెండూ ఒకటి కాదు. ఒకటే అయిననాడు దేవతలు మహర్షులు మరి సిద్ధులే కదా. వారు తత్త్వజ్ఞానం కోసం ప్రాకులాడటం దేనికి. అలా ప్రాకులాడుతున్నట్టు మనకు ఉపనిషత్తులలోనే నిదర్శనా లనేకం కనిపిస్తున్నాయి. త్రిలోకాధిపతి అయిన ఇంద్రుడు బ్రహ్మవద్దకు పోయి బ్రహ్మవిద్య నాకుపదేశించమని ప్రాధేయ పడతాడు. పోతే నారదమహర్షి లాంటివాడు మనో వ్యాకులతతో సనత్కుమారుని సమీపించి తరణోపాయమేమిటో బోధించమని యాచిస్తాడు. దీన్నిబట్టిచూస్తే ఆయా సిద్ధులకూ బ్రహ్మానుభవానికీ అసలు ఎలాంటి సంబంధమూ లేదని తేటపడుతున్నది.

సిద్ధి అనేదేమిటి. ఆయా యోగ భూమికలలో సంప్రాప్తమయ్యే ఒకానొక మహిమ. అది కొంత అలౌకికమే అయినా దానివల్ల బ్రహ్మజ్ఞానం మనకు లభిస్తుందనేది కల్ల. బ్రహ్మజ్ఞాన మెప్పుడు కరువైందో అప్పుడు ముక్తి కూడా మనకు పూజ్యమే. కాకున్నా ఈ సిద్ధులనేవి కొంతకాలమే మన కనుభవానికి వస్తాయి. ఆ తరువాత ఎప్పుడో ఒకప్పుడు చెప్పకుండానే ఎగిరిపోతాయి. మన మీ కాలంలో చూచే క్షుద్రశక్తులన్నీ ఇలాంటివే. విభూతి రాల్చేవాడు ఒకడైతే విగ్రహాలు తీసే వాడు ఇంకొకడు. ఆ విద్య వాడికి నిలిచేది కాదు. నిలిచే విద్యను వాడభ్యసించేది లేదు.

కాబట్టి అసలు ప్రయత్నించకున్నా సుఖం లేదు. ప్రయత్నిస్తే ఇలాంటి అల్పసిద్ధుల వరకే పరిమితమైనా సుఖంలేదు. వాటిని కూడా దాటిపోయి అన్నింటికీ మూల భూతమైన తత్త్వమేదో దానినే ఎప్పటికైనా అందుకోవాలి సాధకుడు. అదే నిజమైన సిద్ధి మరేదీకాదు.

## 28

**త్రిభిర్గుణమయై ర్భావై. రేభి స్సర్వ మిదం జగత్**
**మోహితం నాభి జానాతి-మా మేభ్యః పర మవ్యయమ్ 7-13**

అయితే ఇక్కడ ఒక ఆక్షేపణ రావచ్చు. తత్త్వమనేది సర్వత్రా నిండి ఉందని కదా ముందు ప్రతిపాదించారు. అలా సర్వత్రా వ్యాపించి ఉన్నప్పుడది ప్రతివాడి బుద్ధికీ స్ఫురించి తీరాలి. ఏ ఒక్కడో దానిని అనుభవింగడానికి వీలులేదు. అలాంటప్పుడు నూటికి కోటి కొకడుగా దాని నందుకో లేదని చెప్పే మాట కర్థమేమిటి.

యథార్థమే. తత్త్వమన్ని చోట్లా వ్యాపించి ఉంది. అది ప్రతివాడికీ అనుభవానికి రావలసిందే. కానీ చిత్రమేమంటే రావటాని కవకాశముందే గాని అది రావలసిన అగత్యంలేదు. ఎందుచేతనంటే దానికీ మన బుద్ధులకూ మధ్య ఒక పెద్ద అడ్డంకి ఏర్పడవచ్చు. ఎలాంటి ప్రతిబంధ మేర్పడినా అది దాన్ని మనసుకు రానీయదు. అలాంటి ప్రతిబంధకా లేమిటి అని అడిగితే సత్త్వ రజస్తమస్సులనే త్రిగుణాలు. ఈ త్రిగుణాలు పెట్టిన పిల్లలే నామ రూప క్రియలనేవి. పిపీలికాది బ్రహ్మ పర్యంత మీసృష్టినంతా అవేకమ్ముకొనివున్నాయి. అవి ఒకటిపోతే ఒకటి నిత్యమూ మన బుద్ధుల నావరించి తత్త్వానికి మనలను దూరం చేస్తున్నాయి. అందుచేత అక్కడే ఉన్నా మనం కండ్లు తెరచి తత్త్వాన్ని చూడలేక పోతున్నాము.

దీనికొక దృష్టాంతం చెబుతాను. ఒక నూతిలో నీళ్ళుంటాయి. ఆ నీటి అడుగు భాగాన ఒక పెద్ద బండ వున్నది. ప్రొద్దస్తమానమూ మనం నీళ్ళు తోడుతూ పోతే ఆ బండ మనకు కనిపించదు. కనిపించదంటే అది అక్కడ లేదనా అర్థం. ఉంది. అక్కడే ఉంది. ఉన్నా దాని చుట్టూ ఉన్న నీరు కలత చెందుతూ ఉండటం మూలానా అది మన కండ్లకు కనిపించదు. అదే కొంత సేపా నీళ్ళు ఎవరూ తోడకుండా పోతే చాలు. బాగా తేరుకొంటాయి. అలా తేరినప్పుడు పోయి చూచామంటే అడుగున ఉండే బండేకాదు. మనకు గుండు సూదితో సహా దర్శనమిస్తాయి.

ఇందుమూలంగా మనం గ్రహించవలసినదేమిటి. ఉపాధుల సంచలనమే పదార్థాన్ని కప్పిపుచ్చి మనకు కనపడకుండా చేస్తుంది. అవి నిశ్చలస్థితికి వస్తే అడ్డు తొలగి పదార్థం మరలా సాక్షాత్కరిస్తుంది. ప్రస్తుత మీ బ్రహ్మ పదార్థం కూడా ప్రకృతి గుణాల సంక్షోభం వల్లనే మరుగుపడి పోయింది. దానితో అది ఎక్కడో ఉందని మనం భ్రాంతి పడుతున్నాము. అందుకొవాలని ప్రయత్నిస్తు

న్నాము. అది అక్కడే వుంది. అయితే నీటి పొరలలాగా త్రిగుణాలనే తెరలు దానికడ్డు తగిలాయి. అందుకే కనపడటం లేదు.

## 29

**త్రివిధమ్ నరక స్యేదమ్-ద్వారమ్ నాశన మాత్మనః**
**కామః క్రోధస్తథా లోభ - స్తస్మాదేత త్త్రయమ్ త్యజేత్ 16-21**

త్రిగుణాలంటే సత్త్వ రజస్త మస్సులని గదా పేర్కొన్నాము. ఇవి ప్రతి వ్యక్తి లోనూ వాటి ప్రభావం చూపుతూనే ఉంటాయి. మనలో చోటుచేసుకొని నిత్యమూ మనలను పీడించే గర్భశత్రువులు మూడున్నాయి. ఒకటి కామం, మరొకటి క్రోధం. వేరొకటి లోభం. ఇవి మూడూ ఏవో గావు. ఆ గుణాల తాలూకు దుష్పరిణామమే. ఇందులో సత్త్వ ప్రభావం వల్ల ఏర్పడింది కామమైతే -రజః ప్రభావంవల్ల లోభమైతే-తమోగుణం మూలంగా జనించింది క్రోధం. అవి మూడూ జీవితాంతమూ సరాసరిమనలను నరకానికే చేరుస్తాయి. నరక ద్వారాలివి. మామూలుగా అవి మూతపడి ఉంటాయి. ఈ కామాదులకు దాసులమై ఏమరు పాటుతో ఉన్నా మంటే మాత్రం ఎప్పుడూ మన పాలిటి కవి తెరవబడే వుంటాయి. మరణానంతరం వాటి ద్వారా నిరయంలో ప్రవేశించకా తప్పదు. అసి పత్త్ర రౌరవాది నరక దుఃఖాల ననుభవించకా తప్పదు.

అంచేత వాటి బారినుంచి తప్పించుకోవటానికే ఎప్పటికైనా మానవుడు ప్రయత్నం చేయాలి. అలా చేయాలంటే ఏమి చేయాలి మనం. కామక్రోధాదులను దూరం చేసేకోవాలి. వాటినెలా దూరం చేయాలి. వాటి శత్రువులేవో వాటిని మనం మిత్రులను చేసుకోవాలి. వాటి శత్రువులు వరుసగా కామానికి దమం. లోభానికి దానం. మరి క్రోధానికి దయ. ఒకప్పు డీమూడింటినీ అలవరచుకొని బ్రతుకండని బ్రహ్మ దేవుడు దేవ మానవదానవులకు ముగ్గురికీ బోధించి పంపాడట. దేవతలు మామూలుగా కామలోలుపులు. కాబట్టి వారికి ఇంద్రియ నిగ్రహ రూపమైన దమ మవసరం. మానవులు సాధారణంగా లోభ గ్రస్తులు. ఎంత ఉన్నా తృప్తిజెందని స్వభావం మనది. కనుక దానికి విరుగుడుగా దాన మలవరచుకోవాలి మానవుడు. పోతే ఇక రాక్షసులు క్రోధైక పరాయణులు. నిష్కారణంగా పరులను బాధించటమే వారి స్వభావం కాబట్టి దానికి చేయవలసిన చికిత్స దయాగుణం.

ఆ మాటకు వస్తే ఈ దేవ దానవ మానవు లెక్కడో లేరు. మానవులలోనే ఉన్నాయి వాస్తవాని కీమూడు తరగతులూ. కామ క్రోధ లోభాలు మనలో లేక

పోతే గదా. అవే దేవాది జాతులకు ప్రతీకలు Symbols. వీటి మూటినీ నిర్మూలించు కోటానికి దమ దాన దయా గుణాల నభ్యసిస్తూ పోమ్మని మనకు చేసిన బోధే ఇదంతా. ప్రతి సంవత్సరమూ వర్షర్తువులో మేఘం "ద ద ద" అని గర్జిల్లటంలో కూడా ఈ దమదాన దయలే ధ్వనిస్తున్నా యంటుం దుపనిషత్తు. ఆ శబ్దం వినేది మానవుల మైన మనమే గదా. కాబట్టి మనకే ఈ సందేశం. మరెవరికీ గాదు.

ఈ సందేశాన్ని అందుకొని దమాది గుణాల నల వరుచుకొని క్రమంగా సత్త్వరజస్తమో గుణాల ఫలితంగా ఏర్పడిన ఈ కామ క్రోధాదులను దాటి పోయామా - త్రిగుణా తీతులమై గుణాతీతమైన ఆ పరమాత్మ తత్త్వాన్నే మన స్వరూపంగా అనుభవానికి తెచ్చుకోగలం. తద్ద్వారా మృత్యువునే జయించ గలం. లేదా వాటికి బానిసలమై వాటి ఉక్కు కోరలలో చిక్కి శాశ్వతంగా ఆత్మ వినాశాన్ని కోరి తెచ్చుకోగలం. ఆత్మకు వినాశ మేమిటని ఆశ్చర్య పడరాదు. దాని అస్తిత్వాన్ని మరచి పోవటమే దాని వినాశం. వినాశమంటే పోగొట్టుకోట మని గదా అక్షరార్థం. ఉన్నా గుర్తించక పోతే అది దాన్ని పోగొట్టు కోటమే. మెడలో ఉన్న గొలుసు ఉన్నదని గుర్తించ లేక ఇక్కడా అక్కడా వెతుకుతూ కూచున్నంత వరకూ అది మన పాలిటికి లేనిదే. అంచేత ఇలాంటి అనర్థం నుంచి బయట పడాలంటే దానికి మూల కారణమైన త్రిగుణాల సంపర్కానికి తిలాంజలి ఇవ్వాలి.

## 30

**దైవీ హ్యేషా గుణమయీ - మమ మాయా దురత్యయా**
**మా మేవయే ప్రపద్యంతే - మాయామేతాం తరంతి తే 7-14**

సరే. బాగానే ఉంది. కాని ఈ గుణాలని చెబుతున్నారే ఇవి ఎక్కడివి. ఉన్న దొక్క పరమాత్మ చైతన్యమే గదా. అదే సర్వ వ్యాపక మని గదా వర్ణించారు. అలాంటప్పుడీ గుణా లేమిటి వీటి వల్ల మన బుద్ధులు కలుషితం కావట మేమిటని ప్రశ్న.

వాస్తవమే. చైతన్యం తప్ప మరేమీ లేదు. కాని చైతన్య మనేది అశక్తమైనది కాదు. దాని కొకశక్తి ఉన్నది. అది దాని లాగే సర్వత్రా వ్యాపించి ఉన్నది. అయితే చైతన్యం వస్తువు. ఇది దాని ఆభాస. వస్తువు నాధారం చేసుకొని ఉండ వలసిందే గాని అది స్వతంత్రంగా ఉండలేదు. అగ్నికి ఉష్ణ గుణ మనేది

ఉన్నదంటే అది ఎప్పుడూ దాని నంటి పట్టుకొనే ఉంటుంది. అలాగే త్రిగుణాత్మకమైన ఒకానొక శక్తి ఆ పరమాత్మ నంటి పట్టుకొని ఉంటుంది. అది ఆ చైతన్యంలోనే అంతర్లీనమయి ఉంది. కావలసి నప్పుడే అది బయటికి వచ్చి కనిపిస్తుంది. దానికి "మాయ" అని పేరు. "మీయతే అనయా ఇతిమాయా". చైతన్యాన్ని నామ రూప క్రియాత్మకంగా కొలత వేసి చూపుతుంది కాబట్టి అది మాయ అయింది.

ఈ మాయా శక్తి కొలిచి పారవేసిన చైతన్య ఖండాలే జరాయు జాదులైన జీవులన్నీ. అది నానా విధాలుగా మార్చి వేసిన చైతన్యచ్ఛాయులే చరా చర పదార్థాలన్నీ. దాని చేతి మీదుగా జరిగింది. ఈ సమస్త సృష్టిని దాటి పోయే శక్తి లేని దీమానవుని సృష్టి.

అయితే మనగతి ఎప్పటికీ ఇక ఇంతేనా అని ప్రశ్న. కాదు. ఎప్పటికీ ఇంతే అయితే ఇక జీవుడు తరించే మార్గమే లేదు. మార్గం లేదని చెప్పటానికే అయితే ఇంత శాస్త్రం దేనికి. ఇంత ఉపదేశం దేనికి అనావశ్యకం. కాబట్టి ఉంది. సాధించే మార్గము ఉంది. కాని ఈ త్రిగుణాలతో పోరాడి సాధించేది కాదది. త్రిగుణాతీతమైన తత్త్వముతో చేయి కలిపేది. తత్త్వాన్ని గట్టిగా పట్టుకుంటే అదే త్రిగుణాల పట్టు వదిలిస్తుంది.

అది ఎలాగ అని అడగవచ్చు. నామరూపాదులే గదా ఎప్పుడూ మన దారి కడ్డు తగిలేది. అలా తగిలితే వాటిని మరలా మన మెదుర్కోటానికి యత్నించ రాదు. ఎదుర్కొనే కొద్దీ అవి ఇంకా ఉద్ధృతంగా వచ్చి నెత్తిన పడతాయి. మరి ఏమి చేయాలి మనం. మనకేది తగులుతున్నా అదంతా నా స్వరూపమే నని భావన చేస్తూ పోవాలి. నిజాని కది మన చైతన్యమేగదా. చైతన్యమే మూర్తీభవించి మన కావిధముగా కనిపిస్తూంది. అంచేత భావిస్తే అది ద్రవీభవించి మరలా మన చైతన్యం లాగానే దర్శనమిస్తుంది. ఇలాంటి రాజీ మార్గమే సరియైన రాజ మార్గం. దీని మూలంగా అడ్డుకుండానే గుణాల నడ్డి నట్టయింది. గుణా తీతమైన తత్త్వాన్ని అందుకొన్నట్టయింది.

## 31

**న మాం దుష్కృతినో మూఢాః - ప్రపద్యంతే నరాధమాః**
**మాయయాపహృతజ్ఞానా - అసురం భావ మాశ్రితాః 7-15**

Vallamraju Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

అయితే ఇక్కడ ఒక ఆశంక. జీవుడూ దేవుడూ ఇద్దరూ చైతన్యస్వరూపులు ఇద్దరూ ఒకటే తత్త్వమని గదా వక్కాణించారు. అలాంటప్పుడా దేవుణ్ణి బాధించని మాయాశక్తి ఈ మానవుణ్ణి మాత్రమే పట్టి పీడించడ మేమిటి.

అదీ నిజమే. పీడించరాదు వాస్తవంలో. ఎందు కంటే మీరన్నట్లు జీవేశ్వరులిద్దరూ జ్ఞాన స్వరూపులే. అయితే వచ్చిన తిరకాసేమంటే జీవుడు జ్ఞాన స్వరూపుడే అయినా ఆ జ్ఞానం ఈశ్వరుడి జ్ఞానం లాగా పరిపూర్ణమైనది గాదు. ముప్పాతిక మూడు పాళ్ళది దోపిడి అయిపోయింది. దోపిడీ చేసిన ఆ గజదొంగ కూడా ఎవరో గాదు. ఈ మాయే. మాయ అయినా ఎలా చేయగలిగిందా అపహరణ. అపహరిస్తే ఆ ఈశ్వరుడి జ్ఞానం కూడా హరించవచ్చు గదా.

ఐశ్వరమైన జ్ఞానాన్ని హరించజాలదది. కారణం దానిలో అలాంటి అవకాశం లేకపోవటమే. అవకాశం దానికొక్క మానవుడిలోనే దొరికింది. అది ఏదో కాదు. అసురమైన భావమే. అసురుడికి సంబంధించింది అసురం. అసుర అంటే సుర కానిది. సురత్వ మంటే స్వస్వరూపంలోనే రమించడం. అలాంటి స్వరూప రతిని కోలుపోతే అది అసుర భావం. మరొక్క మాటలో చెబితే జ్ఞానం జ్ఞానాత్మకంగానే ఉండక జ్ఞేయ జగత్తులోకి తొంగి చూడట మని అర్థం. ఇలాంటి అసురత్వమెప్పుడేర్పడిందో అప్పుడే జ్ఞానం తన అఖండత్వాన్ని కోలుపోయి మాయకు లోబడి పోయింది.

అయితే ఈ అసుర భావం మాత్ర మెందు కేర్పడాలి మన జ్ఞానానికి. మూఢత్వం వల్లనే నని జవాబు. మూఢత్వ మంటే ఏదో గాదు, జ్ఞానానికి సహజంగా ఉండవలసిన హుషారు లేకపోవడం. హుషారుగానే ఉంటే నిరంతరమూ ఆత్మ పరామర్శ చేసుకుంటూ ఉండేది. పరామర్శ చేసుకొంటే పరాకు ఉండేది కాదు. కాబట్టి అసుర భావానికి కారణం మోహమే.

మరి ఈ మోహానికి కారణ మేమిటని ప్రశ్న. దానికి కారణం దుష్కర్మల ననుష్ఠించటం. జన్మ జన్మల నుంచీ చేసుకొన్న పాప కర్మలు బండ్ల కున్నాయి. అవి పరిపక్వమయి మనకు మోహాన్ని కల్పించాయి. ఆ మోహ మనేది అసురమైన భావాన్ని రేకెత్తించింది. దాని నాసరాగా చేసుకొని మాయ మన జ్ఞాన ధనాన్ని ఊచముట్టగా దోచుకున్నది, జ్ఞానాపహరణం మూలంగానే ప్రకృతి గుణాలకు మనం దాసోహ మనవలసి వచ్చింది. మరి గుణాతీతమైన భగవత్తత్త్వాన్ని ఎలా పొందగలం.

దీనివల్ల మనకు తేలిందేమిటి. అంతా మనం చేసుకొన్నదే మనమనుభవిస్తున్నాము. మన మేమిటి అని అడిగావో అది విచారణ అవుతుంది. విచారణ సాగించా మంటే చివర కేదీ లేదు. అంతా ఆత్మ చైతన్యమేనని తేలుతుంది. కాబట్టి అవిచారితంగా అనుభవిస్తున్న వరకే ఈ జీవ భావం. ముందు వెనుకలాలోచిస్తే చాలు ఎగిరి పోతుంది. రజ్జు సర్పం లాంటిది దాని ఆస్తిత్వం. సర్పమని భ్రాంతి పడి చూచినంత వరకే అది. ఏమిటి నేను చూస్తున్నది సర్పమేనా అని ఏ మాత్రం నిగా పెట్టినా సర్పం పరారయి రజ్జువే మిగులుతుంది. అలాగే ఏమిటీ జీవ భావం - ఇది చైతన్యమే కదా - చైతన్య మనేది ఎప్పుడూ ఆకాశంలాగా ఒక అఖండమైన తత్త్వమే కదా- అని వివేచన చేస్తే చాలు. కర్మలేదు. మోహం లేదు. అసురత్వమూ లేదు. ఏదీ లేదు. అంతా హుళక్కే. కాబట్టి ఆత్మ విచారమే అన్నింటికీ పరిష్కారం.

## 32

**చతుర్విధా భజంతేమాం - జనా స్సుకృతినోర్జున**
**ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ-జ్ఞానీ చ భరత తర్షభ** **7-16**

కానీ ఈ విచారణ మాత్రం చేయగలమా అని ప్రశ్న. ఎంచేతనంటే విచారణ అనేది బుద్ధికి సంబంధించిన విషయం. బుద్ధి పురాకృత కర్మఫలం. బుద్ధిః కర్మాను సారిణీ. అని గదా పెద్దలు చెప్పిన మాట. కర్మ వల్ల ఏర్పడిన బుద్ధికి కర్మ వ్యూహాన్ని భేదించుకొని పోయే శక్తి ఎక్కడిది. మరి విచారణ అంటే అలాంటి ప్రయత్నమే కదా. కాబట్టి అది కూడా ఒక గొంతెమ్మ కోరికే గాని వాస్తవంలో ఎంత మాత్రమూ సంభవం కాదని తోస్తుంది.

తోచటం సహజమే. కానీ కర్మ అనగానే మనం బెదరి పోగూడదు. సర్వ శక్తులూ అది గుత్తకు తీసుకొన్నదని భ్రాంతి పడరాదు. కర్మలనేవి రెండు రకాలు. ఒకటి దుష్కృతం. మరి ఒకటి సుకృతం. రెండూ కలిసి మన జన్మకు నిమిత్తమవుతాయి. ఇందులో కూడా ఒక సూక్ష్మ మున్నది. మరీ మొద్దులయితే చెప్పలేముగాని కొంత ఆలోచనా పరులైన మానవుల కందరికీ రెండు బుద్ధులుంటాయి. ఒకటి ప్రాపంచిక విషయాల మీదికి పరుగెత్తేది. మరొకటి పారమార్థికాన్ని పట్టుకొనేది. ఇందులో మొదటిదానికి మన దుష్కృతం కారణమైతే రెండవ దానికి సుకృతకర్మ కారణ మవుతుంది.

Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

అంచేత రెండందాలా పదునైన దీకర్మ అనే కరవాలం. దుష్కృత మొక అంచయితే దానికి సుకృత మొక అంచు. ఒకదానితో అది గుణత్రయమనే విషవలయంలో పడద్రోసి అధః పాతాళాని కణగ ద్రొక్కగలదు. వేరొక దానితో ఆ వ్యూహాన్ని భేదించి పరమపద శిఖరాని కెక్కించనూగలదు. దీనినిబట్టి మన కర్థమయిందేమిటి. ఏ కర్మ బంధకమని భయ పడుతున్నామో మనం–అదే మనపాలిటికి మోచకంకూడా. లోకంలో కూడా ఒక ఆభాణకముంది. వజ్రాన్ని వజ్రంతోనే భేదించాలి. ముల్లు ముల్లుతోనే తీయాలి. అలాగే కర్మను నిర్మూలించ టానికి కర్మే సాధనం. అందులో నిర్మూలించేది సుకృతమైతే నిర్మూలించబడేది దుష్కృతం.

కాబట్టి మనబుద్ధి మనం చేసుకొన్న దుష్కృతాన్ని బట్టి మాయకులోబడి నడుస్తూన్నా – మనం చేసిన సుకృతాన్ని బట్టి మరలా దానిని భేదించి బయట పడవచ్చు. దీనికే పురుషకార మనిపేరు. పురుషుడు చేసే యత్నమే పురుష కారం. దైవమేగాని పురుష ప్రయత్నం లేదని వాదించరాదు అలాగయితే మానవుల మనస్తత్త్వాలలో చేష్టలలో ఇన్నిభేదాలు మనకు గోచరించరాదు. పరమామూఢుల దగ్గరనుంచీ మహాయోగులదాకా మానవ బుద్ధులలో ఇంత వైవిధ్య మెక్కడినుండి వచ్చి చేరింది. అందరినీ కర్మ ఒకే విధంగా బాధిస్తే అందరూ పశుప్రాయులుగానే బ్రతుకుతుండాలి గదా. ఏదీ అలా జరగటం లేదే. కాబట్టి దైవాని కెంత బలముందో పురుష ప్రయత్నానికీ అంతే ఉంది. అది సుకృతకర్మ వల్లనే ప్రాప్తిస్తుంది మనకు.

ఈ సుకృతమనేది ఏదోకొంత ఉంటేగాని అసలు పారమార్థికమైన చింతే కలగదు మానవుడికి. మనకీ పారమార్థిక చింత ఉన్న మానవులు నాలుగు భూమి కలలో కనిపిస్తారు. మొదటివారు ఆర్తులు. వీరిది చాలా ప్రాధమికమైన దశ. ఏదో ఆపదవచ్చి నెత్తిన పడితే గాని వీరు కన్ను తెరచి చూడరు. అది గడచిందంటే మళ్ళీ యథాప్రకారమే. రెండవవారు అర్థార్థులు. ఏవో కోరికలు పెట్టుకొని అవి నెరవేరటాని కాశ్రయిస్తారు దేవుణ్ణి. దైవికంగా అవి నెరవేరా యంటే వారూ యథాప్రకారమే.

పోతే మూడవ వారున్నారు. వీరికి జిజ్ఞాసువులని పేరు. వీరి కార్తిలేదు. కోరికలు లేవు. వీరి కున్న ఆర్తీ కోరికా ఒక్కటే. భగవత్తత్త్వ మేమిటో అర్థం చేసుకోవాలని. ఇదికొంత మేలుజాతి. కాగా ఇంతకన్నా మేలురకం నాల్గవది

వారే జ్ఞానులు. తత్త్వాన్ని గ్రహించి తదేక నిష్ఠతో జీవితాన్ని గడిపే మహనీయులు వీరు. శుక శౌనకాదులందరూ ఇలాంటివారే. నలుగురిలో మొదటి ఇద్దరూ ముముక్షువులు. మూడవవారు సాధకులు. నాల్గవవారు సిద్ధపురుషులూనని మన మర్థం చేసుకోవలసి ఉంటుంది.

# 33

**యే యథామామ్ ప్రపద్యంతే - తాంస్తథైవ భజామ్యహమ్**
**మమ వర్త్మాను వర్తంతే-మనుష్యాః పార్థ సర్వశః 4-11**

అసలు రహస్య మేమంటే ఎవరు నన్నెలా భజిస్తారో నేను కూడా వారి నలాగే భజిస్తుంటాను. ఎలా భజిస్తారో అని చెప్పటంలో ఎంతైనా ఉంది భావం. దేవుడెక్కడ ఉన్నాడు-లేడు పొమ్మని-వాదించే పరమ నాస్తికుడి దగ్గరి నుంచీ - ఎక్కడబడితే అక్కడ ఉన్నాడది మన స్వరూపమేనని అనుభవానికి తెచ్చుకొనే మహాజ్ఞాని వరకూ అందరూ ఆ పరమాత్మను భజిస్తున్నవారే. అందుకే మానవు లంతా ఏదో ఒక విధంగా చివరకునా మార్గాన్నే అనుసరిస్తున్నారని నిర్భయంగా చాటుతున్నాడు భగవానుడు.

అందరూ ఆయన మార్గాన్నే అనుసరించట మేమిటి. నాస్తికులూ Atheists అజ్ఞేయ వాదులూ Agnostics హేతువాదులూ Rationalists వందలు వేలు న్నారు గదా లోకంలో. వారెవరూ ఈశ్వరాస్తిత్వాన్ని ఒప్పుకోరు గదా అని ప్రశ్నరా వచ్చు. ఒప్పుకోనట్టు పైకి కనిపిస్తున్నా ఒక విధంగా వారూ భజిస్తూనే ఉన్నారా పరమాత్మను. ఎలాగంటే మనుష్య మానవ అనే మాటలకు మనన శీలుడని అర్థం. మననమంటే ఆలోచన. భగవంతుడున్నాడని చెప్పేవాడి కాభావాన్ని గూర్చిన స్ఫురణ ఎలా ఉందో లేదని వాదించే వాడికి అలాగే ఉంది. లేదని ఒకడు వాచా అంటున్నాడంటే మనసా దాన్ని గూర్చిన ఒక స్పృహ Awareness ఉంటే గదా అంటాడు. అది ఎంత అస్పష్టమైన దైనా కావచ్చు. అయినా ఆ పదార్థానికి చెందినదే ఆ ఆలోచన.

అయితే వాడు బొత్తిగా లేదని చాటుతున్నాడు గదా-అది ఒప్పుకొట మెలా అవుతుందని అడగవచ్చు. వాడొక వేళ లేదన్నా అది సర్వత్రా ఉండనే ఉంది. భగవంతుడనే వాడికి కాళ్ళూ చేతులూ కళ్ళూ చెవులూ- ఉన్నాయంటే గదా నీకు బాధ. కేవలం సచ్చిత్తులనే భావాన్నే మేము భగవంతుడని చెప్పటం. ఈ

Vallamraju SrinivasaRao
www.advaitavedanta.in

సచ్చిత్తులనేవి లోకంలో ఎక్కడబడితే అక్కడ కనిపిస్తాయి మనకు. నీవూ నేనూ చూచే ప్రతి పదార్థమూ సత్తే చిత్తే. ప్రతి ఒక్కటీ ఉందనే చూస్తున్నాము. కనిపిస్తున్నదనే చెబుతున్నాము. ఏదీ లేదనీ కనిపించటంలేదనీ వాకొనలేము. లేకుండా కనిపించకుండా పోయిన పదార్థాన్ని గూర్చి నీవు మాటాడలేవు సరిగదా అసలా లోచించను గూడాలేవు. అది సృష్టిలో-అసంభవం. కాబట్టి ప్రపంచాన్ని చూస్తున్నా మంటేనే-అది సచ్చిదాత్మకంగానే కనిపిస్తున్నది. ఈ సచ్చిత్తులే పరమాత్మ అని పేర్కొన్నాము ఇక ఈశ్వరుడు లేదని వాదించడం దేనికి. ఎంత నాస్తికుడు కూడా ప్రపంచం లేదని చెప్పలేడు గదా. ప్రపంచం లేదన లేదంటే అప్పటి కీశ్వరుణ్ణి కూడా లేదనటం పొసగదు.

ఒకవేళ నామ రూపాత్మకమైన ప్రపంచాన్నే అంగీకరిస్తాము-మీరు చెప్పే సచ్చిత్తుల సంగీకరించమంటారా. సచ్చిత్తు లెత్తిన అవతారాలే ఆ నామ రూపాలని మా సమాధానం. నీవు నామ మనేది దాని నామమే. నీవు రూపమనేది దాని రూపమే దాని విభూతే Expansion ఈ చరా చరప్రపంచమంతా. ఒక మృత్తికవిభూతే ఘటశరావోదంచనాదులయినట్లు - ఒక సువర్ణ విభూతే కటక కుండలకేయూరాదు లయినట్లు- ఇదంతా దాని విభూతే. "రసోహ మప్సు కౌంతేయ సర్వతః పాణి పాదమ్ తత్ - మయాతత మిదమ్ సర్వమ్- మత్తః పరతరమ్ నాస్తి-అని భగవానుడే సెలవిస్తాడు.

అంచేత నాస్తికుడు మొదలు కొనీ-మహాయోగి వరకూ ప్రతి ఒక్క మానవుడూ ఆతత్త్వాన్ని భజించే వాడే వాస్తవంలో. అయితే ఆ భజించటంలో ఒక్కొక్కరి దొక్కొక్క దృష్టి విశేషమయి ఉండవచ్చు. అంత మాత్రమే తేడా అసలు లేదనే అభావ దృష్టి ఒకడిదైతే అంతా నా స్వరూప మనే సర్వాత్మ భావ దృష్టి వేరొకడిది. పోతే ఈ ఇద్దరిమధ్యలో ఉన్నారు మిగతా మానవులంతా అందులో విగ్రహ రూపంగా భజించే వారు కొందరూ-జ్యోతిః స్వరూపంగా చూసేవారు కొందరూ-మంత్రరూపమైన శబ్దంగా భావించే వారు కొందరూ-శూన్యంగా దర్శించేవారు కొందరూ- ఒకటిగాదు రెండుగాదు. పరశ్శతంగా ఉంటాయి వారి వారి ప్రపత్తి మార్గాలు. అధికారి భేధమనేది ఒకటి ఉంది గదా. మరి వారి Approachలో వైవిధ్యమెలా లేకపోతుంది.

అయితే ఇక్కడ చిత్ర మేమంటే లోకంలో ఎవరా పరమాత్మ నెలా భావిస్తే వారి నా ఈశ్వరు డలాగే చూస్తాడని చెప్పటం. నాస్తికుల కాతత్త్వం నాస్తికంగానే

కనిపిస్తుంది. అజ్ఞేయ వాదుల కజ్ఞేయంగానే ఉండిపోతుంది. హేతువాదులకు హేతురూపమే అది. పోతే ఆస్తికులలో ఆర్తులైన వారి ఆర్తిహరణ చేసి కాపాడు తుంది. అలా కాపాడకనే పోతే ఇన్ని మొక్కుబళ్ళూ- ఇన్ని సేవలూ- ఇన్ని ఉత్సవాలూ చేయనక్కరలేదు. ఫలితముండకపోతే మానవుడేపనీ చేయడుగదా. కాబట్టి ఆ పన్నులపాలిటి కాపద మొక్కులవాడా ఈశ్వరుడు మరితత్త్వ జిజ్ఞాసువు లయి ఏ ఫలమూ కోరనివారి కాయన జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. ఆర్థార్థుల కర్థాన్ని ప్రసాదిస్తాడు. పోతే జ్ఞానులైన వారికి జ్ఞాననిష్ఠ నిస్తాడు. నిష్ఠా పరులకు మోక్ష ఫలాన్నే అందజేస్తాడు. మొత్తానికందరినీ అన్నివిధాలా అనుగ్రహిస్తూనే ఉంటాడు ఎవరినీ ఉపేక్షించడు.

మరి ఇన్ని విధాల అనుగ్రహించటాని కిందరు దేవుళ్ళు లేరుగదా అని ఆశంక చేయరాదు. స్వరూపతః ఆయన ఏకమైనా విభూతితః అనేకం. నిరాకార మైనా సాకారం. అవ్యక్తమైనా వ్యక్తం. నచేతనమైనా అచేతనం. "సచ్చ త్యచ్చ భవ" త్తంటున్నది శాస్త్రం. కాబట్టి అ భావం దగ్గరినుంచి భావందాకా ఏ రూప మైనా ధరించగలడు. సాధకుల నెట్లాగైనా అనుగ్రహించగలడు. సందేహం లేదు. అయితే మన దృష్టినిబట్టే మన సాధన. మన సాధనను బట్టే ఆయన ఇచ్చే ఫలమనే సత్యాన్ని మరచిపోరాదు.

## 34

**తేషాం జ్ఞానీ నిత్య యుక్తః- ఏక భక్తి ర్విశిష్యతే**
**ప్రియో హి జ్ఞానినో త్యర్థ - మహం సచ మమ ప్రియః 7-17**

మొత్తానికి నాస్తికుల నొకరిని మినహా యిస్తే మిగతా మానవులంతా నాలుగే నాలు గంతస్తులు. వారే ఆర్తాదులు. ఆ ఆర్తాదులు నలుగురిలోనూ జ్ఞానికున్న అంతస్తు చాలా ఉన్నతమైనది. పరమాత్మ స్థాయికీ అతని స్థాయికీ ఏమాత్రం తేడా లేదు. పరిపూర్ణ చైతన్య రూపమే గదా పరమాత్మ అంటే. అలాంటి పరి పూర్ణతనే అందుకొన్నాడు జ్ఞాని కూడ, అందుకే పరమాత్మ అంటే అతని కిష్టం, అతడంటే పరమాత్మకూ ఇష్టం.

అంతేగాదు. పరిపూర్ణమైన జ్ఞాన మప్పుడయిందో అప్పుడదే భక్తీ అవు తుంది. అదే కర్మా అవుతుంది. భజించటమే భక్తి. చేయటమే యుక్తి. జ్ఞాని సమత్వ బుద్ధి సంపన్నుడు కాబట్టి ఒకవైపు పరమార్థాన్ని భజిస్తూనే మరొకవైపు దాని బలంతో కర్మ లాచరిస్తాడు. లేదా కర్మ లాచరిస్తూనే పరమాత్మను సేవిస్తుం

టాడు. రెండిటికీ విరోధం లేకుండా జ్ఞాన మనేది కాపాడుతుంటుంది. అది రెండు కొసలూ కలిపే సూత్రం. అపుడు కర్మ భక్తి భావాలు జ్ఞానంలోనే కలిసి వచ్చి అది పరిపూర్ణ యోగ మనిపించుకొంటుంది.

## 35

**ఉదారా స్సర్వ ఏవైతే-జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్**
**అస్థిత స్సహి ధర్మాత్మా-మా మే వానుత్త మాం గతిమ్ 7-18**

అర్తాదు లందరూ ఉదారులు కారా అంటే ఉదారులే. సందేహం లేదు. మరీ పశుప్రాయంగా బ్రతికే అనేక లక్షలమంది కంటే ఎప్పుడో ఒకప్పుడు కష్టంలోనైనా పరమార్థాన్ని స్మరించే వాడు గొప్పవాడే. కష్టం ప్రాప్తించినప్పుడే కాక కోరికల నెపంతోనైనా తరుచుగా స్మరించేవాడు అంతకన్నా గొప్ప. పోతే అవి రెండూ కూడా తుచ్ఛంగా భావించి అసలు విషయ మేమిటో తెలుసు కోవాలని కాంక్షించే వాడు గొప్ప మహనీయుడు. అయితే ఎంత మహనీయు డైనా ఆ పరమార్థాని కింకా దూరంగానే ఉండిపోతున్నాడు కాని దగ్గరపడటం లేదు. అలా దగ్గరగా వచ్చి నీవే నేను- నేనే నీవని దానితో ఏకత్వాన్ని భజించే వాడు జ్ఞాని. వారు ముగ్గురూ ఆత్మీయులైతే ఇతడు కేవల మాత్మరూపుడే. కనుకనే జ్ఞాని వారందరి కన్నా విశిష్టుడు.

అయితే ఇంత ఉత్కృష్టమైన స్థానాన్ని ఎలా అందుకో గలిగాడు జ్ఞాని. అతని ఆత్మ సంయమం అలాంటిది. పరిపూర్ణమైన చైతన్యాన్ని తప్ప సృష్టిలో మరేది కానీ దర్శించ డతడు. తానూ చైతన్యమే తాను చూచే జగత్తూ చైతన్యమే. రెంటికీ అతీతమని భావించే ఈశ్వరుడూ చైతన్యమే అతని దృష్టికి. అలాంటి దృష్టికి ఇక భేద మేముంటుంది సృష్టిలో. భేదమే లేదంటే దూరం దగ్గర అనే పరామర్శ ఏముంది. తానే సర్వమూ అనే పరిపూర్ణ భావ మయత్నంగానే సిద్ధిస్తుంది కాబట్టి సర్వోత్కృష్టుడైనవాడు జ్ఞాని ఒక్కడే.

## 36

**బహూనాం జన్మనా మంతే-జ్ఞానవాన్ మాం ప్రపద్యతే**
**వాసుదేవ స్సర్వ మితి-స మహాత్మా సుదుర్లభః 7-19**

అయితే ఈ మహోన్నతమయిన స్థాయిని అందు కోవాలంటే సామాన్యం కాదు. ఎన్నో కోట్ల జన్మలు గడిస్తే గాని అలాంటి పరిపాకంరాదు. కారణ

Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

మేమంటే జ్ఞాన మనేది ఆఖరి మెట్టు. ఆ తరువాత ఇక ఏదీలేదు. అంచేత ఎన్ని జన్మలెత్తినా అంతకు ముందే మన మెత్తవలసింది. జ్ఞానోదయమయ్యే వరకూ జన్మలనేవి తప్పవు గదా. అందులో కొన్ని లక్షలు కేవలం కర్మాచరణతోనే గడచి పోతాయి. కొన్ని జన్మలు సమాధి యోగ సాధనలో గడుస్తాయి. మరికొన్ని తత్త్వదేవతోపాసనతో. ఇంకా కొన్ని సగుణోపాసనతో సరిపోతాయి. ఇలా క్రమంగా ఎక్కుతూపోతే గాని కడపట వీటన్నిటి ఫలితంగా జ్ఞాన మనే దానికి నోచుకోడు సాధకుడు. కనుకనే "జన్మనామంతే" అని ప్రయోగించటం. జ్ఞాన ముదయించిందంటే ఇక జన్మ పరం పర అక్కడికి పరి సమాప్తం కావటమే మనకు తార్కాణం. అంత వరకూ జన్మలు తప్పవు. అవికూడా ఎప్పటికైనా ఈ జ్ఞాన ఫలాన్ని సాధించటం కోసమే తప్ప మరి ఒక ప్రయోజనం లేదు వాటికి. దీనిని బట్టే చెప్పవచ్చు. జ్ఞానం మిగతా కర్మానుష్ఠానాదుల కంటే ఎంత గొప్పదో. అక్కడికి జన్మే కడతేరుతున్నదంటే అన్నిటికన్నా అది శ్రేష్ఠమని వాచా చెప్పవలెనా.

అయితే జ్ఞానం జ్ఞాన మంటున్నారు. ఏమిటా జ్ఞానం. ప్రాపంచిక జ్ఞానమా కాదు. శాస్త్రజ్ఞానమా కాదు. వేదాంత జ్ఞానమా అదీ కాదు. మరేమిటి. ఈ చెప్పినవి కాక ఇంకా ఈ సృష్టిలో ఎంతెంత ఉన్నదో అదంతా ఒకే ఒక తత్త్వమని అనుభవానికి తెచ్చు కోవటమే యథార్థమైన జ్ఞానం. "వాసుదేవ స్సర్వమితి" అనే వాక్యానికి ఇదే అర్థం. సర్వభూత నివాసోసి వాసు దేవ నమోస్తుతే. చరా చర ప్రపంచాన్నంతటినీ వ్యాపించి ఉన్నతత్త్వమేదో అదే వాసుదేవుడు. వసతి-దీవ్యతి అంటే అస్తి భాతి-లేదా సచ్చిత్తులనే అక్షరార్థం. సచ్చిదాత్మకమే కదా పరతత్త్వం అలాంటి సర్వ వ్యాపకమైన తత్త్వమే ఈ కనిపించే ప్రపంచమంతా. దానికి విలక్షణంగా అందులో అణు మాత్రం కూడా లేదని నిత్యమూ చూడ గలిగితే దానికి ప్రపత్తి అని పేరు. అప్పటికి ప్రపత్తి అంటే "అడియేన్ దాసన్" అని కాళ్ళమీద పడటం కాదన్న మాట. అది కేవలం బాహిరమైన చర్య. పోతే ఇది మానసికం.

అయితే ఇలాంటి సర్వాత్మ భావన పట్టుపడిన వాడు కోటికొకడు ఉంటాడో లేదో. ఉంటే వాడు మహాత్ముడే. మహత్తంటే గొప్పదని అర్థం. అన్నిటి కన్నా గొప్పది. ఈ సృష్టిలో ఆత్మ ఒక్కటే. అలాంటి ఆత్మనే పట్టుకొన్న వాడు గనుక అతడే మహాత్ముడు. మిగతా వారందరికీ ఆత్మలేదా అని లడగవచ్చు. ఉంది

గాని దానిని వారు ఎలా ఉందో అలా పట్టుకోలేక పోతున్నారు. వారు పట్టుకొన్న ఆత్మ భూతాత్మ-దేహాత్మ-విజ్ఞానాత్మ మాత్రమే. ప్రత్యగాత్మ గాదు. అందుచేత మహాత్మ అనే స్థాయికి వారు రాలేదు.

దీనిని బట్టి జ్ఞాన మొక్కటే సంసార తారకమనీ అది కూడ పరోక్షం కాదు-అపరోక్షంగా అనుభవానికి వచ్చేదని స్పష్ట మయింది. అలా అపరోక్షంగా అనుభవానికి రావాలంటే అది ఎన్నో జన్మల నోము ఫలమని కూడా అవగత మయింది ఇలాంటి పరాకాష్ట Summit నందుకొన్న వాడెవడు. వాడెక్కడ ఉంటాడు సుదుర్లభః దుర్లభ అంటేనే చాలు చాలా అరుదని చెప్పటానికి. సుదుర్లభః అట. అంటే అరుదుగానైనా అసలు కనిపిస్తాడో లేదో చెప్పలేము. ఇది ఆత్మ జ్ఞానమనేది ఎంత అపురూపమైనదో దాని మహత్త్వాన్ని వర్ణించటానికి చెప్పిన మాటే గాని అలాంటివాడసలెక్కడా ఉండడని కాదు. అంతే కాదు. అంత అపురూపమైంది గనుకనే వజ్రవైడూర్యాదుల లాగా దాన్ని పట్టుకోటానికి మానవు డితోధికంగా కృషి చేయాలని కూడా ఒక ప్రబోధమే ఇది.

## 37

కామై స్తై స్తైర్హృత జ్ఞానాః - ప్రపద్యంతే న్యదేవతాః
**తంతం నియమ మాస్థాయ-ప్రకృత్యా నియతాస్స్వయా 7-20**

ఇలాంటి ప్రబోధాన్ని అందుకొని అలాంటి అఖండ జ్ఞానాన్ని అనుభూతికి తెచ్చుకోటానికెంతో సుకృతం చేసి ఉండాలి. లేకుంటే మనం చేసిన దుష్కృత మెలాగూ ఉండనే ఉన్నది. అది ఊరక ఉండేది కాదు. అనుక్షణమూ కామాన్ని రెచ్చగొడుతుంది. ఆ కామ భుజంగం సహస్ర ఫణాలు విప్పి మన జ్ఞానాన్ని కబళిస్తుంది. దానితో మనకు సర్వమూ వాసు దేవుడనే బుద్ధి నశిస్తుంది. ఒకే ఒక తత్త్వాన్ని భిన్న భిన్న రూపాలుగా దర్శిస్తాము. ఒక్కొక్క రూపాని కొక్కొక్క దేవత అని నామ కరణం చేస్తాము. ఆ దేవతల నడిగి కోరికలన్నీ తీర్చుకోవాలని తాపత్రయ పడతాము.

అయితే ఈ దేవతోపాసన కూడా అంత సులభం కాదు. ఒక్కొక్క దాని కెన్నో నియమాలూ నిష్టలు ఉంటాయి. ఉన్నా ఫరవాలేదు. ఫలకామన బలంగా ఉండడం మూలాన ఆక్లేశం కూడా వహిస్తాడు మానవుడు. ఈ సహన శక్తి అతడికి సహజంగా ఉన్న ప్రకృతే నేర్పుతుంది.

## 38

**యోయో యాంయాం తనుం భక్తః**
**శ్రద్ధ యార్చితు మిచ్ఛతి**
**తస్య తస్యా చలాం శ్రద్ధాం**
**తా మేవ విదధా మ్యహమ్** **7-21**

అఖండ మైన తత్త్వాన్ని ఖండంగా భావించే వాని దృష్టి సమగ్రం కానేరదు. పైగా అది సకామం. అయినా వాడు భావించిన ఆ మూర్తినే భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తాడు. శ్రద్ధ అనేది చాల శ్లాఘ నీయమైన గుణమని గదా ముందు చెప్పాము. కాబట్టి ఆ శ్రద్ధ సడలకుండా వాడి కంత కంత కచంచలంగా పరిణ మించేలా చేస్తాడా పరమాత్మ.

ఎంచేత నంటే తన అఖండ స్వరూపాన్ని వాడు గుర్తించ లేదనే గాని ఏదో ఒక రూపంలో తన్ను సేవిస్తూనే ఉన్నాడు. అకామంగా తన్ను భావించలేదనే గాని ఏదో ఒక కామంతోనైనా తన్ను ఆశ్రయిస్తున్నాడు. అదే చాలు భగవానుడు వాడి ననుగ్రహించడానికి.

## 39

**స తయా శ్రద్ధయా యుక్త - స్తస్యా రాధన మీహతే**
**లభతేచ తతః కామాన్ - మయైవ విహితాన్ హితాన్** **7-22**

పరమేశ్వరు డనుగ్రహించిన ఆ శ్రద్ధా పాటవంతో వాడు తన ఆరాధన సాగిస్తాడు. ఆ ఆరాధన మూలంగా వాడు కోరిన కోరికలు కూడ ఫలిస్తాయి. అందుకు కారణం తానారాధిస్తూ వచ్చిన ఆ దేవతా మూర్తేనని వాడు భావించ వచ్చు. అది కేవలం పొరబాటు. కారణమేమంటే దేవతలందరూ పరమేశ్వరుని బంట్లు. ఈశ్వర ప్రేరణ లేకుండా ఏ దేవత గానీ స్వతంత్రంగా అనుగ్రహం చూపలేదు. పరిపూర్ణ శక్తి సంపన్ను డీశ్వరుడు. తద్విభూతి శకలాలే ఈ దేవతలు. ఈశ్వరుని కాదని సాధకుడిని అనుగ్రహించే శక్తి వాటి కెక్కడిది.

కాబట్టి ఒక సాధకుడి మనోరథ మేదైనా నెరవేరు తున్నదంటే అది ఆయా దేవతల వల్లనని కాదు. మరిదేని వల్ల. ఆ దేవతల ద్వారా పరమేశ్వరుడే మన కదినెరవేరుస్తాడని అర్థం. ఇంతకూ సర్వసమర్థుడైన పరమేశ్వరుడు ఫలదాత అయితే దానికొక ప్రణాళిక Channel మాత్రమే ఆ దేవత.

## 40

**అంత వత్తు ఫలం తేషాం-తద్ భవత్యల్ప మేధసాం**
**దేవాన్ దేవ యజో యాంతి-మద్భక్తా యాంతి మామపి 7-23**

అయితే ఈ దేవతలు మనకు ప్రసాదించా లనుకొనే ఫలితం మాత్రం చాలా పరిమితమైంది. అది ఎంతో కాలం మానవుడి అనుభవానికి వచ్చేది కాదు. ఎప్పుడో ఒకప్పుడు అంతరించేదే. కారణం ఆ ఉపాసకు డఖండమైన చైతన్యాన్ని కాకుండా పరిచ్ఛిన్న మైన Limitted మూర్తినే పట్టుకొని కూచున్నాడు. పరిచ్ఛిన మైనది ఇచ్చే ఫలం మాత్రం పరిచ్ఛన్నం కాక పరిపూర్ణ మెలా అవుతుంది.

బుద్ధి బలం తక్కువగా ఉన్న వాళ్ళే ఇలాంటి కోరికలు కోరుతుంటారు. కోరికల కనుగుణంగా ఆయా చిల్లర దేవతలను ఆరాధిస్తూ ఉంటారు. అదే బుద్ధి బాగా వికసించిన సాధకుడైతే క్షుద్ర దేవతో పాసనలతో జీవితం వ్యర్థం చేసుకోడు. అఖండమైన తత్త్వ మేదో దానినే అర్థం చేసు కొనెందుకు ప్రయత్ని స్తాడు. అది ఇక జ్ఞానమే గాని ఉపాసన కాదు.

## 41

**అవ్యక్తం వ్యక్తి మాపన్నం-మన్యంతే మా మబుద్ధయః**
**వరం భావ మజానంతో-మమావ్యయ మనుత్తమం 7-24**

అసలు పరతత్త్వ మనేది ఒకటి ఉండగా దానిని త్రోసి పుచ్చి ఆయా క్షుద్ర దేవతల నుపాసించే అగత్య మేమి వచ్చిందని ప్రశ్న. అందుకు కారణం ఒక్కటే. పరతత్త్వ మెప్పుడూ మనకు వ్యక్తం కాదు. నామ రూప క్రియా శూన్య మది. అలాంటి దెప్పుడూ ఇంద్రియాలకు ప్రత్యక్ష మయ్యేది కాదు. అంతరింద్రియ మైన మనస్సు చేతనే గ్రహించవలసి వుంటుంది, అదీ సంస్కృతమైన Refined or Cultivated మనస్సయితేనే.

అలాంటి సంస్కార వంతమైన బుద్ధి లేని వారంతా ఇక ప్రాకృతులే Uncul-tured వారు. దానిని కూడా ప్రాకృతమైన బుద్ధి తోనే పట్టుకోవాలని చూస్తారు. అది వ్యక్తం కాకపోయినా వ్యక్తమైన స్థాయికి దించటానికే ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్న ఫలితమే ఇన్ని దేవతా మూర్తులూ ఇన్ని ఉపాసనలూ లోకంలో. తత్త్వా నికి నామరూపాలు లేవు. ఈ దేవతలకో నామ రూపాదులున్నాయి. కాబట్టి మనసు వాటి మీద నిలవటం సులభమని ఉపాసకుని అభిప్రాయం.

అయితే ఇది వాడి సౌకర్యం కోసం చేసుకొన్న కల్పనే కాని వాస్తవం కాదు. కారణ మేమంటే అది అవ్యయం. పరిణమించే స్వభావం దానికి లేదు అనుత్తమ మని దానికీ పేరు. ఉత్తమం కానిదేదో అదీ అనుత్తమం. అంతకన్నా గొప్ప పదార్థమేదీ లేదు. అది అన్నింటికీ మూల కారణమని గదా ప్రతిపాదించాము. అలాంటప్పుడిక దానిని మించిన తత్త్వమెలా ఉండగలదు. కనుకనే దానిని కూటస్థ Constant మన్నారు. అది ఎలా ఉంటే అలా భావించటమే మన విధి. అంతేగాని ఒక విధంగా ఉంటే మరొక విధంగా చూడటం గాదు. చూస్తే తత్త్వానికి దూరమైపోతామే గాని దాని కెన్నటికీ సన్నిహితులం కాము. కాలేము. ఇంతకన్నా తెలివి తక్కువ ఏముంది.

## 42

**నాహం ప్రకాశ స్సర్వస్య - యోగ మాయా సమావృతః**
**మూఢోయం నాభిజానాతి - మా మేభ్యః పరమవ్యయం 7-25**

అయితే ఇక్కడ ఒక ఆశంక వస్తుంది. జీవేశ్వరు లిద్దరూ చైతన్య స్వరూపులే. చైతన్యం తప్ప మరొక లక్షణం ఇద్దరిలోనూ లేదని సిద్ధాంతం చేశారు. మహా అయితే జీవ చైతన్య మీశ్వర చైతన్యం కన్నా స్వల్పమైన దైతే కావచ్చు. అది పరిమాణంలోనే గాని వస్తు తత్త్వంలో కాదు గదా. అలాంటప్పుడిది దాని నర్థం చేసుకోలేని దుస్థితి అసలు ఎలా సంభవించిందని ప్రశ్న.

వాస్తవమే. ఎంత స్వల్పమైనా చైతన్యమే గనుక అది సజాతీయమైన ఆ ఈశ్వర తత్త్వాన్ని గ్రహించి వుడవలసిందే. సందేహం లేదు కాని ఇక్కడ వచ్చిన తిరకాసే మంటే అది దీని పరిధిలోకి రాకుండా మరుగు పడి వుంది. ఏదైనా ఎదట పడితే గ్రహిస్తుందే గాని మరుగు పడితే ఎలా గ్రహించగలదు. అక్కడే వున్నా పట్టుకోలేదు. ప్రస్తుత మీశ్వర చైతన్య మంతటా నిండివున్నా మరుగున పడి జీవుని కేమాత్రమూ గోచరం కావడం లేదు.

అంతటా ఉన్న దెలా మరుగయిందని ప్రశ్న. దాని చుట్టూ యోగమాయ అనే దట్టమైన పొర ఒకటి ఆవరించి వుంది. అది నిత్యమూ అడ్డు తగులుతూ ఉంది లోక దృష్టికి. అందుకే ఎవడంటే వాడు దాన్ని అంత సులభంగా గ్రహించ లేక పోతున్నాడు. గ్రహించే సాధనం మన దగ్గర లేక గాదు. జ్ఞానమే గదా గ్రహించే సాధనం. అది ఎప్పుడూ మన దగ్గర ఉన్నదే. అసలు మన స్వరూపమే

అది. అయినా అది ప్రసరించకుండా యోగ మాయ దాన్ని మభ్య పెడుతున్నది. దాన్ని అంటే ఆ పరమాత్మ స్వరూపాన్ని. అదే మన బుద్ధి కుండే గ్రహణ శక్తిని కూడా కుంఠితం చేస్తూంది.

అటు గ్రాహ్యమైన తత్త్వమూ ఇటు గ్రాహకమైన మన జ్ఞానమూ రెండూ దానిచేత ఎప్పుడావృత మయ్యాయో అప్పు డీజ్ఞానమనే సాధనం మనకున్నా ఉపయోగం లేకుండా పోయింది. దానితో పరమార్థాన్ని గ్రహించలేని మూఢుల మయ్యాము మనమంతా. అయితే పరమార్థం మాత్రం మనం గ్రహించినా గ్రహించకున్నా అలాగే ప్రకాశిస్తూ ఉంది. ఎంచేత. అది అజమూ అవ్యయమూ అయిన పదార్థం. కారణమనేది లేనిది కాబట్టి అది అజం. దేనికి కార్యం కాదు కాబట్టి అవ్యయం. అంచేత మరొకదాని కది ఎప్పుడూ వశం కాదు. మాయ కూడా దానికి భిన్నం కాదు కాబట్టి దాని నేమీ చేయలేదు. ఎటువచ్చీ జీవుడికే అది అడ్డు తగులుతూ వుంది. కనుకనే ఎదుటనే ఉన్నా దాన్ని చూడలేక బాధ పడుతున్నాడీ జీవుడు.

## 43

**వేదాహం సమ తీతాని - వర్త మానాని చార్జున**
**భవిష్యాణిచ భూతాని - మాంతు వేద నకశ్చన** **7-26**

ఇదేమిటే అన్యాయం. మాయా శక్తి జీవేశ్వరుల నిద్దరినీ కమ్ముతూ ఉందని గదా పేర్కొన్నారు. అందులోనూ అది ఈశ్వరుడికి చెందినదే కదా ఆ మాయ. ఈశ్వరుణ్ణి ఆవరిస్తూ గదా అది జీవుడి దృష్టిని కూడా మభ్య పరచటం. అలాం టప్పు డీశ్వరుడి కది హాని చేయక పోవటమేమిటి. జీవుడే దాని బారికి చిక్కట మేమిటని ప్రశ్న వస్తుంది.

నిజమే, ఈశ్వరుడినీ అది బాధించ వలసిందే. కానీ బాధించే స్తోమత లేదు దానికి. కారణం అది ఈశ్వర తత్త్వాని కంటే భిన్నమైన పదార్థం కాదు. ఈశ్వర ప్రకృతే అది ప్రకృతి అంటే స్వభావం. తన స్వభావం తన కెప్పుడూ హాని చేయదు. ఇంతెందుకు. అగ్నికి ఉష్ణత అనేది స్వభావం. అది దేనినైనా నిమి షంలో దహించి వేస్తుంది. కాని అగ్ని నేమీ చేయలేదది.

ఇంకా [illegible]ంతం కూడా చెప్పుకో వచ్చు ఇక్కడ. ఒకడొక పెద్ద దుర్భిణీ పెట్టుకొని దూరం నుంచి అందరినీ చూస్తుంటాడు. దుర్భిణీ వాడి కండ్ల కడ్డంగా

ఉంది. కాబట్టి వాడి ముఖాన్ని ఎవరూ చూడలేరు. కాని వాడు మాత్రం ఆ దూర దర్శినిలో నుంచి అక్కడ ఉన్న నలుగురినీ చక్కగా చూడ గలుగుతాడు. అది వాడి కండ్లమీదనే ఉన్నావాడి చూపుల కేమాత్రమూ అడ్డురాదు.

అట్లాగే యోగమాయ పారమేశ్వరమైన తత్త్వాన్ని ఎంత ఆవరించి నప్పటికీ ఆయన జ్ఞాన దృష్టి కది ఏ మాత్రమూ ప్రతి బంధకంకాదు. ఆయన జరిగిన దాన్ని చూడ గలడు. జరుగుతూ ఉన్న దాన్ని దర్శించ గలడు. జరగబోయే దాన్ని ఆకళించ గలడు. ఎటు వచ్చీ చుట్టూ ప్రేక్షకుల లాగా నిలబడి చూచే మన లాటి జీవుల దృష్టికే అంతా అగమ్య గోచరం.

ఇక్కడ మన మర్థం చేసుకోవలసింది ఒక్కటే. ఆవరణ మనేది ఈశ్వరుడికి లేదని కాదు. ఉన్నా అది ఒక దుర్భిణి లాగా ఆయన దృక్శక్తిని నిరోధించడం లేదు. పోతే జీవుడి కది దుర్భిణీ లాగా పనిచేయక పోవటం మూలాన్నే అతని దృష్టి ఎక్కడి కక్కడ నిరుద్ధమౌతున్నది. అసలా మాటకువస్తే జీవుడిదే ఆవరణం అతడీశ్వరుణ్ణి సగుణంగా చూచినంత వరకూ అతని దృష్టి సావరణ Veiled మౌతుంది. అదే నిర్గుణంగా చూచిన నాడు నిరావరణమే unveiled అవుతుంది. ఇంతకూ జీవుడి దృష్టి భేదాన్ని అనుసరించి ఏర్పడ్డవే ఆవరణమైనా అనావరణమైనా. స్వతహాగా ఈశ్వరుడి కేదీ లేదు.

## 44

**ఇచ్ఛా ద్వేష సముత్థేన-ద్వంద్వ మోహేన భారత**
**సర్వ భూతాని సమ్మోహమ్-సర్గే యాంతి పరంతప 7-27**

ఆవరణ మీశ్వరుడి దంటూనే మరలా ఈశ్వరుడి కాదోషమెంతా మాత్రమూ సోక దంటున్నారు. జీవుడిది కాదంటూనే దోషమంతా అతని మెడకే చుడు తున్నారు. రెండూ చైతన్యాలే అయినప్పుడది రెండింటికి దుర్భిణి మాదిరి పని చేయాలి గాని ఒక దాన్ని తప్పించటమేమిటి. మరొకదాన్ని బాధించట మేమిటని ఆక్షేపించవచ్చు.

దీనికి శాస్త్రం చెప్పే సమాధాన మిది. మన మీశ్వర స్వరూపులమే. మన చైతన్యం సర్వవ్యాపక మైనది. ఎలాంటి అవరోధం దానికి లేదని మనం భావించ గలిగితే చాలు. నిజంగా మన మీశ్వరుడే అవుతాము అప్పుడెలాంటి ఆవరణ దోషమూ లేదు మనకు. అయితే అలా భావించే అదృష్టానికి మనం నోచు

Brahmasri Vallabhajosyula Srinivasa Rao www.advaitavedanta.in

కోవడం లేదు. కనుకనే తద్భిన్నంగా జీవులమై కూచున్నాము. అయినందుకు మనకేమిటి దాఖలా. మనలో ప్రతి ఒక్కడూ నాకు పరిపూర్ణమైన జ్ఞానముందని అనుభవానికి తెచ్చుకోలేక పోవడమే. అనుభవమేకదా దేనికైనా ప్రమాణం. అనుభవాన్ని ఎలా కాదనగలం. అజ్ఞానులమనే అనుభవం మనలో సహజంగానే చోటు చేసుకొని ఉంది.

దీనిని బట్టి అసలు మానవుడు జన్మ ఎత్తినప్పుడే అజ్ఞానంతో జన్మించాడని అర్థమవుతున్నది. దీనికే మోహమని కూడా పేరు. ఈ మోహమొక అంధకారం లాంటిది. అది పుట్టుకతోనే మన అఖండ దృష్టిని ఆచ్ఛాదిస్తున్నది. అంతటితో ఊరుకోక ఇచ్ఛాద్వేషాలనే భావాలను రెచ్చగొట్టి నిర్వి కల్పమైన తత్త్వాన్ని సవికల్పంగా చూడటాని కలవాటు చేసింది. తన్మూలంగా నేను నాది అనే ద్వంద్వాల అనుభవం సంప్రాప్తమైంది. దాని వల్లనే ఈ ప్రపంచమంతా మన దృష్టికి బ్రహ్మమయంగా భాసించటానికి మారుగా బ్రహ్మమే ప్రపంచాకారంగా భాసిచసాగింది.

ఇదీ జరిగిన పెద్దమోసం. ఈ మోసానికేమిటి కారణం. మన అజ్ఞానం. ఎప్పటిదీ అజ్ఞానం. అనాది సిద్ధం. అది మనకెందుకేర్పడింది. మనం చేసుకున్న కర్మేదానికి కారణం. కారణం లేని కార్యమెప్పుడూ సంభవించదు. మన మీ జన్మలో అజ్ఞానంతో జన్మించామంటే మన మంతకుముందు చేసుకొన్నదే. మనం చేసుకొన్నది కాకుంటే అది మనలనెందుకు బాధించాలి. కర్మే అజ్ఞానాన్ని ప్రేరేపిస్తే ఆ అజ్ఞానం మనకు ద్వంద్వానుభవాన్ని ప్రసాదిస్తే అది మరలా మనచేత కర్మ చేయించి అజ్ఞానకూపంలో పడదోస్తున్నది.

## 45

**యేషాం త్వంత గతం పాపం-జనానాం పుణ్యకర్మణాం !**
**తే ద్వంద్వ మోహ నిర్ముక్తా-భజంతే మాం దృఢ వ్రతాః 7-28**

కాబట్టి దీనికి ఆది ఏమిటని ప్రశ్నించి మరలా ప్రయోజనం లేదు. అది ఒక పరంపర. పూర్వపూర్వ వాసనయే ఉత్తరోత్తరానుభవానికి కారణమని చెప్పవలసి వస్తుంది. అన్నిటికీ పూర్వమేదని అడిగావో అసలు లేనేలేదు. పొమ్మని నోరు మూయిస్తుంది శాస్త్రం. ఈశ్వరుడి మాదిరి ఈ సంసారం కూడా అనాది సిద్ధం. "ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉ భావపి" అని కదా భగవానుడు చెప్పిన మాట.

Vallamraju Srinivasa Rao www.advaitaveda.in

అంచేత మానవుడికున్న ఈ అజ్ఞానానికి ఆది అంటూ లేదు. అదే కారణ శరీరమన్నారు. శాస్త్రజ్ఞులు. కారణం గనుకనే తన్మూలంగా జీవుడి కీజన్మ లేర్పడు తున్నాయి. ప్రతి జన్మలోనూ కామ ప్రేరితుడు కావటం మూలాన ఈ జీవుడు పాప కర్మలు చేస్తుంటాడు అవి అంతకంతకు ప్రబలమై జన్మ పరంపర అనేది తామర దంపరగా సాగుతూపోతుంది ఇదే సంసారం.

దీని నెప్పటికయినా సరే- మనం తెంచుకొని బయట పడాలంటే పుణ్య కర్మలే చేస్తూ పోవాలి. పుణ్యం పాపానికి ప్రతిద్వంద్వి Opposite కదా. ఎంత పాపం పెరిగిపోయిందో అంత పుణ్య మాచరించగలిగితే చాలు. ఇది దాన్ని కూకటి వేళ్ళతో సహా పెళ్ళగిస్తుంది. దానితో రజస్తమో మాలిన్య మడుగంటి సత్త్వం పరిశుద్ధ మవుతుంది మానవుడికి. సత్త్వశుద్ధి నార్జిస్తే ఇక ద్వంద్వాలకు ప్రసక్తిలేదు. పదవిని కోలుపోయిన ప్రభువులలాగా అవి వెంటనే పలాయనం చిత్తగిస్తాయి. అప్పుడీ విషవలయాన్నుంచి బయటపడి జీవుడు భగవత్తత్త్వాన్ని గట్టిగా పట్టుకో గలుగుతాడు.

కాబట్టి ఇంతకూ పిండితార్థ మేమిటి ఇది ఎక్కడిదీ- ఎందుకూ అనే ప్రశ్నలతో కాదు సాధకుడు కాలం గడపవలసింది. దాని బదులు ఇది ఎలా నిర్మూల మవుతుంది అనే విచారణ సాగించాలి. ఎందుకు అనేది లౌకికుని స్థాయి. ఎలాగ అనేది సాధకుని స్థాయి. లౌకికుని స్థాయిలో పరిష్కారం లేదు. ప్రశ్న ప్రశ్నగానే నిలిచి పోతుంది. పరిష్కారమే కావాలంటే సాధకుని స్థాయికి ఎదగాలి. అది ఎలా పోగొట్టుకోవాలనే ప్రయత్నం సాగిస్తూపోతే యత్నం ఫలించే సరికి ఇక ఎందుకనే ప్రశ్నరాదు. దానికి కూడా అందులోనే సమాధానం దొరుకు తుంది మనకు.

## 46

**జరా మరణ మోక్షాయ-మా మాశ్రిత్య యతంతి యే**
**తే బ్రహ్మతద్విదుః కృత్స్న-మధ్యాత్మం కర్మ చాఖిలం 7-29**

అయితే ఇంత శ్రమపడి అయినా ఆ భగవత్తత్త్వాన్ని పట్టుకోవలసిన అవసరం ఏమిటి. స్వాభావికమైన జీవభావం తోనే ఉంటే సరిపోలేదా అని మరలా పూర్వ పక్షం చేయవచ్చు.

జీవభావం మనకు సుఖదాయకమైతే మంచిదే. ప్రాకులాడ బనిలేదు. కాని అది ఉన్నంతవరకూ సుఖమనే వాసనే లేదు మనకు. అడపా దడపా ఏదో

కొంత ఉన్నట్టు కనిపించినా అది ఒక ఆభాసే Pseudo. రెండు కష్టాల మధ్య ఏర్పడే విరామాన్నే సుఖమని భ్రమిస్తున్నాము మనం. అంచేత జీవితమంతా కష్టభూయిష్ఠమే. సుఖపడుతున్నామనేది కల్ల. జన్మవ్యాధి జరా మరణాది బాధలనేవి అనుభవించని ప్రాణిలేదు. ప్రాణి ఎప్పుడూ బాధారహితమైన స్థితినే వాంఛిస్తాడు.

అయితే జరా మరణాదులున్నంతవరకూ అలాంటి సుఖైకతానమైన దశ సంభవం కాదు. కాబట్టి వాటినుంచి బయటపడే ప్రయత్నమే మనమెప్పుడూ చేయవలసిన కార్యం. ఆ ప్రయత్నం కూడా మరేదో కాదు. నిరంతరమూ భగవచ్చింతన కలిగి ఉండటమే. తదాకార వృత్తి ఎప్పుడేర్పడుతుందో అది సర్వ వ్యాపకం కాబట్టి జీవితమంతా దానితోనే నిండి పోతుంది.

జీవితమంతా ఎలా నిండుతుందని అడగవచ్చు. అక్కడే ఉంది రహస్యం మిగతా ప్రాపంచిక వృత్తులలాంటిది కాదు బ్రహ్మ వృత్తి. నేనూ-నేను చూచే సమస్తమూ కూడా చైతన్యమేననే భావన అది. ఆ భావనలో జ్ఞానంకంటే వేరుగా జ్ఞేయపదార్థం లేదు. అంతా జ్ఞాన స్వరూపమే. అంచేత అది అఖండం. పరి పూర్ణం పరిపూర్ణం కనుకనే దానిని బ్రహ్మమన్నారు. పరిపూర్ణమైన జ్ఞానం మనకుదయించిందంటేనే అప్పటికి బ్రహ్మమనేది పరిపూర్ణంగా మనకు బోధపడిందని అర్థం. అది బోధపడిందంటే మన ఆత్మ కూడ మన కవగత మయింది. ఆత్మరూపమే గదా బ్రహ్మమంటే. అంతేకాదు. మనం చేసే కర్మలన్నీ కూడా మనకు బ్రహ్మాకారం గానే అనుభవానికి వస్తాయి. అంటే ఏమన్నమాట. బ్రహ్మాకార వృత్తి కలిగిందంటే అదీ-నేనూ- ఈ ప్రపంచమూ-మూడూ కలసి అఖండ చైతన్య రూపంగానే అనుభవానికి వచ్చి తీరాలని తాత్పర్యం.

## 47

**ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ-నైనాం ప్రాప్య విముహ్యతి**
**స్థిత్వాస్యా మంత కాలేపి-బ్రహ్మ నిర్వాణ మృచ్ఛతి 2-72**

ఇలా అధి భౌతికంగా ఆధ్యాత్మికంగా అధి దైవికంగా మూడంతస్తులలోనూ ఉన్నదొకే తత్త్వమని చూడగలగటమే బ్రాహ్మీస్థితి. అన్నింటికీ కడపటి స్థితి ఇది. దీనిని పొందటమే కష్టసాధ్యం జీవితంలో. ఎన్నో జన్మల నుంచీ చేసుకొన్న తపః ఫలమది. కడసారిగా కలుగుతుంది మానవుడికి.

అది కలిగేంత వరకే అన్ని ప్రయత్నాలు. కలిగిన తర్వాత ఇక యత్నం కాదు. ఫలితమే అది ఎలా ఉంటుందని అడిగితే మోహాని వృత్తే అది మోహ మంటే అనాది ప్రవృత్తమైన మానవుడి అజ్ఞానం. దానివల్లనే ఈ సంసార బంధం. తపస్సు లాంటిదది. అది ఈ బ్రహ్మ భావమనే తేజస్సు ముందు విలువ లేక దాని లోనే లీనమైపోతుంది. అప్పుడంతా బ్రహ్మమే. మరొక పదార్థమే లేదు.

మరొకటి లేకుంటే ఇక ఆభావానికి చలనమంటూ ఉండబోదు. జీవితం లోనూ ఉండదు. మరణంలోనూ ఉండదు. మరణం కూడా చలనమే గదా. జీవుడు చలించి బయటికి పోవటాన్నే మరణ మంటున్నాము. దేశ కాలాదులన్నీ నా స్వరూపమే అని భావించిన బ్రాహ్మీ స్థితిలో అది ఎలా సంభవం. కాబట్టి అంతకాలంలోనైనా ఆ స్థితిలో ఉన్న వాడికంతమే లేదు. అనంతమైన నిర్వాణ సుఖాన్నే చూరగొంటాడు. శరీర మున్నప్పుడు జీవన్ముక్తి రూపమయితే అది-శరీరం తొలగినప్పుడు విదేహముక్తి. అంతే తేడా. మరేమీ లేదు.

# 48

**అంత కాలేపి మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం**
**యఃప్రయాతి సమద్భావం-యాతినాస్త్యత్ర సంశయః 8-5**

అయితే ఇక్కడ ఒక అశంక. అంతకాలమంటున్నారు. మరలా చలనం లేదంటున్నారు. చలనం లేదన్నప్పుడది అంతమెలా అవుతుంది. అంతమయితే చలనమెలా లేకపోతుంది. చూడబోతే విప్రతి షిద్ధంగాContradictory ఉన్నదీ వాక్యమని ప్రశ్న వస్తుంది. దానికి మరలా సమాధానమిస్తున్నది శాస్త్రం.

ఇందులో విప్రతి షేధ మేమాత్రమూ లేదు. ఎందుకంటే అంతమని చెప్పింది మేము సాధకుడి ఆత్మకుకాదు. ఆత్మగా భావించే శరీరానికి. జ్ఞానోదయం కాగానే ప్రారబ్ధావసానంలో దానినక్కడే వదలి వేస్తాడు సాధకుడు. మరి ఆత్మ కంతమే లేదు. కాబట్టి సాధకుడి స్వరూపమే కాబట్టి అలాగే నిలిచి ఉంటుందది. ఇక్కడ ఉన్న విశేషమేమంటే మామూలుగా లౌకికుల నందరినీ అవసానంలో శరీరమే వదలి పోతుంది. సాధకుడి విషయ మలాగాదు. ఆపాటికి వాడు సిద్ధుడయి ఉంటాడు కాబట్టి అతణ్ణి శరీరం వదలడం కాదు. అతడే శరారాన్ని వదలి వెళ్ళుతాడు. అంటే ఎక్కడికో పోతాడని కాదు మరలా శరీరాదు లను కూడా బ్రహ్మంగానే భావించి అలాగే నిలిచి ఉంటాడని భావం.

అందుకు కారణం నిరంతరమూ ఆ బ్రహ్మాభావాన్ని నిలుపుకోవటమే. దీనికే స్మరణమని మరొక నామధేయం. తత్త్వస్మరణం వల్ల వాటి స్వరూపమే తదా విష్టమై తన్మయంగా పరిణమిస్తుంది. అసలు తత్త్వమే గదా అది. అలాంటప్పు డది శరీరం లాగా అంతరించే ప్రసక్తి ఎక్కడిది. అంతరిస్తే అది తత్త్వమెలా అవుతుంది. అంతరించేది శరీరమే.

అయితే శరీరాన్ని వదలి అతడెక్కడికో వెళుతాడని పేర్కొన్నారే. అదేమిటని ప్రశ్న. మాట సామెతగా చెప్పిందేగాని ఎక్కడికో వెళ్ళటం కాదది. అయితే ప్రయాతి అనేమాట కర్థమేమిటి? లోకుల దృష్టిని బట్టి చెప్పినమాట అది. చచ్చిన వాడి శరీరం కనిపిస్తున్నది. వాడు కనిపించటం లేదు. దానిని బట్టి వాడుదీన్ని విడిచి ఎక్కడికో వెళ్ళాడని భావించటం సహజమే. కాని వాడెక్కడికో వెళ్ళలేదు. వాడి దృష్టితో చూస్తే అక్కడే ఉన్నాడు వాడు. "స మద్భావమ్ యాతి" అంటు న్నాడు భగవానుడు, అంటే బ్రహ్మాభావంతోనే ఉన్నాడు. బ్రహ్మమెక్కడ ఉంది. అంతటా ఉంది. అన్నిటిలోనూ ఉంది. కాబట్టి ముక్తుడైన వాడంతటా అన్ని రూపాలుగా అక్కడే ఉన్నాడని భావం.

## 49

**యం యం వాపి స్మరన్ భావం-త్యజత్యంతే కళేబరం!**
**తంత మేవైతి కౌంతేయ.సదా తద్భావ భావితః 8-6**

ఇందుకు సందేహంలేదు. ఎందుకంటే అసలు ఒక్క పరమాత్మ భావమే గాదు. ఏయే భావాన్ని సాధకుడు ధ్యానిస్తూ కూచున్నా ఆ భావాన్నే అవసానంలో పొంద గలుగుతాడు. స్థూలమైన కళేబరమిక్కడే పడిపోవచ్చు కాని సూక్ష్మమైన అతని జీవచైతన్య మాధ్యేయ స్వరూపాన్నే అందుకొని అలాగే ఉండిపోతుంది.

ఇందులో ఉన్న ఉపపత్తి ఏమిటని అడగవచ్చు. అన్యచింతమాని ఒకే ఒక భావాన్ని అంటిపట్టుకో గలిగితే చాలు. మనస్సు తదాకారంగా మారటానికి అవకాశం ఉంది. తద్భావ భావన మనేది ఇదే. భావన అనేమాట చాలా గంభీర మైంది. ఒక వస్తుగుణాన్ని మరొక వస్తువుకు పట్టించటానికి భావన మని పేరు. వైద్య శాస్త్రంలో కూడా ఈ శబ్దం తరుచుగా వినబడుతుంది భావన అల్లం భావన జీలకర్ర అనేవి ఇలాంటివే. మామూలు అల్లం-జీలకర్ర- ఔషధాలు కాకపోయినా పుటం పెడితే అవే ఔషధాలుగా పని చేస్తాయి.

పోతే వేదాంతులు వర్ణించే భ్రమర కీటన్యాయ మొకటి ఉంది. అదికూడా ఇలాంటి భావనే. నిరంతర భ్రమర సాహచర్యాల వల్ల తదీయ ఝుంకారా కర్ణణం వల్ల కొన్నాళ్ళకు కీటకం భ్రమరంగా మారిపోతుంది. అంతేందుకు పరుస వేది ప్రభావం వల్ల లోహం బంగారంగా మారటం లేదా. అంటు కట్టటం మూలంగా ఒక చెట్టుకు మరొక చెట్టు లక్షణాలు సంక్రమించటం లేదా.

దీనిని బట్టి జీవుడు కూడా నిరంతర స్మరణ మూలంగా ఈశ్వర తత్త్వాన్ని పొందటంలో ఆశ్చర్యం లేదు. ఆ మాటకు వస్తే క్రొత్తగా పొందటం కూడా కాదిది. అంతకుముందు కూడా ఈశ్వరుడే జీవుడు. అయితే అ విద్యా దోషం వల్ల కాదనుకొని సంసార జంబాలంలో చిక్కుకొన్నాడు. ప్రస్తుతం శాస్త్రాచార్య ప్రబోధజనిత నిరంతరాను సంధానం వల్ల మరలా తన ఈశ్వరత్వాన్ని తాను జ్ఞప్తికి తెచ్చుకో గలిగాడు. ఇదే పొందట మనే మాటకు అర్థం.

## 50

తస్మా త్సర్వేషు కాలేషు - మా మనుస్మర యుధ్య చ
మయ్యర్పిత మనో బుద్ధి - ర్మా మే వై ష్యస్య సంశయః 8-7

అంచేత మనం చేయవలసిన సాధన ఏమిటింతకూ. క్రొత్తగా ఏదో సాధించడమనేది ఎప్పుడూ లేదు. ఉన్న దానినే మనం జ్ఞాపకం చేసుకోవాలి. అది మన స్వరూపమే. శుద్ధమైన సర్వవ్యాపకమైన చైతన్యం. అహమహ మనే రూపంలో ఉన్నదది. అలాంటి అహమాకారవృత్తి నెప్పుడూ ఆవృత్తి చేసుకొటూ కూచోటమే మన విధి. ఎప్పుడూ అంటే సర్వకాల సర్వావస్థలలోనని అర్థం. ప్రతిక్షణమూ అలా లనుసంధానం చేస్తూ పోతేగాని వృత్తి దృఢంగా నిలవదు.

ఈ వృత్తికే బ్రహ్మాకారవృత్తి అనీ- అఖండాకారవృత్తి అనీ - ఆత్మాకార వృత్తి అనీ - పర్యాయపదాలు, ఒక్క నిమిషంకూడా దీని నేమరరాదు. సంగీతంలో శ్రుతిలాగా ఇది ఎప్పుడూ అంటిపట్టుకొనే ఉండాలి సాధకుణ్ణి. విస్మరిస్తే ఆ మేరకు మరలా అజ్ఞాన పిశాచం వచ్చి నెత్తిన పడుతుంది. దానితో బ్రహ్మం మరలా నామ రూపాత్మకమైన ప్రపంచంగా భాసిస్తుంది. కాబట్టి ఒకవేళ తాత్కాలికంగా తొలగినా దాని నెప్పటికప్పుడు మరలా అనుసంధానం చేసుకొంటూ పోవాలి. తెగితే ముడి పెట్టటానికే అనుసంధానమని పేరు. దానివల్ల మనో మాలిన్యం ఎప్పటికప్పుడు ప్రక్షాళితమై బ్రహ్మవృత్తి ప్రతిష్ఠితమవుతుంది.

బ్రహ్మవృత్తిని విస్మరించామంటే దానికి హేతువు ప్రాపంచికవృత్తులే. అవి సవికల్ప వృత్తులు. వాటితో నిర్వికల్పమైన ఈ వృత్తి దెబ్బతినడం సహజమే. అలాంటప్పుడీ నిర్వకల్పవృత్తిని కాపాడుకోవాలంటే ఆ సవికల్ప వృత్తులు ప్రవేశించకుండా వాటితో పోరాటం సాగించవలసి వుంటుంది. ఒకవైపు వాటితో పోరాడుతూ మరొకవైపు తత్త్వాను సంధాన మేమరకుండా ఉండటమే సాధకుడి కర్తవ్యం.

ఇలా రెండు మార్గాలలోనూ అభ్యాసం కొనసాగించామంటే కొత కాలానికి అసలీ సవికల్పవృత్తులు చిత్తంలో తల ఎత్తనేలేవు. దానితో బ్రహ్మవృత్తి ఒక్కటే ఏకచ్ఛత్రాధిపత్యంగా రాజ్యం చేస్తుంది. సాధకుడి మనసు-బుద్ధి- ఈ రెండూ కలిసి ఆ క్షణంనుంచీ బ్రహ్మమునందే అర్పితమౌతాయి. అదే నిజమైన ఆత్మార్పణ. ఈ అర్పణ అతణ్ణి తిన్నగా బ్రహ్మపదానికే తీసుకుపోతుంది. సందేహం లేదు.

## 51

**ప్రయాణకాలే మనసా చలేన**
**భక్త్యాయుక్తోయోగబలేన చైవ**
**భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్యసమ్య**
**క్సతంపరం పురుషముపైతిదివ్యం!!** **8-10**

బ్రహ్మపదాన్ని చేరుస్తుందని వర్ణించాము. అయితే అలా చేర్చటానికి అవకాశమివ్వాలి సాధకుడు. అంటే ప్రయాణానికి కావలసిన సామగ్రినంతా సమకూర్చుకోవాలని అర్థం.

ప్రయాణమని తెలియగానే మనస్సును చలిచకుండా చేయటం మొదటి కర్తవ్యం. చిత్రవిచిత్రమైన భావాలు రాకుండా చిద్రూపమైన భావన ఒక్కటి ఏర్పడితే చాలు. అదే మనసు చలించకుండా పోవటం. చలించకపోతే అది అచలమవుతుంది. అచలమైన మనసులో ఇక అచలమైన చైతన్యరసమే తోణికిసలాడుతుంది.

కానీ దాన్నికూడా సాధకుడిమనసు దూరంగా ఉంచుకొని చూస్తే ప్రయోజనం లేదు. తనదిగా అభిమానించి తనకాత్మీయం చేసుకోవాలి. అప్పుడది చాలా సన్నిహితంగా వస్తుంది. అలా వచ్చినప్పటికీ సుఖంలేదు. అదేతాను-

తానే అది-అనే ఏకాత్మ భావంతో చూడాలి దాన్ని. అప్పుడది ఆత్మీయంగానే కాక ఆత్మగానే అనుభవానికి వస్తుంది. ఇందులో చైతన్యాన్ని అంతటా దర్శించటం జ్ఞానమైతే-దానిని ఆత్మీయంగా భావించడం భక్తి అవుతుంది. మరి ఆత్మగానే భావన చేస్తే భక్తికూడాకాదు. యోగమని పించు కొంటుంది. ఇవి మూడూ సాధకుని ప్రయాణ సామగ్రి.

ఇవి కాక నాలుగవది ఒకటున్నది. ఇంతవరకూ వర్ణించిన జ్ఞానాదులు సాధకుడి మనస్సుకు సంబంధించిన పరికరాలు. ప్రాణానికి సంబంధించినవి కావు. చైతన్య శక్తి మన శరీరంలో ప్రవేశించినపుడు ఒకటిగా ప్రవేశించలేదు. అది రెండుపాయలై ప్రవేశించింది. ఒకటి మనస్సు. మరి ఒకటి ప్రాణం. ఇందులో మనస్సనేది చిచ్ఛక్తి ప్రధానంగా అవతరిస్తే-ప్రాణం సచ్ఛక్తి ప్రధానంగా బయలుదేరింది. రెండింటినీ కూడా సాధకుడు ఆ మూల చైతన్యం లోకే మరలా లయం చేసేకోవలసి ఉంది. అందులో ఇప్పుడు చెప్పింది మనోలయం మాత్రమే. పోతే ప్రాణలయం వర్ణిస్తున్నాడు ప్రస్తుతం భగవానుడు.

ఈ ప్రాణాన్ని మనం భ్రూమధ్యంలో ప్రవేశ పెట్టాలట. భ్రూమధ్యమంటే నాసికా మూలం. ఖేచరీ ముద్రా స్థానమదే. "ఖ" శబ్దాని కాకాశమని అర్థం. నాసికామూలాన్ని దృష్టించి చూస్తే శూన్యమే కనిపిస్తుంది. మనకు శూన్యమే ఆకాశం. కాబట్టి ప్రాణ శక్తిని ఆకాశంతో కలపాలని అర్థమైంది. ప్రాణమంటే ఒక చలనమే కదా. చలనాన్నంతటినీ చలనం లేని దశలోకి తర్జుమా చేయాలి. అప్పుడది సద్రూపంగా నిలిచిపోతుంది.

మనసు చిద్రూపమైతే ప్రాణం సద్రూప మౌతుంది. చిత్తును విడిచి సత్తూ-సత్తును విడిచి చిత్తూ- ఉండవు కాబట్టి రెండూ కలిసి ఒకే ఒక అఖండ బ్రహ్మ తత్త్వంగా పరిణమిస్తాయని భావం. అలా పరిణమించిన మరుక్షణం ఇక సాధకుడు పురుషుడు కాడు. పురుషోత్తముడే.

## 52

**అభ్యాసయోగ యుక్తేన-చేతసా నాన్యగామినా**
**పరమం పురుషం దివ్యం - యాతి పార్థానుచింతయన్॥ 8-8**

ఈ వర్ణించిన పద్ధతిని చూస్తే చాలా రమణీయంగానే ఉన్నది గాని ఇలాంటి గొప్ప అదృష్టం మానవులకు పడుతుందా అని మరలా అనుమానం. ఎందు

కంటే ఏది సాధించినా చివరకు మనసుతోనే కదా సాధించాలి. ఆ మనసనేది ఎలాంటిదో మనకు తెలుసు. అంత చంచలమైన పదార్థమే లేదు సృష్టిలో. అది అచలమైన స్థితికి వస్తేనే తప్ప మనకా పరతత్త్వాన్ని అందుకొనే ఆశలేదు. అలాంటప్పుడిక దాన్ని ఎంతవర్ణించి ఏమి ప్రయోజనం. దాన్ని సాధించే మనసు మనకు వశమయ్యేది లేదు కదా.

వాస్తవమే అలాగని ఉపేక్ష వహించరాదు. వహిస్తే యావజ్జీవమూ అలాగే ఉండిపోతాడు మానవుడు. ఏ ఒక్కటీ సాధించలేడు. సాధకుడెప్పుడూ అభ్యాసం సాగిస్తూనే ఉండాలి. తప్పదు. అభ్యాసం సాగించే కొద్దీబుద్ధి పదునెక్కుతుంది. నిర్మల మౌతుంది. క్రమంగా స్వరూపభావనతో నిండిపోయి అన్యభావాలను గూర్చి ఆలోచించటం మానివేస్తుంది. అది మానేకొద్దీ బ్రహ్మాభావనే దృఢమౌతూ వస్తుంది.

అలా అయితే చివరకు ప్రయాణకాలం దగ్గర పడే క్షణంలో కూడా అలవాటు కొద్దీ అదే బ్రహ్మ భావనలో నిలవ గలుగుతాడు మానవుడు. ప్రాణం పోయే సమయంలో కూడా నేనే బ్రహ్మాన్ని అనే అఖండ వృత్తిని ఏ మాత్రమూ విస్మరించడు. విస్మరణమే మరణం. కనుక నిరంతర స్మరణ మేమరని సాధకుడు తప్పకుండా సాయుజ్య మందుకోగలడు.

## 53

**యదక్షరం వేదవిదో వదంతి**
**విశంతి యద్యతయో వీతరాగాః**
**యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి**
**తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే॥ 8-11**

పరమపదం పొందుతాడనీ – సాయుజ్యం చెందుతాడనీ – బ్రహ్మాండంగా వర్ణించారు. బాగానే ఉంది. అయితే ఇంతకూ ఆ సాయుజ్యమనేది ఏమిటి, ఆ పరమపద మేమిటని ప్రశ్న.

దాని నక్షరమని పేర్కొంటారు వేదవిదులు. అక్షరమంటే క్షరం కానిది. శబ్ద బ్రహ్మమని అర్థం. కర్మపరాయణులైన మీమాంసకులంతా శబ్దమే నిత్యమనీ అపౌరుషే యమనీ – అదే బ్రహ్మ స్వరూపమనీ – భావిస్తారు. శబ్దాన్ని మించిన ఈశ్వరతత్త్వాన్ని వారు అంగీకరించరు.

అలాగే యోగ శాస్త్రజ్ఞులని ఒక రున్నారు. వీరు రాగమనే చిత్తవృత్తిని జయిస్తే చాలు. అదే పురుష తత్త్వాన్ని చేరటానికి ఉపాయమని చెబుతారు. వీరి దృష్టిలో ప్రకృతి గుణాలకు సాక్షిగా నిలిచిన కేవల పురుషతత్త్వమే బ్రహ్మం.

పోతే వీరిద్దరూ కాక మూడవ వారొక్కరున్నారు. సగుణ విద్యోపాసకులు వారు. వీరు బ్రహ్మాన్ని ఉపాస్య దేవత రూపంగా భావిస్తారు. మరి తద్దేవతా ప్రసాదసిద్ధి కోసం జప తపాలూ - ఉప వాసమూ - బ్రహ్మ చర్యమూ ఇలాంటి నియమ వ్రతాలన్నింటినీ పాటిస్తూ పోతారు.

## 54

జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి - యద్జ్ఞాత్వా మృతమశ్నుతే
అనాదిమ త్పరమ్ బ్రహ్మ - నసత్తన్నాస దుచ్యతే 13-12

వీరందరూ ఒక ఎత్తు. ఇప్పుడు నాల్గవ వారొక ఎత్తు. వీరు మీ మాంసకులు కారు. యోగులు కారు. ఉపాసకులు కారు. మరి ఎవరు. జ్ఞానులు. వీరు బ్రహ్మాన్ని పరిశుద్ధమైన జ్ఞానంగా భావిస్తారు. జ్ఞానమూ అదే-జ్ఞేయమూ అదే వీరి దృష్టిలో. వెదుకుతూపోతే జ్ఞేయం, వెదకి అనుభవానికి తెచ్చుకొంటే అది జ్ఞానం. ఇదే యథార్థమైన దృష్టి. ఎందుకంటే ఇది సృష్టిలో మరి దేనినీ మిగల్చటంలేదు. అంతా ఒకే ఒక తత్త్వంగా ప్రతిపాదిస్తున్నది. తన్మూలంగా సాధకుడి కేకాత్మ భావం కుదిరి అది పరిపాకానికి వస్తే అమృతత్వమే సిద్ధిస్తుంది.

ఇంతకూ తేలిందేమిటి. సాధకుడు ప్రయత్నించి అందుకోవలసింది మరేదీ కాదు. అఖండమైన జ్ఞానం. దానికే బ్రహ్మమని నామాంతరం. అది ఎక్కడ ఉంది - ఎలా ఉందని-అడిగితే పొరబాటు. అది ఉందనీ చెప్పలేము. లేదనీ చెప్పలేము. ఎందుకని. ఉందని మాత్రం చెబితే లేని దదికాదా అని ప్రశ్న వస్తుంది. లేదని చెబితే ఉన్నది మాత్ర మది కాదా అని ఆక్షేపణ వస్తుంది. ఏది చెప్పినా అదిమాత్రమే అయిమరి ఒకటి కాకుండాపోయే ప్రమాదముంది. అందుచేత ఇది కాదని అదీ-అదికాదని ఇదీ-చెప్పామంటే రెండూ అదే అవుతుంది. అలా అయితేనే అది పరిపూర్ణం. కనుకనే అది సత్తనీ అసత్తనీ కూడా పేర్కొనలేమని వర్ణించటం.

సదసత్తులను గూర్చి మనం మొట్టమొదటనే చర్చించి ఉన్నాము. ఆ సందర్భంలో సత్తనేది జ్ఞానమనీ-అసత్తనే దంతా జ్ఞేయ మనిగదా ప్రతిపాదించాము.

Valluri Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

జ్ఞేయమని పేరేగాని చివరకది కూడా జ్ఞానవివర్తమే. కాబట్టి సద్రూపమైన జ్ఞానం కన్నా వేరుగాదు. అలాంటప్పుడిక బ్రహ్మతత్త్వాన్ని సదసద్రూపంగా పేర్కొన టంలో తప్పేముంది. అయితే ఎంతవరకంటే సత్తనేది దాని అసలు తత్త్వమైతే అసలైన ఈ జ్ఞేయ ప్రపంచమంతా దాని విభూతి. అంతేతేడా.

## 55

**సర్వతః పాణిపాదం త-త్సర్వతోక్షి శిరోముఖం**
**సర్వతః శ్రుతిమ ల్లోకే - సర్వ మావృత్య తిష్ఠతి॥ 13-13**

ప్రపంచమంతా దాని విభూతి అని ఎప్పుడన్నామో అప్పుడు దానికొక నామమూ- ఒక రూపమూ- ఒక క్రియా- ఇవి మూడూ వచ్చి పడ్డాయి. నామ రూపక్రియ లనేవి వాస్తవంలో లేవు పరమాత్మకు. కాని మనకవి నిత్యమూ దర్శనమిస్తున్నాయి. పరమాత్మతప్ప మరొక్క పదార్థమే లేనప్పుడివి ఎక్కడివి. ప్రపంచాని వంటావా. అసలు ప్రపంచమే లేదుగదా. మరి దేనివివి అని ప్రశ్న.

ఇది చాలా చిత్రమైన విషయం. బ్రహ్మతత్త్వం తప్ప మరొక్కటి లేదు. ఉన్నదది ఒక్కటే. పోతే దానికితోడు ఈ నామరూపాలనేవి కనిపిస్తున్నాయి. కనిపించే వాటిని కాదనలేము. అలాంటప్పుడివి దేనివై ఉండాలి ఈ నామ రూపాలు, ఆ బ్రహ్మానివే అయి ఉండాలి సందేహం లేదు. అంటే అప్పటికే మన్న మాట. మన మిప్పుడు నామరూపాలని ఏవి మనచుట్టూ పరచుకొని ఉన్నట్టు చూస్తున్నామో అవి ఈ ప్రపంచానివి కావు. ప్రపంచమనేది వేరే ఒక పదార్థముండి దానికి నామరూపాలంటూ లేవు. బ్రహ్మం తాలూకు నామ రూపాలనే ప్రపంచానివిగా భ్రమిస్తున్నాము మనమంతా. అది కేవలం మన భ్రమే. ఎలాంటిదంటే ఇది-మృత్తిక తాలూకు నామరూపాలనే ఘటం తాలూకు వంటూ చూడటం లాంటిది. మృత్తికకు భిన్నగా ఘటమెక్కడ ఉంది. మృత్తిక రూపమే వాస్తవానికి ఘటమనేది. అలాగే పరమాత్మ రూపమే ప్రపంచమనే పేరుతో మనకు కనిపిస్తూ ఉంది.

దీనినిబట్టి పరమాత్మకు కండ్లూ ముక్కులూ చెవులూ కాళ్ళూ చేతులూ ఇలా చిలవలు పలవలు పెట్టి వర్ణించారంటే అది సమంజసమే. ప్రపంచమంతా ఆయన రూపమే అయినప్పుడందులో ఉండే అన్ని హంగులూ ఇక ఆయనవే గదా. ఆయనవే ఇవన్నీ అని చెప్పటంలో ఏమిటి ఉద్దేశ్యం నిజంగా ఆయన

కివన్నీ ఉన్నాయని గాదు. ఆ మాటకు వస్తే ఈ నామరూపాదులేవీ లేవాయనకు. అది నిర్గుణమైన తత్త్వం. ఆ తత్త్వానికి బాహ్యంగా మరేదీ లేదు వాస్తవానికి. అయినా ఏదో ఉన్నట్టు చూస్తున్నాము మనం. తత్కారణంగా దీని కధిష్ఠానమైన Base అ తత్త్వం మనకు బాగా దూరమైపోయింది. ఇప్పుడు దాన్ని మరలా జ్ఞాపకం చేసుకోవాలంటే ఈ చూచే నామరూపాలన్నీ ఏవో గావు-దాని విభూతే Manifestationనని దాని కారోపించి చూడాలి మనం. చూస్తే ఈ ఉపాధుల మేరకే నిలిచిపోక మన దృష్టి దీనికి విలక్షణంగా దీనికి మూల భూతమైన ఆతత్త్వాన్ని పట్టుకోగలదు. ఇది పాణి పాదాది సావయవమయితే అది నిరవ యవం. ఇది సాకారమైతే అది నిరాకారం. ఇది ఆవృతమైతే అది అనావృత మయి వీటన్నిటినీ ఆవరించింది. ఇది మనకు విషయమయితే అది అవిషయం. ఇలా అనాత్మ ప్రపంచానికి విలక్షణంగా ఆత్మతత్త్వాన్ని మనం జ్ఞప్తికి తెచ్చు కోటానికీ నామరూపాది వర్ణన మనకు తోడ్పడుతూంది. అనేకత్వాన్ని Analy-sis వర్ణించట మప్పటికి ఏకత్వాన్ని Synthesis గ్రహించటానికే నన్నమాట.

## 56

**సర్వేంద్రియ గుణా భాసం-సర్వేంద్రియ వివర్జితం**
**అసక్తం సర్వభృ చ్చైవ-నిర్గుణం గుణ భోక్తృచ** **13-14**

ఇంతకూ ఎప్పుడూ ఉన్నదొక పరిపూర్ణ చైతన్యమే. అదే నామరూపాత్మక మైన ప్రపంచంగా తన మాయాశక్తి చేత ఇలా భాసిస్తూ ఉంది. అంచేత మన ఇంద్రియాలూ ఇంద్రియ గుణాలూ వాటి కాశ్రయమైన ఈ శరీరాలూ-వీటికి బాహ్యంగా గోచరించే శబ్దస్పర్శాదులైన విషయాలూ వాటి కధిష్ఠానమైన ఈ ప్రపంచమూ-అంతా దాని ఆభాసే. అంటే అదే ఈ రూపంలో కనిపిస్తూ ఉంది గాని ఇది వేరే ఒక పదార్థంగా ఎక్కడా లేదు.

వేరుగా లేదు గనుకనే దానికి ఈ కరచరణాదులేవో ఉన్నాయని భావించడం కూడా పొరబాటే. వాస్తవంలో దానికి ఇంద్రియాలూ లేవు. ఇంద్రియ గోచరమైన ప్రపంచమూ లేదు. ఇవి ఏవీ లేకపోతే దానికిక దేనితో మాత్రం సంగ మేముంది. దానినిది భరించటమేముంది. రెండవ పదార్థమంటూ ఒకటి ఉంటే గదా. ఆ ఉన్నదని మనం చూచేది కూడా అదే ఆయె. అంచేత అది వాస్తవానికి నిర్గుణం. ఏ గుణాలూ లేవుదానికి. ఐతే చమత్కారమేమంటే ఉన్నట్టుగా కనిపిస్తాయవి. అది దాని యోగమాయా విలాసమే గాని మరేదీ కాదు.

# 57

**జ్యోతిషా మపితజ్జ్యోతి - స్తమసః పర ముచ్యతే**
**జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం-హృది సర్వస్య విష్ఠితం** **13-17**

కనేకనే అది భావరూపమై గూడా Positive దానికి భిన్నమైన అభావాన్ని Negative సృష్టించగలిగింది. భావం కేవల చైతన్యమైతే అభావమే చరాచర ప్రపంచం. ఇదంతా తమస్సేగాని జ్యోతిస్సు కాదు. తమస్సంటే చీకటి. చీకటి వెలుగుకంటే విలక్షణంగా ఏదో ఒక నల్లని పదార్థంలాగా కనిపిస్తుంది. అది వెలుగును చూడనంతవరకే. చూస్తే అది ఎక్కడా కానరాదు. ఎక్కడా కానరాక ఎక్కడికి పోయినట్టది. ఎక్కడికీ పోలేదు. పోవటానికి కాళ్ళూ చేతులూ లేవు దానికి. అయితే ఏమయిందది. అది ఒకటి ఉంటేగదా ఏమైనా కావటానికి. వెలుగు తాలూకు అభావమే చీకటి అంటే. భావం లేకపోవటమే అభావం. ఉంటే అభావమనే మాట ఎక్కడిది. అదీ భావమే అవుతుంది. అంటే అప్పటికి వెలుగే చీకటన్నమాట. అయితే చీకటిగా చూడటం ప్రతిలోమం. వెలుగుగా చూడటం అనులోమం. అనులోమంగానే చూడాలి మనం. అప్పుడు ప్రతి లోమం కూడా అనులోమంగానే దర్శనమిస్తుంది. ఇదే సత్యమైన దర్శనం.

ప్రస్తుత మీనామ రూపాత్మకమైన జగత్తు కూడ ఒక చీకటి లాంటిదే. చైతన్య మనేది వెలుగైతే ఇది దానికి విలోమంగా ఏర్పడినది చీకటి. దీనిని భేదించాలంటే మరలా దీనిని ఆ వెలుగుగానే భావించాలి సాధకుడు. అంటే నామరూపాల నన్నింటినీ సచ్చి ద్రూపంగానే మార్చుకొని చూడడం నేర్చుకోవాలి. అలా చూడగలిగితే అప్పుడు జ్ఞానమని జ్ఞేయమని తేడా ఉండదు. వెలుగు చీకట్లు ఏకమైనట్టు రెండూ ఏకమై జ్ఞానంగానే పరిణమిస్తాయి. తద్వారా మనమందు కోవలసిన గమ్యం కూడా ఎక్కడోలేదు. అదీ ఈ జ్ఞానమేనని అవగాహన అవుతుంది. దీనికే ఏకాత్మ భావ Subjective one ness మని పేరు.

అయితే ఇది ఎక్కడ ఉంది ఈ భావం. ఎక్కడోకాదు. మానవుడి హృదయం లోనే ఉంది. నేను శుద్ధ చిద్రూపుణ్ణి నేను చూచే సమస్తమూ కూడా చిద్రూపమే అనే భావం నాలో కాక మరెక్కడ ఉంటుంది. ఎక్కడో ఉంటే నేను భావించట మనేది ఎలా పొసగుతుంది. కాబట్టి నాలోనే ఉంది ఆ భావం.

# 58

**సమం పశ్యన్హి - సర్వత్రసమవస్థిత మీశ్వరం**
**న హినస్త్యాత్మ నాత్మానం-తతో యాతి పరాం గతిమ్ 13-28**

అలాగే నాలో మాత్రమే ఉండి మరెక్కడా లేకపోయినా సుఖంలేదు మరలా. నేనేగాక నేనుచూచే దంతాకూడా అదేనని గదా పేర్కొన్నాము. అలాంటప్పుడది నాలోపల ఎలా ఉందో వెలపలకూడ అలాగే వ్యాపించి ఉండాలి. లేకపోతే అంతా అదేననే మాట కర్థంలేదు.

కాబట్టి మొదట తనలో ఉన్నట్టు అర్థంచేసుకొన్న తరువాత అదే ఈ ప్రపంచ మంతా సమానంగా పరచుకొని ఉన్నట్టు చూస్తుండాలి. ఎక్కడా ఎక్కువగా లేదు. తక్కువగా లేదు. నిరాకారమైన పదార్థంలో హెచ్చుతగ్గులు రావెప్పుడూ. ఆకాశ మిప్పుడంతటా వ్యాపించి ఉంది. దానిలో హెచ్చుతగ్గులేమున్నాయని. అలాగే ఈ చైతన్యంకూడా సమంగానే ఉంది సర్వత్రా. అలాగే సమదృష్టితో చూడాలి దాన్ని.

చూస్తే ఏమవుతుంది. ఆత్మకు ఆత్మ బాధకం కాకుండా పోతుంది. చైతన్య మనేది ఆత్మ. అది విషయం కాదు మనకు. విషయి. అంటే మన స్వరూపమే. స్వరూపమంటే ఆత్మఅనే అర్థం. ఆత్మ ఎక్కడ ఉంది. మనలోపలా ఉంది వెలపలా ఉంది. అంటే లోపలా నేనేవెలుపలా నేనే అనే విస్తృతమైన భావనతో చూడాలి మనం. అప్పుడే అది విశ్వాత్మ లేక పరమాత్మగా మన అనుభవానికి వస్తుంది. అలాకాక అదినా లోపలే చూచి వెలపల చూడలేక పోయాననుకోండి. అప్పుడా వెలపలిది అనాత్మగా మారి దీన్ని బాధిస్తుంది. బాధించటమేమిటని అడగవచ్చు. శరీరం లోపలే ఉందనుకొన్నాము కాబట్టి శరీరం పోయేసరికి అదికూడా ఎక్కడికో పోతుందని భ్రాంతిపడతాము. అదే చావు.

ఇలా మన చావుకు దారితీస్తుంది కనుకనే అది దీనికి బాధకమని చెప్పటం. ఎప్పుడయితే వెలపలకూడా నేనే ఉన్నాను-నాకంటే భిన్నంగా ఎక్కడా ఏదీ లేదని విస్వసించానో-అప్పుడంతా ఆత్మేఅవుతుంది. కాబట్టి ఏదీ నాకు బాధకం కాదు. ఆత్మను ఆత్మ ఎలా బాధిస్తుంది. సంకుచితంగా చూస్తే మాత్రం బాధిస్తుంది. ఎందుకంటే సంకుచితమనే సరికి కొంత మాత్రమే ఆత్మగా నిలిచి మిగతాదంతా అనాత్మగా మారుతుంది. అప్పుడది బాధకం. విశాలంగా చూచామంటే అనా

Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

త్మగా మారటానికి వీలు లేదు. కాబట్టి అప్పుడిక బాధకమనే ప్రసక్తేలేదు. లేకపోతే మరణమే లేదు మానవుడికి.

మరణం లేకపోతే పోవచ్చు. కాని వాడే మవుతాడనే ప్రశ్న రావచ్చు మరలా. వాడేమీ కాడు. వాడంటే కేవల చైతన్య స్వరూపుడే కాబట్టి మొదటినుంచీ ఎలా ఉన్నాడో అలాగే అప్పుడూ ఉండిపోతాడు ఎలా అన్నాడు మొదటినుంచీ. సర్వ వ్యాపకమై పరిశుద్ధమై కూటస్థమైన చైతన్యంగా గదా ఉన్నాడని వర్ణించాము. ఆ తత్త్వాని కెప్పుడూ మార్పనేది లేదు. మార్పు లేకుంటే మరణం లేదు. దానినే పరమ పద మన్నారు. ఇదుగో ఆ పదంలోనే కదలకుండా శాశ్వతంగా ఉండి పోతాడు సాధకుడు.

ఇతి

సాధక గీతాయామ్ పూర్వార్థమ్

సమాప్తమ్

# సాధకగీత

## 59

ధ్యానేనాత్మని పశ్యంతి-కేచి దాత్మాన మాత్మనా
అన్యే సాంఖ్యేన యోగేన-కర్మయోగేన చాపరే॥ 13-24

అయితే ఇది అందరూ అందుకొనేది కాదీ ఫలం. నూటికి కోటికి ఏ మహనీయుడికోగాని అబ్బదు. అలాంటి వాడికే జ్ఞాని అని పేరు. జ్ఞాని అయిన వాడు ఆత్మతో ఆత్మను ఆత్మలోనే చూస్తాడు. ఇది చాలా గంభీరమైన మాట. మనమిప్పుడు చెప్పుకొన్న అర్థమంతా ఇమిడి ఉంది ఈ మాటలో.

అంతా ఆత్మేకాబట్టి ఆత్మలోనే చూడాలి ఎక్కడ చూచినా చూచేదికూడా ఆత్మేకాబట్టి ఆ ఆత్మతోనే చూడాలి ఎప్పుడయినా. అలాగే చూడబడేదికూడా అదే కాబట్టి ఆత్మనే చూడాలి ఎవడయినా. అంటే ఏమన్నమాట. చూచేవాడు-చూడబడేది-చూచే పద్ధతి-మూడూ ఆత్మే. చూచేవాడే అంటే అది లోపల. చూడబడేదే నంటే వెలపల. చూడటమంటే ఆరెంటికీ మధ్య. మూడూ ఒక్కటే ననేసరికి లోపల-వెలపల-నడుమ అనేతేడా లేకుండా అంతా కలిసి ఒకేక ఆత్మచైతన్యమని చెప్పినట్టయింది. ఇలా కలిసినట్టే తన స్వరూపాన్ని ఎవడు పట్టుకొంటాడో వాడే జ్ఞాని. వాడే పూర్ణపురుషుడు.

ఇది ఎంత రాజమార్గమయినా అందరికీ సాధ్యమయేది కాదని ముందే చెప్పాము. అయితే సాధ్యంకాదని ఊరక కూచోరాదు. కూచోరుకూడా మానవులు. ఎవరి అంతస్తుకు తగినట్టు వారు సాధన చేస్తూనే ఉంటారు. అయితే దానిలో ఉత్తమ మధ్యమ-మంద-అతి మంద అనే అధికార భేదం మాత్రముంటుంది. అన్నిటికన్నా ఉత్తమమైన మార్గమే మన మిప్పుడు పేర్కొన్న జ్ఞానమార్గం.

పోతే రెండవదయిన మధ్యమ మార్గమొకటి ఉంది. దానినే సాంఖ్యమని వ్యవహరిస్తారు. సాంఖ్యమంటే వివేచన. ప్రపంచమంతా త్రిగుణాత్మకం. నా స్వరూపం త్రిగుణాల కతీతమయిన కేవల పురుషతత్త్వం. అలాంటి తత్త్వాన్ని దీని బారినుంచి తప్పించి నేను దీన్ని దూరం చేసుకోవాలి. చేసుకొంటే అప్పుడు నా సహజ రూపంతో నేను ఉండిపోతాను. త్రిగుణాలు నాకు దూరమవుతాయి. కాబట్టి వాటి బాధ నాకు లేకుండా పోతుంది. అని ఇలా ప్రకృతి పురుష వివేచన చేసి చూడటం సాంఖ్యమంటే. ఒక విధంగా ఇది ప్రసంఖ్యాన రూపమయిన ఉపాసన లేదా భక్తిమార్గం క్రిందకి వస్తుంది.

పోతే మూడవది కర్మ మార్గం. కర్మమంటే పనిచేయటం. మామూలుగా చేస్తే అది కేవల కర్మేగాని యోగం గాదు. యోగమే కావాలంటే చేసే ప్రతి పనీ తనదిగా భావించక సాధకు డీశ్వరార్పణ బుద్ధితో చేయాలి. అంటే కర్తృత్వ భోక్తృత్వాలు రెండూ తనకు లేకుండా చేసుకోవాలని భావం. అలా చేసుకొంటే అది స్వకర్తృకంగాక ఈశ్వర కర్తృకమవుతుంది. తానా ఈశ్వరుడికొక భృత్యుడి మాదిరయి ఆయన తరఫున తానది నెరవేరుస్తున్న భావమేర్పడుతుంది. దానివల్ల ఏ ఫలితం కల్గినా తనది కాదిక. ఈశ్వరునిదే. ఇదే కర్మయోగమనే మూడవ మార్గం మందాధి కారులది.

## 60

**అన్యేత్వేవ మజానంతః - శ్రుత్వాన్యేభ్య ఉపాసతే**
**తేపిచాతి తరం త్వేవ - నిత్యం శ్రుతి పరాయణాః 13-25**

పోతే నలుగవదైన మార్గానికి కూడా చెందిన వారనేకులున్నారు. వారతి మందులు. స్వయంగా ఏదీ భావన చేయలేరు. గ్రహించలేరు. కాని పెద్దలు చెప్పిన దేదయినా విని దాని కనుగుణంగా నడుచుకొనే స్వభావమున్నది వారికి.

గ్రుడ్డికన్నా మెల్లమేలన్నట్లు అది కూడా కొంత మంచిదే. జ్ఞానం లేదేగాని వారికి శ్రద్ధాభక్తులున్నాయి. స్వయంగా చేయలేరే గాని చెబితే చేస్తారు. చేసేది మంచి పనే కాబట్టి అలా చేస్తూ పోతే కొంత కాలానికి చిత్తం శుద్ధమవుతుంది. అంటే రజస్తమస్సులు పోయి సత్త్వం మిగులుతుందని అర్థం. సత్త్వమెప్పుడు ఆవిర్భవించిందో అప్పుడు జ్ఞానమనేది తప్పకుండా ఉదయిస్తుంది. "సత్త్వా త్సంజా యతే జ్ఞాన"మని గీతా భగవానుడు హామీ ఇచ్చాడు. ఇక్కడ రజస్త మస్సులు నశించటం క్షేత్రాన్ని తయారు చేయటమైతే - సత్త్వం పరిశుద్ధం కావటం బీజావాపం లాంటిది. పోతే జ్ఞానోదయ మనేది ఆ బీజంలో నుంచి అంకురం మొలకెత్తటం వంటిదని భావించాలి మనం.

## 61

**నేహాభిక్రమ నాశోస్తి - ప్రత్యవాయోన విద్యతే**
**స్వల్పమప్యస్య ధర్మస్య - త్రాయతే మహతో భయాత్ 2-40**

ఇంతకూ ఏ మార్గాన్ని అవలంబించినా మనకు మోసంలేదు. ఉత్తమం మొదలుకొని అతి మందం దాకా అన్నీ సాధనలో మార్గాలే. కేవలం లౌకికంగా బ్రతికిపోయే దానికంటే సాధనలో అడుగుపెట్టడం మంచిదేగదా. అసలు పెట్ట కుంటేనే ముప్పుగాని పెట్టినప్పటి నుంచీ అంతో ఇంతో ఫలితముండనే ఉంది సాధకుడికి.

అంతేకాదు. ఏ పని అయినా లోకంలో కొంతదూరం చేసి మధ్యలో వదిలేస్తే దానివల్ల నష్టపోతాము. ఒక వ్యవసాయమే ఉందనుకోండి. రైతు పొలాన్ని బాగా దున్ని పదునుచేసి సకాలంలో విత్తనాలు చల్లి తరువాత దాని జోలికిపోకుండా ఉపేక్షించాడంటే చాలు. పంట చేతికి రాకపోగా అంతకు ముందు తాను చేసిన కృషి కూడా వ్యర్థమవుతుంది.

ఇంకా ఒకటి ఉంది లోకంలో. ఒకటి అసటు ఆరంభించక పోయిన ప్రమా దమే. సత్ఫలితం లేకపోవడమే కాక దుష్ఫలితం కూడా ఏర్పడవచ్చు దాని మూలంగా. ఒక రోగానికి దగిన చికిత్స చేయక ఉపేక్షిస్తే అది మన కనర్థదాయ కమేగదా. ఇది లోకవ్యవహారంలో ఎలాగో-శాస్త్ర వ్యవహారంలో కూడా అలాగే. దీనికే ప్రత్యవాయమని పేరు. మన విధులు మనం చక్కగా నిర్వర్తించకపోతే దాని వల్ల మంచి జరగక పోవడం దేవుడెరుగు ఎన్నో అవాంతరాలను కూడా ఎదుర్కోవలసి వస్తుంది.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఇలాంటి కష్టనష్టా లేవీ లేవు ఈ సాధన మార్గంలో. ఇందులో చేసిన కృషి ఎంత స్వల్పమైనా అది చెడిపోదు. చేయకపోతే దానివల్ల ప్రత్యవాయ దోషం లేదు. చేసింది కొంచెమైనా కాలాంతరంలో చాలా పెద్ద విపత్తు నుంచి మనలను కాపాడుతుంది. అంచేత మానవుడై పుట్టి కృషి చేయనివాడు పాపాత్ముడు. కొంత చేసి వెనుకకు తగ్గినవాడు అంత కన్నా అవివేకి. పోతే కృషి చేయవలసిందే. అది ఫలిత మిచ్చేదాకా సాగించవలసిందేననే మనమర్థం చేసుకో వలసి ఉంది.

## 62

**వ్యవసాయాత్మికా బుద్ధి-రేకేహ కురునందన**
**బహు శాఖా హ్యనంతాశ్చ-బుద్ధయోవ్యవసాయినామ్ 2-41**

అయితే ఈ కృషి లేదా సాధన అనేది నాలుగు విధాలుగా పేర్కొన్నాము. అన్ని మార్గాలూ ఉపాదేయాలే నని చెప్పాము. కానీ ఇందులో సాధకుడు గమనించవలసిన రహస్యమొకటి ఉన్నది. అన్నీ మంచివే అయినా వాటిలో జ్ఞాన మనేది అన్నిటికన్నా ఉత్తమ మనే మాట మరచిపోరాదు. దానికి నోచుకోగలిగితే మిగతా మూడూ అక్కర లేదసలు. దానిలోనే అవి కూడా కలిసి వస్తాయి. అందుకు ఎప్పుడు నోచుకోలేదో అప్పుడే ఇవి మూడూ యథా శక్తిగా ఒక్కొక్కటీ ఆశ్రయించవలసి వస్తుంది.

నాలుగూ మార్గాలే అంటూ మరలా జ్ఞానమే గొప్ప దెలా అయిందని అడగవచ్చు. అది వ్యవసాయాత్మకం. వ్యవసాయమంటే దృఢమైన నిశ్చయం. అంతా ఆత్మ చైతన్యమే. జ్ఞేయమైన ఈ ప్రపంచమూ అదే-జ్ఞాత అయిన ఈ జీవుడూ అదే-అనే దృష్టి అది. ఇలాంటి దృష్టి ఎప్పుడూ మారేదికాదు గనుక అది ఏక రూపంగానే ఉంటుంది. ఈ విధంగా వ్యవసాయాత్మకమూ ఏక రూపమూ అయింది కాబట్టి జ్ఞానమనేది మోక్షానికి సాక్షాత్తుగా సాధన మవుతుంది.

పోతే మిగతా మూడు ఇలా సాక్షాత్తుగా సాధనాలుకావు. కారణం వాటి మూడింటిలోనూ జ్ఞాతృజ్ఞేయ భేదముంది. భేదదృష్టి ఏ మాత్రమున్నా అది గమ్యానికి దూరమే. గమ్యమనేది సర్వాత్మ భావమే గదా. అది అభేదరూపమే గాని భేద రూపంకాదు. భేదంతో అభేదాన్ని ఎలా అందుకోగలం. భేదమెప్పుడూ ఒక్క భేధంతో నిలవదు. అది మరొక భేదానికి అది మరొకదానికి దారి తీస్తుంది. అన్నీ కలిసి శాఖోప శాఖలై అసంఖ్యాకంగా పెరిగిపోతాయి. ఆ చక్రంలో పడి

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

పోయామంటే ఇక అంతూ అకాశమూ లేదు. పరమ పదానికి అంతకంతకూ దూరం కావటమే తప్ప దగ్గర పడటమంటూ ఉండబోదు.

అయితే ఇంత అనర్థం కలిగేట్టయితే అవి అసలు సాధన మార్గాలెలా కాగలిగాయని మరలా ప్రశ్న రావచ్చు. మార్గ మంటే సాక్షాత్తుగా కాదని పేర్కొన్నాము. సాక్షాత్తుగా కాకపోయినా పరం పరగా సాధనాలవుతా యవి భేదాన్ని బోధించేవి పరంపరగా మాత్రమెలా సాధనా లవుతాయి అని అడగవచ్చు. అదే చిత్రం. భేద రూపమే అయినా అవి- పరతత్త్వాన్ని దృష్టిలో ఉంచుకొనే అనుసరిస్తున్నాము కాబట్టి తన్మూలంగా చిత్త శుద్దినీ- ఏకాగ్రతనూ - ప్రసాదిస్తాయి. పరిశుద్ధమూ నిశ్చలమూ అయిన చిత్తం జ్ఞానోత్పత్తికి యోగ్యమవుతుంది. ఆ జ్ఞానం వల్ల సాయుజ్యం లభిస్తుంది. ఇలా భేద రూపమైన నిష్కామ కర్మాదులు చివరకు జ్ఞానం ద్వారా మోక్షానికే తోడ్పడుతున్నాయి కాబట్టి పరంపరగా అవీ సాధనా లేనని చాట వలసి వచ్చింది. అంతేగాని నిజానికి జ్ఞాన మనేది ఒక్కటే ఖచ్చితమైన సాధన మార్గం.

## 63

నహిజ్ఞానేన సదృశమ్ - పవిత్ర మిహ విద్యతే
**తత్స్వయమ్ యోగ సంసిద్ధః - కాలే నాత్మని విందతి 4-38**

అసలు జ్ఞానంతో సమానమయింది మరేదీ లేదీ సృష్టిలో. ఎందుకంటే సృష్టి కర్త జ్ఞాన స్వరూపుడు. "ప్రజ్ఞానం బ్రహ్మ" అని గదా ఉపనిష ద్వాక్యం. అలాంటి సృష్టికర్తవల్ల ఏర్పడిన సృష్టి కూడా జ్ఞానస్వరూపమే. సువర్ణం వల్ల ఏర్పడిన ఆభరణం సువర్ణంకాక మరొకటి ఎలా అవుతుంది. అలాగే సృష్టి కూడా జ్ఞాన స్వరూపమే. పోతే సృష్టికర్తను అన్వేషించే సాధనంకూడా మరొకటి కావటానికి వీలులేదు. అది కూడా జ్ఞానమే కావలసి ఉంది. అవి రెండూ ఒక్కటే నని గ్రహించటమే గదా జ్ఞానమంటే. కాబట్టి జ్ఞానమే ఏకైక మార్గం. మరేదీ గాదు.

అది ఏకైకమే కాక పవిత్రం కూడా. మాలిన్యాన్ని తొలగించే దేదో అదే పవిత్రం. మాలిన్యం మనకీ అనాత్మప్రపంచమే. నామ రూపాత్మకమయిన ఈ ప్రపంచమంతా పూర్తిగా తొలగి పోవాలంటే అది కర్మో పాసనాదులవల్ల దేని వల్లా సమకూరేది కాదు. కారణ మేమంటే అందులో భేద వాసనలు అంతో ఇంతో వ్యాపించి ఉంటాయి. ఒక్క జ్ఞానంలోనే అలాంటి భేద దృష్టి లేనిది. అందుచేత పావనమైన మార్గం కూడా అదే.

అయితే ఇక మిగతా మార్గాలు దేనికి. వాటన్నిటికీ తిలాంజలి ఇచ్చి జ్ఞాన మార్గాన్ని పట్టుకొంటే సరిపోదా అంటే సరిపోతుంది వాస్తవానికి. సందేహం లేదు. అయితే అది ఉత్తమాధికారి మాత్రమే చేయగలడు. ఉత్తమాధి కారు లెందరున్నారు లోకంలో. వేళ్ళమీద లెక్క పెట్టవచ్చు. మిగతా జన బాహుళ్య మంతా మంద మధ్యముల జాబితాలో చేరినవారే అలాంటి వారొక్కసారిగా ఈ భూమికకు లంఘించలేరు. సోపాన క్రమంలో ప్రాకి చేరవలసి ఉంటుంది. ఈ సోపానాలే కర్మ-ఉపాసన-సమాధి-ఇలాంటి వన్నీ.

వీటి మూడింటినీ కలిపి ఒక్క మాటలో వర్ణిస్తే అది యోగం. ఈ యోగాన్ని మొదట కొంతకాలం యథాశక్తిగా అనుష్ఠిస్తూ పోవాలి మానవుడు. దానితో బాగా సిద్ధి కలుగుతుంది. సిద్ధి అంటే ఇక్కడ శుద్ధి అని అర్థం. ఆవరణ విక్షేప శక్తుల విజృంభణ అణగారి పోవటమే శుద్ధి. తన్మూలంగా సత్త్వం బాగా పెరిగి కొంత కాలానికి అప్రయత్నం గానే అది జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

## 64

**కర్మణ్యే వాధి కారస్తే - మా ఫలేషు కదాచన**
**మా కర్మఫల హేతుర్భూ - ర్మాతే సంగో స్త్వకర్మణి 2-47**

యోగానికీ జ్ఞానానికీ ఇలాంటి అవినా భావ సంబంధ మొకటి ఉంది. యోగం పరిపాకానికి వస్తే గాని జ్ఞానమనేది ఉదయించదు. కాబట్టి జ్ఞానమే గదా కావలసింది-ఈ కర్మలు దేనికని నిరసించరాదు అది నేల విడిచిన సాము అవుతుంది. కర్మలు చేయవలసిందే. మానరాదు. అయితే మామూలుగా మనం ప్రతిరోజూ చేస్తూ ఉన్న పద్ధతిలో చేయరాదు.

మరి ఎలా చేయాలంటారు. కర్మ కర్మగానే చేయాలి. అంటే ఈ పనిచేస్తే నాకీ ఫలితముంటుందని ఫలితం మీద ఆశపెట్టుకొని చేయరాదు. అలా పెట్టు కొంటే ఆ ఫలితం మనకనుకూలం కావచ్చు. ప్రతికూలం కావచ్చు. అనుకూల మైతే పొంగిపోతాము. ప్రతికూలమైతే క్రుంగిపోతాము. ఏదైనా చావు జంపులే. ఆ ఫలితమే మనలను బంధిస్తుంది. కర్మ ఫలానికి మన మెప్పుడూ నిమిత్తం కాగూడదు. అయితే అది సంగమే.

అలాగని అసలు కర్మనే మాని వేయరాదు! మానితే అది సోమరితనమవు తుంది. పైగా దుష్కర్మా సత్కర్మా రెండు మానివేశాము కాబట్టి సాధనకే అస్కారం లేదు. సాధన చేస్తే గదాసిద్ధి. సిద్ధి మనకిక్కడ జ్ఞానోదయం. జ్ఞాన ముదయించా

లంటే దానికి సాధనచేసి తీరాలి. సాధన అంటే అదీ ఒక కర్మేగదా. మరికర్మ విడిచిపెడితే అది ఎలా సమకూరుతుంది మనకు.

కనుక కర్మ అనేది అసలు బొత్తిగా మానరాదు. చేస్తే అంతా నా కను కూలంగా జరగాలనీ చేయరాదు. కర్మఫలాన్ని ఈశ్వరుడికి ఒప్పజెప్పి కేవలం ఇది నాకు కర్తవ్యమనే తలంపుతో మాత్రమే చేయాలి. దీనికే నిష్కామ కర్మయోగ మనిపేరు. దీనివల్ల కర్తృత్వ భోక్తృత్వాలనే రెండనర్థాలూ తొలగి పోతాయి సాధకు డికి. ఎలా గంటే నేనుకాదు చేయటం-ఈశ్వరశక్తి నా చేత చేయిస్తూందనే భావంతో కర్తృత్వం పోతుంది. దీనివల్ల ఏ ఫలిత మేర్పడినా అది నాకు అక్కర లేదనే దృష్టితో భోక్తృత్వం నశిస్తుంది. ఇవి రెండూ రెండు కోరలు. కర్మమనే కాల సర్పానికి. అవి రెండూ నిష్కామమనే పట్టుకారుతో లాగివేస్తే అది ఒక స్వరూపంతో కనబడుతున్నా ఏమీ చేయలేదు.

## 65

యః సర్వత్రా నభిస్నేహ-స్తత్ త్ప్రాప్య శుభా శుభం
నా భినందతి నద్వేష్టి-తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా 2-57

కానీ ప్రతివాడూ డప్పాలు కొడుతుంటాడు-నేను నిష్కామ కర్మ చేస్తున్నాను-నాకు దేనిమీదా ఆసక్తి లేదని, పైకి చెప్పటం వేరు, యథార్థంగా ఉండటం వేరు. మానలవుందరికీ ఒక నైజం ఉన్నది. యథార్థాన్ని మరుగుపరచి అయథా ర్థాన్నే లోకానికి ప్రదర్శించటం. ఇలాంటి ప్రదర్శనవల్ల అణుమాత్రంకూడా మనకు ప్రయోజనం లేదు. ప్రయోజనం లేకపోగా పెద్దమోసమిది. ఎక్కడయినా చెల్లుతుందేమో గాని ఆధ్యాత్మిక రంగంలో మోసమనేది ఏ మాత్రము చెల్లదు. మాటలలో ఎన్ని చెప్పినా చేతలలో తప్పకుండా బయటపడతాడు.

ఇంతెందుకు. నీవు నిష్కాముడ వైనందుకు ఒక్కటే గుర్తు. జీవిత మనేది ఒకే విధంగా గడవదెవ్వరికీ, కష్టాలువస్తుంటాయి. సుఖాలు వస్తుంటాయి అవీ ఎన్నో విధాలుగా ఎన్నో మోతాదులలో సంప్రాప్తిస్తుంటాయి. గుక్క తిప్పుకోవ టానికి వీలు లేని పరిస్థితులు ఏర్పడతాయి. గుండె పగిలి పోయే సంఘటనలే సంభవిస్తాయి. అలాగే ఆత్యుత్సాహంతో ఉబ్బి తబ్బిబ్బులయ్యే ఆనందం కూడా కలుగుతుంది. ఇలాంటి సందర్భాలలోసాధకుడే మాత్రమూ క్రుంగిపోరాదు. పొంగిపోరాదు. వచ్చింది వచ్చినట్టుగా స్వీకరించాలి. అదే భగవంతుడిచ్చిన ప్రసాదంగా భావించాలి.

ఇది వాడి మనస్సులోనూ మాటలోనూ అయితే లాభంలేదు. మనసూ మాటా అనేది మనం చొచ్చి చూడలేము. ప్రవర్తనలో కనిపించాలి ప్రతిఒక్కటీ. ప్రవర్తన నెవ్వడూ కప్పివుచ్చలేడు. మరిదేనిలో బయట పడకపోయినా దానిలో తప్పకుండా బయటపడుతుంది. ఏదీ అలా ఎందరున్నారు సత్ప్రవర్తన కలవారు, స్వాముల వార్ల దగ్గర నుంచీ సామాన్యుల దాకా అందరూ దొంగలే. ఆత్మ వంచకులే. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే ఎగిరి గంతులు వేస్తారు. ఏ మాత్రం దానికి భిన్నంగా జరిగినా క్రుంగి కృశించి పోతారు.

ఇలాంటి పాటు పోటులు లేకుండా తాపీగా ఉండాలంటే జీవితం- అభిస్నేహ ముండరాదు దేనిలోనూ. అభిస్నేహ మంటే అభిమాన బుద్ధి ఇది నా సర్వస్వమనే తాదాత్మ్యభావం. అదే అనుకూల ప్రతికూలాలనే వైషమ్యానికి పునాది. మనస్సులోనే పెకలించ గలగాలి ఆ పునాదులను మనం. పెకలిస్తే ఇక మాటా చేతావాటి పాటికవే నిర్మలమవుతాయి. నిర్మలమూ నిబ్బరమూ అయిన ప్రవర్తన ఉన్న సాధకుడికి ఏది ఎలా జరిగినా ఒక్కటే. మంచి జరిగితే అభినందించడు. చెడ్డ జరిగితే నిందించడు. రెంటికీ అతీతంగా కనబడతాడు.

## 66

న కర్మణా మనారంభా - న్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే
నచ సన్న్య సనా దేవ - సిద్ధిం సమధిగచ్ఛతి 3-4

అయితే ఒక అశంక. ఇంత అసిధారావ్రతం చేసేదానికన్న అసలీ కర్మల నేమీ అనుష్ఠించకుండా ఊరక కూచుంటే సరిపోలేదా. దానివల్ల మనకిక ఏబాధా లేదు గదా - అని అడగవచ్చు.

వాస్తవమే. ఏకర్మా ఆరంభించకపోతే మంచిదే. కానే అంత మాత్రాన అది నైష్కర్మ్య మనుకోరాదు. నైష్కర్మ్య మంటే ఏకర్మా లేకపోవటం. కర్మ అనేది ఏ ఒక్కటీ చేయకపోతే అది మనకు దక్కాలి వాస్తవంలో. కానీ దక్కదది. ఎందుచేత. కర్మ ఏదీ లేదంటే అది నిశ్చలమైన ఆత్మచైతన్యమే. ఆ చైతన్య మనుభవానికి రావాలంటే సత్త్వం బాగా శుద్ధిచెందాలి. అది శుద్ధి కావాలంటే దానిని శోధించే కర్మను ఆచరించి తీరాలి. అప్పటికి కర్మాచరణమే నైష్కర్మ్యానికి ఉపాయ మయింది. మరి కర్మను ఆరంభించక పోతే అది ఎలా సిద్ధిస్తుంది.

అందుచేత ఇంతకూ సాధకుడు పాటించవలసింది ఏమిటని ప్రశ్న. నైష్కర్మ్య రూపమైన ఆత్మ స్వరూపాన్ని గమ్యంగా భావించి దాన్ని చేరటానికి సాధనంగా

తగిన కర్మ నాచరించాలి. అదికూడా మధ్యలో విడిచిపెట్టక గమ్యం చేరే దాకా అనుష్ఠిస్తూనే పోవాలి. అసలు అనుష్ఠించకున్నా సుఖంలేదు. అనుష్ఠిస్తూ అది ఫలించకుండా విడిచిపెట్టినా లాభంలేదు. ఇందులో మొదటిది సాధనం లేకుండా సాధ్యాన్ని ఆసించటమైతే రెండవది సాధ్యమైన జ్ఞానం కలగకుండానే సాధనాన్నే జారవిడవటం అవుతుంది. రెండూ తెలివితక్కువే.

అంతేకాదు. కర్మను ఆరంభించకపోతే ఎలా నైష్కర్మ్యం సిద్ధించదో అలాగే సిద్ధి కలిగే లోపలనే దానిని వదిలేసినా ప్రయోజనంలేదు. సన్న్యాసమంటే వదులు కోవటమే. అది ఫలితం సిద్ధించిన తరువాత చేయవలసిన పని. ముందుగా కాదు. తొందరపడి ముందుగానే చేశామంటే ప్రారంభించి కూడా అది నిష్ఫలమే.

## 67

**నహి కశ్చిత్ క్షణమపి-జాతు తిష్ఠ త్యకర్మకృత్**
**కార్యతే హ్యవశః కర్మ-సర్వః ప్రకృతిజైర్గుణైః 3-5**

కాకపోయినా ఏపనీ చేయకుండా ఊరకకూచుందామంటున్నారే అది ఎలా సాధ్యం. అలా కూచోగలవా ఒక్క క్షణమైనా. ప్రతి క్షణమూ జీవితంలోఏదో ఒక పని చేస్తూ ఉండవలసిందే తప్పదు. మనసుతోనో మాటలతోనో-దేనితో నైనా సరే కర్మ అనేది దాని పాటికది జరుగుతూనే ఉంటుంది. నీవు చేయనని భీష్మించుకున్నా ప్రయోజనంలేదు.

ఏమీకారణం. ప్రకృతి అనేదొకటి ఉందికదా. అదే చేయిస్తుంది నీచేత. ప్రకృతి అచేతనం కదా ఎలా చేయిస్తుందని అడుగుతావేమో. సత్త్వమూ-రజస్సూ-తమస్సూ అని మూడు గుణాలున్నాయి దానికి. అవి బాహ్యంగానే కాక మానవుడికి లోపల కూడా ఓతప్రోతంగా అల్లుకొని ఉన్నాయి.

అవి పేరుకు మూడైనా ముప్పది మూడుకోట్ల అవతారాలెత్తి మన ప్రాణం తీస్తుంటాయి. ప్రతిక్షణమూ అవి రకరకాల మనోవృత్తులను రేకిత్తిస్తూ ఉంటాయి. అవి బాహ్యమైన శబ్దస్పర్శాదులతో లావాదేవీ పెట్టుకొంటాయి. దానితో ఒక అభేద్యమైన పద్మవ్యూహం తయారవుతుంది. ఈ వ్యూహంలో అభిమన్యుడి లాగా జొరబడటమే తెలుసునుగాని మనమనస్సుకు అందులో నుంచి బయట పడటం తెలియదు.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

అచేతనమైనా మనసును ప్రేరణ చేసే శక్తి ఈ గుణాలకు అయస్కాంతం లాగా సహజంగానే ఉంది. మానవుడు చేసుకొన్న సంచిత కర్మవల్ల వాటి కది సంక్రమించింది. ఆ కర్మ వాసనా బలమే వాటి బలం, దానితో ఈ గుణాలు మనసును పురి కొల్పితే-అది ఇంద్రియాలకు ఉత్తరువిస్తే-తద్వారా కర్మలన్నీ జరుగుతుంటాయి. లేకుంటే ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు కూడా నోచుకో లేము మనం. ప్రతి క్షణమూ మన ఎరుకతో జరుగటం లేదు కదా అవి. కాబట్టి నీ వశంలో లేకుండానే జరిగే కర్మ కాండ జరుగుతూనే ఉంటుంది. కాబట్టి సంక ల్పిస్తే అన్నిటికీ స్వస్తి చెప్ప గలననే మాట వట్టి మాట

## 68

**కర్మేంద్రియాణి సంయమ్య-య ఆస్తే మనసా స్మరన్**
**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా-మిథ్యాచార స్స ఉచ్యతే 3-6**

కొందరున్నారు ప్రబుద్ధులు. అన్ని వ్యాపారాలకూ స్వస్తి చెప్పి మేము ధ్యానం చేస్తున్నా మంటారు. కాళ్ళూ చేతులూ నోరూ కదిలించ కుండా కూచున్నా రంత మాత్రమే. కర్మేంద్రియాలు చలించ కుండా కొంత సేపు కూర్చోవచ్చు. అది ఏమంత అసాధ్యం కాదు. అది వారే కాదు సామాన్యులు కూడా చేయ వచ్చు. అయితే అది ఊరక కూచోట మనుకుంటున్నా రది పొరబాటు.

ఊరక కూచోట మంటే మౌనం మౌన మనేది కేవల వాఙ్మౌనమే కాదు. దేహ మౌనముంది. వాఙ్మౌన ముంది, మనో మౌన ముంది. అందులో కదల కుండా మాటాడ కుండా కూచున్నాడంటే రెండుమౌనాలే సాధించాడు మానవుడు.

కాని మూడవ దొక టున్నది-మనో మౌనం. అది వాడు చస్తే సాధించలేడు. ఊరక కూచున్నాడని పేరేగాని మనసులో వాడికి రైళ్ళు పరుగెత్తు తుంటాయి. ఎన్నో ఆలోచనలు ఎన్నో గొంతెమ్మ కోరికలు. ఇలాంటి వెన్నో గంధర్వనగరాలు మనసులోసృష్టించు కొంటూ బాహ్యానికి సమాధి నిష్ఠ దయినట్లు నటించినా ఏమి ప్రయోజనం. అది వట్టి దాంభికమే అవుతుంది. ఎంచేత. ప్రాపంచిక విష యాలకు దూరంగా కూచున్నట్టు కనిపిస్తున్నాడే గాని మానసికంగా వాడు ధ్యానిస్తూ ఉన్న దావిషయ ప్రపంచాన్నే. అది ధ్యానమెలా అయింది. కేవలం ఒకధ్యానమే అది. మరేదీ గాదు.

## 69

**యస్త్వింద్రియాణి మనసా-నియ మ్యారభ తేర్జున**
**కర్మేంద్రియైః కర్మ యోగ - మసక్తస్స విశిష్యతే 3-7**

అలా బూటకంగా బ్రతికే దానికన్నా ఒకపని చేస్తే చాలా మేలు. ఇంద్రియ వ్యాపారాల నరికట్టినా మనో వ్యాపారాన్ని ఎలాగూ అరికట్టలేవు. కాబట్టి మనసు నీశ్వరార్పణం చేసి మొదట నైర్మల్యాన్ని సంపాదించు. ఆ తరువాత దైవబలాన్ని పుంజుకొన్న ఆ మనస్సుతో ఇంద్రియాల నదుపులో పెట్టుకొని కర చరణాదులైన ఇంద్రియాలతో కర్మలు సాగించు. అలా సాగిస్తే అది కర్మ కాదు. కర్మయోగ మనిపించు కొంటుంది.

ఇందులో ఒక సౌలభ్య ముంది. కర్మేంద్రియాలను నిరోధించ నక్కరలేదు. మీదు మిక్కిలి వాటి ఉపయోగించి పనులు చేయవచ్చు. ఒక పని చేయటం చేయక పోవటం ప్రధానం కాదు. కర్మ ప్రచోదక మైన మనసులో ఉంది మర్మ మంతా. మనసు నిర్మలమైతే ఏ పని చేసినా ప్రమాదం లేదు. కాకపోతే చేయ కున్నా ప్రమోదం లేదు.

అయితే కర్మలన్నీ చేస్తూనే ఉన్నాము గదా- అవి మనకు బంధకం కావా అని ప్రశ్న. బంధకం కావటం కాకపోవట మనేది ఆయా కర్మలలో లేదు. మన మనసులో ఉంది. మనసులో సంగం లేకపోతే సరి. ఇక ఏ కర్మ చేసినా అది మనలను బంధించదు. అసంగబలమే దాన్ని క్షాళితం చేస్తూ పోతుంది.

ఈ అనాసక్తి యోగమే సాధకుడయిన వాడల పరచుకోవలసిన గొప్ప గుణం. ఆ గుణ మలవడిందంటే ప్రత్యేకించి ఏ ధ్యానమూ అక్కర లేదు. కర్మేంద్రియాలతో పనులు చేస్తున్నా అదంతా మనసు పర్యవేక్షణ లోనే ఉంటుంది కాబట్టి- ఆ మనసు వ్యవసాయాత్మకమైన మనసు కాబట్టి దాని పాటికదే ధ్యానంగా పరిణమిస్తుంది.

## 70

**నియతం కురు కర్మ త్వం-కర్మ జ్యాయో హ్యకర్మణః**
**శరీర యాత్రాపి చతే-న ప్రసిద్ధ్యే దకర్మణః॥ 3-8**

మనోనైర్మల్యంతో కర్మ చేసినా ప్రమాదం లేదని చెప్పారు బాగానే ఉంది. కాని ప్రతి దినమూ మనం జీవితంలో సాగించే కర్మకలాపమెంతో ఉన్నది.

Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

ఇంత బరువు నెత్తిన పడితే ఆ మనసు మాత్రమెలా భరించగలదు. నైర్మల్యం మాత్రమెలా నిలవగల దని ప్రశ్న వస్తుంది.

వాస్తవమే. అగ్నికెంత దహనశక్తి ఉన్నా ఒక్కసారిగా బస్తాబొగ్గులు తెచ్చి దాని నెత్తిన పడవేయరాదు చప్పుమని చల్లారిపోతుంది. అలాగే శుద్ధిచెందే లక్షణం మనసు కెంత ఉన్నా-అది అలవడే లోపలనే పనుల భారం పనికిరాదు.

కనుక పరిష్కార మేమంటే ఒక మోతాదులో చేయాలి ప్రతిపనీ. కర్మల సంఖ్యా తగ్గించుకోవాలి. తగ్గించు కొన్నదికూడా ఎంతో అంతే చేస్తూపోవాలి. ఎంత అనేది తెలుసుకోవటమెలాగ అని ప్రశ్న. అందుకే నియతమని పేర్కొన్నాడు భగవానుడు. నియతమంటే శరీరధారణ కెంతకావాలో అంతమాత్రమని అర్థం. శరీర ధారణమంటే బ్రతకటం. బ్రతకటానికి అన్నమూ వస్త్రమూ నివాసమూ ఇవి కనీసమైన అవసరాలా. ఇవి ఎంత హెచ్చులోనైనా ఉండవచ్చు. ఎంత తగ్గులోనైనా ఉండవచ్చు. అందులో ఎంత తగ్గులో తృప్తి పడగలిగితే అంత మంచిది. తన్మూలంగా వాటికోసం ఊరక ప్రాకులాడే శ్రమ తగ్గుతుంది. దానితో మనసుకు శాంతీ-బ్రహ్మాభ్యాసాని కవకాశమూ లభిస్తాయి.

అంతేగాని చేయమన్నారు గదా అని పిచ్చిగా చేయరాదు. మానితే అసలే మానరాదు. అధమపక్షం తనవరకు తానైనా జీవించాలి గదా మానవుడు. అందుకూ బద్ధకిస్తే మరి ఒకరికైనా భారమేగదా. అంచేత ఒక మోతాదు తప్పకుండా పనులు చేస్తూపోతే సాధకుడికి ఇటు జీవయాత్రా అటు బ్రహ్మవిచారణా కూడా సాగుతుంది. ఉభయతారక మది.

## 71

**బ్రాహ్మణ క్షత్రియ విశామ్-శూద్రాణాంచ పరంత ప**
**కర్మాణి ప్రవిభక్తాని-స్వభావ ప్రభవైర్గుణైః** 18-41

కర్మలనేవి అసలు లౌకికమనే గాక శాస్త్రం కూడా విధించింది మనకు. నియతమంటే శాస్త్ర విహితమని కూడా అర్థమే. శాస్త్ర చోదితమైన కర్మలెలా మానుకోగలం లౌకికం లాగా వాటిని కూడా పాటించవలసిందే మానవులు.

మానవులంటే ఒకరు గారు. బ్రాహ్మణులనీ-క్షత్రియులనీ-వైశ్యులనీ-శూద్రులనీ-నాలుగు వర్ణాల వారున్నారు. ఈ నలుగురికీ నాలుగు రకాలైన కర్మలు నియతమై Fixed ఉన్నాయి. శమదమాదులూ- అధ్యయ నాదులూ-బ్రాహ్మణు

లకు. శౌర్యక్షమాదులూ దండపాలనాదులూ- క్షత్రియులకు. కృషి గోరక్ష వాణిజ్యాదులు వైశ్యులకు. అలాగే పరిచర్యాదికమైన కర్మ శూద్రులకు.

ఇవి ఎవరు విభజించారు ఈ వర్ణాలు ఈ వర్ణాలకీయీ కర్మలని ఎవరు నిర్ణయించారు. నిర్జీవమైన శాస్త్రం మనకు నిర్దేశించటమేమిటి. అది కూడా మానవుడు కల్పించుకొన్నదే గదా అని ఆక్షేపించరాదు. శాస్త్ర మనేది అపౌరుషేయం. పురుష బుద్ధి కల్పితం కాదది. సిద్ధమైన తత్త్వాన్నే అనువదిస్తుంది Follows శాస్త్రం. ఏమిటా సిద్ధమైనదంటే అది మన స్వభావమే. స్వభావ మనేదిక్కడ ఈశ్వర ప్రకృతి అయిగా కావచ్చు. లేక మానవ ప్రకృతి అయినా కావచ్చు. ప్రకృతి గుణాలైన సత్త్వరజస్తమస్సులే మానవులందరిలో పడుగుపేకగా అల్లుకొని ఉన్నాయి. ఆ అల్లిక కూడా ఒక తరహాగాదు. ఒక్కొక్కరిలో ఒక్కొక్క తీరులో ఉందది. సత్త్వం ప్రధానమయి రజస్సు అప్రధానమైతే అది బ్రాహ్మణ. రజస్సు ప్రధానమైన సత్త్వమ ప్రధానమైతే క్షత్రియ రజస్సు ప్రధానమయి తమస్సు అప్రధాన మయితే వైశ్య. మరి తమస్సు ప్రధానమై రజస్సు అప్రధాన మైతే శూద్ర.

ఇవి అనేక జన్మల నుంచీ అనుసరిస్తూ వస్తున్నాయి మనలను. ఈ గుణ భేదం వల్లనే కర్మ భేదం ఏర్పడింది. ఇది శాస్త్రం కల్పించిందీ కాదు. మానవులు కల్పించిందీ గాదు ఆ మాటకువస్తే ఈశ్వరుడూ కల్పించిందీ కాదు. "చాతుర్వర్ణ్యం మయా సృష్ట"మని కర్తృత్వం తన కున్నట్టు చెప్పికూడా "విద్ధ్య కర్తార మవ్యయ" మ్మని మరలా దాన్ని త్రోసి పుచ్చాడాయన అంతేగాదు. "న కర్తృత్వమ్ న కర్మాణి-లోకస్య సృజతి ప్రభుః" అని జీవులకు కూడా కర్తృత్వం లేదని చాటుతున్నాడు. జీవేశ్వరుల కిద్దరికీ లేకపోతే శాస్త్రానికి మాత్రమెక్కడిది.

మరి ఎక్కడిదీ విభాగమని ఆశ్చర్యపడ నక్కరలేదు. స్వభావస్తు ప్రవర్తతే అని-స్వభావ ప్రభవై ర్గుణైః అని-సమభావ మిస్తూనే ఉన్నాడు భగవానుడు. మానవుల స్వభావం లోనే గర్భితమయి ఉందది. అనాది సిద్ధమైన అజ్ఞానమే ఆ స్వభావం. దాని వల్లనే మన బుద్ధులూ మన మాటలూ - మన చేష్టలూ - అనేక విధాలుగా తయారయినాయి. వీటి నాధారం చేసుకొనే మన సృష్టి జరిగింది. దాన్ని నిమిత్తంగా చేసుకొనే శాస్త్రం కూడా మన కాయా కర్మలు విభజించి బోధిస్తుంది.

కాబట్టి ఇది ఎవరు చేసిందీ గాదు. మనం చేసుకొన్నదే. మన కజ్ఞాన మనేది వెంటాడు తున్నంత వరకూ ఈ గుణ భేదం తప్పదు వర్ణ భేదం కాకుంటే

వర్గభేదమైనా ఉండి తీరుతుంది. ఇప్పుడీ వర్తమాన కాలంలో కూడా చూడండి. ఆచార్య వర్గమనీ priestsపాలక వర్గమనీ Administratorsవాణిజ్య వర్గమనీ Industrialists శ్రామిక వర్గ మనీ Labourers నాలుగు వర్గాల వారూ ప్రతి దేశంలో ప్రతి సమాజం లోనూ కనిపిస్తూనే ఉన్నారు గదా. శ్రామికుడు వ్యాపారమూ చేయలేడు. వ్యాపారస్థుడు దేశ పాలనా చేయలేడు. పాలకుడు మతాచార్యుడు గానూ ఉండలేడు. ఎవడి స్వభావం వాడిదే. పుట్టుకతో వచ్చిందది. పుటం పెట్టినా మారదు.

అయితే అజ్ఞాన మున్నంత వరకూ అనేమాట మనం గుర్తుంచుకోవాలి. అంతా ఒకే ఒక ఆత్మ చైతన్య మనే సత్యాన్ని గుర్తించక పోవటమే గదా అజ్ఞానం తన్మూలంగా ఏర్పడిందే ఈ విభాగం. కాబట్టి ఇది వ్యావహారికమేRelative గాని పార మార్థికం Absoluteగాదు. పార మార్థిక దృష్టితో చూస్తే అంతా సమానమే. పండితాస్సమ దర్శనః అయితే ఆ సమ దర్శన మలవడాలి ఇంతకూ. అది ఆత్మ జ్ఞానంతో గాని రాదు. ఆ జ్ఞాన మింకా ఉదయించ కుండానే అంతా ఏకమని చాటుతూ పోవటం ఆత్మ వంచన అవుతుంది. నూటికి తొంభయి తొమ్మిది మంది ఆత్మ జ్ఞానం లేనివారే. కాబట్టి ఈ వ్యవస్థ వ్యావహారికంగా ఇలా సాగుతూ పోవలసిందే తప్పదు.

## 72

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్
స్వభావ నియతమ్ కర్మ-కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్ 18-47

లోకవ్యవస్థ ఇలా ఉండవలసింది గనుకనే ఎవడికి నియతమైన ధర్మంవాడు చేస్తూపోవటమే మంచిది. అది వాడి వ్యక్తి జీవితానికీ సమాజ జీవితానికీ రెండింటికీ శ్రేయోదాయకం. అలాకాక ఒకరు చేయవలసిన దానిలో మరొకడు వేలు పెట్టాడంటే అది ఇద్దరికీ నష్టం. దానివల్ల సమాజ శ్రేయస్సు కూడా దెబ్బ తింటుంది.

ఒక ఇంట్లో తండ్రి తల్లి-కొడుకులూ కూతుళ్ళూ-అని ఉన్నారను కోండి. అందులో తండ్రి బయటికి పోయి సంపాదించి తెస్తే-తల్లి అన్నీ తయారుచేసి నలుగురికీ అమర్చితే-కొడుకులు చదువు సంధ్యలు నేరిస్తే కూతుళ్ళు తల్లికి తోడ్పడుతూ ఇల్లూ వాకిలీ చక్కబెడుతుంటే - గృహం బాగుపడుతుంది గాని ఒకరి పని ఒకరు చేస్తామని కూచుంటే ఎలా బాగుపడుతుంది.

అలాగే సమాజంలోకూడా ఎవరి విధులు వారు నిర్వర్తించాలి. విద్యార్థి చదువు కొని బాగుపడాలి. ఉపాధ్యాయుడు చదువు నేర్పాలి. ఉద్యోగస్థులు వారి వారి ఉద్యోగ విషయాలు సక్రమంగా నెరవేర్చాలి. వ్యాపారస్థులు క్రయ విక్ర యాలు సరిగా నడుపుతుండాలి. మరి పరిపాలకు లన్నింటినీ పర్యవేక్షణ చేస్తూ పోవాలి. అందరూ కలిసి అన్ని పనులూ చేయటం సాంకర్యమైతే ఏపనీ చేయక పోవటం సోమరితన మవుతుంది. దానివల్ల తన జీవనమూ జరగదు. సమాజ జీవనమూ ముందుకు సాగదు. ఎవరికి తగినట్టు వారు వ్యక్తులందరూ కృషిచేస్తే సమష్టి రూపమైన మానవ సమాజం పురోగమిస్తుంది. అంతకంత కభ్యు దయాన్ని సాధిస్తుంది.

కాబట్టి పరధర్మం పైన వేసుకొని సంబాళించలేక చతికిల పడటం కన్నా స్వధర్మ మది ఎంత తక్కువ దనిపించినా మనకది విహితమని అనుసరించటమే హితం. విగుణమంటూ ఎలా ఆచరించటమని ప్రశ్నలేదు. విషంలో పుట్టిన క్రిమికి విషమెలా మారకం గాదో అలాగే విగుణమైనా అది వాడికి కీడుచేయదు. కారణమే మంటే అది లోకుల దృష్టిలో ఎంత నికృష్టమైనా వాడి కాజన్మ సిద్ధం. బ్రాహ్మజ్ఞాని అయి కూడా ధర్మవ్యాధుడు మాంస విక్రయం చేసినట్టు వర్ణించింది మహాభారతం. హింసాత్మకమైన కర్మ అయినా అది వాడికి కిల్బిషాన్ని అపాదించ లేదు. అది ఎలాగా అని శంకించరాదు. ఒక వైద్యుడు శస్త్ర చికిత్స చేస్తాడు. పురుషులకూ చేస్తాడు. స్త్రీలకూ చేస్తాడు. దానిని హింస అని గాని వ్యభిచార మని గాని అనలేవు గదా. అది వాడి వృత్తి ధర్మం. అలాగే ఇదీ అని అర్థం చేసుకోవాలి. చేసుకొంటే ఇక గుణదోష విచారమంటూ ఉండబోదు.

## 73

**యతఃప్రవృత్తి ర్భూతానామ్-యేన సర్వమితదమ్ తతమ్**
**స్వకర్మణా తమభ్యర్చ్య-సిద్ధమ్ విందతి మానవః1 8-46**

ప్రతి ఒక్కరికీ కర్మలనేవి ప్రతి నియతం-వారవి ఆచరించి తీరాలని చెప్పారు. అలా ఆచరించటంలో కూడా ఊరక గ్రుడ్డి ఎద్దు చేలోబడ్డట్టు ఆచ రిస్తూ పోతే మరలా ప్రయోజనం లేదు. మహా అయితే ధార్మికమైన Religious ఫలిత ముంటుందేగాని వాటికి ఆధ్యాత్మికమైన Philosophical ఫలితముండ బోదు. మోక్ష పురుషార్థం సాధించటమే ఆధ్యాత్మిక ఫలం. అందు కోసమే భగ వానుడీ గీతోప దేశం చేసింది మనకు. సూటిగానో చాటుగానో దానికి దోహదం

చేసి నప్పుడే దేనికి గానీ ఈ శాస్త్రంలో ప్రవేశం. అలా లేకపోతే దానికిక్కడ అవకాశమే లేదు.

ప్రస్తుత మాయా వర్ణాశ్రమాలకు విధించిన కర్మలు కూడా మానవుడి కలాంటి మోక్ష ఫలాన్ని ప్రసాదించాలంటే అవి ఏవో మనకు స్వధర్మమని కర్తవ్య బుద్ధితో ఆచరించటం వరకే అయితే సరిపోదు. ఆచరిస్తూ ఉన్న ప్రతికర్మా పరమేశ్వరార్పణ మస్తు అని తాత్త్వికమైన దృక్పథంతో ఆచరించాలి. అంటే ఈ కర్మ నేను గాదు చేయటం ఆ ఈశ్వరుడే నా హృదయంలో కూచొని చేయిస్తుంటే నేను చేస్తున్నాను దీని ఫలం కూడా నేను కోరటంలేదు- ఆ ఈశ్వరుడే దీనికి భోక్త-అని కర్తృత్వ భోక్తృత్వాలు వదలుకొంటూ చేయాలి దీనితో సంకుచితమైన వ్యష్టిభావన పోయి అతి విశాలమైన సమష్టి భావన అలవడుతుంది.

అసలు సమష్టి రూపుడే ఈశ్వరుడు. కారణమే మంటే చరాచర జగత్తునూ సచ్చిద్రూపంగా వ్యాపించి ఉన్నదా ఈశ్వర తత్త్వమే. దానికి వ్యతిరిక్తంగా ఏదీ లేదు. అంతా దాని విభూతే. ఇందులో ఏది ఎక్కడ కదలినా మెదలినా దాని ప్రేరణ Impulsion వల్ల జరగవలసిందే. అంచేత ఇలాంటి సమష్టితత్త్వాన్ని భావిస్తూ పని చేస్తున్నప్పుడా వెలుగులోనే ఇవన్నీ జరుగుతున్నట్టు తోస్తుంది. అంతేకాదు. దాని పరిస్పంద విశేషాలే ఈ కర్మలన్నీ. వీటికి కర్తృత్వం వహిస్తు న్నట్టు కనిపించే నేను కూడా ఆ వెలుగేననే భావ మేర్పడుతుంది మనకు. యద్భావస్తద్భవతి అన్నారు ఏది భావన చేస్తే అదే అవుతాడు మానవుడు. క్రొత్తగా కావటం కూడా కాదిక్కడ. వాస్తవంలో మన మా ఈశ్వర స్వరూపులమే. వ్యష్టి భావనతో దానిని విస్మరించి జీవులమయ్యాయి. మరలా సమష్టి భావనతో చేస్తూపోతే దాని స్మృతి ఆవిర్భవించి ఈ వ్యష్టి రూపమైన అహంకారామూ Ego దీనితో చేసే కర్మ వ్యాపారమూ అంతా తద్రూపమే ననేజ్ఞాన ముదయి స్తుంది. ఈ జ్ఞానోదయమే నిజమైన సిద్ది మన కర్మాచరణ కంతటికీ.

## 74

**యజ్ఞార్థా త్కర్మణోన్యత్ర - లోకోయమ్ కర్మ బంధనః**
**తదర్థ మపి కౌంతేయ - ముక్త సంగ స్సమాచర 3-9**

అందుకే మనం చేసే ప్రతి కర్మా - యజ్ఞం కోసమే ననుకొంటూ చేయమని సలహా ఇస్తున్నాడు భగవానుడు. దేన్ని గురించి యజనం చేస్తామో అది యజ్ఞం.

యజనమంటే ఆరాధనం. భగవత్తత్త్వాన్ని గురించే గదా ఆరాధిస్తాము. అంచేత భగవంతుడే యజ్ఞ మంటే. యజ్ఞో వై విష్ణుః- అని వేద వాక్యం. అలాంటి యజ్ఞ పురుషుడైన పరమాత్మ కోసమే ఈ కర్మ నేనాచరిస్తున్నానను కొంటూ చేయాలి ఏ పని అయినా. ఆయనే చేయిస్తున్నాడు -ఆయన కోసమే చేస్తున్నాను - ఆయనకు నేనొక భృత్యుణ్ణి అనే భావ ముండాలి మనకు. దీనితో కర్తృత్వం భోక్తృత్వాలు రెండూ మన మీది నుంచి ఎగిరిపోయి ఆ విశ్వరూపుడి మీద వాలుతాయి. తన్మూలంగా కర్మ భారం తొలగిపోయి మనం పూర్తిగా తేలిక పడతాము.

కర్తృత్వ భోక్తత్త్వాలు పెట్టుకొని చేసినప్పుడే అది బంధం. అవి రెండూ లేకుండా చేస్తే ఏ కర్మా మనకు బంధకం కాదు. అయితే సాధారణంగా ఈ రెండు బుద్ధులూ లేకుండా మనమే పని చేయము. చేయలేము. ఇది నేనే చేస్తున్నాను. దీని ఫలం నాకే దక్కాలనే ఉంటుంది మనందరికీ. ఇదే మన కొక వాసనగా పరిణమించి ఆ కర్మే ముగిసినా మనలను వదలకుండా కట్టి వేస్తున్నది. ఆ వాసలనతోనే మరణిస్తాము కాబట్టి పుణ్య పాపాలూ-స్వర్గ నరకాలూ-జన్మాంతరాలూ-మనకు తప్పటం లేదు,

వీటి దుష్ఫలితం నుంచి విముక్తి పొందాలంటే ఎప్పటికైనా ముక్త సంగులమై కర్మ లాచరించాలి. అసలాచరించక పోవటమూ గాదు. సంగం పెట్టుకొని ఆచరించటమూ గాదు. వ్యక్తి గతంగా భావించి నంత వరకూ అది సంగం. కర్తృత్వ భోక్తృత్వ చింత కూడా అప్పుడే తారసిల్లేది. వ్యక్తిగా గాక విశ్వమంతా వ్యాపించిన చైతన్యమే నేనని సమష్టితో ఎప్పుడూ తాదాత్మ్యం భజిస్తామో అప్పుడా భజనమే యజన మవుతుంది. ఆ యజనంతో చేసిన కర్మ ఇక బంధకం కానేరదు. కారణ మేమంటే దానిలో ముందు చెప్పిన కర్తృత్వ భోక్తృత్వ దృష్టి ఉండదు. దృష్టి లేకుంటే దానికి చెందిన వాసన లేర్పడవు. వాసన లేర్పడక పోతే పుణ్య పాపాదుల ప్రసక్తే లేదు. మీదు మిక్కిలి భగవదంకితంగా చేసే ఈ నిష్కామ కర్మ చిత్తశుద్ధి ద్వారా అత్మ జ్ఞానానికి సులభంగా దారి తీస్తుంది.

## 75

**యావా నర్థ ఉదపానే-సర్వత స్సంప్లుతో దకే.**
**తావాన్ సర్వేషు వేదేషు-బ్రాహ్మణస్య విజానతః 2-46**

అయితే ఒక ప్రశ్న. అసలీ కర్మలనేవే పూర్తిగా మానివేస్తే సరిపోదా. నిష్కా

మంగా నైనా-ఈశ్వరార్పణ బుద్ధితో నైనా-చేసి తీరాలని ఒక ఆసిధారావ్రతాన్ని పాటించకపోతే నేమి.

వాస్తవమే. కర్మ కాండము మాని వేయవచ్చు. కాని అలా మానివేసే అధికారం ఒక్కడికే ఉంది. వాడు పరిపూర్ణ జ్ఞాని. తస్య కార్యమ్ నవిద్యతే అన్నట్టు వాడికిక ఏ కర్మా చరణా అక్కరలేదు. అప్పటికీ శరీర స్థితి మాత్రమైన కర్మ వాడికీ ఉంటుందని చెబుతుంది శాస్త్రం. ఇక మిగతా వాళ్ళ మాట చెప్పే దేముంది.

జ్ఞాని గాక మిగిలిన వాళ్ళు రెండే రెండు జాతులు. ఒకరు కేవలం లౌకికులు. మరొకరు సాధకులు. వీరిద్దరూ కర్మమానివేయటానికి లేదు. జ్ఞానవాసన కూడా లేక కనీసం దాని కోసం ప్రయత్నం కూడా లేకుండా లౌకికంగా బ్రతికేవాడు. శాస్త్ర విహితమైన కర్మలు మానివేస్తే వాడికది అహితాన్ని ఆపాదిస్తుంది. దానికే ప్రత్య వ్యాయమని పేరు. అటు జ్ఞానమూ లేక ఇటు కర్మానుష్ఠానమూ లేక ఉభయ భ్రష్టుడవుతాడు.

పోతే ఇక సాధకుడని చెప్పామే వాడు కూడా త్యజించటానికి లేదు కర్మ. ఎందుకంటే వాడింకా సాధకుడే గాని సిద్ధుడు కాడు. సిద్ధి కలిగే దాకా కర్మ చేయవలసిందే. సిద్ధి అనేది ఇక్కడ జ్ఞానం. దాన్ని సంపాదించటం కోసమైనా కర్మ చేసి తీరాలి సాధకుడు. అయితే అది కేవలం కర్మకాదు. జ్ఞానం కోసమని చేసే కర్మ. దీనికే కర్మ యోగమని పేరు. ఈశ్వర దృష్టితో చేసే కర్మ కాబట్టి ఇది - దానికి విఘాతం కలగకుండా ఎంత మోతాదులో చేయాలో అంతే చేయవలసి ఉంటుంది. అన్ని కర్మలూ తూచా తప్పకుండా నే నాచరించ లేకపోతినే అని తాపత్రయ పడ నక్కరలేదు. ఒక పెద్ద నదిలో నీళ్ళు తాగితే ఎంతో అంతే ఒక నూతిలో దిగి తాగినా. నూతిలో తాగిన ప్రయోజనం మనకు నదిలోనే కలిసి వస్తుంది. ప్రత్యేకంగా దానిలో పోయి దిగనక్కర లేదు.

అలాగే వేదోక్తమైన కర్మలూ-వాటి ఫలితాలు-ఎన్ని వందలు వేలైనా ఉండనీయండి. అవన్నీ పరమాత్మ తత్త్వ జ్ఞాన మనే వెలుగులో ఆచరించే సాధకుడికా విజ్ఞాన ఫలంలోనే ఈ కర్మ ఫల మంతా గతార్థమై Included పోతుంది. ఇదుగో ఆ దృష్టితోనైనా-ఆ దృష్టి బాగా అలవడటం కోసమైనా-శాస్త్ర చోదితమైన కర్మలు సమత్వ బుద్ధి వదలకుండా ఆచరించాలి సాధకుడు. అప్పుడే అది సత్త్వ శుద్ధికీ జ్ఞానోత్పత్తికీ చేయూతనిస్తుంది.

# 76

**కర్మణైవ హి సంసిద్ధి-మాస్థితా జనకాదయః**
**లోక సంగ్రహ మేవాపి-సంపశ్యన్ కర్తు మర్హసి 3-20**

ఇలాంటి అనాసక్తి యోగంతోనే తరించారు పూర్వం జనకాదు లైన రాజర్షులంతా. అవి ఏవో పురాణగాథ లనుకొంటే నిన్న మొన్నటి శంకర విద్యార ణ్యాదుల మాట ఏమిటి. పరిపూర్ణజ్ఞానులై కూడా వారు కర్మ లాచరిస్తూ వచ్చారు. అనాసక్తే లేకపోతే వారి కాకర్మ బంధకం కావలసి వస్తుంది.

అయితే అంత జ్ఞాననిష్ఠులైకూడా వారు కర్మ ఎందుకు చేయవలసి వచ్చిం దని అడగవచ్చు. మంచి ప్రశ్నే ఇది. పూర్ణజ్ఞానికి కర్మ చేయవలసిన అగత్యంలేదు వాస్తవంలో. అంతా జ్ఞానమయంగానే వాడికి భాసిస్తుంది. కడకు దేహయాత్రకు కూడా వాడు పాటు పడనక్కరలేదు. అదికూడా జ్ఞాన బలంతోనే సిద్ధిస్తుంది. అలాంటప్పుడీ శంకరాదులంతా ఎందు కంతంత వ్యాసంగం పెట్టుకోవలసి వచ్చిందని అడగటంలో తప్పులేదు.

ఇక్కడే మనమొక రహస్యం గ్రహించవలసి ఉంది. పూర్ణజ్ఞాని అయిన వాడు ముక్తుడు కావడంలో సందేహం లేదు. కాని వాడు దేహ పాత మయ్యే వరకూ కాలం వెళ్ళబుచ్చవలసి ఉంది. అలా వెళ్ళ బుచ్చే జీవన్ముక్తులందరూ రెండు జాతులు, ఒకరు గోవింద భగవత్పాదులలాగా ప్రపంచంతో అంతగా సంబంధం పెట్టుకోక తమ పాటికి తాము సమాధినిష్ఠలో కాలం గడిపేవారు. పోతే మరి ఒకరు శంకర భగవత్పాదులలాగా తాము సంపాదించిన నిక్షేపాన్ని తమ వరకే గాక పదిమంది ముముక్షువులకూ పంచిపెట్టే ప్రయత్నంలో ఉన్నవారు. అయితే వీరికి కలిగే ఈ సంకల్పం కూడా లౌకికమైనది కాదు. సత్య సంకల్ప మది. నిత్యముక్తుడైన ఈశ్వరుడే వారికలాంటి సంకల్పం కలిగిస్తాడు. వారి మూలంగా ముముక్షు లోకాని కొకమేలు జరగవలసి ఉంది. దానిని బట్టే అసలు వారికా సంకల్పమనేది ఉదయిస్తుంది దీనికే అధికార Divine Deputation మని పేరు. దానిని నిర్వహించే ఆ మహనీయుల కాధికారిక పురుషులని పేరు, లోక సంగ్రహమే వారికి ధ్యేయం. తమ మాటల ద్వారా రచనల ద్వారా ఉపదేశం ద్వారా లోకులను ధార్మికుల గానూ-ధార్మికులను జిజ్ఞాసువులుగానూ జిజ్ఞాసువులను జ్ఞానులుగానూ-జ్ఞానులను అనుభవజ్ఞులుగానూ-చేయటమే వారు చేసే ఆ లోక సంగ్రహం. అందులో స్వప్రయోజన దృష్టి కేమాత్రమూ

చోటులేదు. కాబట్టి ఆత్మదృష్టితో జరిపే ఆ కలాపమంతా వారి కెంతమాత్రమూ బంధకం కాదు. మీదు మిక్కిలి బంధగత జన మోచకం.

## 77

**యద్య దాచరతి శ్రేష్ఠ-స్తత్త దేవేత రోజనః**
**స యత్ప్రమాణం కురుతే-లోక స్తదను పర్తతే ॥** **3-21**

అయితే ఒక ప్రశ్న. వారెంతో జ్ఞానులే కావచ్చు. జీవన్ముక్తులే కావచ్చు. వారు ప్రచారం చేసినంత మాత్రాన లోకులందరూ దాని నందు కోగలరా. అందుకొని బాగు పడగలరా. సామాన్యులైన ప్రజలకంత గొప్పస్థాయి కెదిగే స్తోమత ఉండవద్దా అని ప్రశ్న.

ఇది కూడా మనం సందేహించ నక్కరలేదు. "గతాను గతికో లోకః" అన్నారు పెద్దలు. లోకులెప్పుడూ స్వబుద్ధితో ముందుకు పోలేరు. వారికెవరో ఒకరు నాయకత్వం వహించి ముందుకు నడిపించాలి. తమ నాయకులేది ఆచరిస్తే దాని ననుసరించి మెలగటం వారికి పరిపాటి.

అంతే కాదు. మంచికో చెడ్డకో వారేది సిద్ధాంత మని నిర్ణయిస్తారో-అది దాటి చిన్న మెత్తుకూడా అవతలికి పోరులోకులు. అక్షరాల దాని ననుసరిస్తారు. ఇలాంటి గురత్వమూ అనుసరణ స్వభావమూ లోకుల కుండటం మూలాన్నే ఆచార్య పురుషులూ వక్తలూ వారికి గొప్ప గొప్ప విషయాలు సులభంగా బోధించ గలిగారు.

కాబట్టి ఒక అధికార మనే కాక లోకులకున్న అనుకరణ బుద్ధినిబట్టి కూడా ప్రచారం చేయవలసిందే మహాత్ములు. అలా చేయటం మూలానా వారికి తమ అనుభవం గట్టిపడుతూ పోతుంది. ధర్మ ప్రచారమూ జరుగుతూ వస్తుంది. లేకుంటే ముముక్షు జనోద్ధరణకు మార్గమే ఉండబోదు.

## 78

**సక్తాఃకర్మ ణ్య విద్వాంసో-యథా కుర్వంతి భారత**
**కుర్యాద్వి ద్వాం స్తథాసక్త-శ్చికీర్షు ర్లోకసంగ్రహం॥** **3-25**

అయితే ఒక్క సందేహం మాత్రమింకా మనలను బాధిస్తూనే ఉంటుంది. అదేమిటంటే ఎంత జీవన్ముక్తుడైనా కర్మ నాచరిస్తున్నంత సేపూ కరచరణా ద్యవయవాల నుపయోగించక తప్పదు గదా. అంతే గాక ధర్మ ప్రచారం

చేసేటపుడూ- ఎంత కాదన్నా రాగద్వేషాలకు గురిగాక తప్పదుగదా. అలాంటప్పుడు వారికీ మనకూ తేడా ఏముందని ప్రశ్న వస్తుంది.

నిజమే. పైకి చూస్తే తేడా ఏ మాత్రమూ లేదనే తోస్తుంది. కాని ఇది పైకి చూచి చెప్పే వ్యవహారం కాదు. పైకి కనిపించేవి శరీరాద్యు పాధులు. అవి ముక్తుడికీ-మనకూ కూడా సమానంగానే ఉన్నాయి ఆకలిదప్పులు కూడా సమానమే. తుదకు దేహపాతంకూడ సమానంగానే జరుగుతూ ఉంది.

అయితే మరి తేడా ఎక్కడ ఉందంటారు. అదే గొప్పరహస్యం. తేడా మరి ఎక్కడా కాదు. ఉభయల దృష్టిలో అనుభవంలో ఉన్నది. యో యచ్ఛ్రద్ధస్స ఏవ సః. దృష్టిలో అనేదే మానవుడు. కర చరణాదులు కావు. కడకు మనః ప్రాణాలు కూడా కావు అవన్నీ ఆత్మకు ఉపాధులు. ఆ ఉపాదులకు సాక్షి అయిన ఆత్మను పట్టుకొన్నాడు జ్ఞాని. ఉపాధులను కూడా ఆ దృష్టితోనే చూస్తున్నాడు. కనుక వాడుముక్తుడు అదివాడి అనుభవమే కాబట్టి ఇతరులకది గోచరంగాదు. అనుభవమనేది ఎలా కనిపిస్తుంది. మనకు కలిగే సుఖదుఃఖాదులు కనిపిస్తున్నవా. అనుభవం కూడా అలాగే కనిపించే వస్తువుకాదు. అది వాడి దృష్టి. వాడి దృష్టి కనుకనే అది మన దృష్టికి అంతుపట్టదు. అలా పట్టకపోయే సరికి ముక్తుణ్ణి కూడా మనం మామూలుగానే పరిగణిస్తుంటాము. మన దృష్టితో చూచి మనమాదిరే కదా అని భావిస్తాము. మనమంతా అవిద్వాంసులు. అంటే ఆత్మ జ్ఞానంలేని సామాన్యులం. కనుకనే ఏపనిచేసినా అది నాకు అనుకూలంగానే ఫలించాలని ఎంతో ఆసక్తితో చేస్తుంటాము. ఇలాంటి ఆసక్తితోనే చేస్తాడు ఒక ముక్తుడు కూడా. అయితేవాడు విద్వాంసుడు. అంతా ఆత్మ అనే దృష్టి ఉన్న వాడు. అంచేత వాడికీ వీడికీ ఆసక్తి అనేది ఒకటే అయినా-వీడికది ప్రపంచం మీద. వాడికి దానికధిష్ఠానమైన ఆత్మ మీద, అజ్ఞాని ప్రపంచాన్ని తనకు విలక్షణంగా చూస్తూచేస్తాడు. కాబట్టి కర్మవాడికి బంధకం. జ్ఞాని తన స్వరూపంగానే భావిస్తాడు కాబట్టి బంధకం కానేరదు. మీదు మిక్కిలి అది ఒక యాంత్రికంగా జరిగేచేష్ట. అనుషంగికంగా దానికి లోకసంగ్రహమనే ప్రయోజనం కూడా కద్దు.

## 79

**ప్రకృతేః క్రియమాణాని - గుణైః కర్మాణి సర్వశః**
**అహంకార విమూఢాత్మా-కర్తాహ మితి మన్యతే 3-27**

అయితే మీరెంత చెప్పినా ఇరువురూ చేసేపని ఒక్కటేకదా. అది ఒకరి

మెడకు చుట్టుకోటమేమి. వేరొకరికి ఏ మాత్రమూ అంటక పోవటమేమి. నిప్పులో వేలు తెలిసి పెట్టినా తెలియక పెట్టినా కాలక మానదు గదా. అని మరలా ఆశంక.

వాస్తవమే, అదినిప్పే అయితే మీరు చెప్పినట్లు తెలిసిపెట్టినా తెలియక పెట్టినా కాలుతుంది. తప్పదు. కానీ నిప్పుకాక నిప్పులాగా కనిపించే పదార్థమైతే అప్పుడేమంటారు. ప్రపంచ మిప్పు డలాంటి పదార్థం. ఇది మనం చూస్తు న్నట్టుగా అక్కడలేదు. ఉన్నదెప్పుడూ ఒక ఆత్మ చైతన్యమే. అదేమన ఆవిద్యవల్ల నామరూపాత్మకంగా భాసిస్తున్నది. మనమంతా అవిద్యాభూమికలో ఉన్నంత వరకూ మనకది యథార్థమే. దానివల్ల మనం పొందే బాధలూ యథార్థమే.

అయితే ఎంత యథార్థ మంటున్నా అది మన అజ్ఞాన భూమికలోనే అనే మాట మరచి పోరాదు. అజ్ఞానం ఆత్మజ్ఞానం చేత ఎప్పుడు రూపు మాసిందో అప్పుడిక ప్రపంచమూ లేదు దానితో వ్యవహారమూ లేదు మానవుడికి. వాడాత్మ స్వరూపుడయి సర్వమూ అత్మగానే అనుభవానికి తెచ్చుకొంటాడు. అలాంటప్పు డిక నిప్పేమిటి. కాలట మేమిటి. ప్రపంచ మనేదే కదా నిప్పని నీవు భ్రమిం చటం. అది పట్టి భ్రమే గాని వస్తురూపంగా లేదని గ్రహించి నప్పుడిక బాధ ఏముంది.

మరి ఎవడికీ బాధ, ఎక్కడిదిది. ప్రకృతిలో జరిగే వ్యవహార మంతా ప్రకృతి గుణాల వల్లనే జరుగుతూ ఉంటుందని గుర్తించక నా మూలంగానే ఈ పని జరుగుతూ ఉంది నేనే దీనికి కర్తనని ఎవడహంకరిస్తాడో వాడికే. దారిన పోయే శని గ్రహాన్ని నెత్తికి తెచ్చుకోవట మిది. దీనితో వివేకం దెబ్బతిని విమూఢుడవు తాడు మానవుడు.

## 80

**తత్త్వ విత్తు మహా బాహో-గుణకర్మ విభాగయోః**
**గుణా గుణేషు వర్తంత - ఇతి మత్వా నసజ్జతి** 3-28

తత్త్వజ్ఞుడు మాత్రమలా ఎప్పటికీ మూఢుడు కాదు. ప్రకృతి గుణాలేమిటో అవి చేస్తూ ఉన్న పను లేమిటో ప్రతి క్షణమూ అద్దంలో కనపడ్డట్టు కనపడు తుంటాయి. ఒక అద్దం లాగానే వాడి బుద్ధి నిత్యమూ వాటికి సాక్షిగా నిలిచి చూస్తూ ఉంటుంది. ఒకటి అద్దంలోనే ఉన్నట్టు కనిపించినా అది అద్దానికి

Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

బాహ్యమే. దాని నెప్పుడూ ఆ ప్రతి బింబ మంట బోదు. అలాగే సర్వత్రా పరచుకొని ఉన్న తన ఆత్మలోనే జరగవచ్చు ప్రతి ఒక్క పనీ. అలా జరిగినా ఆ రూపాలుగానీ వ్యవహారం గానీ శుద్ధమైన అతని ఆత్మ చైతన్యాన్ని ఏ మాత్రమూ అంటదు.

ఇందులో ఉన్న చమత్కార మేమంటే పనులు చేసేవీ ప్రకృతి గుణాలే. పనులూ ప్రకృతి గుణాలే. గుణాలే గుణాలతో లావాదేవీ పెట్టుకొని సతమత మవుతున్నాయి నిత్యమూ. గుణా లంటే అహంకారమూ-మనసూ-ప్రాణమూ -వీటి దగ్గర నుంచీ గుణాలే. తానో వీటికి కూడ అతీతమయిన ఆత్మ చైతన్యం. అది నిర్గుణం కాబట్టి ఆకాశంలాగా కదిలేది కాదు. చేసేదికాదు కనుకనే చలనాత్మక మయిన కర్మదాని నంటదని చెప్పటం. ఇలాంటి సత్యం తెలిసిన తత్త్వవేత్త కర్మబంధంలో ఎప్పుడూ చిక్కడు. కర్మ అనే కబంధ హస్తాల నుంచి ఎప్పుడూ వాడు ముక్తుడే.

## 81

నైవ కించి త్కరో మీతి
యుక్తోమన్యేత తత్త్వవిత్
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్
అశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ 5-8

## 82

ప్రలప న్విసృజన్ గృహ్ణ-న్నున్మిష న్ని మిష న్నపి
ఇంద్రియా ణీంద్రియార్థేషు- వర్తంత ఇతి ధారయన్ 5-9

అసలు తత్త్వవేత్త అయిన వాడేపని చేస్తున్నా నేనేమీ చేయటం లేదనే అను కోవాలి. అలా అనుకో గలిగినవాడే నిజమైన తత్త్వవేత్త. తత్త్వ మంటేఏమిటి. అంతా నా స్వరూప మనే గదా. అలాంటి భావమున్న వాడి కా చేసే కర్మ కూడ పరాయి దెలా అవుతుంది. అది కూడా స్వరూపమే. స్వరూప మయి నప్పుడది నిత్య సిద్ధం. దానినిక చేయట మేమిటి. చేశానను కోవటమే చేయటం. అలా అనుకోడు తత్త్వవేత్త. అనుకో గూడదు కూడా.

ఎప్పుడేమి చేస్తున్నా ఏది చేస్తున్నా ఏమీ చేయటం లేదని భావించడానికే ధారణ అని పేరు. ఏమి చేస్తున్నా అంటే ఏమిటది. శాస్త్రీయమైన కర్మ కాండే

Yalamarthi Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

కాదు. లౌకికమైన శారీరకమైన చేష్టలు కూడా. కనటం-వినటం-తాకటం- మూర్కొనటం- తినటం- తిరగటం- నిద్రించటం- నిశ్వసించటం- పలకటం- విడవటం- పట్టుకోవటం- కనులు మూయటం- తెరవటం- ఒక టేమిటి. ప్రతి నిత్యం చేసే ప్రతి సామాన్యమైన పని కూడా అలాగే భావిస్తూ పోవాలి. ఏమిటా భావన. ఆయా ఇంద్రియాలు ఆయా ఇంద్రియార్థాల్లో ప్రవర్తిస్తున్నాయి - నాదేమీ లేదనే ఉదాసీనత.

## 83

**కర్మ ణ్య కర్మ యః పశ్యే దకర్మ ణిచ కర్మ యః**
**స బుద్ధిమాన్ మనుష్యేషు-సయుక్తఃకృత్స్న కర్మకృత్ 4-18**

ఇంతకూ ఒక పని జరుగుతూ ఉన్నప్పుడూ ఏమీ జరగటంలేదని భావించాలి. అలాగే ఏమీ జరగనప్పుడు కూడా కర్మ జరుగుతున్నట్లు చూడాలి. అలా ఎవడుచూడగలడో వాడే అందరిలో బుద్ధిమంతుడు. వాడే యోగి. వాడే సకల కర్మలూ చేసినవాడు.

ఇదిఏమిటి. కర్మలో అకర్మ చూడమన్నారు. బాగనే ఉంది. కాని ఆనోటనే ఆకర్మలో మరలా కర్మ చూడాలంటున్నారు. ఇది పరస్పర విరుద్ధంకాదా అని ఆశంకవస్తుంది.

దీనికి సమాధాన మేమంటే కర్మలనేవి లోకంలో ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. నామరూపాలను బట్టే ఏ కర్మ అయినా. ఇది కర్మ జగత్తు. కాబట్టి కర్మ అనేదెప్పుడూ లేకుండాపోదు అయితే అలా జరిగే దాన్ని నా మూలంగా జరుగుతూ ఉందని భావించరాదు మనం. నా ప్రమేయమేమీ లేదందులో. ప్రకృతి గుణాలే వాటిని నిర్వర్తిస్తుంటాయి. నేను వాటిని కేవలం ఉదాసీనంగా చూస్తున్న శుద్ధచైతన్య రూపుడనని వైదొలగడమే కర్మలో అకర్మను చూడటం.

అలాగే శుద్ధచైతన్యం తప్ప సృష్టిలో మరేదీ లేనప్పుడీ నామరూపాలుగానీ, ఈ కర్మ కలాపంగానీ ఎక్కడి నుంచి వచ్చింది. వచ్చిందంటే దానిలోనుంచే రావాలి. ఇదంతా. దానిలోనే ఇదంతా ఒక ఇంద్రజాలం లాగా జరుగుతూ ఉండాలి. అలా జరిగేటప్పుడు దాని మూలంగా నా చైతన్యానికి క్షతి ఏముంది. తెరపైన తిరిగే బొమ్మల మూలంగా తెరకెలాంటి దోషమూ అంటదుగదా. ఇలా అనుసంధానం చేసుకోవడమే ఆ అకర్మలో మరలా కర్మను దర్శించటం.

కాబట్టి రెండూ పొసగేవే. ఒండొంటికి వైరుధ్య మేమీలేదు. ఇందులో ఇమిడి ఉన్న సబబేమంటే అకర్మ అనేది బ్రహ్మచైతన్యమే. మరి కర్మ అనేది ఏదోగాదు. నామరూపప్రపంచమే. అంచేత అకర్మలో కర్మ చూడటమంటే ఏమన్నమాట. నామరూపాల నన్నింటినీ బ్రహ్మంగా భావించటమని అర్థం. అలాగే కర్మలో అకర్మ చూడటమంటే చరాచర జగత్తంతా వ్యాపించి బ్రహ్మమే ఉందని గుర్తించడం.

కనుక రెండూ ఒక్కటే చివరకు. ఒకటి స్వరూపజ్ఞానమయితే మరొకటి దాని విభూతిదర్శనం.

## 84

యస్య సర్వే సమారంభాః-కామ సంకల్ప వర్జితాః
జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం-తమాహుః పండితం బుధాః **4-19**

కర్మలేవీ చేయకున్నా అన్నీ చేసినట్టేనని చెప్పాము. తత్త్వవేత్త విషయంలో అయితే చేయకున్నా చేసినట్టే ననే మాట కర్థమేమి. అని మరలా సందేహం. కర్మ చేయుటమంటే బాహ్యంగా కనిపించే ఆచరణ అనేగాదు. అంతరమైన సంకల్పమే అసలుకర్మ. ఎందుకంటే సంకల్పం లేకుండా ఏపనీ చేయలేము మనం. ఈ సంకల్పమనేది మనకు కామం వల్లనే ఏర్పడుతుంది. కామమంటే ఒకటి కావాలనే కోరిక. అది తన కన్నా భిన్నంగా ఈ ప్రపంచ మొకటి ఉందని భావించేనప్పుడే ఉదయిస్తుంది.

ఇలాంటి భావన తత్త్వదర్శి అయిన వాడికి లేదని పేర్కొన్నాము. వాడు ప్రపంచాన్నంతటినీ తన స్వరూపంగానే భావిస్తాడు. అంతాతానే అయినప్పుడిక అంతా తనదే. మరి దేనికోస మట్టులు చాచాలి వాడు. అలా ప్రాకులాడకపోతే అది సంకల్పమే అయినా కామసహితం కాదు తద్వర్జిత మవుతుంది. దీనినే సత్యసంకల్పమంటారు. తన రూపం సత్యం కాబట్టి దానిలోనుంచి ఉదయించే సంకల్పంకూడా సత్యమే. ఇలాంటి సంకల్పంతో ఏకర్మ నిర్వర్తించినా ఫరవా లేదు. అదీ సత్యమే అవుతుంది. ఎంచేత. తనకంటే భిన్నంగా ఆకర్మనుకూడా భావించడు తత్త్వవేత్త. అంచేత కర్మచేసినా చేయనివాడే అవుతాడు. సందేహం లేదు.

ఇంతదూరం వచ్చిన తరువాత ఆదృష్టి వాడికి విశ్వతో ముఖంగా వ్యాపిస్తుంది. అప్పుడది విస్ఫులింగం కాదు. విజృంభమాణమైన అగ్ని జ్వాల. దాని

మంటలో పడి సమస్త కర్మలూ కట్టెల మాదిరి కాలిపోవలసిందే. అప్పుడిక కర్మ లేమిటి. వాణ్ణి బంధించటమేమిటి. కర్మ వాగురలోనుంచి అతి మెలకువతో తప్పించు కోగల మహానేర్పరి వాడు.

## 85

**అనాదిత్వా న్నిర్గుణ త్వాత్-పరమాత్మాయ మవ్యయః**
**శరీర స్థోపి కౌంతేయ-నకరోతి నలిప్యతే 13-31**

పూర్ణ జ్ఞాని కర్మ చేసినా చేయని వాడే-అది వాడి నేమాత్రమూ బంధించదని ప్రతిపాదించాము. అది ఒక వేళ విదేహ ముక్తుడి విషయంలోనైతే చెల్లుతుం దేమో గాని దేహంతో ఉండగానే ఎలా చెల్లుబడి అవుతుందని అడగ వచ్చు. ఎందుకంటే దేహ మున్నప్పుడు కర్మ చేయక తప్పదు. కర్మ చేశామంటే అది జడమైన దేహం గాదు చేయటం. చేతను డైన జీవుడు. అలాంటప్పుడు వాడి కది బంధక మెలకాదని ప్రశ్న రావటం సహజమే.

దీనికి సమాధానం చెబుతున్నాడు భగవానుడు. శరీరం కాదుకర్మ చేయటం. అంత వరకూ ఆక్షేపణ లేదు. కాని శరీరంలో కూచొని ఒక జీవుడు చేస్తున్నా డంటున్నారే అక్కడే మనం విచారణ చేయ వలసి ఉంది. జీవుడే చేస్తున్నాడని భావిస్తే వాడు బద్ధుడే సందేహం లేదు. కాని జీవుడనే భావం నీవు కల్పించు కొన్నదే గాని వస్తుతః అలాంటి దెక్కడా లేదని మా సిద్ధాంతం. చిదా భాసుడే జీవుడు. చైతన్యం మనః ప్రాణాది శరీరో పాధుల మేరకే ఉన్నట్టు భాసిస్తే ఆభాసకే జీవుడని మనం పేరు పెట్టాము. వాస్తవంలో శరీరం మేరకే లేదా చైతన్యం లోపలా వెలపలా సర్వత్రా ఉన్నది. స్వచ్ఛమైన అద్దంలో ప్రతి బింబం లాగా మానవుల మనోదర్పణంలో ప్రతిఫలించి కనిపిస్తున్నది.

ఇది ఏమిటా అని మరలా వివేచన చేసి చూస్తే సగుణంగా కనిపించే ఈ జీవుడు నిర్గుణమయిన ఆ చైతన్యమే. నిర్గుణం గనుకనే అవ్యయం. మార్పు లేనిది. మార్పు లేకుంటే దాని కాది కూడా లేదు. కనుకనే శరీరంలో ఒక జీవాత్మ రూపంగా కనిపిస్తున్నా వాస్తవాని కది పరమాత్మే. అంటే శరీరంతో సంబంధ ముండీ లేనిదే. ఘటంతో సంబంధ ముండీ లేనిదే గదా ఆకాశం. అలాగే ఈ చిదాకాశం కూడా.

ఎప్పుడైతే వాస్తవమైన సంసర్గం లేదో అప్పుడీ శరీర మనః ప్రాణాదులనే ఉపాధులతో ఏ పని జరుగుతున్నా అది ఆ ఉపాధుల మూలంగా జరిగే పనేగాని

Brahmasri Vallabhajosyula Srinivasa Rao www.advaitavedanta.in

దానికి సంబంధించింది కానేరదు. చేస్తున్నట్టు కనిపించినా అది నిజంలో ఏ కర్మా చేయటం లేదు. ఒక ఘటాన్ని చేతితో పట్టుకు పోతుంటే దానిలోని ఖాళీ కూడా కదలి పోతున్నట్టు కనిపిస్తుంది. అంత మాత్రాన అది కదులు తున్నట్టా. అలాగే శరీరస్థమై కూడా అదేమీ చేయటం లేదు. చేయకనే పోతే ఇక ఆ కర్మ ఫలం మాత్రం దానినెలా అంటుతుంది. అదీ వట్టి మాటే. కాబట్టి పూర్ణ జ్ఞాని కర్మ చేస్తున్నా - శరీరంలో కనిపిస్తున్నా - వాడు ముక్తపురుషుడే.

## 86

**శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాత్ - జ్ఞానయజ్ఞః పరంతప**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే 4-33**

ఇలాంటి పరిశుద్ధమైన జ్ఞానదృష్టితో చేస్తేనే పనులు మనకంటకపోయేది. అలాకాక ఏమాత్రం సంకుచితమైన దృష్టితో చేసినా-అవి మన మార్గానికి దోహదం చేయటమలా ఉంచి చెప్పరాని ద్రోహం చేస్తాయి.

అయితే అలౌకికమైన కర్మలైతే ద్రోహకరం కావచ్చుగాని శాస్త్రచోదితమైన యజ్ఞ యాగాదికర్మలలాంటి వెందు కవుతాయని సందేహించవచ్చు. ఇక్కడ శాస్త్రీయమూ లౌకికమనే తేడాలేదు. పరమార్థంలో అన్నీ మాయామయమే. మాయికం కనుకనే అవి మానవుడికి ప్రేయస్సేగాని శ్రేయస్సుకావు. శ్రేయస్సనేది ఒకటే.

అది ఆత్మ జ్ఞానం.

జ్ఞానమే ఆమాటకువస్తే యథార్థమైన యజ్ఞం. మిగతావన్నీ భౌతికంగా జరిగేవి తదాభాసలే. వాస్తవంకావు. యజ్ఞమంటే యజనం లేదా భజనమని గదా అర్థం చెప్పాము. సర్వత్రా సర్వదా ఉన్న పదార్థమేదో దానినే భజించాలి మానవుడు. అది ఒక్క ఆత్మ పదార్థమే. నశ్వరమైన ప్రపంచంకాదు. ఆపేక్షిక సత్యమై Relative truth స్వర్గాదులూకావు.

అంచేత మిగతా భౌతిక యజ్ఞాలజోలికి పోక సాధకుడైనవాడు జ్ఞానయజ్ఞమే ఒక మహాయజ్ఞంగా నిత్యమూ అనుష్ఠిస్తూ పోవాలి. ఇందులో ఏమాత్రమూ ద్రవ్యం వెచ్చించనక్కరలేదు. ఎలాంటి పశుహింసకూ అవకాశంలేదు. అసలు బాహ్యాని కెంత మాత్రమూ ప్రదర్శన కూడాలేదు. నిరంతరమూ మానసికంగా జరిగే మహాయజ్ఞమిది. ఇలాంటి యజ్ఞాన్ని ఆచరిస్తూపోయే సాధకు దేకర్మా

ఆచరించ నక్కరలేదు. ఆచరించినా ఆచరించకపోయినా అవన్నీ ఇందులోనే వాడికి కలిసివస్తాయి. అంటే ఏమన్నమాట. జ్ఞానం కలిగే వరకూ ఏకర్మ అయినా చేయవలసిందే. జ్ఞానం గట్టి పడిందంటే ఇక అక్కడికి కర్మకాండ అంతా అగిపోవలసిందే. పోతే శారీరమైన కర్మ ఒక్కటే జరుగుతుంది. అదీ జ్ఞానాగ్నిచేత ఎప్పటికప్పుడు దగ్ధమవుతుందని వర్ణించారు. కాబట్టి ఏకర్మా లేదనే తాత్పర్యం.

## 87

**బ్రహ్మార్పణమ్ బ్రహ్మ హవి-ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్**
**బ్రహ్మైవ తేన గంతవ్యమ్-బ్రహ్మ కర్మ సమాధినా** **4-24**

జ్ఞానమే యజ్ఞమని వర్ణించారు. అది ఎలా సంభవం. యజ్ఞమంటే బాహ్యంగా జరిగే కలాపం గదా అని ప్రశ్న వస్తుంది. వాస్తవమే. యజ్ఞ మంటే అదే అభిప్రాయం మనందరికీ. అయితే అవన్నీ ద్రవ్యయజ్ఞాలు. ద్రవ్యయజ్ఞాలలో ఒక అగ్ని హోత్రమనీ ఒకహవిస్సనీ ఒక అర్పణమనీ-దానితో హవిస్సును హోమం చేయట మనీ ఒక కర్మానుష్ఠాన మనీ-ఫలమనీ. ఇంత కలాప ముంటుంది. ఇదంతా మనకు భౌతికంగా బాహ్యంగా కనపడు తుంటుంది.

ప్రస్తుత మీ జ్ఞానాన్ని ఒక యజ్ఞమని పేర్కొన్నామంటే ఇవన్నీ దానిలో కూడా ఇలాగే ఉంటాయని గాదు. ఒక యజ్ఞం లాగా అది చాలా పవిత్ర మైనదని దాన్ని ప్రశంసించట మిది. తన్మూలంగా సాధకుడికి దాని మీద ఒక ప్రరోచన Inclination కలిగి దాన్ని అర్జించటానికి నడుము కడతాడు. అందుకోసమే దాన్ని యజ్ఞమని వర్ణించటం. అంతేగాని ప్రతి ఒక్క కర్మా బ్రహ్మాకారంగా దర్శిం చుమని చెబుతున్నప్పుడు యజ్ఞమని విశేషించి చెప్పటం దేనికి. అనావశ్యకం.

కొందరీరహస్యం గ్రహించలేక నిజంగానే ఇది ఒక యజ్ఞమని అర్థం చేసుకొని యజ్ఞాంగములుగా ప్రసిద్ధి చెందిన అగ్ని హోత్రహవిర్మంత్రాదుల నన్నింటినీ బ్రహ్మ దృష్టితో దర్శిస్తూ పోవాలని అదే జ్ఞాన యజ్ఞమని వ్యాఖ్యానిస్తు న్నారు. అది శుద్ధ తప్పని చాటారు భగవత్పాదులు. అగ్నిహోత్రాదులను బ్రహ్మ దృష్టితో చూచినా అవి ఎక్కడికీపోవు. అలాగే కనిపిస్తుంటాయి. మహా అయితే బ్రహ్మ దృష్టి ఉంటుంది మనకంత మాత్రమే. అలా చూడటం ఉపాసన అవుతుందేగాని జ్ఞానం కాదు.

అయితే మరి ఎలా చూస్తే జ్ఞానమవుతుంది. ఏది బ్రహ్మమో అది ఈ అర్పణాదు లనిగాక – ఈ అర్పణాదులుగా ఏవి కనిపిస్తున్నవో అవి వాస్తవానికి బ్రహ్మమేనని చూడాలి. అప్పుడు బ్రహ్మ మర్పణాదులుగా గాక అర్పణాదులు బ్రహ్మాకారంగా దర్శనమిస్తాయి. ఇది ఎలాంటిదంటే – ఈ కనిపించేది రజతం కాదు – శుక్తికేనని చూడటంలాంటిది. దానివల్ల రజతమనే భ్రాంతి తొలగిపోయి శుక్తిక అనే వాస్తవం బయట పడుతుంది. వస్తువనేది ఎప్పుడూ ఏకం. దాన్ని మరచి చూచే భ్రాంతులనేకం. ఒక రజ్జువును మరచి చూదామంటే అది సర్పం కావచ్చు. దండంగావచ్చు. ధారగావచ్చు. వీటికే వికల్పాలని పేరు. ఈ వికల్పాల వల్లనే సంసారం. అదే సుఖ దుఃఖాలకు మూలం.

ప్రస్తుత మీ నామరూపాది ప్రపంచ మంతా ఆత్మ రూపమైన బ్రహ్మతత్త్వాన్ని విస్మరించటంవల్ల ఏర్పడ్డ వికల్పమే. ఇది ఇలా ఉన్నంత వరకూ మనకు క్షేమం లేదు. కాబట్టి బ్రహ్మమే ఇది అనే దృష్టితో చూడటం పనికిరాదు. అలా చూస్తే ఇది లయం కాదు. ఇంకా గట్టి పడుతుంది. లయం చేసుకోవాలంటే ఇదంతా ఆ బ్రహ్మమే – అంతకన్నా విలక్షణం కాదని దర్శించాలి. అప్పుడిది ప్రవిలయమై దీని బదులా బ్రహ్మ చైతన్యమే దృఢపడుతుంది. అంటే సవికల్పమైన దృష్టిపోయి సాధకుడికి కేవల నిర్వికల్ప దృష్టి నిలిచి ఉంటుంది. అదే జ్ఞానం. దాన్ని నిరంతరం నిలుపుకోటమే యజ్ఞం. పూర్ణజ్ఞానులంతా ఇలాంటి జ్ఞాన యజ్ఞమే చేస్తుంటారు. వారు జీవితసంలోచేసే ప్రతి కర్మా ఈ యజ్ఞ కుండంలో పడి భస్మం కావలసిందే తప్పదు.

## 88

**తద్విద్ధి ప్రణి పాతేన – పరి ప్రశ్నేన సేవయా**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం– జ్ఞానిన స్తత్త్వ దర్శినః 4-34**

అయితే ఈ జ్ఞానం మనకెలా లభిస్తుంది – ఎవరు బోధిస్తారు దీన్ని మనకు – అని ప్రశ్న. అది జ్ఞానులైన మహాత్ముల దగ్గర మాత్రమే దొరికే ధనం. వారు మనకు దానిని ప్రసాదిస్తారు. అయితే ఊరక ఉత్రవడియంగా ప్రసాదించరు దాన్ని.

మొదట మనమే పోయి వారికి ప్రణిపాతం చేయాలి. ప్రణిపాత మంటే కాళ్ళ మీద పడటం మాత్రమేగాదు. సవినయంగా వారిని ప్రాధేయపడటం.

అలా బ్రతిమాలినా అప్పుడే నీకు వారు బోధించ నక్కరలేదు. నీకు జిజ్ఞాస ఏమాత్రమున్నదో వారికెలా తెలుస్తుంది. "నాపృష్టః కస్యచి ద్బ్రూయాత్" అన్నారు కాబట్టి సాధన మార్గాన్ని గూర్చి నీవు వారి ననేక విధాల ప్రశ్నించవలసి ఉంది. ప్రశ్నవేస్తే రెండు రహస్యాలు బయటపడతాయి. అంతకు ముందు నీకెంత జ్ఞాన ముందనేది ఒకటి. ఇక ఎంత గడించాలనేది మరొకటి. రెండూ తెలుసుకో వలసినవే.

పోతే ఊరక ప్రొద్దుపోక కుతుహల కొద్దీ కూడా ప్రశ్నించవచ్చు. ఒకవేళ సమాధాన మిచ్చినా దాని నమలు పరచే శ్రద్ధ లేకపోవచ్చు. కాబట్టి శ్రద్ధ ఉందనే హామీ కూడా నీవు వారి కివ్వవలసి ఉంటుంది. అదే "సేవయా" అనేమాట కర్థం. అంతే గాని పాద సంవాహనాదులు కావుసేవ అంటే. అది అషాఢభూతి లాంటి వాడు కూడా చేయవచ్చు. నీవూ నేనే కావలసిన పనిలేదు.

ఇదుగోఇన్ని విధాల పాటు బడితే ఎంతో యోగ్యతా కలవాడవని నమ్మకం తోస్తే వారు నీకు ఆజ్ఞాన మనేది ఉపదేశించగలరు. ఉపదేశించాలంటే వారు మొదట జ్ఞానులై ఉండాలి. అది కూడా కేవలమూ శాస్త్రజ్ఞానమైతే ప్రయోజనం లేదు. శాస్త్ర జ్ఞాన మనేది పరోక్షమే. అపరోక్షం కాదు. అనుభవానికి వచ్చినప్పుడే అది అపరోక్ష మవుతుంది. అదే తత్త్వ దర్శనం. తత్త్వాన్ని గ్రహించటమే గాక ముఖాముఖి దర్శించాలి కూడా. దర్శిస్తేనే పరిపూర్ణ జ్ఞానమిది. ఇలాంటి పూర్ణజ్ఞాన మార్జించిన మహా పురుషుడైతేనే వాడు తరించి మనలను కూడా తరింప జేయగలడు.

## 89

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం-తత్పర స్సంయతేంద్రియః**
**జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి-మచిరేణాధి గచ్ఛతి 4-39**

దేనికైనా చివరకు శ్రద్ధ అనేది ప్రధానం. జ్ఞానానికైనా అదే. విజ్ఞానానికైనా అదే. అది తల్లిలాగ సాధకున్ని కొనా మొదలూ కాపాడుతూ వస్తుంది. అంచేత అది ముందు లభిస్తే గాని ఇది క్రమంగా అనుభవానికి రాదు. ఆయితే ఈ శ్రద్ధ అనే దేమిటి. ఏ రూపంలో ఉంటుందది. "తత్పర" అన్నారు. ఒక విషయంలో తత్పరత్వం లేదా తాత్పర్యం గలిగి ఉండటమే శ్రద్ధ. తత్పరత్వ మంటే ఆదే లోకంగా మెలగటం. మరే అవరోధనా మనసుకు రాకపోవటమని ఆర్థం.

Vallamraju Srinivasa Rao www.advaitavedanta.in

అది ఎలా ఏర్పడుతుంది. ఇంద్రియ నిగ్రహం పూర్తిగా ఉన్నప్పుడే ఏర్పడు తుంది. ఇంద్రియాలంటే కర్మేంద్రియాలూ ఉన్నాయి. జ్ఞానేంద్రియాలూ ఉన్నాయి. వెలపలి విషయాలు లోపల కందించేవి జ్ఞానేంద్రియాలైతే - లోపల వాటిని వెలపలికి జారీ చేసేవి కర్మేంద్రియాలు. వీటికి నాయకులు అటు మనస్సూ-ఇటు ప్రాణమూ. ఈ కలాపమంతా ఇంద్రియాలనే జాతి క్రిందకే వస్తుంది. వీటి నదుపులో పెట్టుకోవాలి సాధకుడు.

ఇంత తరిఫీదు అయితే మనం జ్ఞానమనే ధనాన్ని ఆర్జించటానికి నోచు కొంటాము. జ్ఞానమంటే పరోక్షాపరోక్షాలు రెండూనని అర్థంచేసుకోవాలి. ఇలాంటి జ్ఞానం సాధకుడి కబ్బిందంటే దానికొక్కటే తార్కాణం. శాశ్వతికమైన శాంతి లభించాలి సాధకుడికి. అదికూడా ఎప్పుడో కాలాంతరంలో కాదు. జ్ఞాన మెప్పు డబ్బిందో అప్పుడే.

## 90

**అరురుక్షో ర్మునే ర్యోగం-కర్మకారణ ముచ్యతే**
**ఆరూఢస్య తు తస్యైవ - శమః కారణ ముచ్యతే 6-3**

ఇంత వరకూ జరిగిన మీమాంస కంతటికీ ఏమిటి పండి తార్థం కర్మ-జ్ఞానం ఈ రెండింటికీ పైకి చూస్తే ఏదో వైరుధ్య మున్నట్లు కనిపిస్తుందేగాని ఆంతర్యంలో అలాంటి దేమీలేదు. మోక్ష మనేది గమ్యమనుకొంటే జ్ఞానం దానికి సాక్షాత్సాధనం. పోతేకర్మ సాక్షాత్తుగాకాదు గాని జ్ఞానంద్వారా సాధనం. అంటే కర్మ జ్ఞానానికి దారితీస్తే ఆ జ్ఞానం మోక్ష ఫలాన్ని ప్రాసాదిస్తుంది మనకు.

అంచేత గీత మనకిచ్చే సలహా ఏమంటే జ్ఞానం కలిగేదాకా కర్మ వదిలేయ రాదు. వదిలేస్తే జ్ఞానోదయానికి మార్గంలేదు. జపతపాలలాంటి యజ్ఞయాగాల లాంటి విధులు కాకపోయినా జ్ఞానార్జనకు తోడ్పడే కర్మ సమాధి భక్తియోగాలైనా ఆచరించవలసిందే గదా. ఆ మూటినీ కలిపి చెప్పే ఒక్కమాటే కర్మ అంటే. ఇలాంటి కర్మ లేదా యోగమనేది జ్ఞానం కలిగే దాకా సాగించవలసిందే తప్పదు,

పోతే జ్ఞానమనే ఫలం మనచేతి కెప్పుడందిందో ఇక కర్మకు ప్రమేయంలేదు. కాబట్టి జ్ఞానప్రాప్తి అనంతర మిక సాధకుడు దాన్ని పరిత్యజించ వలసి ఉంటుంది. జ్ఞాన మబ్బేవరకూ వాడారురుక్షుడు. అంటే పర్వత శిఖర మెక్కినట్టు ఎక్కుతూ ఉంటాడు. అబ్బిన తరువాత ఇక ఆరు రుక్షువు కాదు ఆరూఢుడు.

అంటే శిఖరం మీద పాదం నిలిపినవాడు. నిలపితే ఇక పైకిపోయే ప్రసక్తి ఏముంది. కనుక మరి చేయవలసిన కర్మ అంటూ ఏదీలేదు. ఏదీ లేదంటే శాస్త్రీయమైనవీ లౌకికమైనవీ కూడానని అర్థం. శారీరకమైనకర్మ మాత్ర మప్పుడూ ఉంటుంది. దానిని మాత్రం విడవటానికి వీలులేదు. అది ప్రారబ్ధంతో జరిగేదికాబట్టి బ్రహ్మానుభవానికి ప్రతి బంధకం కాదు. అంతకుమించి చేసిం దంతా ప్రతిబంధకమే. అంచేత శమమే అప్పుడనుసరించ వలసిన మార్గం. శమమంటే కర్మలనుంచి విరమణ.

## 91

**సన్న్యాసస్తు మహాబాహో - దుఃఖమాప్తు మయోగతః**
**యోగయుక్తో ముని ర్బ్రహ్మ - న చిరేణాధి గచ్ఛతి 5-6**

దీనిని బట్టి ఎప్పటికైనా సాధకుడు కర్మలను సన్న్యసించ వలసిందే! లేకుంటే జ్ఞానమబ్బినా అది నిష్ఠగా పరిణమించదు. నిష్ఠలేకుంటే ముక్తిలేదు. కాబట్టి జ్ఞానో దయమైన తరువాత అ సర్వకాల సర్వావస్థలలో నిలబడడానికి కర్మలను సన్న్యసించక తప్పదు.

అయితే ఎటువచ్చీ అది ఉదయించటానికి పూర్వమే తొందరపడి వీటిని మనం వదులుకోరాదు. వదిలితే జ్ఞాన మార్జించటాని కసలు మార్గమే లేదని చెప్పాము. కాని కొందరి విషయంలో కర్మలేవీ చేయకుండానే బాల్యంలోనే సన్న్యసించినట్టు మనకు కనబడవచ్చు. వారు కారణ జన్ములు ఇంతకు ముందు జన్మలలోనే ఆ కర్మాను ష్ఠానం జరిగిపోయి ఉంటుంది వారికి.

మొత్తంమీద కర్మవల్లనే జ్ఞానం. అది ఉపాయం Means. ఇది దాని కుపేయం End. ఉపాయం లేకుండా ఉపేయం మనకెలా లభిస్తుంది. అందుకే యోగ యుక్తుడయితే సాధకుడు మనన శీలుడవుతాడు. ఆ మననంతో వెంటనే బ్రహ్మన్ని అందుకొంటాడు.

మనన మేమిటి. బ్రహ్మమేమిటి. ఆత్మజ్ఞానమే మననం. అది కర్మయోగం వల్లనేప్రాప్తిస్తుంది మనకు. ఆజ్ఞానం మరలా కర్మసన్న్యాసం ద్వారా జ్ఞాననిష్ఠగా మారుతుంది. బ్రహ్మమంటే ఈజ్ఞాననిష్ఠే-మరేదీగాదు. ఇంతకూ వివక్షిత మేమంటే మోక్షానికి మార్గమొక్కటే-రెండులేవు. అది జ్ఞానమే. పోతే కర్మ లేదా యోగమనేది ఆ మార్గంలో మజిలీ మాత్రమే స్వతంత్రమైన వేరొకమార్గంకాదు.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఇక్కడ చాలామంది మతాచార్యులే బోల్తాపడ్డారు. సాధకుడి విషయంలో చాలా జాగరూకుడయి ఉండాలి. లేకుంటే రెంటినీ సమన్వయించుకోలేక సాధన దెబ్బతింటుంది.

## 92

**యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం - త ద్యోగైరపి గమ్యతే**
**ఏకం సాంఖ్యంచ యోగంచ-యః పశ్యతి సపశ్యతి 5-5**

ఇలాంటి సమన్వయదృష్టి ఉన్న వాడికే సాంఖ్యయోగాలు రెండూ ఒక్కటేననే సత్యం బోధపడుతుంది. సాంఖ్యమంటే జ్ఞానమనీ - యోగమంటే కర్మ అనీ - గీతా పరిభాష. వాటి రెంటినీ ఏకంగానే భావిస్తున్నాడు తత్త్వవేత్త.

ఏకంగానే అంటే సాధనలో కాదు. ఫలంలో. రెండూ ఫలంలో సమానమే. ఎలాగంటే జ్ఞానంవల్ల ఏ మోక్ష ఫలాన్ని పొందుతాడో సాధకుడు దానినే కర్మవల్ల కూడా పొందుతున్నాడు. అయితే జ్ఞానంవల్ల నేరుగా పొందుతాడు. కర్మవల్ల పరం పరయా పొందుతున్నాడు. ఎలాగైనా ఫలప్రాప్తిలో తేడాలేదు. కాబట్టి ఫలదృష్ట్యా రెండూ ఒక్కటే.

ఇక్కడ వున్న సూక్ష్మ మేమంటే కర్మయోగ శిక్షణ అంతా పూర్వ జన్మలోనే ముగించుకొని ప్రస్తుత జన్మలో ఆలోచనా పరుడుగానే జన్మించిన ఉత్తమాధి కారికి కర్మ మార్గమక్కరలేదు. నేరుగా వాడు జ్ఞానమార్గంలోనే అడుగు పెట్ట వచ్చు.

అలాంటి పూర్వ సంస్కారం లేని మంద మధ్య మాధికారులు మాత్ర మీజన్మలోనైనా ఆ శిక్షణ నారంభించవలసిందే. కాబట్టి వారు వారి యోగ్యతకు తగినట్లు ఆయా కర్మ భక్తి సమాధి రూపమైన యోగాన్ని సేవిస్తూ తన్మూలంగా చిత్తశుద్ధి సంపాదించి ఆ తరువాతనే జ్ఞానంలో ప్రవేశించాలి. అంచేత ఫలైక్యమున్నా - ఇద్దరికీ సాధన క్రమంలో ఉన్న ఈ తేడా మనం గమనించ వలసి ఉంది మరలా.

## 93

**లోకేస్మిన్ ద్వివిధా నిష్ఠా - పురా ప్రోక్తా మయానఘ**
**జ్ఞాన యోగేన సాంఖ్యానాం - కర్మ యోగేన యోగినాం 3-3**

Yellamraju Srinivasa Rao www.advaitavedanta.in

ఈ విధంగా సాధన మార్గంలో ఉన్న తేడాను మనసులో పెట్టుకొనే ఆ భగవానుడిలా సెలవిచ్చాడు. నేనీ లోకులకు రెండు రకాలైన మార్గాలను బోధించాను. ఒకటి జ్ఞానం - మరొకటి కర్మ అందులో జ్ఞానులైన వారికి జ్ఞాన మార్గ మైతే-కర్ములకు కర్మ మార్గం చెప్పాను. ఎవరి పాటికి వారు తమ మార్గం పట్టుకొనిపోతే చాలు. చివరికిద్దరూ ఒకే గమ్యాన్ని చేరుతారు.

ఇందుమూలంగా మార్గంలో ఉన్న భేదాన్ని ఆయన స్పష్టంగా బయట పెట్టారు. కాబట్టి ఇప్పుడు మన మొక అపోహను పోగొట్టుకొనవలసి ఉంది. సాధారణం లోకులందరికీ ఒక అపోహ ఉంది. విద్యావంతులకు కూడా చాలా మంది కుందది. ఏమంటే కర్మ భక్తి జ్ఞానాలు మూడు మార్గాలే - అందులో ఎవడేది పట్టుకొని పోయిన గమ్యం చేరవచ్చునని. అది శుద్ధ పొరబాటని మన కిప్పుడు తేలిపోయింది. అన్నీ ఒకటే అయితే జ్ఞానయోగుల కిదీ - కర్మ యోగుల కదీ - రెండు రకాలు చెప్పానని భగవానుడెలా అంటాడు. కాబట్టి అవి రెండూ ఒకటి కావు.

అయితే ఒకటి కావంటే ఇందులో ఒక రహస్యముంది మరలా. రెండు రెండు ప్రత్యేక మార్గాలు కావవి. అయితే మరేమిటి. ఒకే మార్గంలో రెండు మజిలీలు. నాన్యః పంథా విద్యతే యనాయ- అన్నారు పెద్దలు. మోక్షాని కొక్కటే మార్గం. రెండూ లేవు. రెండనేది కేవలం మజిలీలే. అందులో మొదటి మజిలీ కర్మ. చివరి మజిలీ జ్ఞానం. అందుకే ద్వివిధా నిష్ఠా అని ఏక వచనాంతంగా ప్రయోగించింది. విధాలంటే భూమికలు. రెండు భూమికలు కల ఒకే నిష్ఠ అది. దీనిని బట్టి గీతా శాస్త్రంలో చెప్పినదంతా క్రోడీకరిస్తే ఒకే ఒక యోగమని తేట పడుతున్నది. దీని కుపోద్బలకంగా "ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహ మవ్యయం" అని తాను అనాది నుంచీ ఒకే ఒక మార్గాన్ని బోధిస్తూ వచ్చి నట్టు సూచిస్తాడు భగవానుడు.

## 94

**మయా తతమిదం సర్వం - జగదవ్యక్త మూర్తినా**
**మత్థాని సర్వ భూతాని - న చాహం తేష్వ వస్థితః** **9-4**

## 95

**నచ మత్థాని భూతాని - పశ్యమే యోగ మైశ్వరం**
**భూతభృ న్నచ భూతస్థో - మమాత్మా భూత భావనః** **9-5**

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

మోక్షమార్గంలో ఉండే ఈ భూమికలనే చక్కగా బయట పెడుతున్నా యీ రెండు శ్లోకాలూ, సాధన రహస్యమంతా వీటిలోనే గుప్తమయి ఉంది. అధ్యాత్మ రంగంలో సిద్ధమయిన తత్త్వాన్ని బట్టే ఎప్పుడూ సాధన అనేది నిర్ణీతమై ఉంటుంది. ఎందుకంటే సాధన వల్ల చేరవలసింది చివరకా తత్త్వాన్నే. అలాంటప్పుడు సాధన దానికి విలోమంగా ఉండటం ఎలా చెల్లుతుంది.

అయితే ఈ తత్త్వ మనేది తన ఫాటికి తాను ఒకే రూపంలో ఉన్నా - దాని నర్థం చేసుకొనే సాధకుల దృష్టిని బట్టి అనేక రూపాలుగా భాసిస్తూంటుంది. అప్పటికి వారికదే గమ్యమవుతుంది. కాని అది వస్తు తత్త్వం కాదు. సాధకుడి దృష్టి అంతకంతకు పెరిగే కొద్దీ అదీ పెరుగుతూపోతుంది. అలా పెరుగుతూ పూర్తిగా వస్తువును సమీపించి దృష్టి నిలిచే సరి కది అప్పుడు వాస్తవమైన స్వరూపంగానే అనుభవానికి వస్తుంది.

దీనిని బట్టి చూస్తే ప్రస్తుతం అవ్యక్తరూపుడనైన నేనీ సృష్టినంత వ్యాపించి ఉన్నా నంటున్నాడు పరమాత్మ. ఇది భేద దృష్టి ననుసరించి చెప్పినమాట. ఇందులో సృష్టివేరు. స్రష్టవేరు. రెండూ సత్యమే. సృష్టిలో ఒకడుగా జీవిస్తున్న మన మీ సృష్టికంతా నాయకుడైన పరమాత్మ ఒకడున్నాడని గుర్తించి తత్సేవకుల మని భావిస్తూ తదర్థంగా సత్కర్మ లాచరిస్తూ సత్త్వాన్ని శుద్ధి చేసుకొనే ప్రయత్నం చేయాలి

అలా చేశామంటే సకల భూతాలూ నాలో ఉన్నాయేగాని నేను మాత్రం వాటిలో లేనని చాటుతున్నాడు పరమాత్మ. ఇది భేదా భేద దృష్టి ననుసరించి చెప్పిన వాక్యం. పరమాత్మకు సంబంధించినట్టుగా ఈ సృష్టిని చూడటమంటే గుణ విశిష్టంగా తత్త్వాన్ని భావించటమని అర్థం చేసుకోవాలి. దీనిమూలంగా సృష్టిని వేరుగా చూడక తద్విశిష్టమైన పరమాత్మ తత్త్వాన్నే పట్టుకొంటాడు. కాబట్టి సాధకుడి చిత్తానికి శుద్ధియేగాక ఏకాగ్రత కూడా ఏర్పడుతుంది.

అలా ఏర్పడ్డ తరువాత మూడవ భూమిక ఒకటుంది. ఆఖరిది కూడ అదే. "నచ మత్థాని భూతాని" నాలో కూడ అసలవి లేవు. వాస్తవంలో ఉన్నది నేనొక్కడనే. దీనిని బట్టి పరమాత్మతత్త్వ మొకటి తప్ప సృష్టి అనేదసలు దానికి భిన్నంగా ఎప్పుడూ ఎక్కడా లేదని అర్థమవుతున్నది. ఇది కేవల మభేదదృష్టి ననుసరించి చెప్పేమాట. ఇదే అసలు పరమార్థం. అయితే ఆ ముందు చెప్పిన రెండు మాటల కర్థమేమిటి. అవి లేవు వాస్తవంలో. అయినా లోకు లావిధంగా

చూస్తున్నారు తత్త్వాన్ని. తాము చూచిందే అసలు తత్త్వమని నమ్ముతున్నారు. కాబట్టి లోక దృష్టి ననుసరించి తాత్కాలికంగా చేసిన వర్ణన అది. కొంతకాల మలాభాసించినా క్రమంగా వారే ఎప్పటికైనా అసలు తత్త్వాన్ని అందుకోగలిగిన స్థోమత సంపాదిస్తారనీ - సంపాదించినప్పుడు వారికి బోధించవలసిందీ కడపటిదేననీ - శాస్త్రహృదయం.

ఇందులో మొదటిదైన భేదదృష్టే కర్మయోగం. రెండవదైన భేదా భేదదృష్టే భక్తియోగం. పోతే మూడవదైన అభేదదృష్టి జ్ఞానయోగం. ఈ జ్ఞానమే అందుకో వలసింది చివరకు. దానిని చేర్చే సాధనాలే మొదట చెప్పిన రెండూ. అవీ సాధకుడికి జ్ఞానం కలిగించటానికి తాత్కాలికంగా కల్పించినవే గాని - యథార్థం కావు. యథార్థం అద్వయమైన చైతన్య తత్త్వమే. అందులో ద్వితీయ మనే మాటకు చోటు లేదు. లేకుంటే ద్వితీయంగా మన మారోపించినంత మాత్రాన అది ఎలా భాసించగలిగిందనీ ప్రశ్న. పశ్యమే యోగ మైశ్వరమ్మనే మాటలో ఉంది సమాధానం నిరుపాధికమైనా నామరూపాదులైన ఉపాధుల ననేకంగా సృష్టించే శక్తి ఉంది దానికి. అదే ఈశ్వరీయమైన యోగమాయ, తనపాటికి తాను కాకపోయినా జీవుల అవిద్యా దోష దృష్టి ననుసరించి అది చిత్ర విచిత్రంగా దర్శనమిస్తుంది. అదే ఈ సృష్టి. విభూతి అనికూడ దీనికే పేరు. అయినా ఇదంతా కల్పితమే కాబట్టి దీనిని ప్రవిలయం చేసుకొని చూచే ఆ చైతన్య తత్త్వమే అసలైన స్వరూపం. అది జ్ఞానం వల్లనే సాధ్యం. కాబట్టి ఆజ్ఞానమే అన్నింటికన్నా ప్రధానమైన సాధానం. అది ఒకటి దగ్గర ఉంటే చాలు. దానిలో మిగతా కర్మోపాసనాది సాధనలన్నీ కలిసి వస్తాయి. ప్రత్యేకంగా వీటికోసం కృషి చేయనక్కరలేదు. చేసినా దానిని సంపాదించటానికే ఆ కృషి. తరువాత వీటి కస్తిత్వంలేదు.

## 96

**రాజవిద్యా రాజగుహ్యం - పవిత్రమిద ముత్తమం**
**ప్రత్యక్షావ గమం ధర్మ్యం - సుసుఖం కర్తు మవ్యయం . 9-2**

కనుకనే మరలా మొదటికి వచ్చి మాటాడితే జ్ఞానం కన్నా పవిత్రమైనదీ - ఉత్తమమైనదీ - మరొక సాధన మేదీ లేదని చెప్పవలసి వస్తున్నది. పవిత్ర మెందుకయింది. సంసార కాలుష్యాన్ని ఏ కొంచెం కూడా మిగలకుండా దహించి వేస్తుంది గనుక. "జ్ఞాన ముత్పద్యతే పుంసాం క్షయాత్పాపస్య కర్మణః"

Vallabhajosyula Brahmasri Rao
www.advaitavedanta.in

అసలు పాప కర్మ అంతా సమూలంగా నశిస్తేగాని జ్ఞానముదయించదు. కాక పోయినా సర్వమూ శుద్ధ చైతన్యాత్మకంగానే భాసిస్తూ ఉన్నప్పుడిక ఎలాంటి కల్మషానికి గానీ చోటెక్కడిది. కాబట్టి పవిత్రంలోకీ పవిత్రమది.

పోతే ఉత్తమమెలా అయింది. మంద మధ్యమ స్థాయిలు రెండూ దాటి పోయింది గనుక. కర్మానుష్ఠానం మందులకైతే - ఉపాసనాదులు మధ్య మాధి కారులకు. కాగా ఉత్తమాధికారులకు చెప్పవలసింది జ్ఞానమార్గ మొక్కటే. ఎంతో చిత్తపరిపాక మున్నవారు గాని దాని నందుకోలేరు. "యతతామపి సిద్ధానాం కశ్చి న్మాం వేత్తి" అని భగగవానుడు పేర్కొనటంలో ఇదే అంతరార్థం.

ఇంత గొప్ప స్థాయికి చెందినది గనుకనే దానిని రాజవిద్య అనీ రాజయోగ మనీ - ప్రశంసించారు. మనుష్యులలో రాజులాగా విద్యలన్నిటికీ అది రాజు. అంతేగాక కళలలోకూడ రాజు. గుహ్యమంటే రహస్యం. అదే కళ. పోతే విద్య అంటే శాస్త్రం. ఒక సత్యాన్ని గుర్తించటం శాస్త్రమైతే దాని నమలు పరచటం కళ. ప్రస్తుతం సర్వమూ చైతన్యమనే విషయమే సత్యం. దానిని గ్రహిస్తే చాలు. అదే జీవితంతో కూడా నిలుపుకోవలసి వుంది. అది కళ. దానితో "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" అన్నట్టు తానే బ్రహ్మ స్వరూపుడవుతాడు సాధకుడు. అయితే ఇంక కొరతేముంది. సర్వసిద్ధులూ అతనివే.

ఇది నిజమా అని సందేహించ నక్కరలేదు మనం. మిగతా కర్మో పాసనల మాదిరి దీని ఫలితం మనకెప్పుడో చచ్చిన తరువాత ప్రాప్తించేది కాదు. ఇప్పుడే ఇక్కడే ఇహ జీవితంలోనే మనకు ప్రత్యక్షంగా అనుభవానికి వస్తుందని శాస్త్రమిచ్చే హామీ. ఎందుకంటే జ్ఞానం వేరు - జ్ఞేయం వేరు కాదిక్కడ. జ్ఞేయ మనుకొనే బ్రహ్మం కూడా జ్ఞాన స్వరూపమే. అందుకే దానిని పట్టుకోవడం కూడా సులభమే. రత్నవివేకం మాదిరన్నారు భగవత్పాదులు. ఎన్నో రాళ్ళమధ్య మరుగుపడి ఉన్నా ఒక జీవరత్నాన్ని గుర్తించటమెంత సులభమో అంత సులభ మట. మనం బాహ్యంగా చూచేవి - లోపల ఆలోచించేవీ - ఇవన్నీ చూస్తున్నదీ చేస్తున్నదీ ఎవరు - దేని వెలుగులో జరుగుతున్నది ఇదంతా - అవి ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకుంటే చాలు. నామ రూపాలకు విలక్షణంగా తన స్వరూపం ఎప్పటికప్పుడు గోచరమవుతూనే ఉంటుంది. దానికి రూపం లేదే ఎలాగ అని ప్రశ్నే రాదు. ఒక సుఖం లాగా ఉత్సాహం లాగా మనసుకు రావటానికి ఆక్షేపణ ఏముందన్నారు.

# 97

**అజ్ఞ శ్చా శ్రద్ధధాన శ్చ - సంశయాత్మా వినశ్యతి**
**నాయం లోకోస్తి నపరో-న సుఖం సంశయాత్మనః 4-40**

అయినా నూటికి తొంబదితొమ్మిది మందికీ రహస్య మంతుబట్టటంలేదు లోకంలో. అంచేతనే వారికి శ్రద్ధలేదు. ఏ విషయమైనా దాని విలువ తెలిసి నప్పుడే సాధించాలనే శ్రద్ధ ఏర్పడుతుంది. అసలు దాని ముక్కూ మొగం తెలియని వారికి దానిమీద శ్రద్ధ ఎలా కలుగుతుంది. కనుక అజ్ఞానంవల్లనే మనకు శ్రద్ధలేకపోవడం.

శ్రద్ధ ఎప్పుడు కరువయిందో అప్పుడు ప్రతి ఒక్కటీ మనకు సంశయా స్పదమే. శ్రద్ధ అంటే నమ్మకమే గదా. నమ్మితే సొమ్ము నమ్మకపోతే దుమ్మన్నారు. సామాన్యులకేగాదు - సాధకుల నుకొనే వాళ్ళకు కూడా ఈ జాడ్యమెంతో ఉంది. కలదు కలండనెడు వాడు కలడో లేడో అన్నట్టు ఎంత ప్రయత్నిస్తున్నా - ఏదో ఒక సాధన భూమికలో సంశయ పిశాచ మెదురవుతూనే ఉంటుంది.

ఇదుగో ఈ సంశయమనే దయ్యం పట్టిందంటే చాలు. ఇక దాన్ని విడిపించు కోటమసాధ్యం. కేవల మజ్ఞత వరకయితే ఒక విషయం తెలియదు. అంత మాత్రమే. నమ్మకం లేకుంటే లేకపోయింది. దాని జోలికి పోము. అదీ ప్రమాదం లేదు. కాని తెలుసుకొని నమ్మి కొంత ముందుకుపోయి మధ్యలో ఇది యథార్థంగానే మనలను కడతేరుస్తుందా లేదా అని అనుమానించామో - అంతకన్నా ప్రమాదంలేదు. ఇహానికీ పరానికీ దూరమయి రెంటికీ చెడిన రేవడి లాగా తయారవుతాము. చేసింది కూడా దానితోపాటు ఊడ్చుకుపోతుంది.

కాబట్టి మోక్ష సాధనలో మానవు డెప్పుడేగాని సంశయానికి గురికారాదు. అలా కాకూడదంటే చేసే పని ముమ్మాటికీ సత్యమేనని విశ్వాసం సడలకుండా ఉండాలి. అది సడలకుండా సాగాలంటే తన గమ్యమేమిటో దాన్ని నూటికి నూరుపాళ్ళూ కచ్చితంగా తెలిసి పట్టుకోవాలి. ఇలా మూడు ఒక దాని కొకటి సహకారులయి చివరకు మోక్షఫల ప్రాప్తికి దోహదం చేస్తాయి. లేకుంటే అంతా అయోమయమే.

# 98

**తస్మా దజ్ఞాన సంభూ తం - హృత్థం జ్ఞానా సినా పునః**
**ఛిత్త్వైనం సంశయం యోగ - మాతిష్ఠోత్తిష భారత 4-42**

ఇంతకూ అన్ని అనర్థాలకూ మూల కారణం మానవుడి అజ్ఞానం. అంతా భగవత్స్వరూపమే- అది నేనే- అనే పరమ సత్యం తెలియక పోవటమే అజ్ఞాన మంటే. ఈ అజ్ఞానం వల్లనే సంశయ మనేది అడుగడుగునా కొడి ఎత్తుతున్నది. కాబట్టి దానిని సమూలంగా పెకలించి అవతల పార వేయాలి.

అయితే సమూలంగా అంటే దాని మూల మెక్కడ ఉందని. ఎక్కడో దూరం గా లేదది. మనలోనే మన హృదయంలోనే పాదుకొని ఉన్నదది. హృదయమనేది ఎప్పుడూ మనల నెడబాయకుండా మనదే అయిన పదార్థం. కాబట్టి తద్గతమైన సంశయ భూతాన్ని వెదకి పట్టుకోటం ఏమంత దుష్కరం గాదు. అయితే ఆ క్రియకు తగిన సాధనం కావాలి మనకు. అదే జ్ఞాన సాధనం. అది ఒక తీక్షణ మైన కరవాలం లాంటిది. దానితో పట్టి నరికితే ఎక్కడెక్కడి వేళ్ళూ తెగిపోతాయి సంశయమనే వృక్షానికి. అది ఒక్క వేటుకు కాకపోతే రెండు మూడు దెబ్బలకైనా నిర్మూలం కాక తప్పదు.

అయితే ఒక్కమాట. జ్ఞాన కుఠార మజ్ఞాన జన్యమైన సంశయ వృక్షాన్ని పెళ్ళగించి వేస్తుంది. మంచిదే. కాని ఈ కలిగిన జ్ఞానం మరలా తప్పిపోకుండా కాపాడుకోవలసిన బాధ్యత ఉంది సాధకుడికి. లేకుంటే మరలా ఆ విషవలయం లోనే పడే ప్రమాదముంది. చీకటి లాగా పొంచి ఉంటుంది అజ్ఞానం. జ్ఞానమనే వెలుగు ఉన్నంత వరకూ అది ప్రక్కపొంచి ఉంటుంది. అది ఏమాత్రం సడలినా నేనున్నానని వెంటనే తల ఎత్తుతుంది. ఆ మేరకది అజ్ఞానానికి క్రీడాస్థలమే. అంచేత అది సడలకుండా గట్టిగా నిలపటానికి యోగాన్ని ఎప్పుడూ అభ్యసిస్తూ ఉండాలి. యోగమంటే స్వసంవేద్యతా పాదన మని లక్షణం చెప్పారు భాష్య కారులు. విషయంగా కాక విషయిగా - అంటే నేనే అది - అనే భావంతో పట్టుకోవాలి దాన్ని. నేననేది నాకంటే దూరం కాదు. కాబట్టి అది కూడా దూరమయ్యే ప్రశ్నలేదు. ఇదుగో ఈ ప్రక్రియకే స్మరణమని పేరు వేదాంతంలో.

## 99

**నరూప మస్యేహ తథోప లభ్యతే**
**నాంతో నచాది ర్నచ సంప్ర తిష్ఠా**
**అశ్వత్థ మేనమ్ సువి రూఢ మూల**
**మసంగ శస్త్రేణ దృఢేన ఛిత్వా**
**తతః పదమ్ త త్పరి మార్గితవ్యమ్**
**యస్మిన్ గతా న నివర్తంతి భూయః** 15-4

ఈ స్మరణాన్ని ఏమరకుండా ఉంటే విస్మరణ మనేది ఉండబోదు. విస్మరణ మంటే మరపు. నామ రూపాదికమైన ఈ సంసారం వల్లనే మనకు మరవు. సంసారాన్ని అశ్వత్థ వృక్షంతో పోల్చారు మన వేదంతులు. శ్వత్థ మంటే రేపటి దాకా ఉండేది. రేపటికి కూడ ఉండనిదేదో అది అశ్వత్థం. అంటే అంత క్షణ భంగురమయిదన్నమాట ఈ సంసారం.

ఈ సంసార మంటున్నాము - మాటవరసకే గాని అసలిది ఎక్కడ ఉందని. ఇదిగో కనిపిస్తున్నది గదా అంటే ఈ కనిపించే రూపంలో లేదిది. ఎందుకంటే ఆదీ అంతమూలేదు దీనికి. ఆద్యంతాలు లేని పదార్థం మధ్యలో మాత్రమెలా ఉంటుంది. ఎలా కనిపిస్తుంది. మనకు రాత్రికాలంలో స్వప్న ప్రపంచం కని పిస్తుంది. పడుకొనే ముందు లేదది. అప్పుడున్నది మన జ్ఞానమే - అలాగే తెల్లవారితే లేదది. అప్పుడున్నదీ మన జ్ఞానమే. పోతే మధ్యలో మాత్రమే దాని వ్యవహారం అది యథార్థమెలా కాగలదు. అద్యంతాలలో జ్ఞానమేగదా అది అంచేత మధ్యలో స్వప్నంగా కనిపించేది కూడా వాస్తవంలో జ్ఞానమే. జ్ఞానమే జ్ఞేయంగా కూడా భాసిస్తున్నది. అదీ చమత్కారం.

అలాగే ప్రస్తుత మీసంసార మొక అశ్వత్థం మాదిరి ఎంత శాఖోపశాఖలుగా విస్తరించినా - ఎంత వేళ్ళు పాతుకొని ఉన్నా ఇదంతా మనకు జ్ఞేయంగా లేదె క్కడా. ఎక్కడా ఎప్పుడూ ఉన్న పదార్థం మన ఆత్మ చైతన్యమే Subjective consciousness. అదే తన శక్తివల్లా - మన అవిద్య వల్లా - అనాత్మ జగత్తు రూపాన్ని Objective world ధరించి మనకిలా నిత్యమూ భాసిస్తున్నది.

మరి ఈ నామ రూపాధికాన్ని చూస్తున్నంత వరకూ దాని అసలు రూపాన్ని మనం పట్టుకోలేము. మీదు మిక్కలి అది ఈ నామ రూపాదికంగానే మూస పోసినట్టు కనిపిస్తుంది. మనకు. కాబట్టి మనదృష్టి నీ నామరూపాలనే బురదలో ఎక్కడి కక్కడ దిగబడకుండా పెళ్ళగించు -ని ప్రక్కకు మళ్ళించాలి. దీనికే అసంగమని పేరు. అది ఎలా సాధ్యమన సంశయించబని లేదు. వాటినన్నిటినీ సదాకారంగా చిదాకారంగా భావిస్తూ పోటవమే అసంగం. తన్మూలంగా అవి సద్రూపంలోనే కరిగిపోయి సదాత్మకంగానే సాక్షాత్కరిస్తాయి. కాబట్టి అసంగ మనే తీక్షణమైన పరశ్వధంతో ఒక వృక్షాన్ని నరకినట్టే ఈ సంసార వృక్షాన్ని నరికివేయాలి.

దీన్ని నరకటం వరకే అయితే మరలా ప్రయోజనం లేదు. దీనినుంచి వైదొలగి దాని నందుకోవాలి సాధకుడు. అది దీని కధిష్ఠానమే కాబట్టి ఇది చూడక

పోతే చాలు అది వెంటనే కంట పడుతుంది. సర్పం మాయమైతే ఇక రజ్జువు కనిపించటానికభ్యంతరమేముంది. ఎలా ఎక్కడా అని ప్రశ్నే లేదు. పరిమార్గి తవ్యమ్ అన్నారు. వెతికిచూస్తే అన్నివైపులా కనిపిస్తుందట. అసలు అంతటా ఉన్నదదే గదా. కనిపించక ఏమవుతుంది. కనిపించటమంటే మనకు బాహ్యంగా దూరంగా కాదు. మన మందులోనే చేరిపోతాము. అదే అయిపోతాము, అయి ఉన్నాము ముందుకూడా. కానీ అయినామని తెలీదు. విస్మరించాము. దానికి నిమిత్త మీ నామరూపాది ప్రపంచం. అది ఇప్పుడు పూర్తిగా ప్రవిలమయ మయింది. కాబట్టి విస్మృతి పోయి మరలా అదే మన స్వరూపమనే స్మృతి ఏర్పడింది. అలా ఏర్పడితే ఇక మరలా ఈ సంసారవైపు రావటమంటూ ఉండ బోదు. ప్రేత్యాస్మాల్లోకాదమృతా భవంతి - అంటున్న దుపనిషత్తు. ప్రపంచాత్మ కంగా మరణించి బ్రహ్మాత్మకంగా ఎప్పటికీ బ్రతుకుతుంటాడు సాధకుడు.

## 100

**జ్ఞానేనతు తదజ్ఞానం-యేషాం నాశిత మాత్మనః**
**తేషా మాదిత్యవత్ జ్ఞానం - ప్రకాశయతి తత్పరం** **5-16**

అయితే ఈస్మరణ మనేది అందరికీ దక్కేసొమ్ముకాదు. ఎవరో పుణ్యాత్ములైన పెద్దలే ఒకరిద్దరో నోచుకొంటారుదానికి. అలాంటి పుణ్యాతిశయం పూర్వార్జిత మైనది ఇంతవరకూ లేకపోతే ఇప్పుడైనా ఆర్జించటానికి ప్రయత్నించాలి. సాధ కుడు. ప్రయత్నించి పోగుచేస్తూపోతే ఒకానొక జన్మలో వీడూ అలాంటివాడే అవుతాడు.

అయినందు కేమిటి గుర్తు. జ్ఞానమనేది ముమ్మరంగా అలవడాలి, అది అజ్ఞానాన్ని ఇక తలఎత్తకుండా చేస్తుంది. మా కలవడిందని ఊరక డప్పాలు కొట్టవచ్చు కొందరు. అది కేవలం వాచా వేదాంతం. నీకది నిజంగానే అలవడిన నాడిక అంధకార మనేది కనిపించరాదు. నామరూపాలే అంధకారం. అది కప్పి ఉన్నంత వరకూ అంతటా ఉన్నా తత్త్వం నీ అనుభవానికి రాదు. రావా లంటే జ్ఞానమనేది కోటి సూర్య ప్రభా భాసమానంగా ప్రకాశించాలి. సూర్య ప్రకాశంలో అంధకారమెలా మటుమాయ మవుతుందో అలాగే నామరూపాలనే తమస్సుకూడా మటుమాయమవుతుంది. అప్పుడంతవరకూ మరుగుపడిన తత్త్వమా వెలుగులో మనకెక్కడబడితే అక్కడే సాక్షాత్కరిస్తుంది.

# 101

**సర్వభూతేషు యేనైకం-భావ మవ్యయ మీక్షతే**
**వినశ్యత్స్వ వినస్యన్తం-తద్ జ్ఞానం విద్ధిసాత్త్వికం** **18-20**

అయితే జ్ఞానం జ్ఞానమని ఇంతగా ప్రశంసిస్తున్నారు. ఏమిటా జ్ఞానం ఎలా అభ్యసించాలది అని ప్రశ్న వస్తుంది. ఎన్నోమార్లు విన్నదే అయినా పరమపద సాధన విషయంలో మరలా దాన్ని ప్రపంచించటం ఎంతైనా మంచిది.

సాత్త్వికమైన జ్ఞానమే జ్ఞానమన్నారు తత్త్వజ్ఞులు. సాత్త్వికం రాజసంతా మసం అని అసలది మూడు విధాలు. అందులో తామసమనేది నామరూపాలను మనసుకు తెచ్చే ప్రాపంచిక జ్ఞానం ordinary. రాజసం శాస్త్రాలకూ కళలకూ సంబంధించిన వైజ్ఞానిక విషయం scientfic. పోతే రెండింటికీ మూల భూతమైన ఏ అధ్యాత్మిక జ్ఞానమున్నదో అది Spiritual సాత్త్వికం.

ఈ సాత్త్వికమే అసలైన సిసలైన జ్ఞానం వాస్తవానికి. ఎందుకంటే అది అవ్యయం. ఏమాత్రమూ వ్యభిచారం లేనిది. ఎంచేత. దానికి విషయమైన పర మార్థం కూడ వ్యభిచారం లేనిదే, వ్యయమన్నా వ్యభిచారమన్నా ఎప్పటికప్పుడు మారిపోవటమని అర్థం. అలాంటి మార్పు మిగతా రెండు జ్ఞానాలలోనూ ఉంటుంది గాని దీనిలో ఉండదు. ఇక్కడ జ్ఞేయమైన పరతత్త్వమెలా మారదో దాన్ని గోచరింపచేసుకొనే జ్ఞానం కూడా అలాగే మారదు. ఎప్పుడూ ఏక రూపంగానే ఉంటుంది.

అది ఎలాగని అడగవచ్చు. పరతత్త్వ మనేది సమస్త భూతాలలోనూ సమా నంగా పరచుకొని ఉన్న ఒకానొక భావం. భూతాలంటే అవి జడ పదార్థాలే కాదు. చేతనాలు కూడా. రెంటికీ భూతమనే శబ్దం వర్తిస్తుంది. అప్పటికి నామరూప క్రియాత్మకమైన సృష్టి అంతా కలిసి వస్తుంది ఈ మాటలో. ఈ సృష్టిలో ఎక్కడికక్కడ విశేషాలూ కనిపిస్తాయి. మనకు వాటన్నిటినీ వ్యాపించిన సామాన్యమూ కనిపిస్తుంది. ఒక సువర్ణంతో చేసిన రకరకాల ఆభరణాలు చూస్తే ఆభరణాలుగా అవి అనేకమైనా వాటిలో ఏకరూపంగా సువర్ణమే కనిపిస్తుంది మనకు. పోతే ఈ సువర్ణం కూడా రజతతామ్ర - కాంస్య-త్రపు సీసాదులైన లోహాలన్నిటి దృష్ట్యా చూస్తే అదీ ఒక లోహవిశేషమే. అప్పుడా విశేషాలన్నిటిలో లోహజాతి అనే సామాన్య మేకరూపంగా సాక్షాత్కరిస్తుంది.

ఇలాకాక ఈ సామాన్య విశేష పరంపర ననుసరిస్తూపోతే చివరకీ నామ రూపాదులన్నీ విశేషాలయిపోయి వీటన్నిటినీ సమానంగా వ్యాపించిన ఒక మహా సామాన్యం దర్శనమిస్తుంది మనకు. దానిని మించిన సామాన్యం మరొకటి లేదు కాబట్టి అది పర Supreme మన్నారు. మారకుండా నిలిచేది కాబట్టి తత్త్వ మన్నారు అయితే ఇవన్నీ మారి అది మారకపోవటమేమిటి. దాని స్వరూపమే అలాంటిది గనుక. ఏమిటా స్వరూపం. సచ్చిత్తులే దాని స్వరూపం. సత్తంటే ఉనికి. చిత్తంటే ఎఱుక. ప్రతి ఒక్క పదార్థామూ లోకంలో ఉంది, ప్రకాశిస్తుంది. ఉండకుంటే ప్రకాశించేది లేదు. ప్రకాశించకుంటే మనం దాన్ని గ్రహించేది లేదు. కాబట్టి మనమొక పదార్థాన్ని గ్రహిస్తున్నామంటే ఆ పదార్థంతో కలిపి సచ్చిత్తులను కూడా పట్టుకొంటున్నామనే అర్థం. అవి ఆ పదార్థం ఆది మధ్యాం తాలలో లోపలా వెలపలా ప్రతి అణువూ వ్యాపించే ఉండాలి. ఎక్కడ ఏ భాగం వ్యాపించకపోయినా ఆ భాగం మన మనసుకు రావడానికి వీలులేదు. అవి ఉంటేనే పదార్థం. లేకుంటే లేదు. అంటే ఏమన్నమాట. సచ్చిత్తులే ఉన్నాయి వాస్తవానికి. అవే ఆయా పదార్థాల రూపంగా మనకు భాసిస్తున్నాయి. కనుక ఈ ఆభరణాలన్నీ బంగారమే గదా – అని చూచే వాడికి ఆభరణ రూపాలన్నీ బంగారంలో లీనమయి కేవలం పచ్చగా మెరిసే ఒక బంగారమే ఎలా దృష్టికి గోచరిస్తుందో – అలాగే ఈ నామరూపక్రియలన్నీ కేవలం సత్తే గదా – చిత్తే గదా – అని చూడ గలిగితే చాలు. ఆకాశంలాగా మనలోపలా వెలపలా సర్వత్రా పరచుకొని ఒక వెలుగులాగా ప్రకాశించే స్ఫురణ Awareness ఒకటి మనకు తప్పకుండా సాక్షాత్కరిస్తుంది.

అప్పటికిక ఏదీ మిగలకుండా అన్నీ అందులో లయమయ్యేవే. దానికి నామరూపాలుండబోవు. నామరూపాలు లేకుంటే అది చలించే ప్రశ్న లేదు. అవ్యయమే అవుతుంది. అంతేకాదు. మిగతా భూతప్రపంచమంతా నశిస్తున్నా అది నశించదు. ఎప్పటికీ అదే రూపంలో ఉంటుంది. కారణం – అది విషయమేగాక మనకు విషయి కూడ. అంటే మనమే. మనం నశిస్తున్నామనే స్ఫురణకూడా మనకే రావాలి కాబట్టి నశించటమనే క్రియే అసంభవం. అదీ నా స్వరూపంలోనే చేరిపోతుంది. పోతే ఇక నాశమే లేదు. కనుకనే అది అభావం కాదు. భావం భావమంటే అది సిద్ధమేగాని మనం క్రొత్తగా సాధించేది కూడా కాదు. సాధన ఎంతవరకంటే ఉన్నదున్నట్లు మరలాదాన్ని మానవుడు జ్ఞాపకం చేసుకోవటమే. మరేదీ కాదు.

## 102

**భక్త్యా మా మభి జానాతి - యావాన్ యశ్చాస్మి తత్త్వతః**
**తతో మాం తత్త్వతో జ్ఞాత్వా-విశతే తదనం తరం 18-55**

అది ఎలా జ్ఞాపకం చేసుకోవాలని నిజమైన సాధకునికి జిజ్ఞాస కలగవచ్చు. అందుకే చెబుతున్నాడు భగవానుడు సమాధానం భక్తి చేతనే జ్ఞాపకం చేసుకో మని. భక్తే జ్ఞప్తికి సాధనం. భక్తేమిటి. భక్తి అంటే అనన్యభావన. నామరూపాదు లైన ఉపాధులలో ఏదిగాని మనసుకు రానీయకుండా వాటన్నిటికీ అధిష్ఠానమైన శుద్ధ సచ్చిదాత్మకమైన తత్త్వాన్నే మనోనేత్రంతో దర్శిస్తూ పోవడం.

అలా ప్రయత్నిస్తూపోతే అదే ఒక వృత్తిగా మారి అఖండమైన ఆ వృత్తిలో నామరూపాలనే ఖండ వృత్తులన్నీ పూర్తిగా ప్రవిలయమవుతాయి. దానితో ఇక ఆ అఖండ వృత్తి చలించకుండా ఏకధారగా ఒకే ఒక తత్త్వాన్ని చూడగలుతుంది. అయితే అలాచూచే ఆ పరతత్త్వ మెలా ఉంటుందని అడగవచ్చు. "యావాన్ యశ్చ" అనే రెండు మాటలలో ఇమిడ్చి చెప్పారు దాన్ని. యావాన్ అంటే ఎంత ఉందో అంత. యశ్చ అంటే ఎట్లా ఉందో అట్లా అని అర్థం. ఎంత అనేది నామ రూపాదులైన ఉపాధులను కలుపుకొని చెప్పినమాట. ఎట్లా అనేది కలుపు కోకుండా చెప్పినమాట.

కేవలం చైతన్యమేనని చూస్తే నామరూపాదికమైన ప్రపంచమది కాదా అని ప్రశ్న వస్తుంది. నామరూపాది ప్రపంచమేనని చూస్తే అదీ మన దృష్టికి కనిపించే ఒక ఘటం లాంటిది - పటంలాంటిదేనా అని అనుమాన మేర్పడుతుంది. అంచేత రెండూ అదేనని చెబితే చిక్కులేని పని. దీనిని బట్టి తేలిందేమిటి చివరకు శుద్ధసచ్చి ద్రూపంగా ఉన్న అదే నానావిధనామరూప ప్రపంచంగా భాసిస్తున్న దని చూడాలి సాధకుడు. అంటే నామరూపాల నెప్పుడుగాని చూడటం మానుకోరాదు. చూస్తూనే ఉండాలి ప్రపంచాన్ని. అయితే ప్రపంచంగాకాదు. బ్రహ్మంగా. "దృష్టిం జ్ఞానమయీం కృత్వాపశ్యే ద్బ్రహ్మమయం జగత్." ప్రతి ఒక్కటీ చూసేటప్పుడూ దానితో వ్యవహరిస్తున్నప్పుడూ అది ఒక నామం ఒక రూపమని గాక తన చైతన్యమే ఆ నామమనీ - తన చైతన్యమే ఆ రూపమనీ - చైతన్య దృష్టితో చూడటం అభ్యసించాలి దానితో ప్రపంచాన్ని చూచినట్టూ అవుతుంది మరొక విధంగా చూడనట్టూ అవుతుంది.

ఇలా చూడటమే అసలు తత్త్వాన్ని చూడటమంటే. ఈ చూపులో తత్త్వమంతా కలిసి వస్తుంది. చూపే తత్త్వమవుతుంది. అయితే ఇక వేరుగా చూడవలసిందంటూ ఉండబోదు. చూడబడేది చూసేదే అవుతుంది. అప్పుడు చూడడమనే మాటకు కూడా ఇక అర్థంలేదు. మరి ఎక్కడా జాగాలేక తనలోనే ప్రవేశిస్తుందది. చమత్కారంగా చెప్పేమాటేగాని అది వాస్తవానికి ప్రవేశమేగాదు. అంతరమనేది ఉంటే గదా ప్రవేశించటానికి. అనంతర మన్నప్పుడు ప్రవేశమేమిటి. కాబట్టి తాను తానుగా ఉండిపోవడమే ప్రవేశమనేమాటచేత ఔపచారికంగా metaphorical నిర్దేశిస్తున్నాడు భగవానుడు.

## 103

**మన్మనాభవ మద్భక్తో - మద్యాజీ మాం నమస్కురు**
**మామేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః 18-65**

అయితే ఇలాంటి ఏకాత్మను సంధాన మేర్పడాలంటే సామాన్యంకాదు. దానికి పునాదులనుంచీ గట్టిచేసుకొంటూ రావాలి. అది ఎలాగంటే చెబుతున్నాడు. నాపైనే మనసుపెట్టి నన్నే భజిస్తూ నా కోసమే పనులుచేస్తూ నాకే విధేయుడవై ఉండు మనసూ బుద్ధీ నాకే ఎప్పుడు సమర్పించావో అప్పుడు నీవు నన్నే చేరుతావు. సందేహం లేదంటున్నాడు గీతాచార్యుడు.

ఈ నా అనేమాట కర్థమేమిటి. ఈ కనిపించే నీల మేఘశ్యాముడని కాదు. పైన చెప్పిన సర్వ వ్యాపకమైన పరతత్త్వమే. అది సాధకుడి స్వరూపమే కాబట్టి నానా అని ఉత్తమ పురుషలో చెప్పవలసి వచ్చింది. నా అంటే అప్పటికి ఆత్మచైతన్యమని భావం. దాని మీదనే మనసుండాలి మనకు. అంటే జీవితంలో మరే ఒకటీ ఆలోచించకుండా దానినే ఆలోచిస్తూ కూచోవాలి. మరి నిత్యమూ ఏపని చేస్తున్నా అదే చేస్తున్నదని భావించాలి. దానికే అధీనమై ఉండాలి ఎప్పుడూ.

ఇలా మనసూ బుద్ధీ దానికే ఒప్పచెబితే అదే అవుతాడు చివరకు. మనసంటే సంకల్ప వికల్పాలు కరణం. బుద్ధి అంటే నిశ్చయాత్మకం - కర్త. అర్పణమంటే క్రియ. కర్తృకరణ క్రియలు మూడూ అప్పగించటమంటే అప్పటి కేమన్నమాట. మిగిలేది చివరకిక సాక్షి రూపమైన ఆత్మ చైతన్య మొక్కటే. అది ఎవడికి వాడికి నేనే - నా స్వరూపమే. కాబట్టి నన్నే నేను చేరుతాను. అంటే నాకు నేనే మిగులుతానని తాత్పర్యం.

## 104

**యదా భూత పృథాగ్భావ - మేకస్థ మను పశ్యతి**
**తత ఏవచ విస్తారమ్ - బ్రహ్మ సంపద్యతే తదా** **13-30**

ఈ ఆత్మైకత్వ స్థితినే మరొక భాషలో మనకు బోధిస్తున్నాడు పరమాత్మ. నేనూ-నాకు కనిపించే ఈ భూత ప్రపంచం. ఇవి రెండే మన అనుభవంలో ఉన్న భావాలసలు. ఇందులో ఈ భౌతిక జగత్తంతా ఒకటి గాదు. నానా విధ నామరూపక్రియా భేద భిన్నం. ఇలాటి భిన్నమైన జగత్తు నంతా ఏకంగా ఒకే ఒక తత్త్వంగా చూడటం నేర్చుకోవాలి సాధకుడు.

ఏమిటా ఏకం. ఆత్మ చైతన్యమే. అది ఎప్పుడూ ఏకమే గాని ప్రపంచం లాగా అనేకం గాదు. ఎందుకంటే చిద్రూపం తప్ప దానికి మరొక రూప మంటూ లేదు. చిద్రూప మని మాటే గాని అది ఒక రూపమే గాదు వాస్తవానికి. ఆకాశం లాగా నలుదెసలా వ్యాపించిన ఒకానొక స్ఫూర్తి అది. అలాంటి దానికి రూప మనే దేముంది. పైగా అది ఎక్కడ ఉందనే ప్రశ్నే లేదు. నేనే. నేను నేననేదే ఆ స్ఫురణ దానికే ఆత్మ అని పేరు. అది మన అందరిలో ఉంది, లోపల భావరూపం గానూ - వెలపల భూత రూపంగానూ - పరచుకొని ఉన్న ఈ అనాత్మ జగత్తునంతా నిత్యమూ గ్రహిస్తూ ఉన్న చైతన్య తత్త్వమే అది.

అయితే వచ్చిన తిరకాసేమంటే అది ఈ జగత్తునంతా తనకు వేరుగా బాహ్యంగా దర్శిస్తున్నది. కనుక దృక్కనిదృశ్యమని రెండుగా విభక్త మయింది. అలాకాక దీనిని మరలా శాస్త్రా చార్యోపదేశ జనితమైన సంస్కార బలంతో దృగ్రూపమైన నేనే గదా అని తన ఆత్మకు అభిన్నంగా దర్శించగలగాలి. అప్పు డత్మై వేదమ్ సర్వమని ఇదంతా ఏకైకమైన ఆత్మ చైతన్యంగానే దర్శనమిస్తుంది. ఇది స్వరూపావస్థ.

పోతే ఆత్మత ఏవ ప్రాణః- ఆత్మత ఏవాన్న - మన్నట్టు ఈసర్వ ప్రపంచమూ మరలా ఏదో గాదు. తన ఆత్మ స్వరూపం నుంచే ఉదయిస్తూ - దానియందే సంచరిస్తూ-తుదకు దానిలోనే లయిస్తున్నదని - అనాత్మ జగద్వ్యవహారాన్నంత టినీ నిజశక్తివిలాసంగానే నిత్యమూనిరీక్షించ గలిగి ఉండాలి.అప్పుడు తన స్వరూపమే గాక తనమహిమ ఏదోతనకు గోచరం కాగలదు. ఇది విభూత్యవస్థ.

ఇలా తన స్వరూప విభూతులు రెండూ తాను దర్శించగలిగితే తానే **ఆత్మ** తానే బ్రహ్మమూ కూడా అవుతాడు సాధకుడు. నామరూప ప్రపంచమంతా

తన విభూతిగానే భాసిస్తుంది కాబట్టి - అది తన స్వరూపమేననే స్ఫురణ ఉంటుంది కాబట్టి- ఇక విస్మరణ మనే ప్రశ్నలేదు. నిరంతర స్మరణమే అవుతుందది.

# 105

**తద్బుద్ధయ స్తదాత్మాన - స్తన్నిష్ఠా స్తత్పరాయణాః**
**గచ్ఛ స్త్యపునరావృత్తిం - జ్ఞాననిర్ధూత కల్మషాః 5-17**

అయితే ఇంత మహోన్నతమైన స్థితి నందుకోవాలంటే ఎంత సులభమని చెప్పినా అందులోనూ కొంత మెళకువ కావలసి ఉంది సాధకుడికి. ఏది ఫలితానికి రావాలన్నా ఊరకవచ్చి ఒడిలో పడదది. దానికొక పద్ధతి అంటూ ఉంటుంది. అందులో శిక్షణపొందిన వాడికే క్రమంగా అది పాకానికి వస్తుంది. భౌతికమైన శిక్షణ కాక పోయినా ఇది ఒక మానసికమైన శిక్షణ.

ఈ శిక్షా మార్గంలో నాలుగు భూమికలున్నాయి. మొదటితి "తద్బుద్ధయః" అంటే దాని మీదనే బుద్ధి ఉండాలి సాధకుడికి. అంటే ఎప్పుడూ అదే స్వరూపం కనపడుతూ ఉండాలి మనో నేత్రానికి. అది తప్ప మరొక విజాతీయ భావ మేదీ మనసుకు రాగూడదు. వస్తే దీనికి తిలాంజలి ఇవ్వవలసి వస్తుంది. కనుక అనుక్షణమూ అదే లోకంగా ఉండాలి మనం.

అలా ఉన్న తరువాత అదీ నేనూ అనే విభాగం కూడా వదిలేసి అది నేనే అనే నిశ్చయానికి రావాలి. "తదాత్మానః" ఆత్మ అంటే స్వరూపం. దానికి విజాతీయమైన ప్రపంచమంతా అనాత్మ. అనాత్మను చూచేటప్పుడుకూడ అది ఆత్మే అనే అనుసంధానం కావాలి. అప్పుడిక ఆనాత్మ నంతటినీ తనలో లీనం చేసుకొని ఆత్మ చైతన్యమే పైకి తేలుతుంది. సర్వతోముఖంగా ప్రసరిస్తుంది.

అలా ప్రసరించిన ఆ చైతన్యంలో నుంచి జారకుండా నిత్యమూ అందులో నిలిచి ఉండాలి. దీనికే నిష్ఠ అని పేరు. తైలాధారలాగా ఎప్పుడూ ఒకే ఒక భావంతో నిలిచి ఉండటాన్నే నిష్ఠ అంటారు. ఇది ఒక్కసారిగా అబ్బదు. క్రిందా మీదా పడితే ఎప్పటికో పాటుకువస్తుంది. వచ్చినందుకు దాఖలా ఇక మరలా అనాత్మ పంకంలో పడకపోవటమే.

అయితే ఇది జీవితాంతమూ మనం ద్రవిడ ప్రాణాయామంలాగా పట్టుకొన్నా అవసానంలో పట్టు సడలవచ్చు. అలా సడలితే మరలా సుఖంలేదు.

అది ఈనగాచి నక్కలపాలు చేయటమే. కాబట్టి ఆక్షణంలో కూడా గట్టిగా నిలబడాలి సాధకుడు. నిలబడితే జీవితమూ మరణమూ అంటూ వేరుగా కనబడవు. పరస్పర విరుద్ధంగా కనిపించే అవి రెండూ ఏకంగానే అనుభవానికి వస్తాయి సాధకుడికి. పరాయణ మనే మాట ఈ భావాన్నే సూచిస్తుంది. పోయినా అందులోకే పోవటమని దాని అర్థం. ఇది ఆఖరి మెట్టు సాధనలో. సాధనే కాదు. ఇది సిద్ధి. అపునరావృత్తి అన్నా ఇదే అందులో చేరితే ఇక మరలా తిరిగి రావట మంటూ లేదు.

ఏమిటి దీని భావం. అనాత్మకూడ మనకెప్పుడాత్మగా అనుభవానికి వచ్చిందో - ఆ అనుభవ మెప్పుడు మనకు స్వాభావిక మయిందో-అదే మనం చేరవలసిన స్థానం. అలాంటి స్థితిలోనుంచి మనమిక మరలా రావటమనే దేముంది. రావాలంటే దాని కంటే విలక్షణమైన దేదైన ఉంటే గదా. దానికి విలక్షణ మీ నామరూపాలే. అవి ఆత్మలోనే ప్రవిలయ మయినాయి. ఇక ఎలా వస్తుందది. ఎక్కడికి వస్తుంది దాని పాటికది కదలకుండా ఉండవలసిందే. కను కనే దాన్ని కూటస్థమన్నారు శాస్త్రంలో. దాన్ని చేరటానికే ఇంత శిక్షణ. దీనివల్ల అనాత్మ రూపమైన కల్మషమంతా క్షాళితమై పోతే అప్రయత్నంగానే మనకది సిద్ధిస్తుంది. మన స్వరూపమే గదా అది. సిద్ధించక ఏమవుతుంది.

## 106

**అనన్యా శ్చింతయంతోమా-యేజనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం - యోగక్షేమం వహామ్యహం 9-22**

అందుకే జీవితాంతమూ అనన్యమైన చింతనతో ఉండాలి మానవుడు. అన్యం లేనిదేదో అది అనన్యం. అది సర్వతో వ్యాప్తమైన ఆత్మతత్త్వ మొక్కటే. అది మన స్వరూపమే. ఇలాంటి స్వరూపమే ఎక్కడ బట్టినా. అదితప్ప మరేదీ లేదు. అంటే ఏమన్నమాట. నీవు నిత్యమూ కండ్లు పెట్టుకొని ఏది చూస్తున్నావో-చెవులతో ఏది వింటున్నావో-చేతులతో ఏది స్పృశిస్తున్నావో - అదంతా ఆత్మే. ఏ ఇంద్రియానికే విషయం గోచర మవుతున్నా దానినంతా ఆత్మ చైతన్యంగానే భావిస్తు పోవాలి. అంతేగాని ఇది శబ్దమని- ఇది స్పర్శమని- ఇది రూపమని- స్వరూపానికి భిన్నగా చూడగూడదు.

ఇలాంటి ఆత్మైక భావనకే అనన్య భక్తి అని పేరు. అనన్యభక్తి అన్నా - పరాభక్తి అన్నా- ఒక్కటే. ఇది మామూలుగా మనమనుకొనే భక్తికాదు. మామూలు

భక్తిలో సేవ్య సేవక భావముంటుంది. ఉపాస్య ఉపాసక భావముంటుంది. ఇందులో అలాంటి విభాగముండదు. అనన్యమిది. ఇది జ్ఞానాని కనంతర భూమిక. సామాన్యమైన భక్తిజ్ఞానానికి పూర్వభూమిక. జ్ఞానమంటే పరమార్థాన్ని గూర్చి చేసే విచారణ. అది భక్తిశ్రద్ధలుంటేగాని ఏర్పడదు. ఏర్పడిన తరువాత ఆజ్ఞాన మపరోక్షమైన అనుభూతినివ్వాలి. ఇది ఆ కలిగిన జ్ఞానంలో నిష్ట ఏర్పడితే గాని రాదు. ఇదుగో ఈ జ్ఞాననిష్టనే అనన్యభక్తి అని -పరాభక్తి అని-వ్యవహరిస్తారు. ఇది కేవల జ్ఞానంకన్నా శ్రేష్టమైనది. ఆత్మ చైతన్యం తప్ప మరిదేనికీ ప్రవేశం లేదీభూమికలో. అంతా ఆత్మే. చూచేదీ చూడబడేదీ-చూపూ అంతా అదే. అంతా నేనే. "పర్యుపాసతే" అన్నమాటకిదే అర్థం. పరితః- ఉప-అసనా- అంటే అంతటా తన స్వరూపాన్నే చూస్తూ దాన్నే పట్టుగొని కూచోటం.

అయితే అలా కూచోమన్నారు బాగానే ఉంది. కూచోగలమా అనే ఇప్పుడు ప్రశ్న. ఎందుకంటే దీనికి రెండు ప్రతి బంధకాలు కనిపిస్తున్నాయి. మనం చేయ వలసిన సాధన ఎప్పుడూ మనసుతోనే గాని మరిదేనితోనూ గాదు. ఈ మనసుకు ఒక రోగమున్నది. అది ఏదో ఒక ఆకారాన్నే చూడాలి. ఆ ఆకారం కూడా ఎప్పటికప్పుడు మారుతుండాలి. అలాంటప్పుడోకే ఒక నిరాకారమైన తత్త్వాన్ని ఏకధారగా చూడటమంటే అది ఎలా సంభవం. అలాగే ఒకవేళ చచ్చి సున్నమై అదేలోకంగా. కూచున్నామే అనుకోండి. లోకంలో మన దైనందిన వ్యవహారం జరిగేది ఎలాగా. దానికి మనమిక స్వస్తి చెప్పక తప్పదు గదా. చెబితే మనకొక శరీరమంటూ ఉందిగదా. ఆకలిదప్పులున్నాయి గదా. వాటి సంగతేమిటి- ఎవరు చూస్తారు. కనుక అది అసంభవమే.

వీటిరెండింటికీ సమాధానమే ఉత్తరార్థం. అలా ప్రతిక్షణం ఆత్మ చింతనతో కాలంగడిపే సాధకుడికి పనులు ఎలా జరుగుతాయని గదా ప్రశ్న. అవి జరప టానికి ఈశ్వరుడే ఉన్నాడు. ఈశ్వర ప్రకృతేగదా ఇదంతా. ఇందులోనేగదా మనకేదైనా ఒకకార్యం జరగవలసింది. దాని కధ్యక్షుడైన ఈశ్వరుడే ప్రేరణ కలిగిస్తాడు. అది మన ప్రారబ్ధాన్ని బట్టి ఎక్కడో లోకంలో ఎవరికో బుద్ధి పుట్టించి ఏదో ఒక ఉపకారం మనకు చేయిస్తుంది. ప్రారబ్ధాన్ని బట్టే ఏదైనా మనకు జరుగుతుంది ఇక మనకు భయమేముంది. ఊరకున్నా జరుగుతుంది. లేక పోయినా. జరుగుతుంది. మన దగ్గరికి దానిపాటికది దొర్లుకొంలూ వస్తుంది. ఇదే యోగం. పోతే ఆ వచ్చింది మన ప్రారబ్ధాన్ని బట్టి ఎక్కడికి పోదు. ఎంత కాల ముండాలో అంత కాలమూ ఉండి తీరుతుంది. ఇదే క్షేమం.

ఇది లోక విషయంగా చెప్పినమాట. పోతే మన సాధన విషయంలో కూడా ఇంతే. అయితే ఒక విశేష మేమంటే లౌకికంలో కేవల ప్రారబ్ధం వల్లనే పనులు జరుగుతాయి. దానినే ఈశ్వర ప్రేరణగా చెప్పుకొన్నాము. పోతే ఇక్కడ సాధన విషయంలో అలాకాదు. ఈశ్వరుడే స్వయంగా అనుగ్రహిస్తాడిక్కడ. సాధన అంతకంతకూ ప్రబలమై ప్రతిబంధకాలన్నీ తొలగిపోయి ఫలించేలాగా చూస్తాడు. మనస్సు కున్న దౌర్బల్యం మాటేమిటిని అడగవచ్చు. దౌర్బల్యం దానికి సహజంకాదు రజస్త మోగుణ సంపర్కంవల్ల ఏర్పడింది. అది నిరంతర బ్రహ్మ చింతనలో ఉన్న సాధకుడికి ఈశ్వరానుగ్రహం వల్ల తొలగిపోతుంది. మరలా ఈ ఈశ్వరుడు ఎక్కడినుంచి వచ్చాడని ప్రశ్నించ రాదు. తాను ఈశ్వరుడయ్యే వరకూ ఈశ్వరుడొక డుండనే ఉంటాడు. లేదా తానే ఈశ్వరుడనే ఏ భావన ఉందో అదే ఈశ్వరుడనుకొవచ్చు. ఆ భావనే మనలను అనుగ్రహిస్తుందని చెప్పినా చెప్పవచ్చుగదా.

మొత్తంమీద అనన్యభక్తి యోగానుష్ఠానం సాధ్యమే. అసాధ్య మనుకొనే రెండు ప్రతిబంధకాలూ చిత్తశుద్ధితో ముందుకుపోయే సాధకుణ్ణి ఎన్నడూ బాధించవు. ఎంచేతనంటే వాడు లౌకిక వ్యవహారాలన్నీ ప్రారబ్ధానికి ఒప్ప చెబుతాడు. పార లౌకికంగా జరిగే సాధన అంతా తన ఈశ్వర భావనకే అప్పగిస్తాడు. అందులో కూడా అప్పుడప్పు డంతరాయాలు కలుగుతుంటే అవి తన ప్రబల మైన ప్రారబ్ధదోషం వల్లనైనా కావచ్చు. లేక తన ఆత్మభావన అంత ప్రబలంగా లేనందువల్లనైనా కావచ్చునని సమాధాన పడతాడు. అలా పడగలిగితే చాలు. ఆప్రారబ్ధం కూడా అతి చిత్రంగా తొలగిపోయి ఈశ్వరానుగ్రహానికే పాత్రు డౌతాడు సాధకుడు. ఇదీ దీనిలో ఇమిడి ఉన్న సాధన రహస్యం.

## 107

**సదృశమ్ చేష్టతే స్వస్యాః - ప్రకృతేః జ్ఞానవా నపి**
**ప్రకృతిమ్ యాంతి భూతాని - నిగ్రహః కిమ్ కరిష్యతి 3-33**

సాధన అనేది మానవుడై పుట్టిన ప్రతి ఒక్కడూ చేసి తీరాలని - అలా చేసి నప్పుడే మోక్షానికి నోచుకొంటాడని - తీర్మానించారు. బాగానే ఉంది. కాని అసలు ఆ సాధన అనేదే చేయగలమా అని ఇప్పుడు ప్రశ్న.

ఎందుకంటే ఏ సాధన మనం చేయాలన్నా అది మన సంకల్పాన్ని బట్టి

ఉంటుంది. సంకల్పమనేది మన స్వభావాన్ని బట్టి ఏర్పడుతుంది. ఈ స్వభావానికే ప్రకృతి అని పేరు. ప్రకృతి అంటే ఇది ఈశ్వర ప్రకృతిగాదు. మానవ ప్రకృతి. బహు జన్మల నుంచీ పోగయిన సంచిత కర్మ ఫలంగా వర్తమాన జన్మలో జారీ అయి కూచున్న మన ధర్మా ధర్మ సంస్కారానికే ప్రకృతి అనిపేరు. దీనినే ప్రారబ్దమని కూడా పేర్కొంటారు. ఇది ముందుగానే జారీ అయి కూచుంది. కాబట్టి దీని నేమి చేయటానికి లేదు. జన్మతో ప్రారంభమై మరణంతో సమాప్తమవుతుందది. ఈ మధ్య కాలంలో మన మెంత పనిట్టుకొన్నా తొలగి పోయేది కాదు.

అలాంటప్పుడిక మన సాధన ఏమిటి. ప్రయత్నమేమిటి. మనం ప్రయత్న మనేది ఇప్పుడుగదా ప్రారంభిస్తున్నాము. ఇది ప్రారంభించక పూర్వమే అది రంగంలోకి వచ్చి వుంది గదా. దీనికన్నా దానికి బలమెక్కువ. అది దీనిని కొడి ఎత్తనీయదు. జీవితమంతా అదే రాజ్యం చేస్తున్నదాయె. ఏ క్షణంలో మనకే సంకల్పం కలగాలో - ఏ మాట మాటాడాలో - ఏ పని చేయాలో - అంతా అదే నిర్ణయించి కూచుంది. ఇక క్రొత్తగా మనమొక ప్రయత్నం చేయటాని కవకాశ మెక్కడిది. ప్రారబ్ధాధీనమే మన బ్రతుకంతా. మనసా-వాచా-కాయేన దాని కనుగుణంగానే నడుచు కొంటాడు ప్రతి ఒక్క మానవుడూ. జ్ఞాని అయినా అలా నడుచుకోవలసిందే. ఇక పామరుడి మాట చెప్పేదేముంది.

మరి ప్రతి ఒక్కడూ ఇలా తన ప్రారబ్ధానికి దాసుడై ప్రవర్తిస్తున్నప్పుడు సాధన చేయమనే మాట కర్థమేముంది. ఎలా చేయగలడు వాడు సాధన. మానవ యత్నాని కాస్కారమే లేదుగదా. ఆస్కారమనేది ఉంటే శాస్త్రమైనా ఆచార్యుడైనా మనకొకటి బోధించవచ్చు. మనం దాన్ని పాటించవచ్చు. అసలే ఆస్కారం లేన ప్పుడా శాస్త్రమూ నిరర్థకమే. ఆచార్యుల బోధా నిరర్థకమే. మరి దీనికేమిటి పరిష్కారమని ప్రశ్న.

## 108

**ఇంద్రియ స్యేంద్రియ స్యార్థే - రాగద్వేషౌ వ్యవస్థితౌ**
**తయోర్నవశ మాగచ్ఛే- త్తౌ హ్యస్య వరిపంథినౌ 3-34**

నిజంగా ఇది ఒక గడ్డు సమస్యే. పైకి చూస్తే ఏ మాత్రమూ దీనికి పరి ష్కారమే లేదని తోస్తుంది. పరస్పర విరుద్ధమైన భావాలు రెండున్నాయి ఇక్కడ. ఒకటి దైవమూ-fate-మరొకటి పురుషకారము -Free will. అత్తా కోడళ్ళ

మాదిరి రెంటికీ సరిపడదు. ఎలా ఈ రెంటినీ సమన్వయించటం. సమన్వయించకపోతే మన సాధనేబండపడుతుంది. సాధన లేకపోతే మోక్షమేలేదు మానవుడికి. అది మొదటికే మోసం. కాబట్టి ఏదో ఒక పరిహార ముండాలి దీనికి.

ఉందనే చెబుతున్నాడు భగవానుడు. ప్రకృతి లేదా ప్రారబ్ధ మనేది సర్వాధికారాలు గుత్తకు తీసుకొన్నదని భ్రాంతి పడరాదు అనేక జన్మలనుంచీ అది మానవుడి బుద్ధిలో సంస్కార రూపం గానే మెదులుతుంటుంది. కార్య రూపంగా తనపాటికి తానెప్పుడూ బయటపడదు. రాగద్వేషాలనే ద్వంద్వా లెప్పుడు దయిస్తాయో అప్పుడది వాటి ఆసరాతో తల ఎత్తుతుంది. ఈ రాగద్వేషా లనేవి మనకు ప్రతి ఇంద్రియ విషయంలోనూ ప్రతి క్షణమూ కలుగుతూనే ఉంటాయి. శబ్ద స్పర్శాదులైన విషయాలేవైనా సరే - మనకనుకూల మని తోస్తే అభిమానిస్తాము. ప్రతికూల మనిపిస్తే ద్వేషిస్తాము.

అవి రెండూ పెట్టుకోటం- పెట్టుకోక పోవటం - మన చేతిలో ఉంది. ఒక విషయంలో అభిమానమూ - ద్వేషమూ - అనే భావాలు కలుగుతుంటే వాటిని కలగకుండా చేసుకోవచ్చు మనం. అలా చేసుకోటాని కాలంబనం మనకు తత్ప్రతిపక్ష భావన. ఏది వాటికి ప్రతిపక్షం. సమ్యగ్దర్శనమే Right vision వాటికి ప్రతిపక్షం Opposite. అంతా ఆత్మస్వరూపమే గదా అని చూడగలిగితే రాగమూ లేదు ద్వేషమూ లేదు. రాగద్వేషాలు లేకపోతే నిద్రాణమై ఉన్న సంస్కారం పురివిప్పదు. చచ్చిన పాములాగా అలాగే పడి ఉంటుంది. రాగద్వేషాలనే సచివులు చేయూత ఇవ్వనిదే అది పైకి లేవలేదు. పని చేయలేదు.

ఇదుగో ఈ రాగద్వేషాలనే ద్వంద్వాలకే మానవుడు వశం కాగూడదు. ముందుగానే వాటి నదుపులో ఉంచుకోవాలి. శాస్త్ర దృష్టితో వాటి నదుపు చేయవచ్చు. అప్పుడు ప్రకృతి వాడినేమీ చేయలేదు. ప్రకృతి అనేది ఎక్కుపెట్టిన బాణం. దాన్ని ప్రయోగించటం - ఉపసంహరించటం - మన చేతిలో ఉంది. మన రాగద్వేషాలు దాన్ని ప్రయోగించమని చెబుతుంటే మన వివేచనా శక్తి దాన్ని ఉపసంహరించమని బోధిస్తుంది. ఈ వివేచనకే పురుష ప్రయత్నమని పేరు. దీనితో రాగద్వేషాలనే దోపిడి దొంగలను సంహరించి ప్రాక్తన కర్మవాసనలకు మనం జవాబు చెప్పవచ్చు.

# 109

**ఉద్ధరే దాత్మనా త్మానమ్ - నాత్మాన మవసాదయే**
**దాత్మైవ హ్యాత్మనో బంధు. రాత్మైవ రిపు రాత్మనః 6-5**

అంచేత సాధన చేయట మెలాగా అని సందేహించ నక్కరలేదు. మన ప్రారబ్దాని కెంత అవకాశముందో జీవితంలో - మన ప్రయత్నానికీ అంతే ఉంది. ఈ ప్రారబ్ధం కూడా అసలు మన మింతకు ముందు జన్మలలో చేసు కొన్నదే గదా. చేసుకోనే స్వాతంత్రమే మనకు లేకపోతే అది ఎలా తయా రయింది. కాబట్టి తత్ఫల భోక్తృత్వ మెలా ఉందో మనకు తత్కర్మ కర్తృత్వం కూడా ఉండి తీరాలి.

ఇదుగో ఈ కర్తృత్వం కూడా ఉంది గనుకనే మరలా మన మీ జీవితంలో కృషి చేయ వలసి ఉంది. అది ఏదో గాదు. మన ఆత్మోద్ధరణమే. ఆత్మను ఆత్మతోనే ఉద్ధరించు కోవాలి మానవుడు. మరేబాహ్య సాధనా అక్కర లేదు. అంతటా అన్ని వేళలా అదే మనమయి ఉన్న ఆత్మనే మరచి పోయాము మనం. మరచి పోయి మామ పెండ్లాన్ని అత్త అన్నట్టు మరలా దానినే మనం జ్ఞాపకం చేసుకోవాలి. ఎలాగా అది. ఆత్మతోనే పట్టుకోవాలి ఆత్మను. ఎందుకంటే ఆత్మే ఆత్మకు బంధువు. ఒక బంధువు లాగా దాన్ని చేర్చేందుకు అదే సాధన మవు తుంది.

ఎలా అవుతుందని ప్రశ్న. ఏకాత్మ ప్రత్యయసార మన్నది ఉపనిషత్తు. ఒకే ఒక ఆత్మ చైతన్యం తప్ప మరేదీ లేదనే ప్రత్యయం Concept లేదా భావంతోనే అనుసరించాలట దాన్ని. ఆ భావమే దాన్ని అందుకొనే ఉపకరణం "యద్భావ స్తద్భవతి" అన్నట్టు ఏ భావం బలంగా ఏర్పడితే ఆ భావమే అయిపోతాడు మానవుడు. ప్రపంచ భావనతో మన మంతా ఇప్పుడు ప్రపంచమయి కూచు న్నాము. అలాగే మన మీ ప్రపంచం కాదు - శుద్ధ చైతన్య రూపుల మేనని అను క్షణమూ భావన చేయ గలిగితే తదాకారంగానే మారి పోతాము. క్రొత్తగా మారటం కూడా కాదిది. తదాకారంగానే ఉన్నాము మొదటి నుంచీ. అయితే మరచి పోయాము. కాబట్టి మరలా జ్ఞప్తి చేసుకోటమే ఈ భావన.

కనుక ఈ భావనే బంధు వయింది మన పాలిటికి. లోకంలో బంధువులు మనల నీలోకవ్యవహారంలో బంధించేవారే గాని విముక్తులను చేయబోరు. ఇది దీనిలో నుంచి విముక్తిని ప్రసాదించేది కాబట్టి నిజమైన బాంధవుడిదే మనకు.

అంతేకాదు. దీని విలువ తెలుసుకో లేకపోతే అది మనల నీ సంసార సాగరం లోనే ముంచుతుంది. కాబట్టి అదే మన పాలిటికి శత్రువు కూడా అవుతుంది.

కాబట్టి దాని విలువ తెలిసి ఆ ఆత్మాకార వృత్తిని నిరంతరమూ ఆ వృత్తి చేసుకోవాలి మనసులో. దానితో మన ఆత్మ స్వరూపాన్ని మనం పైకి తెచ్చుకో గలం - ఎక్కడబడితే అక్కడ దర్శించగలం. లేక పోతే అధఃపాతాళాని కణగ ద్రొక్కినట్టయి ఎక్కడాకనిపించదది.

## 110

**సర్వధర్మాన్ పరిత్యజ్య-మామేకం శరణం వ్రజ**
**అహం త్వాసర్వపాపేభ్యో - మోక్షయిష్యామి మాశుచః** **18-66**

కాబట్టి ఇంతకూ చెప్పవచ్చే దేమంటే మోక్ష సాధకుడైన మానవుడు ఇక మీన మేషాలు నెమరువేస్తూ కూచోరాదు. మనసు నిలుస్తుందా నిలవదా- మన మింత గొప్ప స్థాయిని ఈ జీవితంలో అందుకోగలమా - అందులోనే కూచుంటే మన గతి ఏమి - మన పనులెలా జరుగుతాయి - అని ఇలాంటి ఆలోచనలే పనికిరావు. అవన్నీ ప్రకృతి ధర్మాలు మనవి కావు. ప్రకృతి ధర్మాలు మన అవిద్యాదోషంవల్ల మనసులో చేరి మనలను నిత్యమూ భ్రమ పెడుతుంటాయి. ఇవే కర్మవాసన లంటే. సాధన సాగకుండా అడ్డు తగిలేవి ఇవే. కాబట్టి వీటన్నిటినీ సమూలంగా వివేచనా బలంతో పరిత్యజించాలి మోక్షకాముడు. ఒక్కటి కూడా లోపల మిగల నీయరాదు. ఋణశేషం - శత్రుశేషమున్నట్లు ఏకొంచెం శేషించినా అది మన బుద్ధిని దూషిస్తుంది. కాబట్టి శత్రువుమాదిరి ద్వేషించ వలసిందే. దానితో విక్షేపమనే దోషం Distraction పూర్తిగా తొలగి పోతుంది సాధకుడికి.

అయితే ఇది ప్రతిలోమసాధన. అనులోమం కాదు. విక్షేపం పోయినా ఆవరణమనే దోషమొకటి Contraction ఉంది మనకు. అది చాలా ప్రబలమైన దోషం. ప్రతిలోమంగా సాధిస్తే పోయేది కాదది. అనులోమంగా అభ్యసించాలి. అంటే అన్ని విక్షేపాలూ తొలగిన తరువాత ఉన్నదిక ఏమిటా అని ఆలోచించాలి. లేకుంటే అది శూన్యమయి కూచుంటుంది. ఇలాంటి శూన్యం సుషుప్తి మూర్ఛాది దశలలోనే ఉంది మనకు. ఇక క్రొత్తగా సాధనదేనికి. కాబట్టి విక్షేపం లేదు. శూన్యంకాదు - అలాంటి దేదో భావరూపంగా ఒకటి అనుభవానికి రావాలి మానవునికి. ఏమిటది.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

అదే “మామేకం శరణంవ్రజ” మాం అంటే నన్ను అని అర్థం. నన్ను అంటే ఎవడా నేననే వ్యక్తి. ఎదుట నొగలమీద కూర్చొని గుఱ్ఱాలుతోలే నీలమేఘ శ్యామలమైన విగ్రహమని తోస్తుంది. అది కాదు. అదే అయితే ఆ విగ్రహం అర్జునుడింకా బ్రతికి ఉండగానే కాల ప్రవాహంలో కలిసి పోయింది అది అర్జునుడికి ఎలా శరణ్య మవుతుంది. కాబట్టి నేనంటే ఒకానొక క్షేత్రంలో కుంచించుకు పోయిన నేనుకాదు. సర్వక్షేత్రాలలో వీరవిహారం చేసేనేను. అంటే “యేన సర్వ మిదంతత” మ్మనే వాసుదేవ స్వరూపం. “వాసుదేవ స్సర్వమితి” అనే వాక్యానికిది మరలా ప్రతిధ్వని. అక్కడా “మాం ప్రపద్యతే” అనే ఉందిమాట. మాం అనేది ఏమిటో వివరించా డక్కడ – “వాసుదేవ స్సర్వమితి” అని. వాసుదేవుడంటే వసుదేవస్య అపత్యం పుమాన్ కృష్ణః – అని పోతుంది మన శాబ్దిక మైన దృష్టి. అది కాదు “వాసుదేవ” అంటే. వసతి–సర్వత్ర అస్తి –దీవ్యతి– ప్రకాశతే– చైతన్య రూపేణ సదా – సర్వత్ర ఇతి వాసుదేవః ఏదైతే సర్వత్రా ఉన్నదో భాసిస్తున్నదో అది. మరో మాటలో చెబితే సత్తు–చిత్తు–ఇంతకన్నా ఏమీలేదు. ఇలాంటి తత్త్వమే నేనని గట్టిగా పట్టుకోవాలి. ఇదే శరణాగతి.

అలా పట్టుకొంటే చాలు. అది స్వతః ప్రకాశమైన ఆత్మతత్త్వమే కాబట్టి సుషుప్త్యాదుల లాగా అభావరూపం గాక భావ రూపంగానే నిలిచి ఉంటుంది. అంతే గాదు. అలా నిలిచిన ఆ అఖండభావనే మన సకల పాపాలనూ ప్రక్షాళితం చేసి మనలను వాటి బారినుంచి బయటపడ వేస్తుంది. అదే విమోచన మీజీవుడికి. అప్పటి నుంచీ అటు జగద్భావమూ లేదు. ఇటు జీవభావమూ లేదు. ఆవరణ విక్షేపాలు రెండూ పటాపంచలవుతాయి. దానితో త్రిగుణాత్మక మైన మాయ మన మీద పని చేయదు. మాయే లేదంటే తన్నిమిత్తంగా కలిగే విషాద మెప్పుడో బలాదూరయింది.

ఇందులో శరణాగతి మన వంతయితే పాపవిమోచన మీశ్వరుని వంతు. శరణాగతి అంటే అర్థం చెప్పాము. పాపమంటే ఇప్పుడు చెప్పవలసి ఉంది. పాపమన్నా పాతకమన్నా క్రింద పడగొట్టేదని అర్థం. శుద్ధ చైతన్య రూపుడైన జీవుణ్ణి మొదట పడగొట్టింది అవిద్య. ఆవిద్య పడగొడితే అక్కడినుంచి కామంలో పడ్డాము. కామం పడగొడితే కర్మలో పడ్డాము. కర్మ నుంచి మరలా జన్మలో పడ్డాము. ఇది ఒక పెద్ద పద్మవ్యూహం. విషవలయం. పడటమే తప్ప లేవటం లేదు దీనిలో. ఇలా పడగొట్టి పరమార్థానికి మనలను దూరంచేశాయి కాబట్టే ఇవన్నీ పాపాలే మనపాలిటికి. అవిద్యా కామ కర్మ జన్మలన్నీ పాపాలే.

వీటి నన్నిటినీ వదలించు కోవాలంటే ఏమిటి మనకిప్పుడు ఉపాయం. అది ఎప్పటికైనా ఆ పరమాత్మనే ఆశ్రయించటమే. అదే సబబు కూడ. ఎక్కడి నుంచి పడ్డామో–పడి దేనికి దూరమయ్యామో–మరలా దానినేకదా మనం పట్టుకో వలసింది. ఈ పట్టుకొనే భావం పరమాత్మ అయితే–పట్టుకొనే సాధనం విద్య. విద్యేకదా అవిద్యకు విరుగుడు. అవిద్యవల్ల క్రింద పడ్డాము. విద్య వల్ల పైకి లేస్తాము. విద్య అంటే బ్రహ్మమే నేనని మరలా గుర్తించటం. గుర్తిస్తే బ్రహ్మమే అవుతాడు జీవుడు. "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" అని శాస్త్రమిచ్చే హామీ. అంచేత జ్ఞానమే అనుష్ఠాన మిక్కడ. అంతకన్నా అనుష్ఠాన Practice మనేది మరేదీ వేరుగా లేదు వేదాంత రంగంలో.

ఈ అనుష్ఠాన రూపమైన జ్ఞానం రెండు పాయలుగా ప్రవహిస్తుంది. ఒకటి నేనా పరతత్త్వాన్నే అంతకన్నా వేరుకాదనే భావన. ఇదే శరణాగతి. పోతే రెండవది ఆబ్రహ్మమనేది ఏదోగాదు–అది నాస్వరూపమే నేనేసుమా – అనే భావన. ఇదే పాపమోక్షమనేమాట. మనమీ ప్రపంచోపాధి అయిన జీవులం కాము – నిరుపాధికమైన చైతన్యమేనని అఖండగా ఎప్పుడు భావిస్తామో – ఆ అఖండవృత్తే మనల నీ అవిద్యామయమైన సంసార మహేంద్రజాలం నుంచి విముక్తులను చేస్తుంది. సందేహంలేదు. యద్భావ స్తద్భవతి. ఏది మనసా పదేపదే భావిస్తే అదే అవుతాడు మానవుడు. భ్రమరకీట దృష్టాంతమూ స్వప్న దృష్టాంతమూ– ఇలాంటి దృష్టాంతాలెన్నో ఉన్నాయి దీన్ని సత్యమని చాటటానికి.

ఏతావతా తేలిన సారాంశ మేమిటి. గీతా శాస్త్రాని కంతటికీ సారభూతమైన విషయమిదే. నేనొక జీవుడనే అని భావిస్తే – ఈ పిండాండమూ – బ్రహ్మాం డమూ – వీటి మూలంగా సతమతమయ్యే నేనూ – వీటన్నిటికీ అతీతుడైన ఒక ఈశ్వరుడూ – ఇంత ఉన్నది వ్యవహారం. ఇదే సంసారబంధం. విషాదయోగం. కాగా నేనీ జీవుడేమిటి – సర్వదా సర్వథా సర్వత్రా ఉన్న చైతన్యమే నేనని ఎప్పుడు భావిస్తామో అప్పుడు ఈ జీవుడులేడు. అండపిండాత్మకమైన ప్రపం చమూ లేదు. వీటి కతీతుడైన ఈశ్వరుడూ లేడు. అంతా కలిసి అద్వితీయమైన నాచిత్స్వరూపమే. నేనే. ఇదే సంసారమోక్షం. మోక్ష సన్న్యాసయోగం. ఇందులో మొదటిది అవిద్యవల్లనైతే – రెండవది విద్యవల్ల. కనుక అలాంటి ఆధ్యాత్మ విద్య అనే అమృత భాండానికి నిలయమే ఈ గీతాశాస్త్రమనే క్షీరసాగరం. అసుర శక్తితోగాక దైవసంపదతో దాన్ని మనోమందిరంలో పెట్టిమథించినప్పుడే

మనమా అమృతరసాన్ని ఆస్వాదించ గలుగుతాము. అనంతానందానుభూతి నందుకోగలుగుతాము.

## 111

**ఇదంతే నాతప స్కాయ - నాభక్తాయ కదాచన**
**న చాశు శ్రూషవే వాచ్యం - నచ మాం యోభ్యసూయతి 18-67**

శాస్త్రోపదేశ మిక్కడికి సమాప్తమయింది. తదుపదిష్టమైన సాధన మార్గం కూడా బోధపడింది. పోతే ఇలాంటి బోధ మనం చేసుకొన్నతరువాత దానిని మరలా ఎవరికి బోధించాలని ప్రశ్న వస్తుంది. ఏమి బోధించకపోతేనని సవాలు చేయరాదు. విద్యా సంప్రదాయం దెబ్బతింటుంది. విద్య అనేది ఒకరివల్ల ఒకరికి సాక్రమించవలసిన ధనం. ఒక్కడే అనుభవించేది కాదు. అలాగే అనుకొంటే మొట్టమొదట సృష్టిలో ఎవడు గ్రహించాడో వాడు మాత్రమే తరించి మిగతా జీవులంతా నిర్జీవులయి పోయేవారు. ప్రతియుగంలోనూ కొంతకు కొంత అయినా మానవాళి తరిస్తున్నదంటే అది గురుశిష్య సంప్రదాయమనేది ఒకటి ఉండటం మూలాన్నే.

అయితే బ్రహ్మవిదుడైనవాడు సంప్రదాయాన్ని కాపాడవలసిందే. అలా కాపాడడాని కతడు తనవిద్య లోకులకు బోధించవలసిందే. కాని ఇందులో ఒక తిరకాసు ఉంది. బోధించాలి గదా అని ఎవరికంటే వారికి ఈ విద్య బోధించ గూడదు. అన్ని విద్యలకన్నా విలువైన విద్య ఇది. రాజవిద్య అన్నారు దీన్ని. అలాంటి విద్య అనర్హులకు బోధిస్తే సుఖంలేదు. వారు దానిని విశ్వసించక పోవచ్చు. అవహేళన అయినా చేయవచ్చు. దాని వల్ల నీకు నిర్వేదం కలగవచ్చు. ఆ నిర్వేదం నీకు నిరుత్సాహం కలిగించవచ్చు. ఎన్నో ఉన్నాయి ఈతి బాధలు.

అందువల్ల సర్వవిధాలా అధికారి అయినవానికే బ్రహ్మవిద్య నుపదేశించాలి విద్యోపదేష్ట. ఎవరా అధికారులని అడిగితే చెబుతున్నాడు భగవానుడు. అధికార మున్నవాడే అధికారి. అధికారమనేది నాలుగువిధాలు. ఒకటి తపస్సు, తప స్సంటే అతిసూక్ష్మమైన భావాన్ని కూడ ఆలోచించి పట్టుకొనే శక్తి. రెండవది భక్తి. భక్తి అంటే విషయం మీదా దాన్ని బోధించే ఆచార్యుని మీదా - ఎనలేని గౌరవం మూడవది శుశ్రూషశాస్త్రమూ, ఆచార్యుడూ తనకు బోధించే విషయం వినాలనే ఉత్కంఠ. పోతే నాల్గవది అనసూయ. ఏ పరతత్త్వాన్ని గూర్చి చర్చ జరుగుతున్నదో దానిమీద గట్టి నమ్మకం కలిగి ఉండటం. ఇలాంటి నమ్మక

మనేది మొదట ఉంటేగాని వినేబుద్ధి పుట్టదు. వింటేగాని దానిపైన గౌరవ మేర్పడదు. గౌరవమేర్పడితేగాని దానిని నిశింతగా ఆలోచించి పట్టుకోలేడు.

దీనిని బట్టి మనం గ్రహించవలసిం దేమంటే ఇవి నాలుగూ కలిసి ఉంటేనే అధికారం Competence. ఏ ఒక్కటి లోపించినా ఆమేర కది కుంటుపడుతుంది. అంతే కాదు. నాలు గింటిలో ఉత్తరోత్తరం చాలా అవశ్యకమైన గుణం. అంటే తపస్సు కన్నా భక్తి – భక్తి కన్నా శుశ్రూష- దాని కన్నా అనసూయ-ముఖ్యమైన యోగ్యత. శుశ్రూష-భక్తీ ఉంటేనే తపస్వికి చెప్పవలసింది. అవి లేకుండా తపస్వి అయినా చెప్పకూడదు. అసూయా యుక్తుడయితే ఇక ఎన్ని గుణాలున్నా పనికిరాదు. అది లేకుండా కనీసం భక్తి శుశ్రూష లున్నా చాలు పనికి వస్తుంది. ఇదీ శాస్త్ర సంప్రదాయ విధి. దీనిని బట్టి తెలిని తేటలు గాదీ మార్గంలో ముఖ్యం. ముఖ్యంగా కావలసింది విశ్వాసం. దానితో పాటు గౌరవం- గౌరవ బుద్ధితో చేసే శ్రవణం. ఇవి మూడూ ఉన్నప్పుడే మానవుడి తెలివి సరియైన మార్గంలో ప్రవేశించి రాణిస్తుంది. లేకుంటే పెడత్రోవ బట్టి ఊరక పాడయి పోతుందని శాస్త్ర హృదయం.

## 112

**య ఇమం పరమం గుహ్యం**
**మద్భక్తేష్వభి ధాస్యతి**
**భక్తిం మయి పరాం కృత్వా**
**మా మేవైష్య త్యసంశయః 18-68**

సంప్రదాయ మెలా ఉండాలో వర్ణించారు. పోతే ఇప్పుడు సంప్రదాత అయిన ఆచార్య పురుష డెలా ఉండాలో అలాంటి దేశికుడి కెలాంటి ఫల మబ్బుతుందో నిరూపిస్తున్నాడు భగవానుడు. శాస్త్రార్థం చక్కగా గ్రహించి ఒంటబట్టించుకొని దానిని స్వానుభవినికి తెచ్చుకొని ఉండాలి ఆచార్యు డనేవాడు. అలాంటివాడే మరొకడికి బోధ చేయడాని కర్హుడు. ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వ దర్శినః- అనే గీతా శ్లోకార్థాన్ని ఇక్కడ అనుసంధానం చేసుకొని చూడవచ్చు.

అలాంటి ఆచార్యుడు తాను గ్రహించిన పరమరహస్యాన్ని తనలోనే జీర్ణం చేసుకోక శిష్యులకు బోధించాలి. శిష్యులంటే పూర్వోక్త అధికార చతుష్టయ మున్న వాళ్ళు. అందులో కేవలం భగవద్భక్తి మాత్రమున్నాచాలు. వాడర్హుడే.

అలాంటివాడి కెంతో భక్తితో బోధించాలి ఆచార్యుడు కూడా. ఆచార్యుడి కుండ వలసిన భక్తి ఏమిటిక్కడ. ఇది మామూలు చదువు కాదు నేను చెప్పటం-జగద్గురు వైన పరమాత్మకు సాక్షాత్తుగా చేసే పరిచర్యే ఇది. అనే- ఒక నిష్కామ నిరాడంబర చిత్త వృత్తి.

ఇలాంటి భక్తి విశ్వాసాలతో శాస్త్రాన్ని చదివించటమే గాక తదర్థాన్ని కూడా ఉన్నదున్నట్టు బోధిస్తే చాలు. అతడి జన్మ చరితార్థ మవుతుంది. చచ్చిన తరువాత నన్నే పొందుతాడతడు - సంశయం లేదంటున్నాడు పరమాత్మ. నన్నే పొందటమంటే ముక్తుడవు తాడని అర్థం. అంతకు ముందు కాలేదా అని సందేహించరాదు. విముక్తశ్చ విముచ్యతే" అంతకు ముందు కూడా విముక్తుడే. జ్ఞానం వేరు ముక్తి వేరు కాదుగదా. బ్రహ్మజ్ఞాన మెప్పుడు కలిగిందో అప్పుడే ముక్తి కూడా ప్రాప్తించింది. అయితే ప్రారబ్ధ కర్మ ఒకటి ఇంకా ఉంది కాబట్టి అది జీవన్ముక్తి. అవసానంలో అదికూడా తీరిపోయింది కాబట్టి ఇది విదేహముక్తి. అంటే ఇక దేహధారణ అనేది లేదని భావం.

## 113

**అధ్యేష్యతేచ య ఇమం - ధర్మ్యం సంవాద మావయోః**
**జ్ఞాన యజ్ఞేన తేనాహ - మిష్ట స్స్యామితి మేమతిః 18-70**

ఆచార్యుడి విషయమైన తరువాత ప్రస్తుత మధ్యయనం చేసే శిష్యుడి సంగతి చెబుతున్నాడు. కృష్ణార్జును లనే నెపంతో సాగిన ఈ సంవాదం వాస్తవానికి గురుశిష్య సంవాదమే. ధర్మ్యమైన దీసంవాదం. ధర్మం తప్పనిది ధర్మ్యం. ధర్మ మంటే సాధన మార్గం. సత్యం గమ్యమైతే ధర్మమది అందుకొనే మార్గమవుతుంది. అందుకే "ధర్మం చర" అన్నారు. మార్గమనే దెప్పుడూ చరించటానికే గదా. అయితే అది గ్రుడ్డిగా పట్టుకొని పోతే ప్రయోజనం లేదు. అధ్యయనం చేసి పట్టుకోవాలి. అధ్యయన మేమిటి. గురు ముఖంగా విన్న శాస్త్రార్థాన్ని శ్రవణం చేసి చక్కగా గ్రహించట మని అర్థం.

అలా గ్రహించి తదను గుణమైన సాధన చేసే పెద్దమనిషి ఇక ఏ యజ్ఞాలూ యాగాలూ చేయనక్కర లేదు జీవితంలో. జ్ఞాన యజ్ఞ మనేది ఒకటి చేస్తే చాలు. అన్నీ చేసినట్టే. జ్ఞాన మేమిటి. యజ్ఞ మేమిటి. యజ్ఞ మనేది లోకంలో నాలుగు విధాలు. ఒకటి విధి యజ్ఞం. ఋత్విక్కులూ - యజమానుడూ-అగ్నులూ-సమిధులూ. ఇలాంటి కలాపంతో సాగే బాహ్యమైన అనుష్ఠానం. దీనినే మనం

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ప్రసిద్ధంగా యజ్ఞమని వ్యవహరిస్తుంటాము. పోతే రెండవది జప యజ్ఞం. ఇదీ ఒక అనుష్ఠానమే. అయినా దాని లాగా కాయికం కాదు. వాచికం. ఉచ్చారణ రూపమైనది. పంచాక్షరి-అష్టాక్షరి- ఇలాంటి మంత్ర పఠనం. దీని తరువాత మూడవది ఉపాంశు యజ్ఞం. అందరికీ కాక దగ్గరగా కూర్చున్న ఏ ఒకరిద్దరికో వినబగే లాగా జనాంతికంగా చేసే పఠనం. జపంకన్నా సూక్ష్మమైన దిది. పోతే నాల్గవది మానసం ఇది శారీరకం కాదు. వాచికం గాదు. కేవలం మనసులో మాత్రం జరిగే క్రియ. మనోవృత్తి రూపమిది. ఈ వృత్తు లెన్నైనా ఉదయిస్తుం టాయి నశిస్తుంటాయి మనసులో. తానే అలా ఉదయించక నశించక ఏక రూపంగా వర్తించే వృత్తి ఒక్కటే ఉంది. అదే బ్రహ్మాకార వృత్తి. విషయ విషయి విభాగం లేని వృత్తి కాబట్టి అది ఏక రూపం. అనుదితా నస్తమిత మన్నారు పెద్దలు.

ఇలాంటి వృత్తి నిరంతరంగా మనసులో ఆవృత్తి కావటానికే జ్ఞాన యజ్ఞ మని పేరు పెట్టారు. జ్ఞాన రూపమైన అనుష్ఠానంతో పరమాత్మ నారాధించటం కాబట్టి జ్ఞాన యజ్ఞమనే పేరు సార్థక మయింది. అంతేకాదు. మిగతా విధిజపాది యజ్ఞాలు మన కాపేక్షికమైన ఫలాన్నిస్తే ఇది నిరపేక్షమైన మోక్ష ఫలాన్నే ప్రసా దిస్తుంది. కాబట్టి వాటికి విలక్షణంగా దీనిని జ్ఞాన యజ్ఞమని పరిగణించవలసి వచ్చింది. ఇంకా ఒకటున్నది రహస్యం. తతిమా యజ్ఞాలలో ఏ ఫలితం చెప్పారో అదంతా ఇందులోనే కలిసి వస్తుంది మనకు. అందుచేత కూడా ఇది సర్వో త్కృష్టమైన మార్గం.

దీనిని బట్టి సాధకుడు గమనించ వలసిందేమిటంటే జీవితంలో ఇక మిగతా యజ్ఞయాగాది కర్మలకూ - తత్తద్దేవతో పాసనాదులకూ స్వస్తి చెప్పి సర్వకాల సర్వావస్థలలోనూ శాస్త్రా చార్యోప దిష్టమైన ఈ జ్ఞాన రూపమయిన యజ్ఞాన్ని అభ్యసిస్తూ పోవటమే. ఈ ఒక్క యజ్ఞానుష్ఠానం వల్లనే నేను సుప్రీతుణ్ణి సుప్రసన్నుణ్ణీ అవుతానని హామీ ఇస్తున్నారు మనకు పరమాత్మ.

## 114

**కచ్చి దేత చ్ఛ్రుతమ్ పార్థ-త్వయైకాగ్రేణ చేతసా**
**కచ్చి దజ్ఞాన సమ్మోహః - ప్రణష్టస్తే ధనంజయ** **18-72**

శిష్యాచార్య సంవాదమైన తరువాత ఆచార్యుడు తాను బోధించిన శాస్త్రా ర్థాన్ని శిష్యుడు గ్రహించాడో లేదో గ్రహించిన విషయం బాగా మనసుకు

పట్టిందో లేదో తెలుసుకోట మతని బాధ్యత. ఒకవేళ బాగా గ్రహించలేదని తెలిస్తే మరొక సులభమైన మార్గంలోనైనా బోధించవలసి ఉంటుంది. ఏదో ఒక ఉపాయంతో మొత్తానికి శిష్యుణ్ణి కృతార్థుణ్ణి చేయటమే ఆచార్యుడి ధర్మం.

అందుకే ప్రశ్నిస్తున్నాడు జగద్గురువైన శ్రీ కృష్ణు డర్జునుణ్ణి. అర్జునా నేను చేసిన ఈ గీతోపదేశ మంతా నీవు చక్కగా శ్రవణం చేశావు గదా. ఊరక శ్రవణం చేస్తే సరిపోదు. ఏకాగ్రమైన మనసుతో చేయాలి శ్రవణం. శ్రవణమంటే ఇక్కడ చరాచర ప్రపంచమంతా ఆత్మచైతన్యానికి భిన్నంగా లేదు- ఉన్నదంతా ఒకే ఒక ఆత్మతత్త్వమనే సత్యాన్ని అర్థం చేసుకోవటం. ఇలాంటి లోకోత్తరమైన భావాన్ని మనసుకు పట్టించుకోవాలంటే మనసు పరధ్యానంగా ఉంటే సుఖం లేదు. ఎంతో సావధానంగా Attentive ఉండాలి. దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా అని పేర్కొన్న దుపనిషత్తు. విషయం సూక్ష్మమయ్యే కొద్దీ దాన్ని గ్రహించే బుద్ధికూడా సూక్ష్మంగానే తయారు కావాలి. అప్పుడే అది ఉన్న దున్నట్టు మనసుకు పట్టేది. లేకుంటే అసలు పట్టనైనా పట్టదు. లేదా పొరబాటు గానైనా పట్టవచ్చు. రెండూ పనికిరాని సందర్భాలే.

పోతే ఏకాగ్రమైనా మనసుతో గ్రహించి ఒంట బట్టించుకొన్నందుకేమిటి ఫలితం. అజ్ఞాన సమ్మోహ మనేది తొలగిపోవాలి. అజ్ఞానంవల్ల కలిగిన సమ్మోహమేదో అది అజ్ఞానసమ్మోహం. అజ్ఞానమంటే అనాదిగా మనలనంటి పట్టుకొన్న అ విద్య. అది మనకు స్వాభావికమై పోయింది. తన్నిమిత్తంగా ఏది హేయమో ఏది ఉపాదేయమో వివేచన చేయలేని దుస్థితి ఏర్పడింది జీవులకు. దీనికే సమ్మోహ మని పేరు. ధర్మ సమ్మూఢ చేతాః- అని మొదటనే వాపోతా దర్జునుడు. ఇది ప్రణష్టం కావాలి జ్ఞానోదయ మయినందుకు. నష్టంకూడా కాదు ప్రణష్టం. అంటే లేశమాత్రం కూడా మిగలగూడదిక. సూర్యోదయమైతే అంధకార ముంటుంది. అలాగే ఆత్మ జ్ఞానోదయమైతే అజ్ఞానాంధకారం కూడా ఏ మాత్రమూ కనపడరాదు. ఇదే దాఖలా విషయం చక్కగా గ్రహించాడని చెప్పటానికి.

అంతేకాదు. ధనంజయ అని సంభోధిస్తున్నా డర్జునుణ్ణి. పార్థ అని మరొక సంబోధన ఉంది ఆదిలో. ఆత్మ స్వరూపాన్ని శ్రవణం చేసి అజ్ఞాన తిమిరాన్ని నిర్మూలించ గలిగితే పార్థుడప్పుడు నిజంగా ధనంజయుడవుతాడు. పృథకుమారుడే పార్థుడంటే. పృథ అనే మాటలో పృథివీ తత్త్వం కూడా ఇమిడి ఉంది

vallurisrinivasaRao
www.advaitavedanta.in

అప్పటికి మర్త్యుడయిన ప్రతి ఒక్కడూ అర్జునుడిలా పార్థుడే. వాడు తన మర్త్యత్వాన్ని పోగొట్టుకొని అమర్త్య భావాన్నే Immortality అందుకోవాలంటే ఆత్మజ్ఞానంతో అజ్ఞానాన్ని నిర్మూలించుకొని ధనంజయుడు కావాలి. ధనమంటే ఇది భౌతికం కాదు. ఆధ్యాత్మికం. మాగృధః కస్యస్విద్ధన మన్న దీశావాస్యం అంతా ఈశ్వరుడి ధనమే నట. ఆ ఈశ్వరుడు మనమేనని గ్రహించినప్పుడీ ధనమంతా మనదేగదా. ఆ దృష్టితో జ్ఞాని అయిన ప్రతివాడూ ధనంజయుడే. ఇలాంటి జ్ఞానధనాన్ని జయించినప్పుడే నీవు నిజమైన ధనంజయుడవు. అంతేగాని ఉత్తరకురు భూములను జయించి అసంఖ్యాక ధన రాసులని కొని తేవటం కాదు సుమా- అని అర్జునుణ్ణి వ్యంగ్యంగా కూడా మందలిస్తున్నా డీమాటతో భగవానుడు.

## 115

నష్టో మోహః స్మృతిర్లబ్ధా-త్వత్ప్రసాదా న్మయా చ్యుత
స్థితోస్మి గత సందేహః - కరిష్యే వచనమ్ తవ 18-73.

ప్రస్తుతం జగద్గురు వడిగిన ప్రశ్నకు జగచ్ఛిష్యుడైన అర్జునుడు సమాధాన మిస్తున్నాడు. జగచ్ఛిష్యుడంటే జగత్తుకంతా ప్రతినిధి అయిన శిష్యుడు. మనబోటి మానవుల కంతా ప్రతినిధి అర్జునుడు. "శిష్యస్తేహమ్ శాధిమా" మ్మని శిష్య భావంతోనే ప్రాధేయపడ్డాడు పరమాత్మను. అంతవరకూ భగవానుడాయనకు బోధే చేయలేదసలు. శిష్యుణ్ణి- నన్ను శాసించ మన్నప్పుడే ఉపక్రమించాడు గీతోపదేశం. శాసితుమ్ యోగ్యః శిష్యః శాసించటానికి యోగ్యు డువడో వాడే శిష్యుడు. ఆ యోగ్యత ఎప్పుడేర్పడుతుంది. ప్రణి పాత పరి ప్రశ్న సేవాదులతో గాని ఏర్పడదది. అవి మూడూ పుష్కలంగా ఉన్నా యర్జునుడికి. మనకుగూడా అలాంటి లక్షణాలుంటేనే గురూపదేశానికి నోచుకొంటాము.

ఉపదేశం బాగా పనిచేసినందు కది మన కివ్వవలసిన ఫలితాలు రెండే. ఒకటి మోహనాశమూ, మరొకటి స్మృతి లాభమూ. మోహమంటే మనకు భిన్నంగా అనాత్మ ప్రపంచ మేదో ఉందనే భ్రమ. అది పూర్తిగా నశించాలి మనకు. అలా నశించాలంటే దానికి ముందు స్మృతి అనేది లభించాలి. ఏమిటా స్మృతి. ఆత్మ చైతన్యమనే దొక్కటే ఉంది - అది మన స్వరూపమే - మనమేననే స్ఫురణ. ఇందులో అజ్ఞానం నశించటం ప్రతిలోమమైతే ఆత్మజ్ఞాన ప్రాప్తి అనులోమం. అప్పుడంతా ఆత్మ తత్త్వంగానే భాసిస్తుంది కాబట్టి ద్వితీయమైన

Vallamraju Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

పదార్థమేలేదు. ద్వితీయ మనేది లేకుంటే ఇక ఎలాంటి సందేహానికీ ఆస్పదం లేదు. స్థితోస్మి గత సందేహః.

సందేహాలన్నీ నివృత్తి అయినా యంటే ఇక తన ధర్మాన్ని తాను పాటించ వచ్చు మానవుడు. ప్రస్తుత మర్జునుడు పాటించవలసిన స్వధర్మ మేమిటి. కౌరవులతో యుద్ధం. యుద్ధం చేస్తే పదిమందినీ చంపవలసి వస్తుందేమో - తన్నిమిత్తంగా పాపం చుట్టుకొంటుందేమో నని గదా సందేహ మర్జునుడికి. అది ఆత్మజ్ఞానంతో తీరిపోయింది. చచ్చేది శరీరమే అది కేవల మసత్కల్పం-పోతే ఆత్మ అనేది అలా చచ్చేది కాదది నిత్య సత్యం-అని గదా గ్రహించాడతడు. ఇక సందేహ మేముంది. స్వధర్మమైన సంగ్రామాన్ని సాగించటాని కాక్షేపణే లేదు. కనుకనే అంటున్నాడు కరిష్యే వచనమ్ తవ అని. హత్వాపి ఇమాన్ లోకా ననే భగవ ద్వచన మతడికి బాగా మనసుకు పట్టి ఉండవచ్చు. అయితే ఇదంతా గురుప్రసాద లబ్ధమని మరలా విన్నవించటంలో శిష్యుడి కుండవలసిన వినయ సంపత్తీ-గురు ముఖంగా లభించని విద్య ఫలించదనే సంప్రదాయ రహస్యమూ-కొట్టవచ్చినట్టు ధ్వనిస్తున్నాయి.

## 116

**యత్ర యోగేశ్వరః కృష్ణో-యత్ర పార్థో ధనుర్ధరః**
**తత్ర శ్రీర్విజయోభూతి-ర్ధ్రువానీతి ర్మతిర్మమ** 18-78

పరోక్షంగా ఇలాంటి గురుపదేశ ప్రసాదాన్ని తాను సంపాదించి తన ధన్య త్వాన్ని సాధక లోకాని కిలా చాటుతున్నాడు ప్రస్తుతం సంజయుడు.

సమస్త యోగాలకూ మూలకందమైన శ్రీ కృష్ణపరమాత్మ ఎక్కడ ఉంటాడో ఎక్కడ ధనుర్ధరుడై పార్థుడు నిలిచి ఉంటాడో అక్కడే శ్రీ విజయమూ భూతీ-నీతీ - అవశ్యముండీ తీరుతాయని నా అభిప్రాయ మంటాడు.

సమ్యఙ్గయోస్యా స్తీతి సంజయః - సంజయతీతి సంజయః తాను జయ మును సాధించి దానిని మరలా పరులకు ప్రసాదించేవాడు సంజయుడు. మానవుడు సాధించవలసిన ఆ జయమేమిటి. " ఇహైవ తైర్జిత స్సర్గః" అని గీతా వాక్యమే బయట పెట్టిందది ఏమిటో. సృష్టి రహస్యాన్ని ఛేదించటమే జయం. సృష్టి రహస్యంనామ రూపాత్మకంగా విస్తరించి ఉన్న ఈ సమస్తమూ కేవలసచ్చిదాత్మకమైనతత్త్వమేగాని మనేమీ కాదని గ్రహించటమే.

ఈ విధంగా గ్రహించి విజయంపొందిన వాడే సంజయుడు. సిద్ధుడయి మిగతా సాధకుల కందరికీ బోధిస్తున్నా డారహస్యాన్ని. ఏమని. యోగేశ్వరుడైన శ్రీ కృష్ణుడెక్కడ ఉంటాడో - అంటే ఏమని అర్థం. "కర్షతీతి కృష్ణః" పైకిలాగే వాడెవడో వాడు కృష్ణుడు. "తేషా మహం సముద్ధర్తా" అని ఆయనే సెలవిచ్చాడు గదా. మృత్యురూపమైన ఈ సంసార సాగరంనుంచి బయటపడ వేసే నేర్పు పరమాత్మకే వుంది. కారణం యోగేశ్వరుడు. కర్మ జ్ఞాన భక్తి సమాధి యోగాలన్నీ ఆయన వశంలో ఉన్నాయి. లేదా మిగతా మూడింటినీ తనలో ఇముడ్చుకొన్న జ్ఞానయోగానికే ఈశ్వరుడాయన. దాని నీ మానవులకు ప్రసాదించి తద్బలంతో తరింపచేయగల డీ సంసారసాగరాన్ని.

అయితే ఇలాంటి తారకమైన యోగాన్ని ఆయన ప్రసాదించాలన్నా తద్వారా మనలను ఉద్ధరించాలన్నా మనమెలాంటి యోగ్యత కలిగి ఉండాలని ప్రశ్న. ఎందుకంటే ఎంత కరుణాళుడైనా భగవానుడు అలసులనూ-అయోగ్యులనూ - కాపాడబోడు. అది వట్టిమాట. గట్టి సాధన కుపక్రమించిన మానవునికే ఆయన చేయూత నిచ్చేది. ఉద్ధరించేది. కనుక అలాంటి యోగ్యత ఏదో వర్ణిస్తున్నాడు- "యత్రపార్థో ధనుర్ధరః అని. పార్థుడంటే అర్జునుడనే కాదు. అర్జునుడికి నరుడని కూడా నామాంతరమున్నది. నరుడంటే మనమే. మనమూ పార్థులమే. పృథివీ వికారమే పార్థం-పార్థివం, పార్థివమైనదీ నర శరీరం. దీనితో సంపర్కం వదిలితేగాని మనం సాయుజ్యానికి నోచుకో లేమని చెప్పాము. అది వదిలే ఉపాయం ధనుర్ధరత్వం. "ప్రణవో ధను శ్శరో హ్యాత్మా" అన్నారు. ధనుస్సంటే శబ్దబ్రహ్మం. అంటే బ్రహ్మాకారవృత్తి. దానినే నిత్యమూ ధరించి ఉండాలి సాధకుడు. క్రమంగా అది పరిపాకానికి వస్తే ముక్తి అనేది పూలబాట అవుతుంది.

ఇలాంటి గురుశిష్యభావ ముంటే ఒక మానవుడికి ఫలించనిదంటూ ఏదీ లేదు. వృత్త్యను సంధానంలో శిష్యుడు త్వంపదార్థ శోధన చేసుకొంటే చాలు. తత్పదార్థైక్యాన్ని గురువు వెంటనే ప్రసాదించి తీరుతాడు. దానితో ఇక ఐహిక మేమిటి. అముష్మికమేమిటి. రెండూ సిద్ధిస్తాయి మానవుడికి. ఐహికం శ్రీ విజయాలైతే - ఆముష్మికం భూతినీతులు. కావలసినవన్నీ వచ్చి వరిస్తే అది శ్రీ. ఇష్టం లేనివన్నీ తొలగిపోతే అది విజయం. ఇవి ఐహికఫలం. పోతే ఇక సమస్తసృష్టికీ మూలమైన బ్రహ్మమే నేనైతే అది భూతి. దానితో సృష్టినంతా మరలా నడపగలిగితే అది నీతి. ఇవి అముష్మికఫలం. దీనితో అసిపదార్థంకూడా

సిద్ధించి -తత్త్వమసి మహా వాక్యార్థానికే సాధకుడి జీవితం లక్ష్యమవుతుంది. గీతా సందేశం కూడా దీనితో పరిసమాప్తమవుతుంది.

**ఇతి**

**సాధక గీతా యామ్ ఉత్తరార్థమ్**

**సమాప్తమ్.**

సాధక గీతార్థము - నవ
బోధము గావించు కొనిన పుణ్యాత్ములు - ని
ర్బాధ మగు మోక్ష పదవిని
సాధించుట కున్నె యెట్టి సందే హంబున్

* * *

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in